
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 245

మంగళవారం 26-11-2024


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



295 పరుగుల తేడాతో...

ఆస్ట్రేలియా జట్టుతో పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 295 పరుగుల తేడాతో బ్రహ్మాండ విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 534 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 238 పరుగులకే ఆలౌటైంది. పరుగుల పరంగా ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టుకిదే అతిపెద్ద విజయం. భారత తాత్కాలిక కెప్టెన్ బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

14లో



పీఠికనూ సవరించొచ్చు

రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకిక, సమగ్రతలను చేర్చుతూ చేసిన సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది.

- వివరాలు 6లో▶



మర్రి చెట్ల రక్షణపై కప్పదాటు తీరు

900 కు పైగా ఊడల మర్రి వృక్షాలను కాపాడే విషయంలో ఎన్‌హెచ్‌ఏఐ దాటవేత ధోరణి రోడ్డు విస్తరణకు ఆటంకంగా మారింది.

- వివరాలు 16లో▶



బీసీ కేటగిరీల పునర్వ్యవస్థీకరణ

బీసీల్లోని కులాలను పునర్వ్యవస్థీకరణ చేయాలనే డిమాండ్ ఎక్కువగా వచ్చిందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు.

- వివరాలు 5లో▶



కాల్పుల విరమణ ఒప్పందం!

ఇజ్రాయెల్, లెబనాన్ సరిహద్దుల్లో కాల్పులు ఆగే సూచనలు కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణకు నెతన్యాహూ అంగీకారం చెప్పినట్లు తెలుస్తోంది.

- వివరాలు 6లో▶

అదానీ నిధులు వద్దన్నాం

నేనేదో అప్పనంగా తీసుకున్నాననే చర్చ జరగడం ఇష్టం లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని అదానీ సంస్థకు లేఖ రాశాం

నిధులు వద్దన్నంత మాత్రాన పాత ఒప్పందాల రద్దు సులువు కాదు

అసలు పెట్టుబడుల విషయంలో బీఆర్ఎస్ విధానమేంటి?

గతంలో వారు అదానీతో ఒప్పందాలు చేసుకున్నందుకు కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలా?.. వాళ్లది కడుపు మంట, కాకిగోల.. వాళ్లు అరుస్తుంటే మాకు ఉత్సాహం వస్తుంది

ఢిల్లీ వెళ్లేది బీఆర్ఎస్ వాళ్లలా పైరవీల కోసం కాదు.. రాష్ట్రానికి నిధుల కోసం వెళ్తున్నా.. మహారాష్ట్ర ఫలితాలపై కిషన్‌రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మండిపాటు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్కిల్స్ యూనివర్సిటీ కోసం అదానీ సంస్థ ఇస్తామని ప్రకటించిన రూ. 100 కోట్లను తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అదానీ గ్రూపు విషయంలో వివాదాలు, జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే పక్క రాష్ట్రాల్లో జరుగుతున్న వివాదాలకు, తెలంగాణ ప్రభుత్వానికి సంబంధం లేదని పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు జంగా రాఘవరెడ్డి, రోహిణ్‌రెడ్డి, సామా రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సదుద్దేశంతో ప్రారంభించిన స్కిల్ వర్సిటీ వివాదాలకు లోనుకావడం తమకు ఇష్టం లేదని.. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని, తమను లాగొద్దని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడటం ద్వారా నిరుద్యోగులకు నష్టం చేసే వైఖరిని అవలంబించవద్దని విజ్ఞప్తి చేశారు.

ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి కార్పస్ ఫండ్ కింద నిధులు ఇచ్చేందుకు చాలా సంస్థలు ముందుకొచ్చాయని సీఎం రేవంత్

మిగతా 2వ పేజీలో ▶

కేటీఆర్ జైలుకెళ్లినా సీఎం అయ్యే చాన్స్ లేదు!

ఎప్పుడెప్పుడు జైలుకు పోదామా అని కేటీఆర్ ఎదురుచూస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "జైలుకు వెళ్లినవారంతా ముఖ్యమంత్రులు అయ్యారని పేపర్లలో వార్తలు చూసి తాను కూడా జైలుకెళితే ముఖ్యమంత్రి అవుతానని కేటీఆర్ అనుకుంటున్నారు. కానీ కేటీఆర్ కన్నా ముందు ఆయన చెల్లెలు కవిత జైలుకు వెళ్లింది. ఇప్పుడిక సీఎం అవకాశం కూడా కేటీఆర్‌కు లేదు. సీఎం పోస్టు కోసం కేసీఆర్ కుటుంబంలో పోటీ ఎక్కువైంది. పదేళ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి తెలివిని వాడాలి. చిల్లర ఆలోచనలు మానాలి. ఏ ఎల్లయ్యో, పుల్లయ్యో, బోడిగాడో చెప్పినట్టు ప్రభుత్వం వ్యవహరించదు. ఇక నుంచి ఆయన పేరును సైకో రామ్‌గా ఫిక్స్ చేయండి" అని ఎద్దేవా చేశారు.

కౌన్ బనేగా 'మహా' సీఎం



మహారాష్ట్రలో నరాలు తెగే సస్పెన్స్

ఫడ్నవీస్‌పై బీజేపీ, షిండేపై సేన పట్టు

హస్తినలో మహాయుతి నేతల మల్లగుల్లాలు

ఫడ్నవీసే సీఎం ; డిప్యూటీలుగా షిండే, అజిత్!

మంత్రి పదవులు శివసేనకు **12** ఎన్సీపీకి **10** బీజేపీ అధిష్టానం నిర్ణయమంటూ వార్తలు

ముంబై: మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరన్న దానిపై నరాలు తెగే సస్పెన్స్ కొనసాగుతోంది. శనివారం వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సారథ్యంలోని పాలక మహాయుతి కూటమి అఖండ విజయంతో అధికారాన్ని నిలబెట్టుకోవడం తెలిసిందే. ఆ పార్టీ సీనియర్ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి సీఎం అవడం లాంఛనమేనని, సోమవారం నూతన సర్కారు కొలువుదీరుతుందనివార్తలొచ్చాయి. కానీ ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండేనే కొనసాగించాలని కూటమి భాగస్వామి శివసేన (షిండే) పట్టుబడుతోంది. బిహార్ మోడల్‌ను మహారాష్ట్రలో కూడా బీజేపీ అమలు చేయాలని శివసేన (షిండే) అధికార ప్రతినిధి నరేశ్ మస్కే సోమవారం డిమాండ్ చేశారు. బీజేపీకి ఎక్కువ సీట్లున్నా సంకీర్ణంలోని మైనారిటీ భాగస్వామి జేడీ(యూ) అధినేత నితీశ్‌కుమార్‌ను సీఎం చేశారని గుర్తు చేశారు. ''సీఎంగా మహాయుతి కూటమిని షిండే ముందుండి నడిపి ఘనవిజయంలో కీలక పాత్ర పోషించారు. కనుక ఆయన్నే కొనసాగించడం సబబు'' అన్నారు. బీజేపీ నేతలు మాత్రం ఈసారి ఫడ్నవీస్‌ను సీఎం చేయాల్సిందేనంటున్నారు. కూటమిలోని మూడో పార్టీ ఎన్సీపీ అధినేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కూడా అందుకు మద్దతిస్తున్నట్టు సమాచారం. దాంతో

మిగతా 6వ పేజీలో ▶

న్యూస్‌రీల్

స్వపరిపాలనకు ఆమోదముద్ర!



1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. నాటినుంచీ భారత్ గణతంత్ర దేశంగా మారింది. రాజ్యాంగాన్ని ఆమోదించిన చరిత్రాత్మక సందర్భానికి బుధవారంతో 75 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా కేంద్రం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది.

- వివరాలు 6లో▶

రాజ్యాంగ వజ్రోత్సవాలు



రాజ్యాంగ ప్రాశస్త్యానికి ప్రచారం కల్పించడం, దానిపట్ల పౌరుల్లో అవగాహనను మరింతగా పెంచడమే లక్ష్యంగా కేంద్రం పలు కార్యక్రమాలు రూపొందించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనం వంటివి జరగనున్నాయి. రాజ్యాంగ నిర్మాతల కృషిని పార్లమెంటు మరోసారి నెమరువేసుకోనుంది.

- వివరాలు 6లో▶

'మేడిగడ్డ' లోపాలను ముందే వివరించా!



కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాకు కుంగడానికి చాలాకాలం ముందే బుంగలు ఏర్పడి నీళ్లు లీక్ అయ్యాయని బరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) ఎల్. భీమరాజు వెల్లడించారు. వెంటనే తన పై అధికారి అయిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు లేఖ రాసి తెలియజేసినట్లు వివరించారు.

- వివరాలు 3లో▶

ప్రజలు తిరస్కరించినా పార్లమెంట్‌పై పెత్తనమా ?

రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంట్‌ను నియంత్రించే యత్నం



తొలి రోజే ఆరోపణల పర్వం

అదానీ అంశంపై చర్చకు విపక్షాల పట్టు

6లో

ప్రతిపక్షాల తీరుపై ప్రధాని మోదీ విమర్శల దాడి

ఇటీవలి ఎన్నికల ఫలితాలతో తమపై మరింత బాధ్యత పెరిగిందని వ్యాఖ్య

పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చ జరగాలి. కానీ, దురదృష్టవశాత్తు కొంతమంది వ్యక్తులు తమ రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటును నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. అంతరాయాలు, గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. 80–90 సార్లు ఎన్నికల్లో ఓడినా విపక్షాల తీరు మారలేదు. విపక్ష నేతలు పార్లమెంట్‌లో చర్చలు జరగనివ్వట్లేదు. ప్రజల పట్ల తమకున్న బాధ్యతను గుర్తించడం లేదు.

- ప్రధాని మోదీ



సార్.. ఈ అన్నం మాకొద్దు

నాణ్యత లేకుండా వండుతున్నారని విద్యార్థుల ఆవేదన

జగిత్యాలలో ప్రజావాణిలో ఫిర్యాదు

కరీంనగర్‌లో రోడ్డెక్కిన చిన్నారులు

వివరాలు 5లో▶

మహబూబాబాద్‌లో మహాధర్నాలో బీఆర్ఎస్ నేతలతో కలసి కేటీఆర్



కాకి బలగంలా కదలాలి

ఒక ప్రాంతంలో గిరిజనులకు అన్యాయం జరిగితే మరో ప్రాంతం గిరిజనులు మౌనంగా ఉండొద్దు

- గిరిజనులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పాలనను కూకటివేళ్లతో పెకిలించాలి.. రాష్ట్రంలో ఎక్కడ, ఎవరికి అన్యాయం జరిగినా కేసీఆర్ సైన్యం సహించదు
- మహబూబాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్

వివరాలు 3లో▶

రాష్ట్రానికి చలిజ్వరం!



పెరిగిన చలి, వాతావరణంలో మార్పులతో పీడిస్తున్న జ్వరాలు

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇబ్బందిపెడుతున్న నిమోనియా, శ్వాస సంబంధ సమస్యలు

- డెంగీ, చికున్‌గున్యా కేసులు తగ్గినా... ఇతర విష జ్వరాల పంజా
- హైదరాబాద్‌లోని ఫీవర్, నిలోఫర్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పెరిగిన రోగులు
- వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలన్న వైద్యులు

2లో

చెరుకు నేలచూపు..!



20,000 హెక్టార్లు ఈ ఏడాది పడిపోయిన సాగు విస్తీర్ణం

ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి అవసరమైన విస్తీర్ణంలో 30% మేర మాత్రమే సాగు

- నిజాం షుగర్ యూనిట్ల పరిధిలో దాదాపుగా కన్పించని చెరుకు పంట.. పదేళ్ల క్రితం నుంచే ఒడిదుడుకులు
- ధర గిట్టుబాటు కాక, కూలీల కొరత, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో ఇతర పంటల వైపు మళ్లుతున్న రైతులు

2లో

ఇదండీ సంగతి



యువతని సైన్యంలో చేర్చుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు!!

ఓ కరపత్రం 'ఏడు'పు కథ!

సెకీతో ఒప్పందాన్ని 7 గంటల్లోనే ఆమోదించారంటూ ఈనాడు వక్రీకరణ

వాస్తవాలను దాచిపెట్టి విషం చిమ్మడమే అసలు లక్ష్యం

సెకీ లేఖ - ఒప్పందానికి మధ్య దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ సమయం

కమిటీ లోతైన అధ్యయనం తరువాతే కేబినెట్ ఆమోదం



- కారుచౌకగా సౌర విద్యుత్తు సరఫరా చేస్తామని 2021 సెప్టెంబర్ 15న లేఖ రాసిన సెకీ.. సాధ్యమైనంత త్వరగా లేఖపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రాన్ని కోరిన సెకీ
- దీంతో మార్గనిర్దేశం (గైడెన్స్) కోసం సెప్టెంబర్ 16న కేబినెట్ ముందుకు టేబుల్ ఐటమ్‌గా సెకీ లేఖ.. దీనిపై లోతైన అధ్యయనం చేసి క్యాబినెట్‌కు నివేదిక ఇవ్వాలని కమిటీకి ఆదేశం
- క్షుణ్నంగా అధ్యయనం తరువాత అక్టోబర్ 28న కేబినెట్ ముందుకు కమిటీ నివేదిక.. దాన్ని ఆమోదిస్తూ ఏపీఈఆర్సీ అనుమతి తీసుకోవాలని డిస్కమ్‌లకు నిర్దేశం
- ఏపీఈఆర్సీ కూడా ఆమోదించాక డిసెంబర్ 1న సెకీతో ప్రభుత్వం, డిస్కమ్‌ల ఒప్పందం

12లో

వారికి ఇళ్ల స్థలాల కేటాయింపు సరికాదు

జీహెచ్‌ఎంసీ పరిధిలో జర్నలిస్టులు, బ్యూరోక్రాట్లు, జడ్జీలు, ప్రజా ప్రతినిధులకు స్థలాలివ్వడంపై సుప్రీం తీర్పు



- వారేమీ వెనుకబడిన వర్గాలు కాదు
- వారు చెల్లించిన సొమ్మును వడ్డీతో వెనక్కి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆల్ ఇండియా సర్వీసు అధికారులు, జడ్జిలు, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ 2008లో అప్పటి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పలు జీవోలను సుప్రీం కోర్టు రద్దు చేసింది. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు మార్గదర్శకాలపై 2005లో జారీ చేసిన జీవోలను సైతం రద్దు చేసింది. సుప్రీం కోర్టు, హైకోర్టు జడ్జీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీసు అధికారులు, జర్నలిస్టులను 'ప్రత్యేక వర్గం'గా పేర్కొంటూ వారి హౌసింగ్ సొసైటీలకు నామమాత్రపు ధరకు ఇళ్ల స్థలాలు

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రానికి చలిజ్వరం!

పెరిగిన చలి, వాతావరణంలో మార్పులతో పీడిస్తున్న జ్వరాలు

- ఏజెన్సీ ప్రాంతాల్లో ఇబ్బందిపెడుతున్న న్యుమోనియా, శ్వాస సంబంధ సమస్యలు
- డెంగీ, చికున్‌గున్యా కేసులు తగ్గినా... ఇతర విషజ్వరాల పంజా
- హైదరాబాద్‌లోని ఫీవర్, నీలోఫర్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పెరిగిన రోగులు
- ఎంజీఎం సహా జిల్లా ఆస్పత్రుల్లో పెద్ద సంఖ్యలో ఓపీ నమోదు
- సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



ఈ చిత్రంలోని తల్లీకొడుకులు ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామానికి చెందినవారు. తల్లి మిరియాల రాజమ్మకు వారం రోజుల నుంచి తీవ్ర జ్వరం, కుమారుడు అనుపాల్‌కు టైఫాయిడ్. ఇద్దరూ ఇప్పుడు ఏటూరు నాగారం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చలి పెరగడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి చలిజ్వరం పట్టుకుంది. విషజ్వరాలతోపాటు దగ్గు, జలుబు, ఇతర శ్వాస సంబంధ సమస్యలతో జనం సతమతం అవుతున్నారు. వాతావరణంలో మార్పులు, ఒక్కసారిగా పడిపోయిన ఉష్ణోగ్రతలతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. హైదరాబాద్ మొదలు ఏజెన్సీ ప్రాంతాల దాకా ఇదే పరిస్థితి. ఏ ఆస్పత్రిలో చూసినా పెద్ద సంఖ్యలో ఔట్ పేషెంట్లు కనిపిస్తున్నారు. ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్స పొందాల్సిన వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది.

కిక్కిరిసిపోతున్న పెద్దాస్పత్రులు

- హైదరాబాద్‌లోని ఒక్క ఫీవర్ ఆస్పత్రికి ఈ నెలలో ఇప్పటివరకు వచ్చిన జ్వరాల బాధితులు 12,080 మందికావడం ఆందోళనకరం. నాలుగైదు రోజులుగా రోజూ 800 వరకు ఔట్ పేషెంట్లుగా నమోదవుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వివిధ జ్వర సంబంధ సమస్యలతో సుమారు 700 మంది ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు.
- ఇక చిన్నపిల్లల ఆస్పత్రి నిలోఫర్‌కు సోమవారం 1,600 మంది ఔట్ పేషెంట్లుగా నమోదుకాగా.. ఇందులో చలి కారణంగా 'న్యుమోనియా'వంటి శ్వాస సంబంధ సమస్యలతో వచ్చిన పిల్లలే ఎక్కువగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇక్కడ ఇన్‌పేషెంట్లుగా 1,300 మంది వరకు చికిత్స పొందుతున్నారు.
- ఉస్మానియా ఆస్పత్రిలో సోమవారం జనరల్ మెడిసిన్ కింద వైద్యం కోసం వచ్చిన ఔట్‌పేషెంట్లు 290, ఇక గాంధీ ఆస్పత్రిలో ఈ నెలలో సోమవారం నాటికి వచ్చిన ఔట్ పేషెంట్ల సంఖ్య 35,547. అంటే సగటున ప్రతీరోజు 1,500 మంది వస్తున్నారు. ఇందులో జ్వర సంబంధిత సమస్యలతో వచ్చేవారు ప్రతీరోజు 300 నుంచి 500 మంది వరకు ఉంటారని సిబ్బంది చెబుతున్నారు.
- ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని పిల్లల వార్డులో ప్రతీరోజు 50కి తక్కువ కాకుండా విషజ్వరాల కేసులు నమోదవుతున్నట్లు ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఉట్నూరు ఐటీడీఏ, ములుగు, భూపాలపల్లి, అచ్చంపేట మన్ననూరు, కొత్తగూడెం పరిధిలోని పలు ఏజెన్సీ మండలాల్లో కూడా జ్వరాల బాధితుల సంఖ్య పెరుగుతోంది. కానీ చాలా మంది గిరిజనులు ఆస్పత్రులకు వెళ్లకుండా ఇళ్ల దగ్గరే సొంత వైద్యం చేసుకుంటున్నట్టు ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు.

తగ్గిన డెంగీ, చికున్‌గున్యా...

ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు రాష్ట్రాన్ని వణికించిన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా కేసులు.. నవంబర్ నెలలో తగ్గుముఖం పట్టినట్లు వైద్యారోగ్యశాఖ చెబుతోంది. డెంగ్యూ కేసులు సెప్టెంబర్, అక్టోబర్‌లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 9,500కు పైగా డెంగీ కేసులు నమోదవగా..సెప్టెంబర్‌లో 1,542, అక్టోబర్‌లో 854 కేసులు ఉన్నాయి. ఈ నెలలో 22వ తేదీ వరకు 168 కేసులే వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఇక చికున్‌గున్యా కేసులు సెప్టెంబర్‌లో 183, అక్టోబర్‌లో 13 నమోదవగా, ఈనెలలో ఇప్పటివరకు 13 కేసులే వచ్చాయని వివరిస్తున్నారు. మలేరియా కేసులు కూడా తగ్గాయని అంటున్నారు.

పెరిగిన శ్వాస సంబంధ సమస్యలు

ఈ నెల మొదటి వారం నుంచి పెరుగుతూ వచ్చిన చలి... కార్తీక పౌర్ణమి మరింత తీవ్రమైంది. దీని కారణంగా న్యుమోనియా వంటి శ్వాస సంబంధ సమస్యలు పెరిగి జనం తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో తీవ్ర చలి కారణంగా ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరి ఇబ్బందిపడుతున్న వారు అధికంగా ఉన్నట్లు ఆరోగ్యశాఖ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇచ్చింది కూడా. చలితో వచ్చే జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు, గొంతు నొప్పులు ఎక్కువగా ఉంటున్నాయని అందులో పేర్కొన్నట్టు తెలిసింది.



వరంగల్ ఎంజీఎంలో ఫీవర్స్ వార్డ్

చలిజ్వరంతో బాధపడుతున్నా..

చలి, తీవ్ర జ్వరం, కడుపునొప్పి రావడంతో రెండు రోజుల క్రితం జిల్లా దవాఖానాకు వచ్చిన. డాక్టర్లు పరీక్షించి వార్డులో చేర్చుకున్నారు. పొద్దున, సాయంత్రం వచ్చి చూస్తున్నారు. కొంచెం నయమైంది.

– తూడి సోమక్క, వనపర్తి, లింగాల గణపురం

శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి



కొన్నిరోజులుగా ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా నమోదవుతున్నాయి. వారం రోజుల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో 2,350 మంది ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగానికి వచ్చారు. అందులో 80 మంది జ్వరాలతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. ఆస్తమా, గుండె సంబంధిత వ్యాధుల టెస్టులు చేయడానికి ఎక్స్‌రే, ఈసీజీ, ట్రెడ్‌మిల్, టూడీ ఈకో టెస్టులు అందుబాటులో ఉన్నాయి. సరిపడా టెక్నీషియన్స్ లేక అన్ని టెస్టులు ఒక్కరే చేస్తున్నారు. సరిపడా మందులు ఉన్నాయి. ఎమ్మారై, సీటీ స్కాన్లు తీయడం లేదు.

– డాక్టర్ గోపాలరావు, జిల్లా వైద్యాధికారి, ములుగు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



శీతాకాలం ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులు వచ్చి, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. జ్వరం, జలుబు, దగ్గు, ఆస్తమా సమస్యలు తలెత్తుతాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో చలి గాలిలో తిరగవద్దు. బయటికి వెళ్లినప్పుడు మాస్కులు ధరించడం మంచిది. వెచ్చగా ఉండే దుస్తులను ధరించాలి. రోగ నిరోధక శక్తి పెరిగే ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ మధుసూదన్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, జయశంకర్ భూపాలపల్లి

క్లుప్తంగా...

తెలంగాణ కశ్మీర్ అనంతగిరికి విచ్చేయండి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించిన స్పీకర్ గడ్డం ప్రసాద్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కశ్మీర్, మూసీ నది జన్మస్థానం, అనంత పద్మనాభస్వామి కొలువై ఉన్న అనంతగిరి సందర్శనకు రావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆహ్వానించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహానికి వెళ్లిన ప్రసాద్‌కుమార్ సోమవారం తెలంగాణ భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్ ఆహ్వానంపై గవర్నర్ సానుకూలంగా స్పందించారు.

మీరు తెచ్చిన చట్టాన్ని మీరే అమలు చేయరా?

రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన 2013 భూసేకరణ చట్టాన్ని మీరే అమలు చేయరా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. 'మీరు తీసుకొచ్చిన భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా రైతులను వేధించడం కరెక్టేనా?'అంటూ నిలదీశారు. రాహుల్ గాంధీని కలిసి ఆ చట్టాన్ని అమలుచేయడం లేదని చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడారు. లగచర్లలో రైతులపై దాడి, భూసేకరణ చట్టం అమలు చేయకపోవడం గురించి పార్లమెంట్‌లో లేవనెత్తాలనుకున్నానని, సభ వాయిదాతో వీలుపడలేదని చెప్పారు. లగచర్ల బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని.. న్యాయ పోరాటంలోనూ సహకరిస్తామన్నారు. మల్లన్నసాగర్ రైతులపై దాడులు చేయించి, కేసులు పెట్టించిన కేటీఆర్ ఇప్పుడు రైతుల కోసం పోరాడుతున్నానని చెప్పడం శోచనీయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆయన ఆరోపించారు.

అదానీ నిధులు వద్దన్నాం

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.100 కోట్లు ఇచ్చేందుకు అదానీ సంస్థ ముందుకొచ్చిందని తెలిపారు. కానీ అదానీ సంస్థ అదేదో తెలంగాణ రాష్ట్రానికో, ముఖ్యమంత్రికో అప్పనంగా రూ.100 కోట్లు ఇచ్చినట్టు చర్చ జరుగుతోందన్నారు. ''అదానీ సహా ఇప్పటివరకు ఏ సంస్థ నుంచి తెలంగాణ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అదానీ సంస్థ నుంచి నిధులు తీసుకున్నారంటూ వ్యక్తిగతంగా నా గురించి చర్చ జరగడం నాకు, కేబినెట్ సహచరులకు ఇష్టం లేదు. అందుకే మా అధికారి జయేశ్‌రంజన్ ద్వారా అదానీ సంస్థకు లేఖ రాశాం. ఆ సంస్థ ప్రకటించిన రూ.100 కోట్లు స్వీకరించడానికి సిద్ధంగా లేమని, ఆ నిధులు ప్రభుత్వానికి బదిలీ చేయవద్దని ఆ లేఖలో స్పష్టం చేశాం'' అని రేవంత్ తెలిపారు.

ఒప్పందాల రద్దు అంత సులువుకాదు

అదానీ గ్రూపుతో గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటారా? అని మీడియా ప్రశ్నించగా.. అది అంత సులువైనది కాదని, అలా రద్దు చేసుకుంటే వారు కోర్టులకు వెళ్లే అవకాశం ఉంటుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ''అయినా అదానీ ఫ్లైట్‌లో ఆడంబరంగా తిరిగింది వాళ్లు. కేసీఆర్‌లా మేం అదానీ నుంచి అప్పనంగా తీసుకోలేదు. అదానీతో ఎన్నో ఒప్పందాలు చేసుకున్నవారు మాపై ఆరోపణలు చేస్తున్నారు. అసలు పెట్టుబడుల విషయంలో వారి విధానమేంటి? పెట్టుబడులు రాకపోతే తీసుకురాలేదంటారు. తెస్తే రద్దు చేసుకోవాలంటారు. అంటే గత ప్రభుత్వం అదానీ గ్రూపుతో జాతీయ రహదారులు, డేటా సెంటర్ల ఏర్పాటు కోసం ఒప్పందాలు చేసుకున్నందుకు కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలా? వారి మీద కూడా కేసులు పెట్టాలా?'' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

వాళ్ల కాకిగోలను పట్టించుకోబోం

పెట్టుబడుల విషయంలో తాము ఎవరికీ ఆయాచిత లబ్ధి చేకూర్చబోమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ''2023లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. 2024లో డిపాజిట్లు కోల్పోయింది. ఇప్పుడు మెదడు కోల్పోయింది. మీ కడుపు మంట మాకు తెలుసు. మీ దుఃఖం మాకు తెలుసు. మీ కాకిగోలను పట్టించుకోం. మీలాంటి వాళ్లు అరుస్తుంటే మాకు ఉత్సాహం వస్తుంది. మా కార్యకర్తలు సంతోషపడతారు. మీ క్షోభను చూస్తుంటే అప్పుడప్పుడు కోపం వస్తుంది. అయినా ఏకాగ్రత, కార్యదీక్షతో మేం ముందుకెళుతున్నాం'' అంటూ బీఆర్ఎస్ నేతలను ఎద్దేవా చేశారు.

ఆ ఎన్నికల్లో వచ్చింది లేదు.. పోయింది లేదు

జార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఉప ఎన్నికలపై రేవంత్‌రెడ్డి స్పందిస్తూ... ఆ ఎన్నికల వల్ల ఎవరికీ వచ్చింది లేదని, ఎవరికీ పోయింది లేదని పేర్కొన్నారు. ''మహారాష్ట్రలో బీజేపీ కూటమికి ఎక్కువ సీట్లు వచ్చాయి. జార్ఖండ్‌లో ఇండియా కూటమికి ఎక్కువ సీట్లు వచ్చాయి. కర్ణాటక అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. బెంగాల్‌లో బీజేపీ డిపాజిట్లు కోల్పోయింది. దేశంలోని రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు మోదీని ఓడించి రాహుల్, ఖర్గేల నాయకత్వాన్ని బలపర్చారు. కేరళలోని వయనాడ్ నుంచి ప్రియాంకా గాంధీ భారీ మెజార్టీతో గెలిచారు. మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానాన్ని మేమే గెలిచాం. దీన్నిబట్టి దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని, కిషన్‌రెడ్డిని ఛీ కొట్టారని అర్థమవుతోంది. అయినా కిషన్‌రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. ఆయనను కేంద్ర మంత్రిగా చేయడం తెలంగాణ దురదృష్టం..'' అని రేవంత్ విమర్శించారు.

పైరవీల కోసం కాదు..
పెళ్లి కోసం ఢిల్లీ వెళ్తున్నా..

తాను ఢిల్లీ వెళ్లినప్పుడల్లా మంత్రివర్గ విస్తరణ గురించి వార్తలు వస్తున్నాయని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు తాను ఢిల్లీకి వెళ్తోంది లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమని చెప్పారు. సోమవారం రాత్రి వివాహ రిసెప్షన్‌కు హాజరై... మంగళవారం ఉదయం తెలంగాణ ఎంపీలతో సమావేశమవుతామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించే వ్యూహంపై చర్చిస్తామని చెప్పారు. అందుబాటులో కేంద్ర మంత్రులెవరైనా ఉంటే కలుస్తామన్నారు. అయితే తాము బీఆర్ఎస్ నేతల్లా పైరవీలు చేసేందుకు, కాళ్లు పట్టుకునేందుకు, కేసుల నుంచి తప్పించుకునేందుకో, మోదీ ముందు మోకరిల్లేందుకో ఢిల్లీకి వెళ్లడం లేదని పేర్కొన్నారు. కేంద్రాన్ని నిలదీసి అయినా నిధులు తెచ్చుకునేందుకు వెళుతున్నామని.. ఎన్నిసార్లయినా వెళ్తామని రేవంత్ చెప్పారు. కేంద్రం సమాఖ్య స్ఫూర్తితో ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు ఇవ్వాలని... అదేమీ బీజేపీ ఖజానా కాదని వ్యాఖ్యానించారు. ఏ ఎన్నికలైనా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలనేది కాంగ్రెస్ పార్టీ విధానమని, తనది కూడా అదే అభిప్రాయమని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఓంబిర్లా కుమార్తె వివాహ విందుకు ప్రముఖుల హాజరు



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుమార్తె వివాహ విందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఓంబిర్లా కుమార్తె అంజలీ బిర్లా ప్రముఖ వ్యాపారవేత్త అనీష్ రజనీల వివాహం ఈనెల 12న జరగ్గా సోమవారం ఢిల్లీలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. దీనికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కాంగ్రెస్ ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తదితరులు హాజరయ్యారు. అలాగే ఏపీ నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, వైఎస్సార్సీపీ తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, టీడీపీ ఎంపీలు కేశినేని చిన్ని, ప్రసాద్, బాలశౌరి, ఉదయ్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

అదానీతో ఒప్పందాల సంగతేంటి?

అవినీతి బయటకు రాగానే సీఎం మాట మార్చారు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: పారిశ్రామికవేత్త అదానీతో దావోస్‌లో సీఎం రేవంత్ కుదుర్చుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటో చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అవినీతి మీద జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నినదిస్తున్న సమయంలో అదానీతో రేవంత్ ఒప్పందాల సంగతి తేల్చాలన్నారు. ఈ మేరకు సోమవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని వెనక్కి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించారు. 'అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల సంగతేంటి. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడతామనే ప్రతిపాదనతో వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం మర్యాదపూర్వకంగా తేనీరు ఇచ్చి పంపించింది. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ రాహుల్ గాంధీ అవినీతిపరుడు అంటున్న వ్యక్తికే రెడ్ కార్పెట్ పరిచింది. అదానీతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు అన్నింటినీ రద్దు చేయాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

సర్కారు నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి

ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతికి రేవంత్ ప్రభుత్వమే కారణమని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆట పాటల నడుమ చదువుకోవాల్సిన విద్యార్థిని విషాహారంతో కన్నుమూయడం కలిచివేసిందన్నారు. విద్యార్థినిని బలితీసుకున్న పాపం దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతుందన్నారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

అంబర్-రెసోజెట్ సంస్థ రూ. 250 కోట్ల పెట్టుబడి



వెయ్యి మందికి ఉద్యోగాలు: మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ వినిమయ వస్తువులు, విడిభాగాలను పలు దిగ్గజ కంపెనీలకు అందించే 'అంబర్-రెసోజెట్'భాగస్వామ్య సంస్థ రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చింది. సోమవారం ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో సంస్థ ప్రతినిధులు తమ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడించారు. అంబర్-రెసోజెట్ సంస్థకు ప్రభుత్వపరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఏసీలు, అత్యాధునిక వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండీషనర్ల లాంటి పలు పరికరాలను ఈ సంస్థ ఉత్పత్తి చేసి దేశంలోని పలు కంపెనీల కోసం అందిస్తోందని ఆయన తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతుందని శ్రీధర్‌బాబు చెప్పారు. దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు మంత్రి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో మధుసూదన్, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ డా.ఎస్.కె.శర్మ, అంబర్-రెసోజెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దొడ్ల డెయిరీ రూ.4 కోట్ల విరాళం

సాక్షి, హైదరాబాద్: పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కామారెడ్డి ప్రభుత్వ డెయిరీ టెక్నాలజీ కళాశాల అభివృద్ధికి దొడ్ల డెయిరీ యాజమాన్యం రూ.4 కోట్ల విరాళం ప్రకటించింది. పశుసంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌కు సోమవారం దొడ్ల డెయిరీ బోర్డు ఆమోదపత్రాన్ని ఆ సంస్థ సీఈవో బీవీకే రెడ్డి అందించారు. ఈ విరాళం ద్వారా కళాశాల భవన మొదటి అంతస్తు నిర్మాణం, ఎన్‌హెచ్ 44 నుంచి కళాశాల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం, కళాశాల నుంచి బాలుర, బాలికల వసతి గృహాల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం, కళాశాల భవనానికి మరమ్మతులు, సుందరీకరణ, మినీ డెయిరీ ప్లాంట్ ఏర్పాటు, ఇతర పరికరాలను ఏర్పాటు చేస్తామని బీవీకే రెడ్డి వెల్లడించారు. పనుల వివరాలను ఇవ్వాలని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ శరత్‌చంద్రను సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి ముందుకొచ్చిన దొడ్ల డెయిరీ యాజమాన్యం, చైర్మన్ సునీల్‌రెడ్డి, సీఈవో బీవీకే రెడ్డిలను అభినందించారు. ఈ వసతుల కల్పనతో రాబోయే కాలంలో ఎంటెక్ కోర్సును ప్రారంభించే అవకాశం ఉంటుందని శరత్‌చంద్ర అన్నారు.

చెరుకు నేలచూపు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చెరుకు సాగు విస్తీర్ణం నానాటికీ పడిపోతుండగా, క్రషింగ్ సామర్థ్యానికి అనుగుణంగా చెరుకు లభ్యత లేక ఫ్యాక్టరీలు నష్టాల బాట పడుతున్నాయి. పంట గిట్టుబాటు కాక, కూలీల కొరత, ప్రభుత్వం ప్రోత్సాహం కరువు తదితర కారణాలతో రైతులు చెరుకు సాగుకు స్వస్తి చెప్పి ఇతర పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రంలోని 12 చక్కెర కర్మాగారాలకు గాను ఇప్పటికే ప్రభుత్వ, సహకార రంగంలోని నాలుగు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఇలాంటి సమయంలో చెరుకు సాగులో కీలకమైన డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) పరికరాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాల్సిన ప్రభుత్వం నామమాత్రపు విస్తీర్ణానికే సబ్సిడీని పరిమితం చేస్తోంది. దీంతో రాష్ట్రంలో ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి అవసరమైన విస్తీర్ణంలో సుమారు 30 శాతం మాత్రమే చెరుకు సాగవుతోంది. ప్రస్తుతం నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్ యూనిట్లను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. చెరుకు సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టి పెట్టాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మూడో వంతుకు చెరుకు సాగు

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న 12 చక్కెర కర్మాగారాల రోజువారీ చెరుకు క్రషింగ్ సామర్థ్యం 37,950 టన్నులు. సీజన్‌లో ఫ్యాక్టరీలు పూర్తి సామర్థ్యంతో క్రషింగ్ చేసేందుకు 4.33 లక్షల టన్నుల చెరుకు అవసరమవుతుంది. ఇందుకోసం 65,780 హెక్టార్లలో చెరుకు పంటను సాగు చేయాల్సి ఉంటుంది. అయితే పదేళ్ల క్రితం సాగైన రీతిలో ప్రస్తుతం చెరుకు సాగవడం లేదు. 2014–15లో 49,183 హెక్టార్లలో చెరుకు సాగవగా, మధ్యలో పెరుగుతూ, తగ్గుతూ ప్రస్తుతం 20,393 హెక్టార్లకు (అధికారుల అంచనా) చేరుకుంది. నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్ (2015లో మూతపడింది) పరిధిలోని మూడు యూనిట్లతో పాటు నిజామాబాద్ సహకార చక్కెర కర్మాగారం పూర్తి స్థాయి క్రషింగ్ సామర్థ్యానికి 14,733 హెక్టార్లలో చెరుకు సాగు జరగాల్సి ఉండగా, ప్రస్తుతం 951 హెక్టార్లకే పరిమితమైంది. నిజాం షుగర్స్ పరిధిలోని మంభోజిపల్లి, బోధన్ యూనిట్ల పరిధిలో చెరుకు సాగు విస్తీర్ణం దాదాపు శూన్య స్థితికి చేరుకుంది.

ప్రభుత్వ ప్రోత్సాహమేదీ?

చెరుకు సాగును ప్రోత్సహించాల్సిన చెరుకు అభివృద్ధి మండళ్ల (సీడీసీ) పాత్ర నామమాత్రంగా తయారైంది. సీడీసీ వాటా కింద రైతులు, ఫ్యాక్టరీలు ఒక్కో టన్నుకు రూ.4 చొప్పున చెల్లిస్తున్నాయి. చెరుకు సాగు విస్తీర్ణం తగ్గిన నేపథ్యంలో సీడీసీకి సమకూరుతున్న మొత్తం కూడా అరకొరగా ఉండటంతో రైతులు స్ప్రేయర్ల వంటి పరికరాలను కూడా సొంతంగా సమకూర్చుకోవాల్సి వస్తోంది. మరోవైపు చెరుకు సాగుకు ప్రధాన ప్రతిబంధకంగా ఉన్న కూలీల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణ అవసరమున్నా ప్రభుత్వ ప్రోత్సాహం అందడం లేదు. 'స్టేట్ నార్మల్ స్కీమ్'కింద 2014కు పూర్వం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు తదితరాలను సమకూర్చుకునేందుకు రైతులకు సబ్సిడీ కింద రూ.16 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. తర్వాతి కాలంలో బడ్జెట్ కేటాయింపులు లేక చెరుకు సాగులో యాంత్రీకరణ అటకెక్కింది. మరోవైపు చెరుకు కనీస మద్దతు ధర (ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్) టన్నుకు రూ.3,150 ఉండగా, కనీసం రూ.4 వేలు ఎఫ్ఆర్‌పీ అన్నా ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెప్తున్నారు.

- ఈ ఏడాది 20 వేల హెక్టార్లకు పడిపోయిన సాగు విస్తీర్ణం
- ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి అవసరమైన విస్తీర్ణంలో 30% మాత్రమే సాగు
- నిజాం షుగర్ యూనిట్ల పరిధిలో దాదాపుగా కన్పించని చెరుకు పంట
- పదేళ్ల క్రితం నుంచే ఒడిదుడుకులు
- ధర గిట్టుబాటు కాక, కూలీల కొరత, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో ఇతర పంటల వైపు మళ్లుతున్న రైతులు

పదేళ్లుగా చెరుకు సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

పంట కాలం	విస్తీర్ణం
2014–15	49,183
2015–16	44,165
2016–17	29,904
2017–18	36,622
2018–19	41,028
2019–20	25,778
2020–21	20,093
2021–22	28,580
2022–23	32,286
2023–24	28,677
2024–25 (అంచనా)	20,393

గిట్టుబాటు కాక మానేశా

నేను ముప్పై ఏళ్లకు పైగా 40 ఎకరాల్లో చెరుకు సాగు చేశా. గాయత్రీ ఫ్యాక్టరీకి ఏటా రెండు వేల టన్నుల చెరుకు సరఫరా చేశా. అయితే రానురానూ పంట సాగుకు, చెరుకు నరకడానికి అయ్యే ఖర్చులు భారీగా పెరిగాయి. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా లేకపోవడంతో గిట్టుబాటుకాక వదిలేశా. ఇతర పంటలు వేస్తున్నా.

– సాయిరెడ్డి, తిప్పాపూర్, కామారెడ్డి జిల్లా

టన్నుకు రూ.500 బోనస్ ఇవ్వాలి

ఎకరానికి 30 నుంచి 40 టన్నుల దిగుబడి వచ్చినా చెరుకు సాగు గిట్టుబాటు కావడం లేదు. ఒక్కో ఎకరంలో చెరుకు సాగుకు రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. చెరుకు సాగు విస్తీర్ణం పెరగాలంటే ఇతర పంటలకు ప్రకటించిన తరహాలోనే టన్నుకు రూ.500 బోనస్ ప్రకటించాలి. రికవరీ శాతంతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర చెల్లించాలి.

– రచ్చా నరసింహారావు, నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా

వారికి ఇళ్ల స్థలాల కేటాయింపు సరికాదు

▶ మొదటి పేజీ తరువాయి

కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, హౌసింగ్ సొసైటీలు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టేసింది. హౌసింగ్ సొసైటీలు చెల్లించిన సొమ్మును రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీతో సహా వడ్డీతో కలిపి వెనక్కి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ సొసైటీలకు అనుకూలంగా లీజు డీడ్‌లు ఏవైనా ఇచ్చి ఉంటే అవన్నీ రద్దు అవుతాయని తెలిపింది. అలాగే సొసైటీలు చెల్లించిన డెవలప్‌మెంట్ చార్జీలను కూడా వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ పి.సంజయ్ కుమార్ ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఎంపీలు, శాసన సభ్యులు, ఆల్ ఇండియా సర్వీసు అధికారులు, జడ్జిల సొసైటీలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ 2008లో అప్పటి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పలు జీవోలను కొట్టేస్తూ 2010లో హైకోర్టు తీర్పునిచ్చింది. ఒకవేళ ప్రభుత్వం ఆ సొసైటీలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనుకుంటే వాటి సభ్యులకు అర్హతలు నిర్ణయించాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, హౌసింగ్ సొసైటీలతో పాటు ఇళ్ల స్థలాల కేటాయింపును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వీబీ చెలికాని తదితరులు సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పలు తరగతులతో పోలిస్తే ఎంపీలు, శాసన సభ్యులు, ఆల్ ఇండియా సర్వీసు అధికారులు, జడ్జిలు మంచి స్థానంలో ఉన్నారని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ వర్గాలకు ఇళ్ల స్థలాల కేటాయింపు అధికార దుర్వినియోగం కిందకు వస్తుందని స్పష్టం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సామాన్యులకు ఒకే రకమైన హక్కులను తిరస్కరించడం ఎంత మాత్రం సహేతుకం కాదంది. తాము ఎన్నో త్యాగాలు చేశామని, అందువల్ల తక్కువ ధరలకు ఇళ్ల స్థలాలు పొందే హక్కు ఉందన్న అఖిల భారత సర్వీసు ఉద్యోగుల వాదనను తోసిపుచ్చుతున్నట్లు ధర్మాసనం తీర్పులో పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులు, చట్టసభలకు ఎన్నికైన వారు, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు, ప్రముఖ జర్నలిస్టులు 'వెనుకబడిన వర్గాల'కిందకు రారని స్పష్టం చేసింది.

క్లుప్తంగా...

సాంస్కృతిక సారథి బాధ్యతలు స్వీకరించిన వెన్నెల



సాక్షి, హైదరాబాద్: సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా గద్దర్ కుమార్తె వెన్నెల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మాదాపూర్‌లోని సాంస్కృతిక సారథి కార్యాలయంలో పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ హన్మంతరావు, సినీనటుడు నారాయణ మూర్తి, విమల గద్దర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ సమక్షంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించటంతో పాటు సమాజాన్ని జాగృతం చేసేలా సాంస్కృతిక సారథి ముందుకు సాగాలని మంత్రి జూపల్లి ఆకాంక్షించారు. రాష్ట్ర సాధనకు ప్రజా గాయకుడు గద్దర్ ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనలో ముందుకు సాగుతున్న వెన్నెలకు ప్రభుత్వం కీలకమైన సాంస్కృతిక సారథి బాధ్యత అప్పగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

మండలి బరిలో సీపీఎస్ యూనియన్

- ఈ ఎన్నికలు సీపీఎస్ విధానానికి రెఫరెండం లాంటివి: స్థితప్రజ్ఞ



వెంకటస్వామిని అభినందిస్తున్న స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉమ్మడి కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ జిల్లాలు, ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ జిల్లాల నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్ఈయూ) నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ జిల్లాల నియోజకవర్గానికి సీపీఎస్ యూనియన్ అభ్యర్థిగా మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. కొలిపాక వెంకటస్వామిని ప్రకటించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపై చర్చించేందుకు సోమవారం రాష్ట్రకార్యవర్గం హైదరాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో సమావేశమైంది. రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ పాత పింఛన్ సాధన ఉద్యమంలో ముందుండి, మచ్చలేని చరిత్ర ఉన్న వారిని అభ్యర్థులుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని చెప్పారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు సీపీఎస్ రద్దుకు రెఫరెండం లాంటివన్నారు. గతంలో రెండు సార్లు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ ఉద్యోగులే అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో సీపీఎస్ ఉద్యోగుల సత్తా చాటాలని, యూనియన్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూల రవీందర్

- జాక్టో సమావేశం తీర్మానం



సాక్షి, హైదరాబాద్: వరంగల్– ఖమ్మం– నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌ను ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో జాక్టో సమావేశం జరిగింది. ఈ మేరకు మార్చిలో జరిగే ఎన్నికల్లో అభ్యర్థిని బరిలోకి దించే అంశంపై జాక్టోలోని సంఘాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం, ఉపాధ్యాయవర్గం సమస్యలపై అవగాహన ఉన్న కారణంగానే ఆయనను ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు జాక్టో ఒక ప్రకటనలో వెల్లడించింది. జాక్టో చైర్మన్ సదానందంగౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, అధ్యాపక వర్గం సమస్యలను చట్టసభలో బలంగా వినిపించేందుకు రవీందర్ అవసరమని తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను ఆయన పరిష్కరించారని ప్రధాన కార్యదర్శి కె.కృష్ణుడు అన్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని జాక్టో ప్రచార కార్యదర్శి ఎండీ అబ్దుల్లా అన్నారు. అన్ని వర్గాల అభిప్రాయం మేరకే పూల రవీందర్‌ను ఎంపిక చేసినట్టు కోశాధికారి జి.హేమచంద్రుడు తెలిపారు.

నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ రేపటికి వాయిదా

వికారాబాద్: లగచర్ల ఘటనలో ఏ–1 నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ మరోసారి వాయిదా పడింది. వికారాబాద్ జిల్లా కోర్టులో సోమవారం బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయస్థానం ఈనెల 27కు మరోసారి వాయిదావేసింది. బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో వేసిన ఈ బెయిల్ పిటిషన్‌పై 18న కూడా వాదనలు జరగ్గా 25కు వాయిదాపడిన విషయం తెలిసిందే.

కాకి బలగంలా కదలాలి

- ఒక ప్రాంతంలో గిరిజనులకు అన్యాయం జరిగితే మరో ప్రాంతం గిరిజనులు మౌనంగా ఉండొద్దు
- గిరిజనులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పాలనను కూకటివేళ్లతో పెకిలించాలి
- రాష్ట్రంలో ఎక్కడ, ఎవరికి అన్యాయం జరిగినా కేసీఆర్ సైన్యం సహించదు
- మహబూబాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్

సాక్షి, మహబూబాబాద్: 'గిరిజనులకు అండగా పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలన సాగింది. గిరిజనులు పోడు చేసుకున్న భూములకు పట్టాలు ఇచ్చి కేసీఆర్ ప్రభుత్వం వారికి దన్నుగా నిలిచింది. కానీ రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో గిరిజనుల భూములు లాక్కుంటున్నారు. ఇంత అరాచక పాలనను చూసిన గిరిజనులు తిరగబడుతున్నారు. లగచర్ల రైతులు రేవంత్‌రెడ్డి వస్తే తరిమి తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒక ప్రాంతంలో గిరిజనులకు అన్యాయం జరిగితే మరో ప్రాంతం గిరిజనులు మౌనంగా ఉండొద్దు. కాకి బలగంలా కదలాలి. అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పాలనను కూకటివేళ్లతో పెకిలించాలి..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్ల గిరిజనులపై పోలీసులు కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ, గిరిజనులకు మద్దతుగా సోమవారం మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు.

తెలంగాణలో కేసీఆర్ సైన్యం ఉంది..

'సీఎం రేవంత్‌రెడ్డి తానేం చేసినా ఎదురు చెప్పేవారు ఉండరనే అహంకారంతో ఉన్నారు. కానీ పరాయి పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకు కేసీఆర్ తయారు చేసిన సైన్యం తెలంగాణలో ఉంది. నాడు పోలీసు కేసులకు ఈ సైన్యం భయపడలేదు ఇప్పుడు కాంగ్రెస్‌కు భయపడుతుందా? లగచర్లలోనే కాదు.. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా సహించబోం. నాలుగు సంవత్సరాలు ప్రజల పక్షాన పోరాడి మళ్లీ మన ప్రభుత్వం తెచ్చుకుంటాం. రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేదు. ఇప్పుడు అదే గతి కాంగ్రెస్‌కు పడుతుంది. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చిన కేంద్రం .. రైతుల ఆందోళనలకు తలొగ్గి వెనక్కి తీసుకుంది. పేదలు, గిరిజనుల భూములు లాక్కొని అన్యాయం చేయాలని చూస్తే వారి తరఫున పోరాటం ఉధృతం చేస్తాం..' అని కేటీఆర్ హెచ్చరించారు.

రేవంత్‌కు మహారాష్ట్ర మహిళలు బుద్ధి చెప్పారు

'ఇక్కడ మాదిరిగానే మహారాష్ట్ర మహిళలను నమ్మించేందుకు ఎన్నికల ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డికి అక్కడి ప్రజలు బుద్ధి చెప్పారు. అమాయక గిరిజనుల తరఫున శాంతియుతంగా ధర్నా చేస్తామని చెబితే అనుమతి ఇవ్వని పోలీసులకు, అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలు వినిపించలేదా? కేటీఆర్ మహబూబాబాద్‌కు వస్తే రాళ్లతో కొడతామని, అడ్డుకుంటామని బహిరంగ ప్రకటన చేసిన ఎమ్మెల్యేలపై ఎస్పీ, డీజీపీ ఎందుకు చర్య తీసుకోలేదు?..' అని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెల్సిన విద్య రియల్ ఎస్టేట్ అని, దాన్ని ఎజెండాగా పెట్టుకున్న ముఖ్యమంత్రి..అందుకు ఎదురుతిరిగిన వారిని అరెస్టు చేయించడం మరో ఎజెండాగా పెట్టుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం భూమి, భుక్తి, భవిష్యత్తు కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చి గిరిజనులపైనే ప్రతాపం చూపించడం దారుణమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియ, గండ్ర వెంకటరమణారెడ్డి, వెంకట వీరయ్య, ఎస్.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ మండలం ఆమనగల్లులో రైతులతో మాట్లాడుతున్న కేటీఆర్

పెండ్లికి పోతున్నవో.. సావుకు పోతున్నవో

- 28 సార్లు ఢిల్లీకి వెళ్లి రూ.28 కూడా తీసుకురాలేదు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: 'పెండ్లికి పోతున్నవో.. పేరంటానికి పోతున్నవో.. సావుకు పోతున్నవో మాకు తెలియదు. 28 పర్యాయాలు ఢిల్లీకి వెళ్లి 28 రూపాయలు కూడా తీసుకురాలేదు అని అడగడం తెలంగాణ పౌరులుగా మా బాధ్యత. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు మినహా ఏడాది పాలనలో కేంద్రం నుంచి అదనంగా ఒక్క రూపాయి కూడా తేలేదు..' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. 'మేము ఢిల్లీ గులాములం కాదు. పదవుల కోసం పెదవులు మూసుకున్న చరిత్ర నీది. కొట్లాడి తెచ్చిన తెలంగాణను తెర్లు చేయాలని ప్రయత్నించి పట్టుబడిన 'ఓటుకు నోటు' చరిత్ర నీకే ఉంది. ఈడీ దాడుల నుంచి తప్పించుకునేందుకు ఫైవ్ స్టార్ హోటల్లో చీకట్లో కాళ్లు పట్టుకున్నదెవరో తెలుసు. ఈడీ చేసిన దాడులు కనీసం బయటకు ప్రకటించకుండా ఎవరి కాళ్లు పట్టుకుని తప్పించుకున్నారో? మీ బడేభాయ్ ఛోటే మియాల వ్యవహారం ఎవరికి తెలుసు పిట్టలదొరా?..' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పోరాటం తెలంగాణ రక్తంలో ఉందని, బీఆర్ఎస్ జెండా, ఎజెండా ఎప్పటికీ తెలంగాణ అభివృద్ధి మాత్రమేనని పేర్కొన్నారు.

ఒకే అంశంపై ఇన్ని ఎఫ్ఐఆర్‌లా?

- లగచర్ల ఘటనలో పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు
- ఏ చట్టం ప్రకారం 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారో చెప్పండి
- పట్నం శ్రుతి దాఖలు చేసిన పిటిషన్‌లో తీర్పు రిజర్వు
- బెయిల్ కోరుతూ హైకోర్టులో నరేందర్‌రెడ్డి మరో పిటిషన్



సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనకు సంబంధించి ఏ చట్టం ప్రకారం ఒకే నేరానికి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. దర్యాప్తు అధికారులు అలసత్వంతో వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిర్యాదులోని అంశం ఒకటేనని, ఫిర్యాదుదారు మారిన ప్రతిసారీ కొత్త ఎఫ్ఐఆర్ పెట్టడం ఎలా సమర్థనీయమో చెప్పాలని నిలదీసింది. 'తహసీల్దార్, ఆర్డీవో, డీఎస్పీ, డీసీఆర్‌బీ.. ఇలా ఫిర్యాదు చేశారంటూ సంతకం మార్చారు. కానీ ఫిర్యాదు రాసిన రైటర్‌తోపాటు తేదీలు, నిందితుల పేర్లు మాత్రం ఒకేలా ఉన్నాయి. డీఎస్పీ, తహసీల్దార్‌లు సొంత ఫిర్యాదును కూడా రాయలేకపోయారా? విషయమంతా ఒకేలా రాసిన రైటర్.. ఫిర్యాదుదారుల నుంచి సంతకాలు మాత్రమే తీసుకున్నారు' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వ్ చేసింది.

కాపీ కొట్టేందుకూ తెలివి ఉండాలి..

ఈ నెల 11న వికారాబాద్ జిల్లా లగచర్లలో ప్రభుత్వ ప్రతిపాదిత భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశానికి వచ్చిన కలెక్టర్ సహా పలువురు అధికారులపై దాడి జరగడం తెలిసిందే. ఈ ఘటనలో ప్రమేయం ఉందని ఆరోపిస్తూ పోలీసులు తన భర్త, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి ఈ నెల 13న అరెస్టు చేశారంటూ ఆయన భార్య భార్య శ్రుతి హైకోర్టును ఆశ్రయించారు. ఇది టీటీ అంటోనీ వర్సెస్ కేరళ కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నరేందర్‌రెడ్డిని ఎఫ్ఐఆర్ 153లో పోలీసులు అరెస్టు చేశారన్నారు. వేర్వేరు రోజుల్లో ఘటనలు జరగడంతో ఎఫ్ఐఆర్‌లు కూడా వేర్వేరుగా నమోదు చేసినట్లు చెప్పారు. వాదనల సందర్భంగా పోలీసుల తీరుపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఫిర్యాదును మార్చకుండా సంతకాలు తీసుకోవడంపై 'నకల్ మార్నే కో భీ.. అకల్ కీ జరూరత్ హై' (కాపీ కొట్టడానికి కూడా కొంత తెలివి అవసరం) అని వ్యాఖ్యానించారు. అనంతరం తీర్పును రిజర్వు చేశారు.

మరో కేసులో అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వండి..

కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండలాధ్యక్షుడు శేఖర్ కారుపై రైతుల దాడి ఘటనకు సంబంధించి నమోదైన కేసులోనూ పోలీసులు తన పేరు చేర్చి అదుపులోకి తీసుకొనే అవకాశం ఉన్నందున అరెస్టు చేయకుండా ఆదేశించాలంటూ నరేందర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఒకవేళ పోలీసులు అరెస్టు చేస్తే వెంటనే బెయిల్ ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ జస్టిస్ కె.లక్ష్మణ్ వద్ద నేడు విచారణకు రానుంది.



తమ భూములను తీసుకోవద్దని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముందు మొరపెట్టుకుంటున్న గిరిజన వృద్ధురాలు

ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలి

- 'ఫార్మా' కోసం భూములు ఇవ్వలేం
- ఎంత పరిహారం ఇచ్చినా అక్కర్లేదు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వివరించిన బాధిత రైతులు
- లగచర్ల, రోటిబండ తండాల్లో కమిషన్ పర్యటన

బొంరాస్‌పేట: 'ఫార్మా కోసం మా భూములు తీసుకోవాలనే నిర్ణయాన్ని విరమించుకుంటే ప్రభుత్వానికి, సీఎంకు రుణపడి ఉంటాం' అని వికారాబాద్ జిల్లా దుద్యాల మండల పరిధిలోని ఫార్మా భూ బాధితులు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు విన్నవించారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్ సోమవారం లగచర్ల, రోటిబండ తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ ఏర్పాటుపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. అధికారులపై జరిగిన దాడి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరతరాలుగా సాగు చేసుకుని బతుకుతున్న భూములను ఇవ్వలేమని బాధితులు చెప్పారు. ప్రభుత్వం ఎంత పరిహారం ఇచ్చినా తమకు అక్కర్లేదన్నారు. అనంతరం కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ.. రైతుల నిర్ణయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. తమ పర్యటనలో గమనించిన అన్ని అంశాలపై సమగ్ర నివేదిక అందజేస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా తమవంతు కృషి చేస్తామని, బాధితులకు కమిషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భూ సేకరణ చట్టం 2013 నిబంధనల ప్రకారం ప్రభుత్వం సంబంధిత గ్రామాల్లో చాటింపు వేయించడం, రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయడం, నోటీసులు ఇవ్వడం వంటి ప్రధాన పనులు చేయాల్సి ఉందన్నారు. అయితే ప్రజాభిప్రాయ సేకరణ కోసం వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కొడంగల్ అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని స్పష్టంచేశారు. ఘటనతో సంబంధం లేనివారిని వెంటనే వదిలిపెట్టేలా చూస్తామన్నారు.

నాటి కాంగ్రెస్ పాలనలో కులగణన ఎందుకు చేయలేదు

- బీజేపీ డీఎన్ఏలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ వ్యతిరేకభావం ఉంది
- మీడియాతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



కమిషన్ చైర్మన్ బూసానికి వినతిపత్రం ఇస్తున్న కవిత

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని 55 సంవత్సరాలపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ కులగణన ఎందుకు చేయలేదో ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కర్ణాటకలో చేపట్టిన కులగణన వివరాలను తక్షణమే బహిర్గతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 19 డిమాండ్లతో రూపొందించిన వినతిపత్రాన్ని సోమవారం డీఎస్ఎస్ భవన్‌లోని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రాంతీయ పార్టీల హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో బీసీలకు న్యాయం జరిగిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. కులగణన చేపట్టబోమని భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో 2021లో అఫిడవిట్ దాఖలు చేసిందని, బీజేపీ డీఎన్ఏలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ వ్యతిరేక భావాలు ఉన్నాయని కవిత మండిపడ్డారు.

బ్యూరోక్రసీ జాప్యానికి తావులేదు!

- నిర్దేశిత గడువులోగా ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తిచేయాలి
- 'సీతారామ' కాల్వల టెండర్ల ప్రక్రియను వేగంగా చేయాలి
- జలాశయాల్లో పూడిక తొలగింపునకు టెండర్లు పిలవండి
- సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తికావాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పనులకు సంబంధించి పరిపాలనపర, ఇతర నిర్ణయాల్లో బ్యూరోక్రసీ జాప్యానికి తావు ఉండరాదని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ, ఆర్థిక రంగాల అభివృద్ధికి ఆయా ప్రాజెక్టులు ఎంతో కీలకమని, వాటిని నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి, పనులను సత్వరం ప్రారంభించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై సోమవారం ఆయన జలసౌధ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్ర స్థాయిలోని వివిధ ప్రాజెక్టుల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీతారామ ప్రాజెక్టు అంచనాల సవరణకు పరిపాలనపర అనుమతులను కోరుతూ కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ సమర్పించిన ప్రతిపాదనలను ఇటీవల నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) నేతృత్వంలోని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ తిప్పిపంపిన నేపథ్యంలో 'బ్యూరోక్రసీ' జాప్యంపై మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పూడిక తొలగింపునకు టెండర్లు..: రాష్ట్రంలోని జలాశయాల్లో పూడిక తొలగింపు కోసం సత్వరంగా టెండర్లను ఆహ్వానించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించా రు. జలాశయాల నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ, నీటి నాణ్యత పెంపుదలకు పూడిక తొలగింపు కీలకం అని గుర్తుచేశారు. ఈ నెల 27న సింగూరు ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తామని, ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొంటారని తెలిపారు. నీటిపారుదల శాఖలో లస్కర్ల నియామకం, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ఎంపిక తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. మోడికుంట వాగు ప్రాజెక్టు అంచనా తయారీ, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియలో పురోగతిని మంత్రి ఉత్తమ్ అడిగి తెలుసుకున్నారు. భూసేకరణలో అడ్డంకులను అధిగమించడానికి .. రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ విభాగం కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలసి పని చేయాలని కోరారు. వివిధ ప్రాజెక్టుల అవసరాలకు మున్ముందు సేకరించనున్న భూముల వివరాలను ఆయనకు అందజేయాలన్నారు. డిసెంబర్ తొలి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారని, జిల్లాలోని ప్రాజెక్టుల స్థితిగతులపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా పురోగతి, నిధుల అవసరాలు, భూసేకరణ సమస్యలు, ఇతర అడ్డంకులను నివేదికలో పొందుపర్చాలని కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

బీఆర్ఎస్ వలలో చిక్కుకోవద్దు

- గిరిజనులకు కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలూనాయక్ సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజనులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, గిరిజనులు బీఆర్ఎస్ వలలో చిక్కుకోవద్దని దేవరకొండ కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలూనాయక్ కోరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీలో ఉన్న గిరిజన నాయకులతో మాజీ మంత్రి కేటీఆర్ హడావుడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొడంగల్‌లో ఘటన జరిగితే మహబూబాబాద్‌లో కేటీఆర్ ధర్నా ఎందుకు చేశారని ప్రశ్నించారు. కొడంగల్ లాంటి వెనుకబడిన ప్రాంతాల్లో కంపెనీలు ఏర్పాటు చేస్తే గిరిజన, దళిత బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయనే కేటీఆర్ ఓర్వలేకపోతున్నారని బాలు నాయక్ పేర్కొన్నారు. గతంలో మూడెకరాల భూమి ఇస్తామని గిరిజనులను బీఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. పదేళ్ల పాటు ఏమీ చేయని కేటీఆర్‌కు ఇప్పుడు లంబాడీలు, గిరిజనులపైన కొత్తగా ప్రేమ పుట్టుకొచ్చిందా అని ప్రశ్నించారు. కొడంగల్ పారిశ్రామిక వాడ కోసం తీసుకునే భూమిలో 11 శాతం మాత్రమే గిరిజనులదని, వారికి మెరుగైన పరిహారంతో పాటు ఉద్యోగాలు కూడా ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని చెప్పారు. అమాయక గిరిజన బిడ్డలను రెచ్చగొట్టి జైలుపాలు చేసే కుట్ర బీఆర్ఎస్ చేసిందని బాలు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'మేడిగడ్డ' లోపాలను ముందే వివరించా!

- ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తూ నాలుగు లేఖలు రాశా
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు తెలిపిన బరాజ్ డీఈఈ భీమరాజు
- కుంగిపోవడానికి ముందే బరాజ్‌లో బుంగలుపడ్డాయని వెల్లడి
- మూడోవిడత క్రాస్ ఎగ్జామినేషన్ మొదలు.. తొలిరోజు 18 మందికి ప్రశ్నలు
- నేడు మరో 15 మంది ఇంజనీర్లను ప్రశ్నించనున్న కమిషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాకు కుంగడానికి చాలాకాలం ముందే బుంగలు ఏర్పడి నీళ్లు లీక్ అయ్యాయని బరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) ఎల్.భీమరాజు వెల్లడించారు. వెంటనే తన పైఅధికారి అయిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)కు లేఖ రాసి తెలియజేసినట్లు వివరించారు. బరాజ్‌ను ప్రారంభించాక వచ్చిన తొలి వరదలకే బరాజ్ దిగువన నిర్మించిన సీసీ బ్లాకులు కొట్టుకుపోవడంతో మరో లేఖ రాసినట్లు చెప్పారు. బరాజ్ కుంగిపోయే నాటికి మొత్తం నాలుగు లేఖలు రాసి పైఅధికారులను అప్రమత్తం చేశానన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా సోమవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో డీఈఈ భీమరాజు పాల్గొన్నారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అయితే ఈఈకే లేఖలు రాశానని.. నిర్మాణ సంస్థలకు రాయలేదని ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. బరాజ్ నిర్మాణంలో సికెంట్ పైల్స్‌ను వినియోగించామన్నారు. దీనిపై జస్టిస్ చంద్రఘోష్ స్పందిస్తూ మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్ ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను సోమవారం ప్రారంభించిన కమిషన్ తొలిరోజు 18 మంది ఇంజనీర్లను ప్రశ్నించింది. మంగళవారం మరో 15 మంది ఇంజనీర్లను కమిషన్ ప్రశ్నించనుంది.



సోమవారం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరైన ఇంజనీర్లు

ముందే సిద్ధమై వచ్చారా?:

అఫిడవిట్‌లోని అంశాలన్నీ వాస్తవాలేనా? అని కమిషన్ ప్రశ్నించగా అదనంగా కొత్త అంశాలను ప్రస్తావించడానికి ఏఈఈ విజయ్ రూపాని ప్రయత్నించారు. దీంతో కమిషన్ అసహనం వ్యక్తం చేసింది. అడిగిన వాటికే సమాధానాలు ఇవ్వాలని.. ఏమేం చెప్పాలో ముందే సిద్ధమై వచ్చారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్లేస్‌మెంట్ రిజిస్టర్‌లో సంతకాలను తానే చేశానని, ఆ సమయంలో తన వెంట నిర్మాణ సంస్థల ప్రతినిధులు లేరని ఓ ప్రశ్నకు ఏఈఈ ఎం.ప్రసాద్ బదులిచ్చారు. ఏ రోజు జరిగిన పనికి సంబంధించిన వివరాలను ఆ రోజు రిజిస్టర్‌లో నమోదు చేశానని మరో ఏఈఈ రవికాంత్ కమిషన్‌కు వివరణ ఇచ్చారు. రోజువారీ పనుల నమోదుకు ప్లేస్‌మెంట్ రిజిస్టర్లను వినియోగిస్తామని షేక్ వలీ అనే ఏఈఈ బదులిచ్చారు. బరాజ్‌ల డిజైన్ల తయారీతో తనకు సంబంధం లేదని.. నిర్మాణం పూర్తయ్యాక లోపాల నిర్మూలనకు నిర్వహించిన 3డీ మోడల్ అధ్యయనంలో పాలుపంచుకున్నట్లు సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీ ఓ) ఈఈ ఎం.రామసుబ్బారెడ్డి తెలిపారు. బరాజ్‌లలో లోపాలను సరిదిద్దడానికి ఏర్పాట్లు చేయాలని సిఫారసు చేశా నని సీడీఓ మాజీ సీఈ టి.శ్రీనివాస్ అన్నారు. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సీఈ మోహన్‌కుమార్ సైతం విచారణకు హాజరై తన అఫిడవిట్‌లో అచ్చు తప్పును సరిదిద్దాలని కమిషన్‌కు విజ్ఞప్తి చేయగా కమిషన్ అనుమతిచ్చింది. గోదావరిలో ఇంద్రావతి కలిసే చోట మేడిగడ్డ బరాజ్ నిర్మించారని ఆయన అఫిడవిట్‌లో తెలపగా.. ప్రాణహితకు బదులు ఇంద్రావతిని పొరపాటున టైప్ చేసినట్లు వివరించారు.

రిజిస్టర్లు స్వాధీనం..

మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో రోజువారీ పనుల వివరాలతో కూడిన ప్లేస్‌మెంట్ రిజిస్టర్లను ఏఈఈలు, డీఈఈల నుంచి కమిషన్ స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా రిజిస్టర్లలో వారి సంతకాలను సరిపోల్చి ధ్రువీకరించుకోవ డానికి మళ్లీ వారి నుంచి నమూనా సంతకాలను సేకరించింది.



కోల్పోవడమే వస్తువుల విలువను ఎక్కువగా అర్థం చేయిస్తుంది.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 26 నవంబర్ 2024

ఎన్నికల మహా పాఠం

తాజా మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమికి ఒకటి, ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి మరొకటితో... పైకి వన్ ఆల్ అనిపించాయి. రెండు చోట్లా గద్దె మీద ఉన్న పార్టీలే అధికారాన్ని నిలబెట్టుకున్నాయి. రెండు విజయాల్లోనూ కొన్ని పోలికలున్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ అధికార పార్టీలు మునుపటి కన్నా పెద్ద మెజారిటీతో విజయం సాధించాయి. అనేక కారణాలు విజయాన్ని ప్రభావితం చేసినా, ప్రధానంగా సంక్షేమ పథకాలు కీలక భూమిక పోషించాయి. మరీ ముఖ్యంగా, మహిళలకు నగదు బదలీ పథకం గేమ్ ఛేంజర్లైనట్టు విశ్లేషణ. మహారాష్ట్రలో మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తూ ఏక్‌నాథ్ శిందే తెచ్చిన 'ముఖ్యమంత్రి మాఝీ లడ్కీ బహిన్ యోజన', జార్ఖండ్‌లో అర్హులైన స్త్రీలకు నెలవారీగా వెయ్యి రూపాయల హేమంత్ సోరెన్ సర్కార్ 'ముఖ్యమంత్రి మయ్యా సమ్మాన్ యోజన' వారిని విజయతీరాలకు చేర్చాయి. మరిన్ని రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు రావడం ఖాయమని తేల్చేశాయి. భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేశాయి.

ఎన్నికల్లో గెలుపోటములు సహజమే కావచ్చు. కానీ, మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి సాధించిన మహా విజయం, ప్రతిపక్ష మహావికాస్ ఆఘాడీ (ఎంవీఏ) కూటమి మూటగట్టుకున్న ఘోర పరాజయం మాత్రం ఆశ్చర్యపరుస్తాయి. పోలింగ్ రోజు సాయంత్రం 5 గంటల తర్వాత దాదాపు 9.5 లక్షల ఓట్లు పెరిగాయంటూ వస్తున్న ఆరోపణల మాట ఎలా ఉన్నా, 288 స్థానాల మహారాష్ట్ర అసెంబ్లీలో మెజారిటీ మార్కుకు కేవలం 13 తక్కువగా 132 స్థానాలు బీజేపీ గెలవడం విశేషం. కేవలం అయిదు నెలల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో 48 స్థానాలకు గాను 9 మాత్రమే గెల్చిన బీజేపీ, ఆ ప్రాతిపదికన ఇప్పుడు కేవలం 83 సీట్లే గెలవాలి. కానీ, అప్పటి లెక్క కన్నా మరో 49 స్థానాలు అదనంగా తన ఖాతాలో వేసుకోగలిగింది. అంటే, జూన్ నాటి ఎదురు దెబ్బల నుంచి బీజేపీ మళ్ళీ పూర్తిస్థాయిలో పుంజుకుంటే, అప్పట్లో దక్కిన కొద్దిపాటి ఉత్సాహం, ఊపును కాంగ్రెస్ చేజార్చుకుంది. మహారాష్ట్రలో బీజేపీ, కాంగ్రెస్‌లు 75 స్థానాల్లో ముఖాముఖి పోరుకు దిగితే, హస్తానికి పట్టుమని 10 దక్కడం గమనార్హం. ఇది నిర్ద్వంద్వంగా స్వయంకృతం.

కాంగ్రెస్ తప్పిదాలకు కొదవ లేదు. మరాఠీ భాషే తెలియని పెద్దలను పార్టీ పరిశీలకులుగా పంపిన ఘనత ఈ గ్రాండ్ ఓల్డ్ పార్టీది. పరిశీలకులుగానే కాదు... ప్రచారకులుగానూ బయటి జనాభాయే. వచ్చేది హంగ్ అసెంబ్లీ అంటూ పార్టీ అధిష్ఠానానికి వర్తమానం పంపి, ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయించారంటే క్షేత్రస్థాయి వాస్తవాలకు ఎంత దూరంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. 'బటేంగే తో కటేంగే', 'ఏక్ హై తో సేఫ్ హై' లాంటి నినాదాలతో జనంలో భయాన్నీ, అభద్రతనూ పెంచుతూ మహాయుతి కూటమి ప్రచారం హోరెత్తిస్తే, సరైన ప్రచార కథనాన్ని ఎంచుకోవడంలో మహావికాస్ ఆఘాడీ కూటమిలోని మూడు ప్రతిపక్షాలూ విఫలమయ్యాయి. దాదాపు 40 పైచిలుకు స్థానాల్లో ముస్లిమ్‌ల మద్దతు కోసం చూసుకొని, మెజారిటీ వర్గాలు బీజేపీ వైపు మొగ్గేలా చేశాయి. అలాగే, 'ఇండియా' కూటమి ప్రధాన పక్షాలు ఇతర పార్టీలను కలుపుకొని పోవడంలో, కనీసం నియంత్రించడంలో విఫలమయ్యాయి. అలా దాదాపు 17 శాతం ఓట్ షేర్ వచ్చిన 'ఇతరులు' కూటమి అవకాశాల్ని దెబ్బ తీశారు.

2023 నవంబర్ – డిసెంబర్‌లలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో ఓటమికి కారణాలను అధ్యయనం చేసేందుకు కాంగ్రెస్ వేసుకున్న అంతర్గత కమిటీలు ఇప్పటికీ తమ నివేదికలు ఇవ్వనేలేదు. ఆ పార్టీలో జవాబుదారీతనం లేకపోవడానికి ఇది ఓ మచ్చుతునక. దూరదృష్టి లేకపోవడంతో పాటు ఉదాసీనత కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలను పట్టి పడిస్తోంది. ప్రతిపక్షాలకు భిన్నంగా బీజేపీ పటిష్ఠమైన వ్యూహంతో ముందుకు వెళ్ళింది. ఆరెస్సెస్ శతవసంత వత్సరంలో అడుగిడిన వేళ మహారాష్ట్రలో కాషాయ విజయాన్ని కానుకగా అందించాలన్న సంకల్పం సైతం సంఘ్ కార్యకర్తలను లక్ష్యసాధనకు పురిగొల్పింది. పోలింగ్ బూత్ స్థాయి దాకా వెళ్ళి వారు శ్రమించడం ఫలితమిచ్చింది. మహారాష్ట్రలో రాహుల్ గాంధీ పరిమితంగా ప్రచారం చేస్తే, 'చొరబాటు దారుల' బూచితో బీజేపీ భయపెట్టిన జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్, ఆయన సతీమణి కల్పన దాదాపు 100 ర్యాలీలలో పాల్గొని విజయసాధనకు శ్రమించాల్సిన విధానం ఏమిటో చూపెట్టారు. ఇటీవల జమ్మూ – కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, ఇప్పుడు జార్ఖండ్‌లో జేఎంఎం భుజాల మీద ఎక్కి, హస్తం విజయకూటమిలో నిలిచింది కానీ, వ్యక్తిగతంగా అది సాధించిన సీట్లు స్వల్పమే.

ఈ ఫలితాలు ఆత్మపరిశీలన తప్పనిసరి అని కాంగ్రెస్‌కు పదే పదే బోధిస్తున్నాయి. రాజ్యాంగ పరిరక్షణ, అధికార బీజేపీ ఆశ్రిత పక్షపాతం లాంటి పాత పాటకు పరిమితం కాకుండా కొత్త పల్లవి అందుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. విజేతగా నిలిచిన బీజేపీ, ముఖ్యంగా మోదీ ఇప్పటికే స్వరం పెంచి, ప్రతిపక్షాలపై విరుచుకు పడుతున్నారు. మోదీ, షాలు మళ్ళీ పట్టు బిగించారు. ఇదే ఊపులో కమలనాథులు ఉమ్మడి పౌరస్మృతి, ఒక దేశం... ఒకే ఎన్నిక, వక్ఫ్ బిల్లు వగైరాలపై వేగం పెంచవచ్చు. బీమా రంగంలో పూర్తి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల లాంటి విపరీత సంస్కరణలకూ గేట్లెత్తే అవకాశం ఉంది. మహారాష్ట్ర పీఠమెక్కే కొత్త దేవేంద్రులకూ చాలా బాధ్యతలున్నాయి. దేశానికి ఆర్థిక కేంద్రంగా, స్థూలజాతీయోత్పత్తిలో దాదాపు 14 శాతం అందించే మహారాష్ట్రలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, ఆర్థిక ఆరోగ్యాన్ని కాపాడాలి. అవినీతి, నిరుద్యోగం, రైతాంగ సమస్యల లాంటివి ఎన్నికల ప్రచారంలో వెనుకపట్టు పట్టినా, ఇకనైనా ఆ కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. వెరసి, మహా ఫలితాల దరిమిలా అధికార, ప్రతిపక్షాలు అందరికీ చేతి నిండా పని ఉంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు.
కార్తీక మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.3.34 వరకు, తదుపరి ద్వాదశి,
నక్షత్రం: హస్త తె.5.12 వరకు (తెల్లవారితే బుధవారం) తదుపరి చిత్త,
వర్జ్యం: ఉ.11.58 నుండి 1.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.28 నుండి 9.16 వరకు, తదుపరి రా.10.32 నుండి 11.20 వరకు,
అమృతఘడియలు: రా.10.32 నుండి 12.12 వరకు

సూర్యోదయం : 6.14
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

రాజ్యాంగ నిర్మాతలకు వందనం

భారతీయ విలువలు, ఆదర్శాలను ప్రతిబింబించేలా పరమ పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని రూపొందించుకుని, 1949 నవంబర్ 26 నాడు ఆమోదించుకున్న రోజు దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది. ఆ రోజునే మనం 'సంవిధాన్ దివస్' (రాజ్యాంగ దినోత్సవం)గా జరుపుకొంటున్నాం. నేడు 75వ రాజ్యాంగ దినోత్సవం కావడం విశేషం. అయితే, రాజ్యాంగ నిర్మాణం చిన్న విషయం కాదు. సిద్ధాంత రాద్ధాంతాల సంఘర్షణ నుంచి వచ్చిన ఇది... ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్. భారతదేశ పురోగతి, ప్రజల సంక్షేమాలకు ఇది తోడ్పాటునందిస్తోంది. ఎప్పటికప్పుడు వ్యవస్థను పటిష్ఠపరుస్తూ 'సజీవ పత్రం'గా నిరంతర మార్గదర్శనం చేస్తోంది.

రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టి

సందర్భం



జి. కిషన్ రెడ్డి


భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య సిద్ధి ఓ ప్రత్యేకమైన సందర్భం. భారతీయుల భవిష్యత్తును నిర్దేశించిన రోజది. రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని పొందాం. కానీ, భారతీయ విలువలకు అనుగుణంగా స్వపరిపాలన జరగాలన్న బలమైన ఆకాంక్ష భారతీయుల్లో వ్యక్తమైంది. దీనికి ప్రతిరూపంగానే, భారతీయ విలువలు, ఆదర్శాలను ప్రతిబింబించేలా పరమ పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని రూపొందించుకుని, 1949 నవంబర్ 26 నాడు ఆమోదించుకున్న రోజు దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది.

నాటి నుంచి గత 75 ఏళ్లుగా భారతదేశంలో మూలవిలువలు, సామాజిక స్ఫూహలను 'భారత రాజ్యాంగం' సంరక్షిస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు వ్యవస్థను పటిష్ఠపరుస్తూ 'సజీవ పత్రం'గా నిరంతర మార్గదర్శనం చేస్తోంది. భారతీయ ఆత్మను, అస్తిత్వాన్ని సంరక్షించడం అనే రెండు అంశాల అద్భుత సమ్మేళనంగా మన రాజ్యాంగం ముందుకు నడిపిస్తోంది. రాజ్యాంగ నిర్మాతల ఈ ముందుచూపే రాజ్యాంగ సభ చర్చల్లో ప్రతిబింబించింది.

1949 సెప్టెంబర్ 18 నాడు భారత రాజ్యాంగ సభలో చర్చ సందర్భంగా... స్వాతంత్ర్య సమర యోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు కల్లూరు సుబ్బారావు తన తొలి ప్రసంగంలో, రుగ్వేదంలో భారత్ అనే పదాన్ని వాడిన విషయాన్ని, వాయు పురాణంలో (45వ అధ్యాయం 75వ శ్లోకం) భారతదేశ సరిహద్దుల గురించి ఉన్న వివరణను తెలియజేశారు.

'ఇదంతు మాధ్యమం చిత్రం శుభాశుభ ఫలోదయం, ఉత్తరం యత్ సముద్రస్య హిమవన దక్షిణం చ యత్'... హిమాలయాల దక్షిణం వైపు, సముద్రానికి ఉత్తరం వైపున్న పవిత్ర భూమే భారతమాత అని అర్థం. భారత్ అనేది కేవలం ఒక పదం కాదు, వేలాది సంవత్సరాల ఘనమైన వారసత్వ విలువలకు సజీవ రూపం అని ఈ మాటలు స్పష్టం చేస్తున్నాయి. ఆనాటి కాంగ్రెస్ సిద్ధాంతంలో, నేటి కాంగ్రెస్ ఆలోచనలో నక్కకూ నాకలోకానికీ ఉన్నంత తేడా ఉంది. వారు తరచుగా భారతదేశపు నాగరిక విలువలను అవమానించేలా, దేశాన్ని 'నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్' అని వ్యాఖ్యానిస్తున్నారు.

1948 నవంబర్ 4న రాజ్యాంగ సభ చర్చలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ... భారతదేశం ఓ అవిభాజ్య భూఖండం అనీ, దేశం పరిపాలనా సౌలభ్యం కొరకు వేర్వేరు రాష్ట్రాలుగా విభజించబడినప్పటికీ... ఈ దేశ అధికారం ఒకే మూలం నుంచి ఉద్భవిస్తుందని పేర్కొన్నారు.



1947 ఆగస్ట్ 29న ఏర్పడిన రాజ్యాంగ రచనా సంఘం సభ్యులు: డి.పి.ఖైతాన్, సయ్యద్ మొహమ్మద్ సాదుల్లా, బి.ఆర్.అంబేడ్కర్(ఛైర్మన్), అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, బి.ఎన్.రావ్; (నిల్చున్నవారు): బి.ఎల్.మిట్టర్, కె.ఎం.మున్షీ, నరసింహ గోపాలస్వామి అయ్యంగార్

రాజ్యాంగ పీఠికలో 'సోషలిస్ట్' అనే పదాన్ని చేర్చాలన్న చర్చను అంబేడ్కర్ వ్యతిరేకించారు. 'రాజ్యానికి సంబంధించిన విధానం ఎలా ఉండాలి? సామాజిక, ఆర్థిక కోణంలో సమాజ నిర్వహణ ఎలా జరగాలి? వంటి అంశాలను సమయానుగుణంగా ప్రజలే నిర్ణయించుకోవాలి' అని స్పష్టం చేశారు. రేపటి రోజు సోషలిజం కంటే మంచి విధానాలు వస్తే, వాటిని రాజ్యాంగంలో చేర్చుకుని, అమలుచేసుకునే అవకాశం రానున్న తరాలకు ఉండాలనేది అంబేడ్కర్ భావన. ఈ సౌలభ్య విధానాన్ని సద్వినియోగం చేసుకుంటూ... 1991లో లైసెన్స్ రాజ్ నుంచి... ఉదారవాద, సరళీకృత ఆర్థిక వ్యవస్థకు బాటలు పడ్డాయి. నాడు రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ సభ వేదిక ద్వారా చేసిన సమగ్రమైన చర్చలు... నేటికీ వివిధ అంశాలపై లోతైన అవగాహనను కల్పిస్తున్నాయి.

రాజ్యాంగ సభలో అంబేడ్కర్ మాట్లాడుతూ... రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా సౌభ్రాతృత్వం, సమానత్వం పదాలు సరిగ్గా అమలై అందరికీ అభివృద్ధి ఫలాలు అందినపుడే, నిజమైన జాతిగా మనం పురోగతి సాధించినట్లుగా భావించాలన్నారు. 2014లో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంత్యోదయ నినాదంతో, 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' విధానంతో సమగ్ర సాధికారత కోసం పనిచేస్తున్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలిచే క్రమంలో... సాధికారత అనేది ప్రతి పౌరుడి సహజమైన జీవన విధానంగా, భారతదేశ పురోగతిలో అంతర్లీనంగా ఉన్నటువంటి అంశంగా మారిపోయింది.

ముద్ర యోజన, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలు, స్వచ్ఛభారత్, బేటీ బచావో–బేటీ పఢావో వంటి సామాజిక ఉద్యమాలు దేశం నడుస్తున్న దిశను పునర్నిర్వచించాయి. ప్రభుత్వ నియంత్రణలో ఉండే సోషలిజం అనే భావన నుంచి ఏనాడో బయటకు వచ్చి, అందరి సంక్షేమం కోసం సామాజిక న్యాయమనే నినాదంతో ప్రతి ఒక్కరికీ విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నాం. వందకుపైగా యూనికార్న్‌ (1 బిలియన్‌కు పైగా పెట్టుబడులున్న కంపెనీలు)తో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా నిలిచింది. వ్యాక్సిన్ సప్లయ్, రక్షణ రంగ ఉత్పత్తిలో గ్లోబల్ లీడర్‌గా మన్ననలు అందుకుంటోంది. దేశంలో సెమీకండక్టర్ల తయారీ ఉద్యమం ఊపందుకుంది. ఫిన్‌టెక్, హెల్త్ టెక్ సంస్థలు అంతర్జాతీయ వేదికపై భారత గౌరవాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. త్వరలోనే ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతోంది.

దేశం ఇలా అన్ని రంగాల్లో అగ్రదేశాల సరసన నిలుస్తున్న సందర్భంలో, భారతీయుల సామర్థ్యంపై విశ్వాసాన్ని ఉంచకుండా, సమాజాన్ని విభజించేందుకు, సంపదను అందరికీ పంచేవిషయంలో అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నాలు జరగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వెళ్లడమే అవుతుంది. ప్రతి భారతీయుడి శక్తి సామర్థ్యాలపై విశ్వాసం ఉంచి, అందరికీ కలుపుకొని ముందుకెళ్తూ, వికసిత భారత లక్ష్యాలను చేరుకోవాలని సంకల్పించుకున్న 'అమృత కాల'మిది. వ్యక్తులకు సాధికారత కల్పించినపుడే, సుసంపన్నమైన దేశంగా ఎదగడానికి, ప్రపంచానికి మరోసారి విశ్వగురుగా మారడానికి విస్తృత అవకాశాలుంటాయి.

వ్యాసకర్త కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి; బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు

మన రాజ్యాంగ నిర్మాతలు

సందర్భం



మాడభూషి శ్రీధర్

భారత రాజ్యాంగ నిర్మాణం పూర్తయిన రోజు నవంబర్ 26. కొన్ని అత్యవసరమైన అధికరణాల అమలు వెంటనే మొదలైంది. రెండు నెలల తరువాత పూర్తి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అదే గణతంత్ర దినోత్సవం. రాజ్యాంగ నిర్మాణం చిన్న విషయం కాదు. సిద్ధాంత రాద్ధాంతాల సంఘర్షణ నుంచి వచ్చిన ఇదొక భగవద్గీత, బైబిల్, ఖురాన్. దీని రచనలో భాగస్వాములైన మహానుభావులను తలుచుకోవడం మన కర్తవ్యం.

బాబాసాహెబ్ బి.ఆర్.అంబేడ్కర్: అధికరణం 32 లేకపోతే రాజ్యాంగమే లేదు. నాయకుల నియంతృత్వం తప్ప స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం వంటి మాటలే ఉండక పోయేవి. కీలకమైన ఆర్టికల్ 32 రాసింది అంబేడ్కర్. ఆయన ఒక న్యాయవేత్త, ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, సంఘ సంస్కర్త. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటి న్యాయశాఖ మంత్రి. పౌర హక్కులకు కీలకమైన ఆర్టికల్ 32 మొత్తం రాజ్యాంగాన్ని బతికించే శక్తి కలిగినది. ఏ అన్యాయం జరిగినా నేరుగా సుప్రీంకోర్టునే అడిగే హక్కును ఇచ్చిన ఆర్టికల్ ఇది. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)కు పునాది ఇదే. ''భారత రాజ్యాంగంలో అత్యంత ముఖ్యమైన ఆర్టికల్ ఏదని అడిగితే, 'ఆర్టికల్ 32' అని చెబుతాను. అది లేకుండా ఈ రాజ్యాంగం శూన్యం అవుతుంది... ఇది రాజ్యాంగ ఆత్మ, హృదయం వంటిది'' అని అంబేడ్కర్ 1948 డిసెంబర్ 9న జరిగిన రాజ్యాంగ సభ చర్చల్లో ప్రకటించారు.

అసమానతలను, వివక్షను అంతం చేసేందుకు అంబేడ్కర్ రాజ్యాంగ రూపకల్పనలో తానూ ఉండాలని అనుకున్నారు. మొత్తం భారత రాజ్యాంగ సంవిధానానికి నిర్మాత అయినారు. 8 పనిగంటలు మొదలుకొని, ప్రసూతి సెలవుల వరకు కారణం ఆయనే. సమాన హక్కులు, సమాన అవకాశాలు అంబేడ్కర్ సిద్ధాంతం. భారతీయ రిజర్వ్ బ్యాంకు స్థాపనలో అంబేడ్కర్ ఆర్థిక సిద్ధాంతాలు కీలకపాత్ర పోషించాయి.

దేవీ ప్రసాద్ ఖైతాన్: న్యాయవాది, స్వాతంత్ర్య సమర యోధుడు, రాజకీయవేత్త. కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో విద్యార్థి. 'ఖైతాన్–కో' లా ఫర్మ్ వ్యవస్థాపకులు. 1925లో ఏర్పడిన ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సహ వ్యవస్థాపకులు. రచనా కమిటీ సభ్యుడిగా కొద్దికాలం పనిచేశారు. 1948లో మరణించడం వల్ల ఆ స్థానంలో టీటీ కృష్ణమాచారి వచ్చారు.

సర్ సయ్యద్ మొహమ్మద్ సాదుల్లా: న్యాయవాది, అస్సాం ముస్లిం లీగ్ నాయకుడు. 1936లో బ్రిటిష్ ఇండియాలో కాంగ్రెసేతర పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి అస్సాంకు తొలి ముఖ్యమంత్రి అయ్యారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన కమిటీకి ఎన్నికైన ఒకే ఒక్క సభ్యుడు. రాజ్యాంగ రచనలో పాలుపంచుకున్న ఒకే ఒక్క ముస్లిం లీగ్ సభ్యుడు కూడా. అస్సాం ఆర్థిక స్థిరత్వం, మైనారిటీ హక్కులను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు.

సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్: తమిళ కుటుంబానికి చెందిన అయ్యర్ నెల్లూరులో పుట్టారు. ఈ ప్రాంతం అప్పట్లో మద్రాస్ స్టేట్‌లో ఉండేది. ఆయన అపారమైన జ్ఞానం కలిగిన గొప్పవాడని అంబేడ్కర్ స్వయంగా అంగీకరించారు. రాజ్యాంగంలో చేర్చవలసిన పౌరసత్వ హక్కులు, ప్రాథమిక హక్కుల గురించి బలంగా వాదించారు. 'మన విధానాలు, నిబద్ధత విషయంలో జాతి, మతం లేదా ఇతర ప్రాతిపదికన వ్యక్తుల మధ్య లేదా వర్గాల మధ్య భేదాలు చూపకూడ'దని లౌకికరాజ్యం ఎందుకు అవసరమో చెప్పారు.

సర్ బెనెగల్ నర్సింగ రావ్: మంగళూరు(కర్ణాటక)లో జన్మించిన బీఎన్ రావు బ్రిటిష్ ప్రభుత్వంలో ఇండియన్ సివిల్ సర్వెంట్‌గా చేరారు. అనేక కోర్టులలో జడ్జిగా పనిచేశారు. బ్రిటిష్ ప్రభుత్వంలో పలు కమిటీలలో, పలు ముసాయిదాల తయారీలో ప్రముఖమైన వ్యక్తి. అంతర్జాతీయ న్యాయస్థానంలో జడ్జిగా, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారతదేశ ప్రతినిధిగా ఉన్నారు. ఇప్పటికీ కొందరు భారత రాజ్యాంగాన్ని రచించింది అంబేడ్కర్ కాదనీ, బి.ఎన్.రావ్ అనీ వాదించే వాళ్లున్నారు. ఆయన బ్రిటిష్ పాలనలో తయారు చేసిన 'భారత ప్రభుత్వ చట్టం 1935' రాజ్యాంగానికి మూల రూపమని అనేవారూ ఉంటారు.

సర్ బ్రజేంద్రలాల్ మిట్టర్: పశ్చిమ బెంగాల్‌కి చెందిన మిట్టర్ బరోడా దివాన్‌గా వ్యవహరించారు. భారత్ రాజ్యాంగ రచనలో భాగంగా, దేశంలో సంస్థానాలు విలీనం కావడానికి నియమాలు, దేశ, రాష్ట్ర, జిల్లా పాలనకు సంబంధించిన అంశాలపై పనిచేశారు. (అనారోగ్యం కారణంగా మిట్టర్ రాజీనామా చేయడంతో ఆ స్థానంలో ఎన్.మాధవరావు వచ్చారు.)

కె.ఎమ్. మున్షీ: కన్హయ్యలాల్ మాణిక్‌లాల్ గుజరాత్‌లో జన్మించారు. న్యాయవాది, జాతీయోద్యమ నాయకుడు. ఘనశ్యామ్ వ్యాస్ కలంపేరుతో అద్భుతమైన రచనలు చేసిన వ్యక్తి. 1938లో గాంధీ సహాయంతో 'భారతీయ విద్యా భవన్' స్థాపించారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. రాజ్యాంగ రచనలో భాగంగా ప్రాథమిక హక్కులు, పౌరసత్వం, మైనారిటీ హక్కుల చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

సర్ నరసింహ గోపాలస్వామి అయ్యంగార్: ఆయన్ని ఎన్.జి.ఏ. అని పిలిచేవారు. మద్రాస్ నుంచి సివిల్ అధికారిగా పనిచేశారు. 1937లో జమ్మూ కశ్మీర్ ప్రధాన మంత్రిగా వ్యవహరించారు. వాక్ స్వాతంత్ర్యం, భూములు సేకరిస్తే నష్టపరిహారాలు ఇవ్వడం, శాసనసభతో మరో మండలి ఉండాలని వాదించిన వారు. ఆంగ్లేయ రాజులు ఇచ్చిన గొప్ప పురస్కారాలను తిరస్కరించిన దేశభక్తుడు. కశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370 రచించిన ముఖ్యుడు.

ఎన్. మాధవ్ రావ్: మైసూర్ సివిల్ అధికారి. తరువాత ఆ రాజ్యానికి దివాన్ అయ్యారు. ఒరిస్సా నుంచి సంస్థాన రాజ్యాల పక్షాన రాజ్యాంగ సభలో ప్రతినిధులైనారు. గ్రామపంచాయతీలు, సమాఖ్యల గురించి అడిగేవారు. ఇంక ఎంతోమంది మహానుభావులు రాజ్యాంగ నిర్మాణంలో పనిచేశారు. అందులో జగ్జీవన్ రామ్, జెరోమ్ డిసౌజా, మృదులా సారాభాయ్ వంటి పెద్దలున్నారు. వారందరికీ వందనాలు!

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

ఇన్ బాక్స్

యుద్ధం తీవ్రమవుతోంది!

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. శాంతి చొరవకు ఒక్క భారత్ తప్ప ఏ దేశం ముందుకు రావడం లేదు. ఉక్రెయిన్ మాత్రం యుద్ధం ఆగిపోతుందనే ఆశతో ఉంది కాని రష్యా ఖండాంతర క్షిపణి దాడితో ఆ ఆశ సన్నగిల్లింది. దీనికి తోడు ఉత్తర కొరియా సేనలు కూడా రష్యాకు బాసటగా నిలవడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఉక్రెయిన్‌కు అమెరికా అండగా నిలబడటంతో రష్యా తెలివిగా ఉత్తర కొరియాను తెరపైకి తెచ్చింది. ఉత్తర కొరియాకు అమెరికా అంటే గిట్టదు. అందుకే పుతిన్ ఈ కార్యాచరణకు పూనుకున్నారు.

ఉత్తర కొరియా ఎప్పుడైతే రష్యాకు మద్దతు ఇచ్చిందో చైనా కూడా రష్యాకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవచ్చు. ఉత్తర కొరియా, చైనాలు అమెరికాతో నేరుగా యుద్ధం చేసే సాహసం లేక పరోక్షంగా ఉక్రెయిన్‌కు సహాయపడుతూ యుద్ధాన్ని మూడవ ప్రపంచ యుద్ధం స్థాయికి తీసుకెళ్తున్నాయి. ఇది చాలా ప్రమాదకరం. చైనా, ఉత్తర కొరియాలంటే సరిపడని దేశాలు ఉక్రెయిన్‌కు సహాయపడితే పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుంది. ఇటీవలే 'ఉత్తర కొరియా సైన్యం మా ప్రాంతంలోని అతి పెద్దదైన నిప్రో నగరంపై దాడి చేసి తీవ్ర నష్టం కలిగించింద'ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు.

రష్యా ఒక వైపు శాంతికి తాము సిద్ధం అంటూనే ఇలా దాడి చేయడం సరికాదు. నిజానికి రష్యాకు యుద్ధం ఆపాలని, శాంతికి బాటలు వేయానే తలంపు లేనే లేదు. యుద్ధాన్ని ఆపడానికి భారత్ చేపట్టే చర్యలు ఓ కొలిక్కి రావడం లేదు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బైడెన్ రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు తాము అందించిన దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించడానికి అనుమతి ఇవ్వడమే రష్యా తాజా క్షిపణి దాడికి కారణమయ్యింది. అమెరికా ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ 'నేను అధికారంలోకి వచ్చిన (2025, జనవరి 20న) తరువాత యుద్ధాన్ని ఆపి శాంతి బాట పట్టిస్తా'నని చెప్పడం కొంత ఊరట కలిగించే సంగతే. ఆయన కృషి ద్వారా యుద్ధం తీవ్రం కాకుండా శాంతి ప్రక్రియకు మార్గం సుగమం అయితే అదే చాలు.

– కనుమ ఎల్లారెడ్డి | 93915 23027

బీసీలకు స్వాతంత్ర్య ఫలాల్లో సమవాటా ఎప్పుడు?

అభిప్రాయం



కల్వకుంట్ల కవిత

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనుకబడిన చేతి వృత్తుల, కుల వృత్తులపై బతికే బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేయాల్సిన అవసరం ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లకు పైగా గడిచిపోయాయి. అయినా బీసీలు, ఎంబీసీలు తమకు న్యాయమైన వాటా దక్కాలని ఇంకా పోరాటం చేస్తూ ఉండాల్సి రావడం నిజంగా బాధాకరం. వారు సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా అట్టడుగున ఉండడం మన కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం జరిగే విధంగా నిర్ణయం తీసుకోడానికి ముందుకు రావడం కొంత ఆశాజనక అంశమే. అయితే అవి తమ చిత్త శుద్ధిని అమలులో నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా; విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిన... బీసీలకు ఆ యా రంగాలలో సరైన న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'బీసీ డెడికేటెడ్ కమిషన్' నివేదిక ఇవ్వాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో 52 శాతానికి పైగా ఉన్న బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వం అయినా వారి సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మార్కెట్ కమిటీ పదవుల్లో 33 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కేసీఆర్ ప్రభుత్వమే. దానితో పాటుగా బీసీలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడం కోసం గొర్రెల పంపిణీ చేయడం, చేపల పెంపకానికి కృషి చేయడం, నాయీ బ్రాహ్మణుల క్షౌరశాలలకు ఉచిత విద్యుత్తు సరఫరా చేయడం, వందల సంఖ్యలో కొత్తగా బీసీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడం, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం 'జ్యోతిబా పూలే ఓవర్సీస్ స్కాలర్ షిప్'ను అందించడం, బీసీ కులాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆత్మగౌరవ భవనాల



నిర్మాణానికి స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేయడం... వంటి విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకొని కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారు.

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డిలో బీసీ వర్గాలకు చెందిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యతో డిక్లరేషన్ ఇప్పించింది. ఆ డిక్లరేషన్‌కు కట్టుబడి బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై కూడా ఎన్నో విమర్శలు, అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే సర్వే పత్రాలు రోడ్లపై ప్రత్యక్షమవుతున్న ఘటనలు చూస్తున్నాం. ఈ ప్రభుత్వానికి బీసీల జనాభా లెక్కలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. కాబట్టి ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ కానీ, కాంగ్రెస్ పార్టీగా తాను తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను కానీ చిత్తశుద్ధితో అమలు చేయాలంటే అధికారంలో ఉన్న వారికి బడుగుల పట్ల ప్రేమ ఉండాలి. ఎన్నికల నినాదాలు ప్రభుత్వ విధానాలుగా మారాలి. హడావిడిగా జనాభా లెక్కలను సేకరించి చేతులు దులుపుకొనే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేయకూడదు.

రాజకీయ అధికారంతో సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్న బాబా సాహెబ్ అంబేడ్కర్ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని బీసీలకు, వారి ఉప కులాలకు రాజకీయ అధికారంలో జనాభా నిష్పత్తి ప్రకారం వాటాను కల్పించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ఈ ప్రభుత్వం వేసే అడుగులు, తీసుకునే నిర్ణయాలు ఉండాలని డిమాండ్ చేస్తున్నాం.

కర్ణాటక, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న, జరిగిన బీసీ రిజర్వేషన్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉదాహరణగా తీసుకొని, అదే స్థాయిలో రాష్ట్రంలో బీసీలకు రాజకీయ వాటా దక్కే విధంగా రిజర్వేషన్లను ఖరారు చేసి అమలు చేయాలి. ఒక నెల కాల పరిమితికే రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. ఈ స్వల్ప సమయం సరిపోకపోవచ్చు. బీసీ, బీసీ ఉప కులాల్లో కచ్చితమైన జనాభా గణాంకాలను వెలికి తీయడానికి కమిషన్‌కు కింది స్థాయి ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు. కాబట్టి డెడికేటెడ్ కమిషన్ కాలపరిమితిని మరికొంత కాలం పాటు పొడిగించి, బీసీ కులాల కచ్చితమైన డేటా వచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించి వారికి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి.

డెడికేటెడ్ కమిషన్ కూడా అంతే చిత్తశుద్ధితో సమగ్రంగా అధ్యయనం చేసి ఎటువంటి లోపాలకూ తావు లేకుండా, న్యాయపరమైన చిక్కులు రాకుండా తమ నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. బీసీలకు సరైన న్యాయం జరగాలనే ఆకాంక్ష, చిత్తశుద్ధిని వ్యక్తం చేస్తూ డెడికేటెడ్ కమిషన్‌కు 'తెలంగాణ జాగృతి సంస్థ' తరఫున నివేదికను అందజేశాం.

అన్ని కులాలు, తరగతులు, వర్గాలకు మధ్య ఉన్న తీవ్ర అసమానతలను తగ్గించి, బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వాలను రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. ఇందులో భాగంగానే ప్రాతినిధ్యం లేని, లేదా తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వివిధ కులాలకు, తరగతులకు అవకాశాలు కల్పించేందుకు అనేక మార్పులను, చర్యలను ప్రభుత్వాలు తీసుకు రావాల్సిన అవసరం ఉంది.

తమ శ్రమను, మేధస్సును మానవ నాగరికతా వికాసానికి ధారపోసిన కులవృత్తుల వారు స్వాతంత్ర్య ఫలాల్లో సమవాటా పొందాలి. ఈ సమాజ నిర్మాణానికి తమ రక్త మాంసాలను కరిగించి వందల వేల సంవత్సరాలుగా రంగులద్దిన చేతి వృత్తుల వారికి ఇప్పటికైనా చట్ట సభల్లో గళమెత్తే అవకాశం కల్పించాలి. ఊరికి నాలుగు దిక్కులా మన తాత ముత్తాతల కథాగానం చేసిన సంచార జాతులు కనీసం పంచాయతీ వార్డు మెంబర్ అయినా కాలేకపోతే స్వరాజ్యానికి అర్థమేముంది? ఇకనైనా మార్పు రావాలి.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

క్లుప్తంగా...

చికిత్స పొందుతున్న ఆశ్రమ విద్యార్థిని శైలజ మృతి


చౌదరి శైలజ (ఫైల్)

వాంకిడి/లక్షెట్టిపేట్: హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాలకు చెందిన తొమ్మిదోతరగతి విద్యార్థిని చౌదరి శైలజ (14) సోమవారం మృతి చెందింది. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ధాబా గ్రామానికి చెందిన చౌదరి తుకారాం–మీరాబాయి దంపతుల కుమార్తె శైలజ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతోంది. అక్టోబర్ 29వ తేదీ నుంచి విద్యార్థినులు ఒక్కొక్కరుగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. రెండు రోజుల్లోనే 60 మందికిపైగా ఆస్పత్రిలో చేరారు. శైలజకు మొదట మంచిర్యాలలోనే చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఈ నెల 5న నిమ్స్‌కు తరలించారు. కొద్దిరోజుల తర్వాత కోలుకుంది. మళ్లీ ఈ నెల 11న శైలజకు సీరియస్ కాగా, మళ్లీ వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్సకు శైలజ శరీరం సహకరించకపోవడంతో ప్రాణాలు కోల్పోయిందని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఊపిరి తీసిన పూరీ

- బాలుడి గొంతులో పూరీలు ఇరుక్కుని మృత్యువాత


విరేన్

సనత్‌నగర్ (హైదరాబాద్): పూరీ ఓ చిన్నారి పాలిట యమపాశమైంది. మూడు పూరీలను చుట్టగాచుట్టి ఒకేసారి నోట్లో పెట్టుకోవడంతో గొంతులో ఇరుక్కుని ఊపిరాడక ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందాడు. సోమవారం బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య వివరాల మేరకు.. బోయిగూడకు చెందిన వ్యాపారి గౌతంజైన్‌కు కుమారుడు విరేన్ (11) అక్షర వాగ్దేవి స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. రోజులాగానే పాఠశాలకు వెళ్లిన విరేన్ మధ్యాహ్నం పూరీలు తింటున్నాడు. ఒక్కసారిగా మూడుకుపైగా పూరీలను చుట్టి తింటుండగా గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడక స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే స్కూల్ నిర్వాహకులు మారేడ్‌పల్లిలోని ఓ నర్సింగ్ హోమ్‌కు తరలించారు. అక్కడి వైద్యులు వేరే ఆస్పత్రికి తీసుకువెళ్లాల్సిందిగా సలహా ఇవ్వడంతో అపోలో హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. వైద్యులు విరేన్ జైన్‌ను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

సార్.. ఈ అన్నం మాకొద్దు

- నాణ్యత లేకుండా వండుతున్నారని విద్యార్థుల ఆవేదన
- జగిత్యాలలో ప్రజావాణిలో ఫిర్యాదు
- కరీంనగర్‌లో రోడ్డెక్కిన చిన్నారులు


జగిత్యాల కలెక్టరేట్ ఆవరణలో విద్యార్థులు

కరీంనగర్/జగిత్యాలటౌన్: మధ్యాహ్న భోజనం తినలేకపోతున్నామంటూ రెండుచోట్ల విద్యార్థులు ఆందోళనకు దిగారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని పురాతన పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కగా, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం ఆరెపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి చేరుకొని కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌లోని పురాతన పాఠశాలలో 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సోమవారం 217 మంది పాఠశాలకు హాజరయ్యారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న ఈ పాఠశాలలో వారంరోజులుగా ఉడికీఉడకని అన్నం పెడుతున్నారని, అడుగు భాగం మెత్తగా, ముద్దగా మారి మాడిపోతోందని, ఆ అన్నం ఎలా తినేదంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. అరగంటపాటు ఆందోళన చేసినా ఉన్నతాధికారులెవరూ పాఠశాలకు రాలేదు. దీంతో విద్యార్థులు అన్నం తినకుండానే పడేశారు.

- ఆరెపల్లి పాఠశాలలో వంట మనిషిని మార్చాలని కోరుతూ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. అన్నంలో పురుగులు, వెంట్రుకలు వస్తున్నాయని, రుచిలేని అన్నం వడ్డిస్తున్నారని, ప్రశ్నిస్తే ఇష్టమున్నచోట చెప్పుకోమంటూ వంట మనుషులు బెదిరిస్తున్నారని ప్రజావాణిలో గోడు వెళ్లబోసుకున్నారు. నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ప్రజావాణి ఆడిటోరియంలోకి వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. వంటమనిషిని తొలగించి సరైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని నిరసన విరమింపజేశారు.

జనసంద్రం.. రాజన్న క్షేత్రం


రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రమైంది. సుమారు లక్ష మంది రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి ఒక్కో భక్తుడికి నాలుగు గంటల సమయం పట్టింది. రాజన్న ఆలయంతోపాటు పరిసర ప్రాంతాలు, జాతరగ్రౌండ్, అనుబంధ ఆలయాల ప్రాంగణాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు. అనంతరం కోడె మొక్కులు చెల్లించుకున్నారు. వీఐపీ దర్శనాల కోసం ఆలయ అధికారులు బ్రేక్ దర్శనాలను కొనసాగించారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఇతర అధికారులు పరిశీలించారు.

బీసీ కేటగిరీల పునర్వ్యవస్థీకరణ

- బహిరంగ విచారణలో పెద్ద ఎత్తున వచ్చిన డిమాండ్ ఇదే
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడి
- పునర్వ్యవస్థీకరణ కావాలంటే కులాల ఆర్థిక స్థితి తేల్చాలి
- దీనికి సమగ్ర కుటుంబ సర్వే ఎంతో కీలకం
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకే ఎక్కువ నష్టమనే వాదనలు వచ్చాయి
- పది జిల్లాల్లో బహిరంగ విచారణ చేశాం..
- వచ్చే నెల 9న బీసీ రిజర్వేషన్లకు సంబంధించి హైకోర్టుకు నివేదిక ఇస్తాం


మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని కులాలను పునర్వ్యవస్థీకరణ (రీకేటగిరైజేషన్) చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి ఎక్కువగా వచ్చిందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పది జిల్లాల్లో నిర్వహించిన బీసీ కమిషన్ బహిరంగ విచారణల్లో ఈ అంశంపైనే ఎక్కువగా విజ్ఞప్తులు వచ్చాయని వెల్లడించారు. లోతైన విచారణ చేపట్టిన తర్వాతే పునర్వ్యవస్థీకరణ సాధ్యమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, బాల లక్ష్మి, తిరుమలగిరి సురేందర్‌లతో కలిసి నిరంజన్ మీడియాతో మాట్లాడారు. ''బీసీల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బహిరంగ విచారణ చేపట్టాం. ఇప్పటివరకు 1,224 విజ్ఞప్తులు అందాయి. వాటిని కంప్యూటరీకరిస్తున్నాం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తోంది. సామాజిక, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, కుల విభాగాల్లో ఈ సర్వే కొనసాగుతోంది. ప్రారంభ రోజుల్లో కాస్త ఇబ్బందులు ఏర్పడినప్పటికీ ప్రస్తుతం ప్రజల నుంచి స్పందన బాగుంది. కొన్ని విభాగాలకు సంబంధించిన ప్రశ్నలకు సరైన జవాబులు అందడం లేదని వార్తలు వస్తున్నాయి. బీసీ కులాల పునర్వ్యవస్థీకరణ చేయాలంటే వారి ఆర్థిక స్థితి కూడా తప్పకుండా తేల్చాలి. అందుకే ఈ సర్వే ఎంతో కీలకంగా మారింది..''అని కమిషన్ చైర్మన్ వెల్లడించారు.

అనుమానాలకు ప్రభుత్వం వివరణ ఇస్తుంది..

సమగ్ర సర్వే ఇప్పటికే 90 శాతానికి పైగా పూర్తయిందని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. తార్నాక వద్ద రోడ్లపై సర్వే ఫారాలు లభ్యమైనట్లు వచ్చిన వార్తలపై స్పందించి, సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేసి, జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశామని వివరించారు. సర్వే ఫారాలను కంప్యూటరీకరించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. సర్వేపై ఎలాంటి అనుమానాలున్నా ప్రభుత్వం సమాధానం ఇస్తుందని తెలిపారు.

ఈడబ్ల్యూఎస్‌తో నష్టంపై వినతులు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలు నష్టపోతున్నారనే వినతులు సైతం పెద్ద సంఖ్యలో వచ్చాయని నిరంజన్ తెలిపారు. 2– 4 శాతం కూడా జనాభా లేని ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుండగా... జనాభాలో సగం ఉన్న బీసీలకు అత్యల్పంగా రిజర్వేషన్లు కల్పించారంటూ వాదనలు వచ్చాయని వివరించారు. ఇటీవల డీఎస్సీలో బీసీల కంటే తక్కువ మార్కులు వచ్చిన ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చాయంటూ వినతుల్లో ప్రస్తావించారని వెల్లడించారు. వచ్చే నెల 9న బీసీ రిజర్వేషన్లకు సంబంధించి హైకోర్టులో విచారణ ఉందని.. ఆరోజు నాటికి రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ తరఫున నివేదిక సమర్పించనున్నామని తెలిపారు.

కమిషన్ తరఫున కొన్ని ప్రతిపాదనలు చేస్తున్నాం

బహిరంగ విచారణ ప్రక్రియలో వచ్చిన అంశాలన్నీ ప్రభుత్వానికి నివేదిస్తామని జి.నిరంజన్ వెల్లడించారు. ''కుమ్మర కులస్తులకు మట్టి కేటాయింపులపై జారీ చేసిన జీవోలను క్షేత్రస్థాయి అధికారులకు పంపేలా చర్యలు.. రంగారెడ్డి జిల్లా బండ రావిర్యాలలో వడ్డెరలకు కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేయడం, సంచార జాతులు, ఎంబీసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు.. గ్రామ అభివృద్ధి కమిటీలు చేస్తున్న కుల బహిష్కరణలపై కఠినంగా వ్యవహరించడం, ఆరె కటికల కోసం మీట్ కార్పొరేషన్ ఏర్పాటు, మద్యం దుకాణాల్లో ఆరె కటికలకు 30 శాతం రిజర్వేషన్లు, ట్యాంక్‌బండ్ వద్ద భగీరథుడి విగ్రహం ఏర్పాటు, రజకులను ఎస్సీ కేటగిరీలో చేర్చడం తదితర అంశాలపై వచ్చిన వినతుల ఆధారంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తాం''అని వివరించారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వసతులు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. ఇటీవల బహిరంగ విచారణ ప్రక్రియలో భాగంగా కొన్ని హాస్టళ్లను సందర్శించామని.. కొన్నిచోట్ల ఏళ్ల తరబడి అద్దె చెల్లించని పరిస్థితి ఉందని వివరించారు. ప్రతి జిల్లా కేంద్రంలో బాలురు, బాలికలకు ప్రత్యేక హాస్టళ్లను పూర్తిస్థాయి వసతులతో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బిల్లులు ఇస్తారా.. చావమంటారా?

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తాజా మాజీ సర్పంచ్‌ల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

కరీంనగర్: 'గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవడం, అప్పులు తెచ్చి పనులు చేయడమే తప్పా. తక్షణమే మా బిల్లులు చెల్లించండి'అంటూ మాజీ సర్పంచ్‌లు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలంటూ మాజీ సర్పంచులు దశలవారీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని ప్లకార్డులతో నిర్వహించిన ప్రదర్శన ఉద్రిక్తతకు దారి తీసింది. ఉదయం నుంచే పోలీసులు ప్రధాన గేట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజావాణికి వచ్చే వారిని సైతం క్షుణ్ణంగా పరిశీలిస్తూ లోపలికి పంపించారు. మాజీ సర్పంచ్‌లు దఫదఫాలుగా బృందాలుగా ఏర్పడి ప్రధాన గేట్ ముందుకు చొచ్చుకురావడంతో పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పీటీసీ సెంటర్‌కు తరలించారు. తాజా మాజీ సర్పంచ్‌లు పంజాల జగన్మోహన్‌గౌడ్, శ్రీధర్, సమ్మయ్య, మల్లారెడ్డి తదితరులు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల బిల్లులు ఏడాదిగా మంజూరు చేయకపోవడంతో ఇక్కట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా బిల్లుల మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. బిల్లులు ఇవ్వకపోతే చావే శరణ్యమన్నారు.

కన్సల్టెన్సీ ఆఫీస్‌లో లా విద్యార్థిని ఆత్మహత్య

- అత్యాచారం చేసి హత్య చేశారంటూ జాతీయ రహదారిపై గిరిజన సంఘాల రాస్తారోకో
- పోలీసుల అదుపులో కన్సల్టెన్సీ నిర్వాహకులు.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


ఇస్లావత్ శ్రావ్య (ఫైల్)

మలక్‌పేట: ఎల్‌ఎల్‌బీ చదువుతున్న ఓ గిరిజన విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మలక్‌పేట పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. మృతురాలి తల్లిదండ్రులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం తక్రాజీగూడ తండాకు చెందిన ఇస్లావత్ రమేశ్– కంసీ దంపతులకు శ్రావ్య(20), శ్రుతి, సాయికిరణ్ సంతానం. శ్రావ్య ఎల్బీనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఎన్టీఆర్‌నగర్ మహాత్మాగాంధీ లా కాలేజీలో మూడో సంవత్సరం చదువుతోంది. మలక్‌పేటలోని నందిని రెసిడెన్సీలో నవీన్, విజయ్‌లు జయదుర్గా ఎడ్యుకేషన్స్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. శ్రావ్య మూడు నెలలుగా నవీన్ వద్ద పనిచేస్తోంది. ఆదివారం కన్సల్టెన్సీకి వెళ్లిన శ్రావ్య సాయంత్రం తన తమ్ముడు సాయికిరణ్‌కు ఫోన్ చేసి రూ.20 వేలు ఫోన్ పే చేయాలని కోరింది. సాయికిరణ్ మనీ ట్రాన్స్‌ఫర్ చేసిన తర్వాత శ్రావ్యకు ఫోన్ చేయగా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో అతను హాస్టల్‌లో శ్రావ్యతోపాటు ఉంటున్న శిరీషకు ఫోన్ చేశాడు. దీంతో శిరీష తన స్నేహితురాలైన సోనికి విషయం చెప్పింది. దీంతో సోనీ తన స్నేహితుడైన కార్తీక్‌తో కలిసి కన్సల్టెన్సీకి వెళ్లింది. పక్క ఫ్లాట్‌లో ఉన్న రవీందర్, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న మరో మహిళతో కలిసి ఆఫీస్‌రూమ్ వద్దకు వెళ్లారు. ఆఫీసురూమ్ బయట శ్రావ్య చెప్పులు ఉండటం గమనించారు. వారు తలుపులు తీసి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో అది సాధ్యం కాలేదు. కిటికీలో నుంచి చూడగా శ్రావ్య సీలింగ్ ఫ్యాన్‌కు స్కార్ఫ్‌తో ఉరేసుకొని కనిపించింది. దీంతో తలుపులు పగులగొట్టి శ్రావ్యను కిందకు దించారు. రవీందర్ కారులో మలక్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, శ్రావ్య మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఎస్సై సురేశ్ అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు, మృతురాలి బంధువులు

ఆందోళనకు దిగిన గిరిజన సంఘాలు

శ్రావ్య మరణవార్త తెలుసుకున్న గిరిజన సంఘాలు, మృతురాలి బంధువులు సోమవారం పెద్ద సంఖ్యలో మలక్‌పేట పీఎస్ వద్దకు చేరుకొని ధర్నా చేశారు. అనంతరం కన్సల్టెన్సీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదివారం సెలవురోజు కన్సల్టెన్సీ నిర్వాహకుడు నవీన్ కార్యాలయానికి శ్రావ్యను ఎందుకు పిలిపించారని ప్రశ్నించారు. శ్రావ్యపై అత్యాచారం చేసి హత్య చేశారని, చున్నీతో ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. పోలీసులు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారన్నారు. కన్సల్టెన్సీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విచారణ కొనసాగుతోంది

గిరిజన విద్యార్థి మృతి చెందిన విషయంపై ఆదివారం రాత్రి మలక్‌పేట పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే ఇన్‌స్పెక్టర్ నరేష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కన్సల్టెన్సీ నిర్వాహకులు నవీన్, విజయ్‌ని అదుపులోకి తీసుకున్నాం. శ్రావ్యను ఆస్పత్రికి తరలించిన కార్తీక్, సోనిలను కూడా విచారిస్తాం. క్లూస్ టీమ్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించింది.నిష్పక్షపాతంగా విచారణ కొనసాగుతుంది.

– శ్యామ్‌సుందర్, మలక్‌పేట ఏసీపీ

ప్రజలు తిరస్కరించినా పార్లమెంట్‌పై పెత్తనమా?

- రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంట్‌ను నియంత్రించే యత్నం
- ప్రతిపక్షాల తీరుపై ప్రధాని మోదీ విమర్శల దాడి
- ఇటీవలి ఎన్నికల ఫలితాలతో తమపై మరింత బాధ్యత పెరిగిందని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లీ ఇలా వేర్వేరు ఎన్నికల్లో వేర్వేరు సంవత్సరాల్లో ఇప్పటిదాకా దాదాపు 80–90 సార్లు ఓటమిని చవిచూసినా విపక్షాలు తమ తీరును మార్చుకోలేదని ప్రధాని మోదీ అసహనం వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రక్రియలో పదేపదే ప్రజల చేతిలో తిరస్కరణకు గురైనాసరే కొన్ని పార్టీలు పార్లమెంట్‌పై పట్టుకు ప్రయత్నిస్తున్నాయని ప్రతిపక్షాలనుద్దేశించి మోదీ ఘాటు విమర్శలు చేశారు. ఈ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంట్ సభాకార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని ధ్వజమెత్తారు. సోమవారం పార్లమెంటు శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు నూతన పార్లమెంట్ భవనం ఎదుట మీడియాతో మోదీ మాట్లాడారు.

పార్లమెంట్‌పై పట్టుకు యత్నం


'పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చ జరగాలి. అయితే, దురదృష్టవశాత్తు కొంతమంది వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంటును నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. అంతరాయాలు, గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. 80–90 సార్లు ఎన్నికల్లో ఓడినా విపక్షాల తీరు మారలేదు. విపక్ష పార్టీలు, ఆ పార్టీల నేతలు పార్లమెంట్‌లో చర్చలు జరగనివ్వట్లేదు. ప్రజాస్వామ్య సూత్రాలను, ప్రజల ఆకాంక్షలను గౌరవించరు. ప్రజల పట్ల తమకున్న బాధ్యతను గుర్తించడం లేదు'' అని మోదీ విమర్శల దాడి చేశారు.

కొన్ని ప్రతిపక్షపార్టీలు సహకరిస్తున్నా..

''కొందరు విపక్ష నేతలు పనిగట్టుకుని ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటారు. వీళ్ల వైఖరిని ప్రజలు ఓ కంట కనిపెడుతూనే ఉంటారు. సమయం వచ్చినప్పుడు తగిన శిక్ష విధిస్తున్నారు. ప్రతిపక్షాల ప్రవర్తన కొత్త ఎంపీల హక్కులను అణచివేస్తుంది. వారి కొత్త ఆలోచనలను పంచుకునే అవకాశాన్ని దెబ్బతీస్తోంది. కొన్ని ప్రతిపక్ష పార్టీలు సభ సజావుగా సాగేందుకు సహకరిస్తామని ముందుకొచ్చాయి. అయితే ఈ పార్టీల మనసుల్ని వాటి మిత్రపక్షాలు మార్చేస్తున్నాయి. సభలో ఆందోళనలు, నిరసనలకే మొగ్గుచూపుతున్నాయి. ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నాయి. సభా సజావుగా సాగేందుకు సిద్ధపడ్డ కొన్ని విపక్షపార్టీల గొంతును వాటి భాగస్వామ్య పార్టీలే నొక్కేస్తున్నాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తు న్నాయి. వీళ్ల గొడవ వల్ల తొలిసారిగా సభకు ఎన్నికైనవారు కనీసం ప్రసంగించే అవకాశాన్ని కూడా పొందలేకపోతున్నారు'' అని మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

భారత్‌లో వచ్చిన అవకాశం అరుదైంది

''ప్రపంచదేశాల పార్లమెంట్‌లతో పోలిస్తే భారత పార్లమెంట్‌లో సభ్యత్వం పొంది అభిప్రాయాలు వెల్లడించే అవకాశం రావడం నిజంగా అరుదు. పార్లమెంట్ వేదికగా ఇచ్చే సందేశం ప్రజాస్వామ్యంపై ప్రజలకున్న అంకితభావానికి అద్దంపట్టాలి. నేడు ప్రపంచమంతా భారత్ వైపు ఆశగా ఎదురుచూస్తోంది. అందుకు అనుగుణంగా దేశ గౌరవాన్ని, ఖ్యాతిని ఇనుమడింపజేసేలా సభ్యులు సభా సమయాన్ని వినియోగించుకోవాలి. ప్రస్తుత సమావే శాలు అత్యంత ఫలవంతమవ్వాలి. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 వసంతాలు పూర్తిచేసుకుంటున్న ఈ తరుణంలో రాజ్యాంగ ప్రతిష్టను మనందరం పెంచుదాం. కొత్త ఆలోచనలతో సరికొత్త స్ఫూర్తిని నింపుదాం' అని మోదీ అన్నారు.



స్వపరిపాలనకు ఆమోదముద్ర!

1949 నవంబర్ 26న రాజ్యాంగానికి ఆమోదం


- ఆ చరిత్రాత్మక సందర్భానికి నేటితో 75 ఏళ్లు
- ఏడాది పొడవునా రాజ్యాంగ దినోత్సవాలు
- రాజ్యాంగ ప్రాశస్త్యంపై పౌరులకు అవగాహన
- నేడు పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక భేటీ

స్వాతంత్య్ర దినోత్సవం అందరికీ తెలుసు. మరి రాజ్యాంగ దినోత్సవం అంటే ఏమిటి? గణతంత్ర దినం మనందరికీ తెలుసు కదా. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. నాటినుంచీ భారత్ గణతంత్ర దేశంగా మారింది. అందుకే ఆ రోజును గణతంత్ర దినంగా జరుపుకుంటున్నాం. ఆ రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేడ్కర్ సారథ్యంలోని రచనా (డ్రాఫ్టింగ్) కమిటీ దాదాపు మూడేళ్ల పాటు అవిశ్రాంతంగా శ్రమించి రూపొందించింది. భారత రాజ్యాంగ పరిషత్ దాన్ని కూలంకషంగా పరిశీలించి 1949 నవంబర్ 26న ఆమోదించింది. అదే రాజ్యాంగ దినోత్సవం. గతంలో దీన్ని నేషనల్ లా డే గా జరుపుకునేవాళ్లం. నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటిస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం 2015లో నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటినుంచీ ఏటా నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్)గా జరుపుకుంటున్నాం. పౌరుల్లో రాజ్యాంగ విలువల పట్ల అవగాహనను పెంచడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించేలా ఆ రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. రాజ్యాంగాన్ని ఆమోదించిన చరిత్రాత్మక సందర్భానికి బుధవారంతో 75 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది.

ఇదీ నేపథ్యం...

భారత్‌కు స్వాతంత్య్రం రావడం ఖాయమని 1945 కల్లా తెలిపోయింది. దాంతో స్వతంత్ర భారతావనికి పాలనతో పాటు అన్ని అంశాల్లోనూ చుక్కానిలా దిశానిర్దేశం చేసే రాజ్యాంగం అవసరమైంది. దాని నిర్మాణం కోసం కేబినెట్ మిషన్ ప్లాన్‌లో భాగంగా 1946 డిసెంబర్‌లో 389 మంది ఉద్ధండులతో రాజ్యాంగ పరిషత్ (అసెంబ్లీ) ఏర్పాటైంది. దీనిలో సభ్యులుగా ఎవరుండాలో నిర్ణయించేందుకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అలా రాజ్యాంగ రచనకు ఉద్దేశించిన సంస్థ పుట్టుకలోనే ప్రజాస్వామిక విలువలు దాగుండటం విశేషం! అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితర ప్రముఖులు ఇందులో సభ్యులు. దేశ విభజన అనంతరం రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్యను 299కి కుదించారు.

1946 డిసెంబర్ 9న బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్ తొలిసారిగా సమావేశమైంది. రాజ్యాంగ రచనకు డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి అంబేడ్కర్ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలనూ కూలంకషంగా పరిశీలించిన మీదట మన రాజ్యాంగానికి డ్రాఫ్టింగ్ కమిటీ రూపమిచ్చింది. ఇందుకు రెండేళ్ల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. ఆ వ్యవధిలో డ్రాఫ్టింగ్ కమిటీ 11సార్లు సమావేశమై ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ 395 ఆర్టికళ్లు, 8 షెడ్యూళ్లతో ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగానికి తుది రూపునిచ్చింది. డ్రాఫ్టింగ్ కమిటీ సమర్పించిన రాజ్యాంగ ప్రతిని అతి కొద్ది మార్పుచేర్పులతో రాజ్యాంగ పరిషత్ 1949 నవంబర్ 26న ఆమోదించింది.





రాజ్యాంగ తుది ప్రతిని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌కు అందిస్తున్న అంబేడ్కర్ (ఫైల్)

> రాజ్యాంగమంటే కేవలం రాత ప్రతి కాదు. ఒక జాతి జీవన విధానం. దేశమంతటికీ నిరంతర చైతన్యస్ఫూర్తి
> – బాబాసాహెబ్ అంబేడ్కర్

– సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్యాంగ వజ్రోత్సవాలు

- దేశమంతటా నేటినుంచి ఏడాది పాటు
- నేడు పార్లమెంటు ఉభయసభల భేటీ
- వేదిక కానున్న చారిత్రక సెంట్రల్ హాల్

న్యూఢిల్లీ: రాజ్యాంగానికి ఆమోదముద్ర పడ్డ చరిత్రాత్మక సందర్భానికి మంగళవారంతో 75 ఏళ్లు పూర్తవుతున్నాయి. దాంతో మంగళవారం నుంచి ఏడాది పొడవునా రాజ్యాంగ దిన వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్యాంగ ప్రాశస్త్యానికి ప్రచారం కల్పించడం, దాని పట్ల పౌరుల్లో అవగాహనను మరింతగా పెంచడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు రూపొందించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనం వంటివి జరగనున్నాయి. రాజ్యాంగ నిర్మాతల కృషిని పార్లమెంటు మరోసారి నెమరువేసుకోనుంది. వారికి ఘనంగా నివాళులు అర్పించనుంది. ఇందుకోసం ఉభయ సభలు మంగళవారం ప్రత్యేకంగా సమావేశం అవుతున్నాయి. 1946 డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్ తొలిసారి భేటీ అయిన పార్లమెంటు పాత భవనంలోని చారిత్రక సెంట్రల్ హాలే ఇందుకు వేదిక కానుండటం విశేషం. ఇందుకోసం సెంట్రల్ హాల్ సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. అనంతరం ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తమ భావాలను పంచుకుంటారు. రాష్ట్రపతి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఉభయ సభల ఎంపీలంతా పాల్గొంటారు. రాజ్యాంగ దిన వజ్రోత్సవాలను పురస్కరించుకుని కాన్‌స్టిట్యూషన్75డాట్‌కామ్ పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా కేంద్రం రూపొందించింది.

మోదీ ప్రసంగించరు: రిజిజు

ఉభయ సభల సంయుక్త భేటీలో ప్రధాని మోదీ ప్రసంగించబోరని రిజిజు స్పష్టం చేశారు. ఈ భేటీలో ఉభయ సభల విపక్ష నేతలకు కూడా ప్రసంగించే అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు తెలిపారు. ''రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, స్పీకర్ మాత్రమే మాట్లాడతారు. విపక్ష నేతలిద్దరికీ వేదికపై స్థానముంటుంది. ఇదో చరిత్రాత్మక సందర్భం. దీన్ని వివాదాస్పదంగా మార్చే ప్రయత్నం చేయొద్దు'' అని విపక్షాలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆ చరిత్రాత్మక దినాన...

1946 డిసెంబర్ 9న పార్లమెంటు పాత భవనం సెంట్రల్ హాల్లో రాజ్యాంగ పరిషత్ తొలి భేటీ జరిగిన క్షణాలను లోక్‌సభ భావోద్వేగపూరితంగా స్మరించుకుంది. ''చెప్పదగ్గ స్వాతంత్య్ర సమరానికి సారథ్యం వహించిన మహామహులైన నేతలు ఆ రోజున ఇదే హాల్లో అర్ధచంద్రాకృతిలో వరుసలు తీరి ఆసీనులయ్యారు. ముందు వరుసలో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, ఆచార్య జేబీ కృపాలనీ, అబుల్ కలాం ఆజాద్ తదితరులు కూర్చున్నారు. బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్ష స్థానాన్ని అలంకరించారు'' అంటూ లోక్‌సభ వెబ్‌సైట్ నాటి స్మృతులను మరోసారి గుర్తు చేసుకుంది.

ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం!


- ఇంకొన్ని అంశాల్లో స్పష్టత వచ్చాక అమలయ్యే చాన్స్
- సూత్రప్రాయ అంగీకారం తెలిపిన నెతన్యాహూ



బీరూట్: ఇజ్రాయెల్, లెబనాన్ సరిహద్దుల వెంట కాల్పుల మోత ఆగే సూచనలు కనిపిస్తున్నాయి. హమాస్‌కు అండగా ఇజ్రాయెల్‌తో పోరు జరుపుతున్న హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్ వెనక్కి తగ్గే వీలుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో హెజ్‌బొల్లాకు కుదరబోతున్న కాల్పుల విరమణ ఒప్పందమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కాల్పుల విరమణకు నెతన్యాహూ సూత్రప్రాయ అంగీకారం తెలిపినట్లు వార్తలొచ్చాయి. అయితే ఇంకొన్ని కీలక అంశాలపై సంప్రదింపులు జరుగుతున్నాయని, అవి కొలిక్కి వచ్చాక అంగీకారం కుదురుతుందని తెలుస్తోందని సీఎన్ఎన్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. సూత్రప్రాయ అంగీకారం త్వరలో కుదరబోతోందని ఇజ్రాయెల్ అధికార ప్రతినిధి డేవిడ్ మెన్సర్ సోమవారం చెప్పారు.

అరెస్ట్ వారెంట్లు కాదు.. నెతన్యాహుకు మరణ శిక్ష వేయాలి

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ



టెహ్రాన్: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతోపాటు ఆ దేశ నాయకులకు అరెస్ట్ వారెంట్లు జారీ చేయాలంటూ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. ప్రధాని నెతన్యాహు సహా ఆ దేశ నేతలకు అరెస్ట్ వారెంట్లు కాదు, మరణశిక్ష విధించాలని వ్యాఖ్యానించారు. 'వాళ్లకు అరెస్ట్ వారెంట్ ఒక్కటే సరిపోదు. నేరగాళ్లయిన ఇజ్రాయెల్ నాయకులకు మరణ శిక్ష విధించాలి'అని పేర్కొన్నారు. గాజాలో అమాయకుల రక్తపాతానికి, ఆకలి చావులకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఆ దేశ మాజీ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్‌లు కారణమనేందుకు తగిన ఆధారాలున్నాయని ఐసీసీ న్యాయమూర్తులు గురువారం వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్ భూభాగంపై హమాస్ శ్రేణులు చేపట్టిన ఆకస్మిక దాడికి కారణమైన ఆ గ్రూపు నేత ఇబ్రహీం అల్ మస్రికి కూడా అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని ఐసీసీ నిర్ణయించడం తెలిసిందే. కాగా, జులైలో గాజాపై జరిపిన దాడిలో మస్రి అలియాస్ మహ్మద్ డెయిఫ్ చనిపోయినట్లు ఇజ్రాయెల్ చెబుతుండగా, హమాస్ మాత్రం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.

సహజ సాగుకు రూ.2,481 కోట్లు

వన్ నేషన్, వన్ సబ్‌స్క్రిప్షన్‌కు ఓకే • కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: వచ్చే రెండేళ్లలో 7.5 లక్షల హెక్టార్లలో సహజ సాగును ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రూ.2,481 కోట్లతో జాతీయ మిషన్ ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సోమవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఇందుకు ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగా కోటి మంది రైతులను సహజసాగు దిశగా ప్రోత్సహించనున్నారు. రీసెర్చి వ్యాసాలు, జర్నళ్లను దేశవ్యాప్తంగా ఔత్సాహికులందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు రూ.6,000 కోట్లతో తలపెట్టిన 'వన్ నేషనల్, వన్ సబ్‌స్క్రిప్షన్' పథకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇతర నిర్ణయాలు...

- రూ.7,927 కోట్లతో పలు రైల్వే ప్రాజెక్టులు
- అరుణాచల్‌ప్రదేశ్‌లో రూ.3,689 కోట్లతో 2 హైడ్రో ప్రాజెక్టులు
- అటల్ ఇన్నొవేషన్ మిషన్ కొనసాగింపు. దాని రెండో దశకు రూ.2,750 కోట్లు
- పాన్ 2.0 ప్రాజెక్టుకు రూ.1,435 కోట్లు

రాజ్యాంగ పీఠికనూ పార్లమెంట్ సవరించొచ్చు

- సోషలిస్ట్, సెక్యులర్ పదాలను చేర్చడంపై సుప్రీంకోర్టు
- ఇప్పటికే చాలా ఏళ్లు గడిచినందున రద్దు అసాధ్యం
- పిటిషన్లను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: 1976లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం రాజ్యాంగ పీఠికలో మార్పులు చేస్తూ తీసుకువచ్చిన 42వ రాజ్యాంగ సవరణపై అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. పీఠికలో సామ్యవాద, లౌకిక, సమగ్రత (సోషలిస్ట్, సెక్యులర్, ఇంటిగ్రిటీ) అనే పదాలను చేర్చుతూ చేసిన సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్యం స్వామి, న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ ఈ మేరకు వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం నవంబర్ 22తో వాదనలు ముగించి, సోమవారం తీర్పు వెలువరించింది. 'రిట్ పిటిషన్లపై తదుపరి విచారణ కానీ, తీర్పు కానీ అవసరం లేదు. రాజ్యాంగంలోని పీఠికను కూడా సవరించే అధికారం పార్లమెంట్‌కుంది. సవరణకు ఇప్పటికే చాలా ఏళ్లు గడిచినందున ఆ ప్రక్రియ రద్దు సాధ్యం కాదు'అని తీర్పులో పేర్కొంది.

'ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగంలోని మార్పులకు ఆమోదించిన తేదీ ప్రభుత్వ అధికారాన్ని తగ్గించదు. పైపెచ్చు ఆ అధికారాలను సవాల్ చేయలేం. పీఠికకు సైతం మార్పులు చేపట్టే అధికారం పార్లమెంట్‌కు ఉంది'అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశంపై ఇప్పటికే పలు న్యాయపరమైన సమీక్షలు జరిగాయని గుర్తు చేసింది. ఎమర్జెన్సీ సమయంలో పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయాలని చెప్పలేమని కూడా పేర్కొంది. ఎన్నో ఏళ్లు గడిచాక పీఠికలో చేసిన మార్పులపై ఇప్పుడెందుకు అభ్యంతరం చెబుతున్నారు?అంటూ ధర్మాసనం పిటిషనర్లను ప్రశ్నించింది.

పిటిషనర్ల అభ్యంతరం ఏమంటే..

సామ్యవాదం, లౌకికవాదం అనే పదాలపై చేరిక తనకూ సమ్మతమేనని పిటిషనర్ అశ్వినీ ఉపాధ్యాయ్ వాదనల సందర్భంగా తెలిపారు. అయితే, ఆ పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చడంపైనే తనకు అభ్యంతరం ఉందన్నారు. రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకిక, సమగ్రత అనే పదాల చేరికను ఇందిరాగాంధీ అనంతరం ఎన్నికైన జనతా పార్టీ ప్రభుత్వం కూడా సమర్థించిందని ఇదే అంశంపై వేరుగా పిటిషన్ వేసిన సుబ్రమణ్యస్వామి పేర్కొన్నారు. అయితే, 1949లో ఆమోదించిన రాజ్యాంగ పీఠికను యథాతథంగా ఉంచుతూ, 1976లో చేపట్టిన మార్పులను వేరుగా ప్రత్యేక పేరాలో ఉంచాలన్నదే తన ఉద్దేశమన్నారు.

ఎమర్జెన్సీ సమయంలో..

ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21వ తేదీ వరకు అత్యవసర పరిస్థితి అమల్లో ఉండటం తెలిసిందే. ఆ సమయంలోనే రాజ్యాంగ పీఠికలోని సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్ర అనే పదాల స్థానంలో సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర అనే వాటిని చేరుస్తూ పార్లమెంట్ చట్టం చేసింది. ఈ కేసులో మొట్ట మొదటిసారిగా 2020లో బలరాం సింగ్ అనే వ్యక్తి విష్ణు శంకర్ జైన్ అనే న్యాయవాది ద్వారా పిటిషన్ వేశారు. ఇదే అంశంపై విస్తృత ధర్మాసనానికి బదలాయించాలంటూ దాఖలైన పిటిషన్‌ను గతంలో సుప్రీంకోర్టు కొట్టివేసింది. సామ్యవాదం అనే పదాన్ని మన దేశానికి వర్తింపజేసుకుంటే సంక్షేమ రాజ్యమనే అర్థమే వస్తుందని వివరించింది.



తొలి రోజే ఆరోపణల పర్వం

- అదానీ అంశంపై చర్చకు విపక్షాల పట్టు
- రేపటికి వాయిదా పడిన సభలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలిరోజే వాడీవేడిగా మొదలై అర్ధంతరంగా వాయిదాపడ్డాయి. మణిపూర్‌లో పెచ్చరిల్లిన హింస, పెరిగిన నిత్యావసరాల ధరలు.. తదితర అంశాలపై మోదీ సర్కార్‌ను నిలదీసేందుకు సిద్ధమైన విపక్షాలకు 'అదానీ ముడుపుల' అంశం చివరినిమిషంలో కొత్త అస్త్రంగా దొరికింది. పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణల అస్త్రంగా పనికొచ్చింది. అధికార బీజేపీసభ్యులుసైతం మాటకుమాటా బదులివ్వడంతో శీతాకాల సమావేశాలు తొలి రోజే బాగా వేడెక్కాయి. విమర్శలు, ప్రతివిమర్శల జడిలో పార్లమెంట్ ఇరుసభలు తడిసిముద్దయ్యాయి. సభలో బిల్లులు ప్రవేశపెట్టి చర్చించడం వంటి ఎలాంటి సభాకార్యకలాపాలు మొదలుకాకుండానే రెండు సభలూ 27వ తేదీకి అర్ధంతరంగా వాయిదాపడ్డాయి. ఇరు సభలూ సోమవారం ఉదయం మొదలుకాగానే ఇటీవలికాలంలో మరణించిన సభ్యులకు నివాళులర్పించగా వెనువెంటనే విపక్ష పార్టీల సభ్యులు అదానీ అంశాన్ని లేవనెత్తారు. అమెరికాలో అదానీ సంస్థపై కేసులు, భారత్‌లో వ్యాపార రంగంపై అదానీ ఉదంతం ప్రభావం, మోదీ సర్కార్ తీసుకున్న చర్యలు తదితరాలపై చర్చించాలని, సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుచేయాలని కోరుతూ పలువురు విపక్ష పార్టీల ఎంపీలు వాయిదా తీర్మానం నోటీసులిచ్చారు. అయితే ఇరు సభల్లోనూ ఆ నోటీసులు బుట్టదాఖలుకావడంతో విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో కాల్పుల ఘటనను లోక్‌సభలో విపక్ష ఉపనేత గౌరవ్‌గొగోయ్ లేవనెత్తారు. అయితే సభ్యుల మృతిని నివాళులు అర్పించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెంటనే సభను మధ్యాహ్నానికి వాయిదావేశారు. స్పీకర్‌గా మధ్యాహ్న సెషన్ బాధ్యతలు తీసుకున్న బీజేపీ నాయకురాలు సంధ్యా రే విపక్ష సభ్యులను వారించిప్పటికీ వారు నినాదాలు ఆపకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ..

రాజ్యసభలో ఉదయం సభాకార్యకలాపాలు మొదలుకాగానే 267వ నిబంధన కింద విపక్ష సభ్యులు పలువురు విడివిడిగా వాయిదా తీర్మానాలు ఇచ్చారు. అదానీ అంశంపై చర్చకు పట్టుబడ్డారు. ఇలా వచ్చిన 13 నోటీసులను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వెంటనే తోసిపుచ్చారు. అయినాసరే చర్చలకు కాంగ్రెస్, వామపక్ష పార్టీల సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభ పావుగంటసేపు వాయిదాపడింది. తర్వాత సభ మొదలుకాగానే రాజ్యసభలో విపక్షనేత ఖర్గే మాట్లాడారు. ''ఏడుగురు ఇచ్చిన వాయిదా తీర్మానాలను అనుమతించండి. యావత్ భారతావనిని 'అదానీ అంశం' ఎంతలా ప్రభావితం చేస్తుందో సోదాహరణంగా వివరిస్తాం' అని ఖర్గే కోరారు. అయితే మధ్యలో ధన్‌ఖడ్ కలుగజేసుకుని ఖర్గేను వారించారు. మీరు మాట్లాడేవి ఏవీ రికార్డుల్లోకి చేరబోవని అన్నారు. అయినాసరే విపక్షపార్టీల సభ్యులు తమ నినాదాలు, ఆందోళనకు ఆపకపోవడంతో సభను కొద్దిసేపు చైర్మన్ వాయిదావేశారు. '' మీరంటే నాకెంతో గౌరవం ఉంది. షెడ్యూల్ ప్రకారం సభా కార్యక్రమాలను జరగనివ్వండి'' అని ధన్‌ఖడ్ కోరారు. అయినా విపక్షాలు తమ నిరసనను కొనసాగించడంతో సభను చైర్మన్ బుధవారానికి వాయిదావేశారు.

కౌన్ బనేగా 'మహా' సీఎం

▶ మొదటి పేజీ తరువాయి

సీఎంపై పీటముడి వీడక కొత్త ప్రభుత్వ ఏర్పాటు కసరత్తు కొలిక్కి రావడం లేదు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇంట్లో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఫడ్నవీస్, షిండే, అజిత్ పవార్ సోమవారం ఢిల్లీ వెళ్లారు. సీఎం అభ్యర్థిని నిర్ణయించేందుకు వారితో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అగ్ర నేత అమిత్ షా సమావేశమవుతారంటూ తొలుత వార్తలొచ్చాయి. దాంతో రాత్రికల్లా సస్పెన్స్ వీడుతుందని భావించినా అలాంటిదేమీ జరగలేదు. దాంతో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ఫడ్నవీసే సీఎం అవడం ఖాయమని, అజిత్‌తో పాటు షిండే ఉప ముఖ్యమంత్రి అవుతారని చెబుతున్నారు. షిండే సేనకు 12, పవార్ ఎన్సీపీకి 10 మంత్రి పదవులు దక్కుతాయని సమాచారం. ఫడ్నవీస్ తొలిసారి 2014 నుంచి 2019 దాకా ఐదేళ్లపాటు సీఎంగా ఉన్నారు. 2019లో మళ్లీ సీఎం అయినా అజిత్ పవార్ మద్దతు ఉపసంహరణతో ఆయన ప్రభుత్వం 80 గంటల్లోనే పడిపోయింది.

'మంగళవారం డెడ్‌లైన్' అవాస్తవం

మహారాష్ట్ర ప్రస్తుత శాసనసభ గడువు మంగళవారంతో ముగుస్తున్నందున ఆలోగా కొత్త ప్రభుత్వం ఏర్పాటవకపోతే రాష్ట్రపతి పాలన తప్పదన్న వాదనను అసెంబ్లీ వర్గాలు తోసిపుచ్చాయి. ''మంగళవారం డెడ్‌లైన్ అంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదు. కొత్త ఎమ్మెల్యేల పేర్లతో కూడిన జాబితాను నోటిఫై చేస్తూ ఎన్నికల సంఘం శనివారమే గవర్నర్‌కు గెజిట్ కాపీ సమర్పించింది. కనుక ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 73వ సెక్షన్ ప్రకారం కొత్త అసెంబ్లీ ఇప్పటికే పూర్తిస్థాయిలో కొలువుదీరినట్టే లెక్క. రాష్ట్రపతి పాలన వచ్చేందుకు అవకాశమే లేదు'' అని అసెంబ్లీ అధికారి ఒకరు వివరించారు.

సంభాల్ హింస... ఎస్పీ ఎంపీపై కేసు

- ఎమ్మెల్యే కుమారుడిపై కూడా
- 25 మంది అరెస్ట్

సంభాల్: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో షాహి జామా మసీదులో సర్వే నేపథ్యంలో ఆదివారం చోటుచేసుకున్న హింసాకాండకు సంబంధించి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జియా ఉర్ రెహ్మాన్ బర్క్, ఆ పార్టీ స్థానిక ఎమ్మెల్యే ఇక్బాల్ మహ్మూద్ కుమారుడు సొహైల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని మరో 2,750 మందిపైనా అభియోగాలు మోపారు. ఇప్పటిదాకా 25 మందిని అరెస్ట్ చేశారు. ఈ నెల 30 వరకు సంభాల్‌లో బయటివారు అడుగుపెట్టరాదంటూ నిషేధాజ్ఞలు విధించారు. సోమవారం సంభాల్ తహసీల్ పరిధిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. స్కూళ్లకు సెలవు ప్రకటించారు. ఈ ఘటనపై మెజిస్టీరియల్ దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశించింది. ఆదివారం మసీదులో సర్వేకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో ఇప్పటిదాకా నలుగురు చనిపోయారు. పదుల సంఖ్యలో గాయపడిన భద్రతా సిబ్బంది, అధికారులు చికిత్స పొందుతున్నారు. బుల్లెట్ గాయాలే మరణాలకు కారణమని ప్రాథమికంగా తేలినట్లు డివిజనల్ కమిషనర్ ఆంజనేయ కుమార్ సింగ్ తెలిపారు. మసీదును కాపాడుకుందామంటూ ఎంపీ ఇచ్చిన ప్రకటన వల్లే భారీగా జనం పోగయ్యారన్నారు. ఆయన గతంలోనూ ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలే చేశారని చెప్పారు. రాళ్లు విసిరి మసీదుకు నష్టం కలిగించిన వారిపైనా చర్యలుంటాయని సింగ్ స్పష్టం చేశారు. హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారిలో 10–15 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన వారు కూడా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. మసీదు చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ బందోబస్తు కొనసాగుతోంది.

సుప్రీంకోర్టు విచారణ చేపట్టాలి: కాంగ్రెస్

హిందువులు, ముస్లింల మధ్య అగాధాన్ని సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిరస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ వైషమ్యాలు రాష్ట్రానికి గానీ, దేశానికి గానీ మంచివి కావని చెప్పారు. సంభావ్ పరిణామాలపై సాధ్యమైనంత త్వరగా జోక్యం చేసుకోవాలని ఆయన సుప్రీం కోర్టును కోరారు. సంభాల్‌లో తలెత్తిన వివాదం దురదృష్టకరమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆమె ఆరోపించారు. సంభాల్‌లో జరిగిన హింసాత్మక ఘటనపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం జరిగేచూడాలని ఆమె సోమవారం ఎక్స్‌లో కోరారు.

సాక్షి
హైదరాబాద్

మంగళవారం । 26 । నవంబర్ । 2024



బెంజ్ కారు బీభత్సం
బంజారాహిల్స్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒక బెంజ్ కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. -8లో



క్రేజీ.. డీజే..
ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆధునిక యువతులు నేడు డీజేలుగా దుమ్ము రేపుతున్నారు. మేల్ డామినేషన్‌కు గండికొడుతూ శరవేగంగా ముందుకు దూసుకొస్తున్నారు. -సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
28.0/15.0

వాతావరణం
నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి బాగా పెరుగుతుంది. ఉదయం పొగమంచు బాగా కురుస్తుంది. సాయంత్రం, రాత్రివేళల్లో చల్లని గాలులు వీస్తాయి.



నిలోఫర్ ఆస్పత్రిలో..



ఉస్మానియా ఆస్పత్రిలో..



ఉస్మానియాలో ఓపీ విభాగం వద్ద బారులు..



ఫీవర్ ఆస్పత్రిలో..

సిటీకి సుస్తీ

చలి పెరగడం..వాతావరణంలో మార్పులు సంభవిస్తుండడంతో గ్రేటర్‌లో వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా విష జ్వరాలు, టైఫాయిడ్, డెంగీతో పాటు చికున్ గున్యా కేసులు పెరుగుతున్నాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఉస్మానియా, గాంధీ, ఫీవర్, నిలోఫర్ ఆస్పత్రుల్లో ఓపీకి వచ్చే వారి సంఖ్య రెట్టింపయింది. వీరిలో అధికశాతం వైరల్ జ్వరపీడితులే ఉంటున్నారు. ఏ ఆస్పత్రికి వెళ్లినా భారీ క్యూలు కన్పిస్తున్నాయి. సరైన వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు

రవాణాశాఖలో పదోన్నతులు

సాక్షి, సిటీబ్యూరో: రవాణా శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు లభించాయి. ఈ మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన డిపార్ట్‌మెంట్ ప్రమోషన్స్ కమిటీ (డీపీసీ) పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసింది. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్‌గా పని చేస్తున్న మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్‌కు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జేటీసీ)గా పదోన్నతి లభించింది. మరో డీటీసీ శివలింగయ్య కూడా జేటీసీగా పదోన్నతి పొందారు. ఆరుగురు ప్రాంతీయ రవాణా అధికారులకు ఉపరవాణా కమిషనర్‌లు (డీటీసీ)గా పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారిలో ఆర్టీఓలు రవీందర్ కుమార్, వాణి, అఫ్రీన్, కిషన్, సదానందం, సురేష్‌రెడ్డి ఉన్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ మేరకు ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.

వణికిస్తోంది!

అత్యల్ప ఉష్ణోగ్రత 11.2 డిగ్రీలు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సిటీలో చలి వణికిస్తోంది. రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. తెల్లవారుజామున పొగ మంచు రోడ్లను కమ్మేస్తోంది. పగటి గరిష్ట ఉష్ణోగ్రత 28 డిగ్రీలకు చేరింది. సోమవారం రాత్రి చలి తీవ్రత మరింత పెరిగింది. సగటున కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీలుగా నమోదైంది. శివార్లలో మాత్రం అత్యల్పంగా సగటున రికార్డు స్థాయిలో 11.2 డిగ్రీలు నమోదైంది.

కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలా

ప్రాంతం	డిగ్రీలు
పటాన్‌చెరు	11.2
రాజేంద్రనగర్	13
హకీంపేట	14.7
దుండిగల్	15.8
హయత్‌నగర్	16

ఆస్పత్రుల్లో ప్రైవేటు సైన్యం!

ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో చూసినా వారిదే రాజ్యం

సాక్షి, సిటీబ్యూరో: వాళ్లు సెక్యూరిటీ గార్డులు..గేటు దగ్గరి నుంచి డాక్టర్‌ను కలిసే దాకా అడుగడుగునా ఉరుముతూ కనిపిస్తుంటారు. తెలిసీతెలియక ఏదైనా అడిగితే చిరాకు పడుతుంటారు. మరోసారి అడిగామంటే అంతే సంగతులు..అక్కడికి వచ్చే పేషెంట్ గజగజలాడాల్సిందే. ఈ పరిస్థితి ఏదో ప్రైవేటు ఆస్పత్రుల్లోనిది కాదు.. మన భాగ్యనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల వ్యవహార శైలి. నిజం..నగరంలోని దాదాపు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేటు సెక్యూరిటీ రాజ్యం నడుస్తోంది. ఒక రకంగా ప్రైవేటు సైన్యాన్ని పెంచి పోషిస్తున్నట్టే ఉంది వ్యవహారం. దూరభారాల నుంచి వచ్చే రోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం..గట్టిగా మాట్లాడితే దుర్భాషలాడటం.. మరీ కాదంటే దౌర్జన్యం చేయడం పరిపాటిగా మారింది. తాజాగా అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో ఉన్న పరిస్థితుల గురించి పాఠకులకు తెలియజేసేందుకు ఫొటోలు తీసేందుకు వెళ్లిన 'సాక్షి' ఫొటోగ్రాఫర్‌పై ప్రైవేటు సెక్యూరిటీ గార్డు దాడికి పాల్పడ్డారు. దీంతో ఆస్పత్రుల్లోని ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల ఆగడాలపై మరోసారి చర్చకు తెరలేచింది.

అంత ఉలుకెందుకు?

ఆస్పత్రుల్లో తాకిడిని నియంత్రించేందుకు థర్డ్ పార్టీ ద్వారా ప్రైవేటు సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పరచుకుంటుకున్నారు. అయితే వారి వ్యవహార శైలి ఏ ఆస్పత్రిలో చూసినా.. ఎప్పుడైనా వివాదాస్పదమే. చిన్న విషయాలకే రోగులపై విరుచుకుపడటం, దుర్భాషలాడటం సర్వసాధారణం అయింది. ఆస్పత్రులకు వచ్చే వారు అనారోగ్యంతో ఎంతో బాధతో వస్తుంటారు. కనీసం వారితో మర్యాదగా మాట్లాడుదామనే ఆలోచనే ఉండట్లేదని రోగులు వాపోతున్నారు. నేరస్తులను చూసినట్టు చూస్తుంటారని, చేతిలో లాఠీల్లాంటి కర్రలతో బెదిరిస్తుంటారని చెబుతున్నారు.

శిక్షణ లేకుండానే విధుల్లోకి..?

ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే ప్రైవేటు సెక్యూరిటీకి తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలి. ప్రజలతో ఎలా మెలగాలి? వారితో ఎలా ప్రవర్తించాలి..? అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి..? మానవతా దృక్పథం ఎలా అలవర్చుకోవాలి వంటి అనేక అంశాలపై వారికి అవగాహన కల్పించాలి. పైగా వీరిని గమనించే ఇన్‌చార్జి వారి ప్రవర్తన ఎలా ఉందనే దానిపై ఎప్పటికప్పుడూ గమనిస్తూ ఉండాలి. ప్రతిసారి షిఫ్ట్ మారుతున్న సమయంలో రోల్ కాల్‌కు పిలిచి వారికి సూచనలు చేస్తుండాలి. కానీ ఏ ఆస్పత్రిలో కూడా ఇలా జరుగుతున్న దాఖలాలు లేవు. దీంతో సెక్యూరిటీ గార్డులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల వ్యవహారం

- లాఠీల్లాంటి కర్రలతో ఆస్పత్రుల ఆవరణల్లో వీరవిహారం
- దుర్భాషలాడటం, దాడులు చేయడం పరిపాటిగా మారిన వైనం
- తాజాగా ఉస్మానియా ఆస్పత్రిలో 'సాక్షి' ఫొటోగ్రాఫర్‌పై సెక్యూరిటీ గార్డు దాడి
- ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను నిలదీసిన జర్నలిస్టులు
- సదరు గార్డును విధుల నుంచి తొలగించిన యాజమాన్యం

సమస్యలు దాస్తే ఏం లాభం?

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాల్సిన పరిపాలనా యంత్రాంగం.. మసి పూసి మారేడు కాయ చేయడంపైనే దృష్టిసారిస్తోంది. ఆస్పత్రుల్లోని సమస్యలను ప్రజలు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నా కూడా ఎన్నడూ లేని ఆంక్షలు విధిస్తున్నారు. సమస్యలను పరిష్కరించాల్సింది పోయి..ఆ సమస్యలు బయటకు రాకుండా మేనేజ్ చేస్తే సరిపోతుందిలే అన్న చందంగా పాలక వర్గం వ్యవహరిస్తోంది. దీంతో రోగులకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పోతోంది. మీడియాపై ఆంక్షలు విధించి, సమస్యలను దాచేస్తే సరిపోతుందా.. నిజాలు బయటకు రాకుండా ఎంతకాలం దాస్తారంటూ పలువురు రోగులు ప్రశ్నిస్తున్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌పై దాడి..

విధుల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రిలో పరిస్థితిని ప్రపంచం ముందు పెట్టేందుకు వెళ్లిన 'సాక్షి' మీడియా ఫొటోగ్రాఫర్ జి.బాలస్వామిపై అక్కడి సెక్యూరిటీ గార్డు దాడి చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. కెమెరా లాక్కుని దుర్భాషలాడిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తాను విధుల్లో భాగంగా ఇక్కడికి వచ్చానంటూ ఎంత చెప్పినా వినకుండా దౌర్జన్యం చేశారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు సూపరింటెండెంట్‌ను నిలదీయగా, సదరు సెక్యూరిటీ గార్డును విధుల నుంచి తొలగించామని తెలిపారు. అయితే వ్యవస్థ మొత్తం ఇలాగే ఉండగా, ఒక్కరిపై వేటు వేసి చేతులు దులుపుకోవడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సెక్యూరిటీ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందేనని చెబుతున్నారు. ఎన్నడూ లేనంత ఆంక్షలు ఇప్పుడే ఎందుకని ప్రశ్నిస్తున్నారు.



ఉస్మానియా ఆస్పత్రిలో సాక్షి ఫొటోగ్రాఫర్ కెమెరా లాక్కున్న సెక్యూరిటీగార్డు

దగ్గు, జలుబు మందులూ కరువే!

గ్రేటర్ ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత

- నొప్పి నివారణ, 'గ్యాస్ట్రిక్' మాత్రలు కూడా లేవు
- ఇండెంట్ పంపినా.. ఇప్పటికీ సరఫరా కాని వైనం..
- సగం మందులతో సరిపెడుతున్న వైద్య సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. ఖరీదైన మందులే కాదు..దగ్గు, జలుబు, నొప్పి నివారణ, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం పొందే సాధారణ మందులు కూడా వీటిల్లో దొరకడం లేదు. వనస్థలిపురం, కొండాపూర్ ఏరియా ఆస్పత్రులు మొదలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. క్షేత్రస్థాయి అధికారులు మందుల కోసం ఇండెంట్ పంపినా..సరఫరా కాక పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఫార్మసిస్టులు చేతులెత్తేస్తు న్నారు. ఎప్పటికప్పుడు ఆయా ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, మందుల సరఫరాపై ఆరా తీయాల్సిన అధికారులు..పట్టించుకోక పోవడం, వైద్యులు కూడా ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లక పోవడం కొరతకు ప్రధాన కారణం.



రాంటాక్, పాంటాక్ ట్యాబ్లెట్లు కరువే..

ప్రస్తుతం వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. చలిగాలులు వీస్తుండటంతో అనేక మంది వివిధ రకాల ఫ్లూ బారినపడుతున్నారు. దగ్గు, జలుబుతో పాటు జ్వరం, తలనొప్పి, కడుపు ఉబ్బరం, వాంతులు, విరేచనాల బారినపడుతున్నారు. పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యసేవలు పొందొచ్చనే భావనతో మెజార్టీ పేదలు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు చేరుకుంటారు. జిల్లాలో 39 ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఒక్కో ఆస్పత్రి అవుట్ పేషంట్ విభాగానికి రోజుకు సగటున 20 నుంచి 30 మంది వస్తుంటారు. వీరిలో సాధారణ జ్వరాలు, ఫ్లూతో బాధపడే చిన్నారులతో పాటు మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి బాధితులు ఉంటారు. వైద్యులు రోగులను పరీక్షించి, మందులు రాస్తున్నారు. డాక్టర్ రాసిన మందుల చీటి తీసుకుని ఫార్మసిస్ట్ వద్దకు చేరుకుంటే తీరా అక్కడ వారికి చేదు అనుభవమే ఎదురవుతోంది. ఖరీదైన మందులే కాదు సాధారణ జలుబు నివారణకు వాడే సీసీఎం, నొప్పుల నివారణకు వాడే రాంటాక్, పాంటాక్ వంటి మందులు దొరకడం లేదు. విధిలేని పరిస్థితుల్లో రోగులే వీటిని ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది.

అనవసర మందులే అధికం

ప్రభుత్వం తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా జిల్లాకు 432 రకాల మందులను సరఫరా చేస్తోంది. అయితే మందుల కొనుగోలు, సరఫరాపై సరైనా నిఘా లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగుల అవసరాలకు భిన్నంగా అనవసర మందులు కొనుగోలు చేస్తూ..గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. ఇందుకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. తీరా గడువు ముగిసిన తర్వాత వాటిని గుట్టుగా బయటికి తరలిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య వ్యర్థాల్లో ఈ మందులను కలిపి పారబోస్తుండగా, మరికొన్ని చోట్ల గుట్టుగా నిర్మానుష్య ప్రాంతాలకు తరలించి, దగ్ధం చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.కోటి విలువ చేసే 170 రకాల మందులు కాలం చెల్లినవిగా గుర్తించినట్లు తెలిసింది. అయితే ఆయా సరఫరా కంపెనీలకు తిప్పి పంపినట్లు స్టోర్స్ అధికారులు చెప్పుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

మరో ఏడు ఎస్టీపీలు సిద్ధం!

త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం

- నిర్మాణ దశలో కొన్ని.. టెండర్ ప్రక్రియలో మరికొన్ని
- వంద శాతం మురుగు శుద్ధి దిశగా జలమండలి అడుగులు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో వంద శాతం మురుగు శుద్ధి సాధన దిశగా జలమండలి అడుగులు వేస్తోంది. రోజువారీగా ఉత్పన్నమయ్యే మురుగు నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేయడానికి వీలుగా మురుగుశుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ప్రాజెక్టు చేపట్టిన విషయం విదితమే. ఇప్పటికే కోకాపేట, దుర్గం చెరువు, పెద్ద చెరువు, నల్లచెరువు ఎస్టీపీలు ప్రారంభానికి నోచుకోగా, తాజాగా మరో ఏడు ఎస్టీపీలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. డిసెంబర్ మొదటి వారంలో జరిగే ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా నాగోల్, ఫతేనగర్, మీరాలం, ఖాజాకుంట, మియాపూర్-పటేల్ చెరువు, సఫిల్ గూడ, వెన్నెల గడ్డ ఎస్టీపీలు ప్రారంభిచేందుకు జలమండలి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



64 ఎస్టీపీలు.

గ్రేటర్‌లో వంద శాతం మురుగు నీటి శుద్ధిలో భాగంగా సుమారు 64 ఎస్టీపీలను జలమండలి నిర్మిస్తోంది. గత రెండేళ్ల క్రితం చేపట్టిన ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా 3 ప్యాకేజీలలో 1259.50 ఎంఎల్డీల సామర్థ్యం గల 25 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మిస్తోంది. ఇప్పటికే నాలుగు ఎస్టీపీల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించగా, మరో ఏడు ఎస్టీపీలను ప్రారంభానికి సిద్ధం చేసింది. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. 11 ఎస్టీపీలు హమ్ మోడ్‌లో అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కిద మరో 39 ఎస్టీపీలు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఇవి టెండర్ల దశలో ఉన్నాయి. వీటన్నింటి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే.. రోజూ ఉత్పన్నమయ్యే మురుగును 100 శాతం శుద్ధి చేసే తొలి నగరంగా దక్షిణాసియాలోనే హైదరాబాద్ చరిత్ర సృష్టించే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఇలా

హైదరాబాద్ అర్బన్ అగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 ఎంఎల్డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఇది జీహెచ్ఎంసీ ప్రాంతంలో 1650 ఎంఎల్డీలుగా ఉంది. ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా 772 ఎంఎల్డీల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేస్తున్నారు. ఇది దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అధికం. మిగిలిన 878 ఎంఎల్డీల మురుగు నీటిని శుభ్రం చేయడానికి రూ.3866.41 కోట్ల వ్యయంతో కొత్తగా 25 ఎస్టీపీల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది.

'జనరల్'కు ప్రాధాన్యం!

రైల్వే ప్రయాణికులకు భారీ ఊరట

- అన్ని ప్రధాన రైళ్లలో నాలుగు జనరల్ బోగీలు
- గోదావరి, గౌతమి, దానాపూర్, దక్షిణ్, నిజాముద్దీన్ తదితర రైళ్లలో పెంపు
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు
- డిసెంబర్‌లో దశలవారీగా విస్తరణ

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ బోగీల పెంపుతో ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని ప్రధాన రైళ్లలో ఇప్పుడు ఉన్న రెండు సాధారణ(జనరల్) బోగీలకు అదనంగా మరో రెండింటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రైల్వేబోర్డు తాజాగా నిర్ణయించింది. డిసెంబర్‌లోనే దశలవారీగా బోగీల విస్తరణ కొనసాగనుందని దక్షిణమధ్య రైల్వే అధికారి ఒకరు తెలిపారు. దీంతో ప్రయాణికులకు పెద్ద ఎత్తున ఊరట లభించనుంది. సికింద్రాబాద్ నుంచి ప్రతి రోజు దానాపూర్‌కు రాకపోకలు సాగించే దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు రద్దీ ఎక్కువగా ఉంటుంది. నిర్మాణ రంగంలో, వ్యాపార సంస్థల్లో పని చేసే కార్మికులు, చిరుద్యోగులు తదితర వర్గాలకు చెందిన లక్షలాది మంది ప్రజలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి నగరానికి వలస వచ్చి ఉంటున్నారు. దీంతో ప్రతి రోజు పెద్ద సంఖ్యలో ప్రయాణికుల రాకపోకలు ఉంటాయి. మరోవైపు వారణాసి తదితర ప్రాంతాలకు వెళ్లే భక్తులు, పర్యాటకులు కూడా ఈ ట్రైన్ పైనే ఆధారపడి బయలుదేరుతారు. రిజర్వేషన్ బోగీల్లో బెర్తులు లభించని ప్రయాణికుల నుంచి కూడా సాధారణ బోగీలకు డిమాండ్ ఉంటుంది. దీంతో కేవలం 75 మంది కూర్చొని ప్రయాణం చేసేందుకు అవకాశం ఉన్న ఒక సాధారణ బోగీలో కనీసం 150 మంది వరకు కిక్కిరిసి ప్రయాణం చేయవలసి వస్తుంది. ప్రస్తుతం మరో 2 బోగీలు అదనంగా ఏర్పాటు చేయడం వల్ల దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు ఊరట లభించనుంది. మహిళలు, పిల్లలు, వయోధికులు, తదితర వర్గాలకు చెందిన ప్రయాణికులు ప్రశాంతంగా ప్రయాణం చేసేందుకు అవకాశం లభిస్తుంది. త్వరలోనే అదనపు బోగీలు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు చెప్పారు. ఒక్క దానాపూర్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే కాకుండా నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్‌ల నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరే సుమారు 60 రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

లక్షన్నర మంది సాధారణ ప్రయాణికులే...

నగరంలోని మూడు ప్రధాన స్టేషన్‌లనుంచి ప్రతి రోజు సుమారు 2.8 లక్షల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణం చేసేవారు మినహాయిస్తే కనీసం లక్షన్నర మంది సాధారణ ప్రయాణికులే. కేవలం లక్ష మందికే సదుపాయం ఉన్న బోగీల్లో మరో 50 వేల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఏ సమయంలో చూసినా జనరల్ బోగీలు కిక్కిరిసి కనిపిస్తాయి. ప్రయాణం నరకప్రాయంగా ఉంటుంది. కాబట్టి అదనపు బోగీలను ఏర్పాటు చేయడం వల్ల ఇప్పుడు ఉన్న డిమాండ్‌లో కనీసం 75 శాతం వరకు భర్తీ అయ్యే అవకాశం ఉంటుంది.' సాధారణ బోగీల పెంపు కోసం చేపట్టిన ప్రయాణికుల ఉద్యమం ఫలించింది. ట్విట్టర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా సమస్య తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రయాణికుల సంఘాలు విజయవంతమయ్యా'యని ఉత్తర తెలంగాణ రైల్వే ప్రయాణికుల సంఘం ప్రతినిధి ఫణి తెలిపారు. పూర్తిగా సాధారణ బోగీలు లేని ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు 2 సాధారణ బోగీలు ప్రవేశ పెడతారు. ఇప్పటికే 2 సాధారణ బోగీలు ఉన్నవాటికి మరో 2 అదనంగా ఏర్పాటు చేస్తారు.



ఈ రైళ్లకు బోగీల పెంపు..

- నాంపల్లి నుంచి న్యూఢిల్లీకి నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నాంపల్లి నుంచి నిజాముద్దీన్ ఢిల్లీకి రాకపోకలు సాగించే దక్షిణ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ నుంచి దానాపూర్ (పాట్నా)వరకు నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు కానున్నాయి.
- అలాగే సికింద్రాబాద్- రాయ్‌పూర్ బైవీక్లీ, సికింద్రాబాద్- హిస్సార్ ట్రై వీక్లీ, నాంపల్లి- రక్సల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ , నాంపల్లి- విశాఖపట్నం గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నాంపల్లి - తాంబరం చెన్నై చార్మినార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏర్పాటు చేయనున్నారు.
- సాధారణ ప్రయాణికుల రద్దీ అత్యధికంగా ఉండే లింగంపల్లి -కాకినాడపోర్ట్ గౌతమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ , సికింద్రాబాద్ -గూడూరు సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం బోగీలు పెరగనున్నాయి.
- హుస్సేన్ సాగర్, ఫలక్ నుమా, దేవగిరి, నారాయణాద్రి, విజయవాడ ఇంటర్ సిటీ, సికింద్రాబాద్-సాయినగర్ షిర్డీ అజంతా ఎక్స్‌ప్రెస్, రాయలసీమ సూపర్ ఫాస్ట్, కాచిగూడ-మంగళూరు , కాచిగూడ-మధురై హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు జత చేస్తారు.

నాగ్‌పూర్ -సికింద్రాబాద్ 8 చైర్‌కార్

మరోవైపు నాగ్‌పూర్ నుండి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బోగీలను తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం 20 చైర్ కార్‌లు ఉన్నాయి. కానీ ఆక్యుపెన్సీ చాలా తక్కువగా ఉంది. దీపావళి సెలవుల్లో మాత్రం 110 శాతం ఆక్యుపెన్సీతో ఈ ట్రైన్ నడిచింది. కానీ సాధారణంగా ప్రతిరోజు 25 నుంచి 30 శాతం ఆక్యుపెన్సీ కంటే పెరగడం లేదు. దీంతో ఈ రూట్‌లో 8 చైర్‌కార్ ట్రైన్ నడిపాలని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 3 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు రెఫర్ చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 46 వినతులు అందగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 21, ఎఫ్ఏ, హెల్త్ విభాగాలకు 5 చొప్పున, ఎలక్ట్రికల్ విభాగానికి 4, స్పోర్ట్స్, సీఈ మెయింటనెన్స్, ఎస్టేట్స్, ఎల్.డబ్ల్యూ.ఎస్, హౌసింగ్ విభాగాలకు రెండు చొప్పున, విజిలెన్స్ విభాగానికి ఒక్క ఫిర్యాదు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 33, శేరిలింగంపల్లి జోన్‌లో 9, ఎల్బీనగర్ జోన్ లో 14, సికింద్రాబాద్ జోన్ లో 21, చార్మినార్ జోన్ లో 3 ఫిర్యాదులు అందగా, ఖైరతాబాద్ జోన్ లో ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, పంకజ, సరోజ, రఘు ప్రసాద్, సత్యనారాయణ, సుభద్ర దేవి, చంద్రకాంత్ రెడ్డి, సీఈ దేవానంద్, కోటేశ్వర రావు, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్, సి ఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, జాయింట్ కమిషనర్లు మహేష్ కులకర్ణి, హౌసింగ్ ఎస్ఈ కష్టారావు పీవీ రమణ రాజేశ్వర్ రావు, వాటర్ వర్క్స్ జీఎం సాయి రమణ ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్వహణ తీరుపై మార్కులు

- 100కు 75 శాతం లోపు వస్తే నోటీసులు
- ఇక ప్రతి వారం సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేయాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల నిర్వహణ పనితీరుపై మార్కుల ఆధారంగా చర్యలు తప్పవని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో సానిటేషన్, భోజనం, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్‌ల నిర్వహణ బాగుండాలని, నిర్వహణ సరిగాలేని హాస్టల్ సంక్షేమ అధికారులు, ప్రిన్సిపాల్స్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల తనిఖీకోసం నియమించిన ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయి సంక్షేమ శాఖాల అధికారులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లతో సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వసతి గృహాల నిర్వహణపై సమీక్షించారు. వసతి గృహాల స్థితిగతులు, పనితీరును పరిశీలించిన ప్రత్యేక అధికారులు సమర్పించిన నివేదికలో కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరు బాగాలేదని సూచించడం జరిగిందని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల కిచెన్ రూమ్, స్టోర్ రూమ్, భోజనశాల, వంటగది నిర్వహణ పనితీరుపై 100 శాతం మార్కులు కేటాయించడం జరిగిందని, 75 శాతం కంటే లోపు మార్కులు వచ్చిన హాస్టల్ వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. వచ్చే వారంలోగా 75 శాతం కంటే లోపు మార్కులు వచ్చిన అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. లేకుంటే సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు.

చెక్‌మేట్ కన్సల్టెన్సీ కేసు సీసీఎస్‌కు బదిలీ

బంజారాహిల్స్: మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు ఇప్పిస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వందలాది మంది నుంచి రూ. లక్షలు వసూలు చేసి మోసం చేసిన చెక్‌మేట్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కేసును జూబ్లీహిల్స్ పోలీసులు సీసీఎస్‌కు బదిలీ చేశారు. వివరాల్లోకి వెళితే..శ్రీనగర్‌కాలనీ సమీపంలోని నవోదయ కాలనీలో పువ్వాల హేమ రోహిత్ అనే వ్యక్తి చెక్‌మేట్ కన్సల్టెన్సీ పేరుతో సంస్థను ఏర్పాటు చేశాడు. సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ప్రకటనలు ఇచ్చి భారీగా వసూళ్లకు పాల్పడ్డాడు. అతడికి ఆర్.భవానీశంకర్, దినేష్, ప్రవీణ్, పువ్వాల శ్రీనివాసరావు, అచ్యుత్ సాయిరాంచౌదరి అలియాస్ పండు తదితరులు సహకరించేవారు. పలువురిని సంప్రదించి మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి 3 లక్షల దాకా వసూలు చేశారు. గత నెల 24న పరశురాంతో పాటు మరో 10 మంది బాధితులు తమను మోసగించిన రోహిత్‌పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు ప్రధాన నిందితుడు రోహిత్‌తో పాటు ఆయన అనుచరులు మరో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. 11 మంది నుంచి సుమారు రూ.కోటికి పైగా వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొనడంతో కేసును సీసీఎస్‌కు బదిలీచేశారు. రోహిత్‌ను విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని బాధితులు పేర్కొంటున్నారు.

ఇక ఫుడ్ సేఫ్టీ కమిటీలు!

- జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు
- ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా కేజీబీవీ వసతి గృహాల్లో అమలు
- కమిటీల్లో జిల్లా, మండల స్థాయి అధికారులు సహా విద్యార్థులకు స్థానం
- మధ్యాహ్న భోజనంపై మరింత నిఘా..
- నిర్లక్ష్యంగా వ్యవహరించే వార్డెన్లపై చర్యలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ స్కూళ్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఆయా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని నిర్ణయించింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం..వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు నాసిరకం భోజనం అందజేస్తున్న విషయం తెలిసిందే. రుచి సుచిలేని ఈ ఆహారాన్ని తినలేక విద్యార్థులు ఖాళీకడుపుతో పస్తులుంటున్న విషయం తెలిసిందే. ఇకపై ఏ ఒక్క విద్యార్థి కూడా ఆకలితో అలమటించొద్దని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి భావించారు. ఈ మేరకు వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిల్లో ప్రత్యేక డైట్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం సహా వసతి గృహాల్లో కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్న కాయగూరలు, పండ్లు, పాలు, కో డిగుడ్లు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించనున్నారు. జిల్లాస్థాయి కమిటీలో డీఈఓ, జిల్లా పౌరసరఫరాల అధికారి, డీఎంసీఎస్‌లు సభ్యులుగా కొనసాగుతారు. మండల స్థాయి కమిటీలో ఎంపీడీఓ చైర్మన్‌గా, ఇద్దరు సభ్యులు ఉంటారు. మున్సిపాలిటీ స్థాయిల్లోనూ ఈ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కమిటీల్లో అధికారులతో పాటు విద్యార్థులను కూడా భాగస్వాములను చేయనున్నారు. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన, రుచికర మైన పౌష్టికాహారం అందజేసి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచవచ్చునని ప్రభుత్వం యోచిస్తోంది.

హాస్టళ్లపై నిరంతరం నిఘా:

జిల్లాలో 1309 ప్రభుత్వ పాఠశాలలు, 20 కేజీబీవీలు, 9 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కేజీబీవీల్లో ఆరు నుంచి 12వ తరగతి వరకు 6027 మంది విద్యార్థులు ఉన్నారు. మరో 11 ఇంటర్మీడియట్ కేజీబీవీల్లో 1176 మంది చదువుతున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని 14 వసతి గృహాల్లో 2212 మంది, ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 34 ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 3000 మంది వసతి పొందుతున్నారు. మరో 16 కళాశాల వసతి గృహాల్లో 1805 మంది వసతి పొందుతున్నారు. ఇక మైనార్టీ సంక్షేమశాఖ అధ్వర్యంలో తొమ్మిది గురుకులాలు, తొమ్మిది జూనియర్ కాలేజీలు కొనసాగుతుండగా వాటిలో 8900 మంది చదువుతున్నారు. వీరికి మూడు పూటల భోజనం(ఉదయం టిఫిన్ (రోజుకో వెరైటీ), మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం వడ్డించాలి. సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో వార్డెన్లు కుమ్మక్కై...నాసిరకం ఆహారాన్ని వడ్డిస్తున్నారు. సన్న బియ్యానికి బదులు దొడ్డు బియ్యాన్ని వాడుతున్నారు. అది కూడా ముద్దకట్టి, ముక్క వాసన వస్తుండంతో విద్యార్థులు తినలేక పోతున్నారు. పప్పు నీళ్లను తలపిస్తుంది. చీడపీడలు పట్టి పుచ్చిపోయి, వాడిపోయిన కాయగూరలను వడ్డిస్తున్నారు. రోజుకో గుడ్డు చొప్పున వారానికి ఏడు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా, మెజార్టీ హాస్టళ్లలో మూడే ఇస్తున్నారు. ప్రతి ఆదివారం చికెన్/మటన్ వడ్డించాల్సి ఉన్నా..చేయడం లేదు. ప్రతి రోజు ఒక్కో విద్యార్థికి గ్లాసు పాలు ఇవ్వాల్సి ఉండగా, వాటిని వార్డెన్లు, వంట సిబ్బందే కాజేస్తున్నారు. డైట్ కమిటీల నిరంతర తనిఖీల ద్వారా పరిస్థితి మెరుగుపరచవచ్చునని భావిస్తుంది. అంతే కాదు కాయకూరలు, ఇతర ఆహార పదార్థాల నిల్వ కోసం దాతల సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. ప్లాస్టిక్ డబ్బాలు, టేబుళ్లు కొనుగోలు చేయించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చునని యోచిస్తోంది.

సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్

మూడు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మెస్ చార్జీలను రూ.950 నుంచి రూ.1350కి పెంచింది. అదే విధంగా ఎనిమిది నుంచి పది వరకు రూ.1100 నుంచి రూ.1540కి పెంచింది. కాస్మొటిక్ ఛార్జీల్లో భాగంగా సబ్బులు, నూనెలకు(బాలుర)కు రూ.150 చెల్లిస్తుంది. బాలికలకు 3 నుంచి 7 తరగతి వరకు రూ.150, ఎనిమిది నుంచి పది వరకు రూ.200 వరకు చెల్లిస్తుంది. వీటితో పాటు ఒక్కో విద్యార్థికి నాలుగు జతల యూనిఫాం, నోట్ పుస్తకాలు, బెడ్డింగ్ మెటీరియల్, బెడ్‌షీట్, కార్పెట్, ఉలన్ రగ్గులు, ప్లేట్లు అందజేస్తుంది. మంచాలు, డైనింగ్ టేబుల్, లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది. అయితే ఆయా వసతి గృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన వార్డెన్లు.. వంట సిబ్బంది, అటెండర్‌కు ఆ బాధ్యతలను అప్పగించి వెళ్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. డైట్ ఛార్జీలు పెంచినా..విద్యార్థుల మెనూలో మార్పు రాకపోవడం ఇటీవల హాస్టళ్ల తనిఖీలకు వెళ్లిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ డైట్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నిరంతర నిఘాతో మెనూలో మార్పులు తీసుకురావొచ్చునని ఆయన భావిస్తున్నారు.

మలక్‌పేట గవర్నమెంట్ క్వార్టర్స్ పరిశీలన

మలక్‌పేట: రాష్ట్ర డీజీపీ జితేందర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం మలక్‌పేట గవర్నమెంట్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం ముంతాజ్ కాలేజ్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ ముకుందా రెడ్డి, హైద్రాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, సైదాబాద్ మండల తహశీల్దార్ జయశ్రీతో సమావేశమయ్యారు. మండల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోషామహల్ లోని ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ స్థలంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్‌ను మలక్‌పేట క్వార్టర్స్‌లో ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలపై క్వార్టర్స్‌ను సందర్శించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ డీసీపీ కాంతిలాల్ పాటిల్, మలక్‌పేట ఏసీపీ శ్యామ్ సుందర్, తహశీల్దార్ జయశ్రీ , మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తదితరులు ఉన్నారు.



ముంతాజ్ కాలేజ్ వద్ద పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

యువతకు శాస్త్రీయ కళలపై ఆసక్తి కలిగించాలి



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సమయ సెంటర్ పర్ఫామింగ్ ఆర్ట్స్ మూడవ వార్షికోత్సవ వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..నేటి యువతకు శాస్త్రీయ సంగీత కళలపై ఆసక్తి కలిగించాలన్నారు. మన వారసత్వ సంపద అయిన కళలను చిన్నారులకు శిక్షణ ఇస్తున్న సంస్థల కృషి ఎనలేనిదని కొనియాడారు. అంతకు ముందు సంస్థకు చెందిన 50 మంది చిన్నారులు వివిధ అంశాలపై చేసిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్. శ్రీనివాసరావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఉస్మానియా మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ శశికళారెడ్డి, సంస్థ వ్యవస్థాపకురాలు కొప్పాల రాధిక, సహ వ్యవస్థాపకులు వంశీకృష్ణ గోనే తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రశాంత్ మృతదేహం

బన్సీలాల్‌పేట్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడకు చెందిన ప్రశాంత్(19) శివ, రాజు ఆదివారం రాత్రి బైక్‌పై నగరానికి వచ్చి తిరిగి వెళుతుండగా మారియట్ హోటల్ సమీపంలోని కవాడిగూడ వై జంక్షన్ వద్ద ముందు వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించగా బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో ప్రశాంత్ లారీ వెనుక చక్రం కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. శివ, రాజు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీపీలను సందర్శించిన ఫ్రాన్స్ బృందం

సాక్షి, సిటీబ్యూరో: ఫ్రాన్స్ దేశానికి చెందిన ఓ అధికారులు, నిపుణుల బృందం సిటీ పరిధిలోని ఎస్టీపీలను సందర్శించింది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ అంతర్జాతీయ వర్క్ షాప్‌నకు హాజరైన ఫ్రాన్స్ బృందం హైదరాబాద్ నగరంలో నీటి నిర్వహణ, అందులోని సవాళ్లు అనే అంశాలపై అధ్యయనం చేసేందుకు ఎస్టీపీలను సందర్శించింది. ఈ సందర్భంగా ఎస్టీపీల పనితీరు, మురుగు నీటిశుద్ధి ప్రక్రియలో దశలు, అవలంబించే పద్ధతులు, ఉపయోగించే సీక్వెన్షియల్ బ్యాచ్ రియాక్టర్ సాంకేతికత తదితర వివరాలను జలమండలి జనరల్ మేనేజర్ వాస సత్యనారాయణ వివరిస్తూ బృందం సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. అత్తాపూర్‌లో ఇప్పటికే రెండు ఎస్టీపీలు (51 ఎంఎల్డీ, 23 ఎంఎల్డీ) వినియోగంలో ఉండగా, మరో రెండు ఎస్టీపీల (64 ఎంఎల్డీ, 40 ఎంఎల్డీ) నిర్మాణం జరుగుతున్నట్లు వివరించారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి

పోచారం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి గుండె పోటు రావడంతో మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా, భువనగిరి టౌన్‌కు చెందిన దొంకెన పాండు (59) వ్యక్తిగత పనిపై మేడిపల్లి వచ్చాడు. సోమవారం ఆర్టీసీ బస్సులో స్వస్థలానికి తిరిగి వెళుతుండగా అన్నోజిగూడలోని భారత్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే గుండె పోటు రావడంతో అస్వస్థతకు లోనయ్యాడు. దీంతో కండక్టర్ సీపీఆర్ చేసి ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లో బెంజ్ కారు బీభత్సం



ప్రమాదానికి గురైన కారు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒక బెంజ్ కారు బీభత్సం సృష్టించింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం. ఆదివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని సిటీ సెంట్రల్ వైపు నుంచి రోడ్డునెంబర్-10 వైపు వెళ్తున్న బెంజ్ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ పోలీసుల సాయంతో కారు నడుపుతున్న నజీర్ అనే వ్యక్తికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించలేదని తేలింది. ప్రమాద సమయంలో కారు యజమానితో పాటు ఆయన భార్య కారులోనే ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మద్యం మత్తులో ఒక మహిళ ఈ ప్రమాదానికి పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో సీసీ ఫుటేజీలను పరిశీలించి కారు ఎవరు నడుపుతున్నారనేది తేలుస్తామని పోలీసులు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్-హోమ్స్ సంస్థ నిర్వాహకుల అరెస్టు

ప్రీ లాంచ్ ఆఫర్స్ పేరుతో రూ.48 కోట్లు టోకరా

సాక్షి, సిటీబ్యూరో: ఎలాంటి అనుమతులు లేకుండా నగర శివార్లలోని వెంచర్లు వేయడంతో పాటు వాటిలో ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో 200 మంది నుంచి దాదాపు రూ.48 కోట్లు వసూలు చేసి మోసం చేసిన ఆర్-హోమ్స్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులను సైబరాబాద్ ఎకనమికల్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) అధికారులు సోమవారం అరెస్టు చేశారు. వీరివద్ద పెట్టుబడి పెట్టి రూ.65.5 లక్షలు నష్టపోయిన వి.మనోజ్‌కుమార్ సహా మరికొందరు ఫిర్యాదు మేరకు శుక్రవారం ఈ కేసు నమోదైంది. కూకట్‌పల్లి కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన ఈ సంస్థకు చుక్కా భాస్కర్ ఎండీగా, ఆయన భార్య సుధారాణి డైరెక్టర్‌గా ఉన్నారు. వీరు సంబంధిత విభాగాల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నగర శివార్లలో బిల్లస్ హైట్స్, ఓఆర్ఆర్ హైట్స్, ఫార్మ్ ల్యాండ్ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో తక్కువ ధరకే ప్లాట్లు, ఫ్లాట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. కొనుగోలుదారులను ఆకర్షించడానికి ప్రముఖులతో ప్రచారం చేయించారు. దీంతో అనేక మంది మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన వారు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలనే వీరి వద్ద ఫ్లాట్లు బుక్ చేసుకున్నారు. మూడేళ్లల్లో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అలా కాని పక్షంలో డబుల్ బెడ్ రూమ్‌కు రూ.6 వేలు, త్రిపుల్ బెడ్‌రూమ్‌కు రూ.8 వేలు చొప్పున పూర్తయ్యే వరకు అద్దె చెల్లిస్తామని నమ్మ బలికారు. నిర్మాణంలో జాప్యంపై బాధితులు ప్రశ్నించగా ధరణి, ఎన్నికలు సహా అనేక కారణాలు చెబుతూ తప్పించుకున్నారు. ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించిన కొందరు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన ఈఓడబ్ల్యూ నిందితులను అరెస్టు చేసింది.

వేధింపుల కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు



నిందితుడు మహమ్మద్ జైన్

రంగారెడ్డి కోర్టులు: బాలికను వేధించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి సోమవారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలాపూర్ ఠాణా ప్రాంతానికి చెందిన బాలిక 2020, మే 5న ఇంట్లో ఒంటరిగా ఉంది. అదే సమయంలో అక్కడికి వచ్చిన మహమ్మద్ జైన్ అనే వ్యక్తి ఇంటిపై రాళ్లు విసరడాన్ని గుర్తించిన బాలిక ఈ విషయమై అతడిని ప్రశ్నించింది. దీంతో అతను బాలికతో అసభ్యంగా ప్రవర్తించడమేగాక తనను ఎందుకు పెళ్లి చేసుకోవట్లేదని ఆమెను చేయి పట్టుకుని లాగాడు. అతడి నుంచి తప్పించుకున్న బాధితురాలు ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బాలాపూర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం నిందితుడికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ లక్ష పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

కారు ఢీకొని రెండేళ్ల బాలిక దుర్మరణం



బాలమ్మ (ఫైల్)

మీర్‌పేట: రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వారివి. ఉన్నంతలోనే తమ ముగ్గురు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటున్న తరుణంలో ఓ కారు ఆ దంపతులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారిని కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన చిన్న తిరుపతయ్య, బాల వెంకమ్మ దంపతులు బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం నగరానికి వచ్చి భూపేష్‌గుప్తానగర్ వనపురి కాలనీ సమీపంలో గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. తిరుపతయ్య ఇంటింటికి తిరిగి గ్యాస్‌స్టవ్ రిపేర్లు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. చిన్న కుమార్తె తిరుమల బాలమ్మ(2) సోమవారం సాయంత్రం స్థానికంగా ఉండే పిల్లలతో కలిసి ఇంటి ఎదుట ఆడుకుంటోంది. అదే సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా కారుతో చిన్నారిని ఢీకొట్టి, తలపై నుంచి వెళ్లడంతో సంఘటనా స్థలిలోనే మృతి చెందింది. గమనించిన స్థానికులు కారు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



నిందితుడు మహేశ్

రంగారెడ్డి కోర్టులు: బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు, 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు చెప్పారు. ఏపీపీ నరేశ్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాచారం మండలం, గడ్డమలయ్యగూడ గ్రామానికి చెందిన వరికుప్పల మహేశ్ 2024, మార్చి 13న తన ఇంటి పక్కన నివసించే బాలిక(05) ఇంటి ముందు ఆడుకుంటుండగా డబ్బు ఆశ చూపించి ఇంటిపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు విని అక్కడికి చేరుకున్న స్థానికులు అతడిని బంధించి తండ్రికి సమాచారం అందించారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన యాచారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం నిందితుడికి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. బాధితురాలికి రూ.5లక్షలు పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్‌: సైఫాబాద్‌ డివిజన్‌ పరిధిలో ఇందిరాపార్క్, ఫీవర్‌ హాస్పిటల్‌ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్, చెట్ల తొలగింపులో భాగంగా విద్యుత్‌ సరఫరాను ప్రాంతాల వారీగా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాపార్క్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దత్తనగర్, హిమాయత్‌నగర్‌ స్ట్రీట్‌ నెం 10 టు 15, ఆక్స్‌ఫర్డ్‌ స్కూల్‌ ఏరియా, తాజ్‌మహల్‌ హోటల్, వెంకటేశ్వర మోటార్స్‌ ఏరియా, పెట్రోల్‌ పంప్‌ ఏరియా, చైతన్య కళాశాల, నియర్‌ అశోక్‌నగర్‌ నాలా ఏరియాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. అదే విధంగా ఫీవర్‌ హాస్పిటల్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో మాఫిల్‌ హోటల్, హిమాయత్‌నగర్, తాజ్‌మహల్‌ హోటల్‌ ఏరియాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

సర్కిల్‌-17లో 75 శాతం సర్వే పూర్తి


దరఖాస్తులను కంప్యూటీకరిస్తున్న ఆపరేటర్‌

బంజారాహిల్స్‌: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ సర్కిల్‌-17 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, సోమాజీగూడ, అమీర్‌పేట, సనత్‌నగర్‌ డివిజన్ల పరిధిలో సమగ్ర కుటుంబ కులగణన సర్వే సోమవారం నాటికి 75 శాతం పూర్తయ్యిందని డీసీ రజనీకాంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన సర్వేలో ఇప్పటి వరకు 35 వేల గృహాల సందర్శన పూర్తయ్యిందన్నారు. మొత్తం 48 వేల గృహాలను సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 75 శాతం పూర్తయ్యినట్లు తెలిపారు. ఖైరతాబాద్‌ సర్కిల్‌ కార్యాలయంలో ప్రతిరోజూ దరఖాస్తుల కంప్యూటీకరణ చేపడుతున్నామన్నారు. ముమ్మరంగా ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇంకా సర్వే కొనసాగుతుందని, ప్రజలు తమ ఇంటికి వచ్చే వారికి కుటుంబ వివరాలు అందజేయాలన్నారు.

తరలని చెత్త కుప్పలు

- స్థానికులకు తప్పని ఇక్కట్లు


గుట్టలుగా పేరుకుపోయిన చెత్త

ఫిలింనగర్‌: చెత్త తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో ఓపెన్‌ గార్బేజీ పాయింట్ల వద్ద చెత్త గుట్టలుగా పేరుకుపోతున్నది. జూబ్లీహిల్స్‌ సర్కిల్‌-18 పరిధిలోని కొత్త చెరువు పక్కన గత కొద్ది రోజులుగా సమయానికి చెత్త తరలించే వాహనాలు రాకపోవడంతో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి స్థానికంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. ఈ ప్రాంతంలో ఇరుకైన సందులతో పాటు ఎత్తైన ప్రాంతాల్లో నివాసాలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాలకు చెత్తను సేకరించే వాహనాలు రాకపోవడంతో స్థానికులు పెద్ద ఎత్తున ఇక్కడ చెత్తను వేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ఓపెన్‌ గార్బేజ్‌ పాయింట్‌ వద్ద చెత్తను ఎప్పటికప్పుడు తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-10లోని బసవతారకం కేన్సర్‌ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న వీధిలో బంజారాహిల్స్‌ ట్రాఫిక్‌ పోలీసులు సోమవారం ఆపరేషన్‌ రోప్‌ నిర్వహించి పెద్ద ఎత్తున ఫుట్‌పాత్‌ ఆక్రమణలు తొలగించారు. వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌ నేతృత్వంలో పోలీసులు నందినగర్‌ బ్రహ్మకుమారీస్‌కు వెళ్లే రోడ్డు ఇళ్ల ముందు ఫుట్‌పాత్‌ను, రోడ్డును ఆక్రమించి యజమానులు నెలనెలా డబ్బులు వసూలు చేస్తూ కిరాయికి ఇచ్చిన ఆక్రమణలు తొలగించారు. సుమారు 45కి పైగా ఫుట్‌పాత్‌ ఆక్రమణలు తొలగించి సామగ్రిని లారీల్లో తరలించారు. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డులో ఇంటి యజమానులు తమ ఇళ్ల ముందు ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి బండ్లు ఏర్పాటు చేయించి వారి వద్ద నుంచి అద్దెలు వసూలు చేస్తున్నట్లుగా పోలీసులకు ఫిర్యాదులు అందాయి. మరోసారి రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై డబ్బాలు ఏర్పాటు చేస్తే యజమానులపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయిస్తామని పోలీసులు హెచ్చరించారు.

వెన్నెలకు అభినందనలు


వెన్నెలను అభినందిస్తున్న బాబా ఫసియుద్దీన్‌

రహమత్‌నగర్‌: రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా నియమితులైన ప్రజానౌక గద్దర్‌ కూతురు వెన్నెలను బోరబండ కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని తన ఆటాపాటలతో చైతన్య పరిచిన ప్రజా గాయకుడు గద్దర్‌ సేవలను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆయన కూతురును సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. వెన్నెల సారథ్యంలో తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు మరింత ముందుకు వెళతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

దళిత నాయకుల అభినందనలు

రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా నియమితులైన వెన్నెలను డా. బీఆర్‌ అంబేడ్కర్‌ రక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జై భీమ్‌ యాదగిరి, బోరబండ డివిజన్‌ అధ్యక్షుడు పావనం శివకుమార్‌ (బొట్టుశివ) తదితరులు అభినందించారు.

ఠాణాల్లో పెండింగ్‌ కేసులపై..

ప్రజావాణిలో ఫిర్యాదులు

- వెస్ట్‌జోన్‌ పరిధిలో 144 దరఖాస్తులు
- ఇప్పటి వరకు 61 కేసులు పరిష్కారం
- విచారణలో మరో 83 కేసులు పెండింగ్‌
- ఎప్పటికప్పుడు బాధితులకు సమాచారం ఇస్తున్న పోలీసులు
- సివిల్‌ కేసులు కొట్టివేత


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బంజారాహిల్స్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గత ఏడాది డిసెంబర్‌లో ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, సబ్‌ రిజిస్టర్, పన్నుల విభాగం, ఆస్పత్రుల్లో బిల్లులు ఇలా పలు అంశాలపై దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో తాము పిటిషన్లు ఇచ్చినా న్యాయం జరగడం లేదంటూ ప్రజావాణి మెట్లెక్కుతున్నారు. సుమారు ఏడాది కాలంగా వెస్ట్‌జోన్‌ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్, పంజగుట్ట, మధురానగర్, బోరబండ, ఎస్సార్‌నగర్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో న్యాయం చేయాలంటూ ప్రజావాణిలో 144 దరఖాస్తులు అందాయి. ఇందులో బంజారాహిల్స్‌ ఏసీపీ పరిధిలో 24, జూబ్లీహిల్స్, ఫిలింనగర్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 11, పంజగుట్ట, మధురానగర్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 6, ఎస్సార్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 19 చొప్పున దరఖాస్తులు అందాయి. మొత్తం 144 ఫిర్యాదుల్లో 61 కేసులను ఆయా ఠాణాల అధికారులు పరిష్కరించారు. మరో 83 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

- గత ఏడాది తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంపై సీసీ కెమెరా ఫుటేజీ కూడా ఉంది. మేము బీదవాళ్లం.. మాకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది.
- బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-1లోని ఐరిష్‌ కన్సల్టెన్సీ సర్వీస్‌లో విదేశాల్లో ఉద్యోగాల కోసం తాను రూ.84 లక్షలు చెల్లించడం జరిగింది. వీసాలు క్యాన్సిల్‌ అయ్యాయని ఇంత వరకు తమకు బంజారాహిల్స్‌ పోలీసుల నుంచి న్యాయం జరగడం లేదంటూ ఓ యువకుడు ప్రజావాణిలో ఫిర్యాదులో చేశాడు.


బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌..

- తాను ఓ ఖాళీ స్థలంలో రాక్‌ కటింగ్‌ చేశానని, తనకు రూ.11.78 లక్షలు రావాల్సి ఉందని, ఇంత వరకు యజమాని తనకు డబ్బులు ఇవ్వడం లేదని మరో వ్యక్తి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.
- తన ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి ఆభరణాలు, పాస్‌ బుక్‌లు, నంది అవార్డులు, ఇతర జ్ఞాపికలు చోరీ చేశారని, ఇంత వరకు నిందితుడిని పట్టుకోలేకపోయారని ఫిలింనగర్‌ పోలీసుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ ఓ మహిళా సినీ అసోసియేట్‌ డైరెక్టర్‌ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే తనకు 2015 నుంచి కిరాయిదారు ఇంటి అద్దె చెల్లించడం లేదంటూ ఓ మహిళ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- ఎస్సార్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బాపునగర్‌లో పోలీసు పెట్రోలింగ్‌ పెంచాలంటూ స్థానికుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.
- తమ సోదరులు బంజారాహిల్స్‌లోని 400 గజాల ప్లాట్‌కు సంబంధించి తనకు వాటా ఇవ్వడం లేదంటూ ఓ మహిళ ప్రజావాణి మెట్లెక్కారు.
- ఇచ్చిన దరఖాస్తుల్లో 21 ఫిర్యాదులు 2, 3 సార్లు అందజేయడం జరిగింది.
- ఆయా డివిజన్ల ఏసీపీలు ప్రజావాణిలో తమకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన వివరాలను కమిషనర్‌ కార్యాలయానికి రిపోర్ట్‌ అందజేశారు.
- 11 పిటిషన్లు రెండుసార్లు వచ్చినట్లుగా కూడా కమిషనర్‌ కార్యాలయానికి రిపోర్ట్‌ కూడా అందజేశారు.
- వెస్ట్‌జోన్‌ పరిధిలో బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి నుంచే అత్యధికంగా 24 మంది ప్రజావాణిని ఆశ్రయించారు.
- అలాగే కొంతమంది సివిల్‌ వివాదాలు కూడా పోలీసులు పరిష్కరించడం లేదంటూ ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తుండగా ఈ సివిల్‌ కేసులను పోలీసులు కొట్టేస్తున్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిందిగా సూచిస్తున్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి

- క్రిస్టియన్‌ మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దీపక్‌ జాన్‌


దీపక్‌ జాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్గనైజేషన్‌ ప్రతినిధులు

ఫిలింనగర్‌: క్రిస్టియన్‌ సంఘాలన్నీ ఐక్యతతో ఉండి క్రైస్తవుల హక్కులు సాధించడంతో పాటు సమస్యలు పరిష్కరించుకోవాలని తెలంగాణ క్రిస్టియన్‌ మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దీపక్‌ జాన్‌ అన్నారు. ఫిలింనగర్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ క్రిస్టియన్‌ రైట్స్‌ ఆర్గనైజేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ బి. పీటర్‌ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సోమవారం ఆయనను కలిసి క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా చోట్ల క్రైస్తవులుపై దాడులు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని వివరించారు. మరో వైపు ప్రభుత్వం నుంచి క్రైస్తవులకు రావాల్సిన పథకాలు, రాయితీలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో పెద్ద సంఖ్యలో క్రిస్టియన్లు శ్మశాన వాటికల స్థలం గురించి ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నామని ప్రభుత్వం గుర్తించి స్పందించాలని కోరారు. దీనికి దీపక్‌ స్పందిస్తూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని వచ్చే నెలలో గ్రేటర్‌లోని ప్రతి డివిజన్‌లో క్రిస్మస్‌ ఫెస్ట్‌లు నిర్వహిస్తున్నామని, ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్‌ ఫెస్ట్‌లో సీఎం కూడా పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జె ప్రశాంత కుమార్, కార్యదర్శి కె.దిలీప్‌ కుమార్, సంయుక్త కార్యదర్శి బి. కిషోర్, కోశాధికారి కె.స్వాతి, చైర్మన్‌ ఆంటోని దాస్, వైస్‌ చైర్మన్‌ రెవరెండ్‌ జీవానందం, స్టేట్‌ ఉమెన్‌ వింగ్‌ ప్రెసిడెంట్‌ సరోజ భాస్కర్, తెలంగాణ స్టేట్‌ ఉమెన్‌ వింగ్‌ కార్యదర్శి రోజా గంధం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ, ఊంజల్‌ సేవ


హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో ఊంజల్‌ సేవలో అర్చకులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ, ఊంజల్‌ సేవ కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌ మెంట్‌ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర ప్రభూజీ పర్యవేక్షణలో ఆయా కార్యక్రమాలు కొనసాగాయి.

నేత్రపర్వంగా లక్ష తులసీ దళార్చన

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్‌ నెం.14 నందినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం ఆలయంలో స్వామివారికి లక్ష తులసీ దళార్చన పూజలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన సహస్ర దీపాలంకరణలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఎం. శేష శైలాచార్యులు, ఆలయ చైర్మన్‌ సి.ఎస్‌. దశరథ్‌ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి తులసీదళార్చన చేస్తున్న అర్చకులు

67వ రోజుకు చేరిన అంబేడ్కర్‌ వర్సిటీ ఉద్యోగుల నిరసన

- ఎమ్మెల్సీ కోదండరాం విన్నపంతో వంటావార్పు వాయిదా

బంజారాహిల్స్‌: తెలంగాణ ఉద్యమ కీలక నేత, ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం విన్నపం మేరకు ఈ నెల 27న తలపెట్టిన వంటావార్పు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు అంబేడ్కర్‌ యూనివర్సిటీ జేఏసీ నేతలు ప్రకటించారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, ఉద్యోగులు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ముందు బైఠాయించి, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనను కొనసాగించారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్‌పర్సన్‌ పల్లవీ కాంబ్లే, సెక్రటరీ జనరల్‌ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నానని, మరికొంత సమయం అవసరమని, ఇప్పటికిప్పుడు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం భావ్యం కాదని, కొంత సమయం వేచి చూడాలని ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం తనను కలిసిన జేఏసీ నేతలను కోరినట్లు చెప్పారు. దీంతో కోదండరాం హామీ మేరకు వంటావార్పు కార్యక్రమ వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు వెంకటేశ్వర్లు, యాకేష్‌దైద, ఉదయిని, హబీబుద్దీన్, కాంతం ప్రేమ్‌కుమార్, రాఘవేంద్ర, పాండు, షబ్బీర్, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్‌ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్‌ ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రోజూ గుప్పెడు బియ్యం దానం చేయండి

- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డా.ప్రఫుల్లారెడ్డి

రహమత్‌నగర్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ సనత్‌నగర్‌ టీం వినూత్న సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతిరోజూ కేవలం గుప్పెడు బియ్యం దానం చేయండి అంటూ విస్తృత ప్రచారం చేపడుతుంది. ఈ క్రమంలోనే యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌లోని అమరావతి హైస్కూల్లో సోమవారం ఈ కార్యక్రమాన్ని లయన్‌ క్లబ్‌ సనత్‌నగర్‌ టీం కార్యదర్శి లయన్‌ డా. ప్రఫుల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సేకరించిన బియ్యాన్ని ప్రతివారం అనాథ, వృద్ధాశ్రమాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్‌ ప్రమోద్‌ రెడ్డి, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

లిబర్టీ: రాజ్యాంగ సవరణ చేసి అణగారిన మాదిగలకు న్యాయం చేయాలని ఇండియన్‌ ప్రజా కాంగ్రెస్‌ పార్టీ జాతీయ అధ్యక్షులు కే.బీ.శ్రీధర్‌ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 341 ఆర్టికల్‌ను సవరించాలని దండోరా ధర్మ పోరాటం పేరుతో పోకల కిరణ్‌ మాదిగ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. వర్గీకరణ అంశానికి ఆర్టికల్‌ 341 ఇబ్బంది కలిగించే విధంగా ఉందని, ఆ ఆర్టికల్‌ సవరించాలని విన్నవించారు. సామాజిక న్యాయం, రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్‌: విధులకు వెళ్ళిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్పీఆర్‌హిల్స్‌లో నివాసం ఉండే కళ్యాణి రెండేళ్ళ కిందట ప్రభుకుమార్‌ను ప్రేమించి పెళ్ళి చేసుకుంది. గతనెల 17వ తేదీన భార్యాభర్తలకు ఆర్థిక పరమైన చిన్న గొడవ జరిగింది. ఈ క్రమంలో 18వ తేదీన ప్రభుకుమార్‌ తాను పనికి వెళతున్నానని చెప్పి వెళ్ళాడు. 19వ తేదీ సాయంత్రం భార్యకు ఫోన్‌ చేసి తాను కరెంటు బిల్లు చెల్లించానని, ఇక ఇంటికి రానని తెలిపాడు. మరుసటిరోజు వస్తాడని అనుకున్న కళ్యాణికి తర్వాత రోజు కూడా రాకపోవడంతో అనుమానం వచ్చి ఫోన్‌ చేయగా ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ వచ్చింది. అతని కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్ళి విచారించినా ఫలితం లభించలేదు. దీంతో ఆమె మధురానగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దంత వైద్య శిబిరం

రహమత్‌నగర్‌: బ్రహ్మశంకర్‌నగర్‌ సెయింట్‌ సాల్మాన్‌ హైస్కూల్లో మంగళవారం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు స్కూల్‌ కరస్పాండెంట్‌ సుధాకర్, హెచ్‌ఎం ప్రీతిలు తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ దంత వైద్యులు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైద్రాబాద్‌ సనత్‌నగర్‌ టీం కార్యదర్శి లయన్‌ డా. ప్రఫుల్లారెడ్డితో పాటు పలువురు దంత వైద్యులు పాల్గొంటారని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి దంత సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తారని సుధాకర్‌ వివరించారు. పిల్లలు ఎక్కువగా దంత సమస్యలతో ఇబ్బంది పడుతుంటారని, అందుకే ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓర్పు, నేర్పుతోనే విద్యాసంస్థల ఎదుగుదల

- జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ వార్షిక వేడుకల్లో రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి దినకర్‌బాబు



ఫిలింనగర్‌: ఓర్పు, నేర్పు ఉంటేనే విద్యాసంస్థల ఎదుగుదల ఉంటుందని రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి దినకర్‌బాబు అన్నారు. జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ 38వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి దినకర్‌బాబు, డీఆర్‌డీఓ ఆర్‌సీఐ ప్రాజెక్ట్‌ లీడర్‌ హరిబాబులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ పి.కాంచనవల్లి స్వాగతోపన్యాసం చేస్తూ పాఠశాల వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా దినకర్‌బాబు మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణంలో విద్యా సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ అంచెలంచెలుగా ఎదుగుతూ తనదైన గుర్తింపు సాధిస్తోందన్నారు. ఈనాటి కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలు సామాజికంగా ఎదగడానికి సహకరించాలని తెలిపారు. పిల్లలకు అమ్మ ఒడి ఎంత ముఖ్యమో స్కూల్‌ కూడా అంతే ముఖ్యమన్నారు. హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని, ఉపాధ్యాయులు, విద్యార్థుల బలాలు, బలహీనతలను తెలుసుకుని తదనుగుణంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు విద్యపై శ్రద్ధ కలిగి ఉండాలని సూచించారు. జూబ్లీహిల్స్‌ ఎడ్యుకేషనల్‌ సొసైటీ అధ్యక్షుడు మురళీ ముకుంద్‌ మాట్లాడుతూ విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఈ స్కూల్‌ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎంతో చక్కని ఆహ్లాదకర వాతావరణంలో వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. విద్యార్థులు ఎంతో నైపుణ్యాలతో ఈ కార్యక్రమాలను ప్రదర్శించి కనువిందు చేశారు. జానపద నృత్య కళా ప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. అలనాటి మేటి మాయాబజార్‌ కథా సన్నివేశాలతో కూడిన లఘు నాటిక ఈ కార్యక్రమానికి తలమానికంగా నిలిచింది. అనంతరం పాఠ్య, పాఠ్యేతర అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ డైరెక్టర్‌ వరలక్ష్మీ, ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షిక వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పరిశ్రమల వివరాలు ఇవ్వాలి

కేంద్ర గణాంక శాఖ సమావేశంలో అజిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అజిత్‌కుమార్

నాంపల్లి: పరిశ్రమలు తమ వివరాలను నిర్దేశించిన సమయం లోపల సంకలనం చేయాలని కేంద్ర గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజిత్ కుమార్ అన్నారు. కేంద్ర గణాంక శాఖ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో పరిశ్రమల వార్షిక సర్వే (ఏఎస్‌ఐ) సంకలనంపై సోమవారం అజిత్ కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆయా పరిశ్రమల ఉద్యోగులకు ఏఎస్‌ఐ రిటర్న్‌ను సంకలనం చేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ రిటర్న్ స్థిర ఆస్తులు, వర్కింగ్ క్యాపిటల్, రుణాలు, ఉపాధి, ఖర్చులు, రసీదులు, ఇన్‌పుట్ అంశాలు, ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులు వంటి అనేక అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం స్థూల దేశీయోత్పత్తికి, పారిశ్రామిక రంగ సహకారాన్ని అంచనా వేయడానికి, పారిశ్రామిక అభివృద్ధి విధానాలను రూపొందించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతి రెడ్డి, ఎస్‌ఎస్‌ఓ రమేష్ మెండు స్వీయ సంకలన ప్రక్రియ గురించి సంక్షిప్తంగా వివరించారు. సీనియర్ స్టాటిస్టికల్ అధికారులు ఏఎస్‌ఐ పోర్టల్‌కు సంబంధించి పలు సందేహాలను నివృత్తి చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డీఈఎస్) అధికారులు, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ డైరెక్టర్ టి.సుజాత పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్‌గా కోట్ల హనుమంతరావు



వీసీ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న ఆచార్య కోట్ల హనుమంతరావు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య కోట్ల హనుమంతరావు పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు సోమవారం ఉత్తర్వులను జారీ చేసి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆచార్య కోట్ల హనుమంతరావు లలిత కళాపీఠం పీఠాధిపతిగా, పరీక్షల నియంత్రణాధికారిగా, రంగస్థల కళల శాఖ అధిపతి వంటి అనేక కీలక శాఖల్లో పనిచేశారు. ఆయనకు ఉన్న సుదీర్ఘమైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆచార్య కోట్ల హనుమంతరావుకు రిజిస్ట్రార్ బాధ్యతలను అప్పగించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఆచార్య వై.రెడ్డి శ్యామల వయసురీత్యా ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆచార్య కోట్ల హనుమంతరావు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామల నుంచి బాధ్యతలను తీసుకున్నారు.

- నాలుగేళ్లుగా సాగుతున్న భవన సముదాయ నిర్మాణాలు
- 13 మార్కెట్ల నిర్మాణ పనులకు రూ.39.90 కోట్లు
- నిధులు లేక అసంపూర్తిగా నిర్మాణపనులు
- నిత్యావసర సరుకుల కోసం పట్టణ ప్రజలకు తప్పని పాట్లు



దమ్మాయిగూడలో..

సమీకృత మార్కెట్లకు గ్రహణం!

సాక్షి,సిటీబ్యూరో: సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు గ్రహణం పట్టింది. ఆ పనులకు నిధులలేమి సమస్యగా మారింది. దీంతో కొన్ని ప్రారంభ దశలో, మరికొన్ని నత్త నడకన, ఇంకొన్ని ఆగిపోయే దశలో ఉన్నాయి. నగర శివారు ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా 13 పురపాలక సంఘాల్లో నాలుగేళ్ల కిందట బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమీకృత (వెజ్, నాన్-వెజ్) మార్కెట్లు నిర్మించాలని నిర్ణయించి ఆ మేరకు శ్రీకారం చుట్టింది. 9 పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నెమ్మదించగా, మరో రెండు చోట్ల ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు సరిపడా నిధులు సకాలంలో ప్రభుత్వం విడుదల చేస్తే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

నాలుగేళ్ల కిందటనే ..

సమీకృత మార్కెట్లు 2022 సంక్రాంతి వరకు ప్రజలకు అందుబాటులో రావాల్సిన ఉంది. కానీ, నిధులు లేక నీరసించాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్, బోడుప్పల్, కొంపెల్లి, ఘట్కేసర్ పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతుండగా, గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్, నాగారం, పోచారం, నిజాంపేట్, దుండిగల్ పురపాలక సంఘాల్లో మొక్కుబడిగా సాగుతున్నాయి. పీర్జాదిగూడ, దమ్మాయిగూడలో పనులు ఒక మోస్తరుగా కొనసాగుతున్నా నిధులు విడుదల కాని కారణంగా నిలిచిపోయే స్థితికి చేరుకున్నట్లు తెలుస్తోంది. సమీకృత మార్కెట్ల నిర్మాణాలు పూర్తయితే తప్ప.. నగర శివారు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు కూరగాయలు, మాంసం, పండ్లు, ఇతర తినుబండారాలు ఒకే చోట లభించే అవకాశంలేదు.



పీర్జాదిగూడలో..

స్థలాన్ని బట్టి నిధుల కేటాయింపు

పురపాలక సంఘాల్లో ఒక ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలంలోపు నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.2 కోట్లు, రెండు ఎకరాలు ఆపైన ఉన్న స్థలంలో నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.4.50 కోట్లు కేటాయిస్తూ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పురపాలిక యంత్రాంగం ఆయా పట్టణాల్లో సమీకృత మార్కెట్ల భవన నిర్మాణ సముదాయాల్లో భాగంగా షెడ్లు, పార్కింగ్ నిర్మాణ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను చేపడుతున్నారు.

13 పురపాలక సంఘాల్లో...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల కోసం అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని అధికార యంత్రాంగం కేటాయించింది. భవనాలు, పార్కింగ్, ఇతర పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.39.90 కోట్లు మంజూరు చేసింది. జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో సమీకృత మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణం కోసం రూ.4.5 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేయగా, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున నిధులు వెచ్చించేలా అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం పురపాలక సంఘాల్లో నత్తనడకన సాగుతున్న సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అవసరమైన నిధులు విడుదల చేసి, సకాలంలో నిర్మాణపనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలంటున్నారు.

30న దివ్యాంగుల 'చలో ఇందిరాపార్కు'

పెన్షన్‌ను 6 వేలకు పెంచాలి: వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: చేయూత పథకం కింద దివ్యాంగులకు పెన్షన్‌ను రూ.4016 నుంచి రూ.6 వేలకు పెంచాలని, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వల్లభనేని ప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పటిష్టంగా అమలు చేయాలని, దివ్యాంగులకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లను 5 శాతం కేటాయించాలని, ప్రతి శాఖలోనూ 5 శాతం లేదా రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఈ విషయంపై రాష్ట్ర వికలాంగుల శాఖ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రాలుసమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ ద డెఫ్ కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షులు కె.వెంకటేష్ గౌడ్, అశోక్‌గౌడ్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఆటో అండ్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యూనియన్స్ జేఏసీ డిమాండ్



కవాడిగూడ: ఆటో, ప్రైవేటు రవాణా కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనియెడల ఆటో డ్రైవర్లతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యూనియన్స్ జేఏసీ నేతలు అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు యూనియన్స్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జేఏసీ నేతలు అల్లూరి జయశంకర్, బోస్, ప్రవీణ్, పెంటయ్యగౌడ్, సమ్మయ్య యాదవ్, కొమురయ్య, శ్రీనివాస్, కిషన్, జహంగీర్, సాయిలు, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తున్న ఓలా, ఊబర్, రాపిడో అక్రమ వ్యాపారాన్ని నిషేధించాలని, మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం పునరాలోచించాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటోమీటర్ల రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు వివిధ జిల్లాల్లో గూడ్స్ వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. ఆటో ప్రైవేటు రవాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం అధ్యయన కమిటీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు.



ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌తో భేటీ

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరికిరణ్‌ను సోమవారం తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు, మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, చంద్రయ్య, గణేష్, విజయ భాస్కర్‌రెడ్డి, ప్రదీప్‌రావు, ఉజ్వల రెడ్డి, జీవన్ కిరణ్ ఉన్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

ముగిసిన వరల్డ్ హెరిటేజ్ వీక్ వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించిన వరల్డ్ హెరిటేజ్ వీక్ వేడుకలు–2024 సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా వారసత్వ పరిరక్షణలో యువతను నిమగ్నం చేయడమే లక్ష్యంగా గ్రాడ్యుయేట్ ఆర్కిటెక్చర్ విద్యార్థుల కోసం 'పునర్జీవన వారసత్వం: ముదుమల్ మెగాలిథిక్ మెన్హిర్స్'పేరుతో డిజైన్ పోటీ నిర్వహించారు. నగరంలోని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌వీ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, జేఎన్‌ఏఎఫ్‌యూ, ఉస్మానియా ఆర్కియాలజీ విభాగం, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ పాల్గొన్నాయి. ఇందులో భాగంగా హెరిటేజ్ తెలంగాణ శాఖ 'సెంటినరీహెరిటేజ్ మ్యూజియం, 'బౌద్ధుల సైట్ మ్యూజియం ఫణిగిరి'బ్రోచర్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ ముదమూల్ మహారాతి యుగం మెన్‌హిర్స్ సైట్‌ను యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చేర్చే లక్ష్యంతో పరిశోధనలు, డాక్యుమెంటేషన్, సంరక్షణ అధ్యయనాలను నిర్వహించడంలో తెలంగాణ వారసత్వ శాఖ, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ కృషిని వివరించారు. ఇలాంటి సంపదను భావితరాలకు అందించడం, మానవాళి ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని సుసంపన్నం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హెరిటేజ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్, ఇన్‌ట్యాక్స్ న్యూఢిల్లీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దీపేంద్ర శర్మ, డాక్టర్ ఈ.శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల రావిచెట్టుకు స్థలమార్పిడి

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విస్తరణ కోసం అనేక చర్యలు చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే తాజాగా 60 ఏళ్లకుపైబడిన రావిచెట్టును విజయవంతంగా ట్రాన్స్‌లొకేట్ చేసింది. సికింద్రాబాద్ రైల్ నిలయం ప్రాంగణంలో సుమారు 40 అడుగుల ఎత్తు, 3బీ మీటర్ల చుట్టుకొలతతో ఉన్న ఈ రావి(ఫికస్ రెలిజియోసా) చెట్టును వేరేచోటుకు తరలించారు. కొత్త కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణ పనుల దృష్ట్యా, దీని వేర్లకు నష్టం వాటిల్లకుండా ట్రాన్స్‌లొకేషన్ పూర్తి చేశారు. కర్నూలుకు చెందిన పర్యావరణ నిపుణుడు ఎ.చంద్రమౌళి నేతృత్వంలో ఈ పనులను చేపట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. చెట్టు స్థలమార్పిడి ప్రక్రియలో భాగంగా కొమ్మలను నరికివేసే ముందు, నరికివేసిన తరువాత వేపనూనె, 50 కిలోల వేపపిండి కేక్‌ను ఉపయోగించారు. 200 లీటర్ల నీటిలో 2 లీటర్ల హ్యూమిక్ యాసిడ్‌ను కలిపి చల్లారు. చెట్టును తిరిగి నాటిన స్థలంలో 180 కిలోల సహజ ఎరువును ఉపయోగించారు. కొత్త చెట్టుకొమ్మలు 3 నుంచి 6 నెలల కాలంలో పెరగడం ప్రారంభిస్తాయని చంద్రమౌళి తెలిపారు. వృక్షాల పునరుజ్జీవన ప్రణాళికల్లో భాగంగా మహబూబ్‌నగర్‌లో ఉన్న ప్రసిద్ధ పిల్లలమర్రి చరిత్రాత్మక మర్రి చెట్టుకు విజయవంతంగా చికిత్స చేశారు. దక్షిణ మధ్య రైల్వే 2021లో కూడా కాచిగూడలోని రైల్వే కోచింగ్ డిపోలో ఉన్న మూడు చెట్లను విజయవంతంగా వేరే చోటికి తరలించింది. దక్షిణ మధ్య రైల్వే ఇంజినీరింగ్ బృందాన్ని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.



పీఎం భార్గవ ఆడిటోరియం ప్రారంభం



సీసీఎంబీలో పీఎం భార్గవ ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ కలైసెల్వి

లాలాపేట: తార్నాకలోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) 37వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సీసీఎంబీ ఫౌండర్ డైరెక్టర్ డా. పీఎం భార్గవ ఆడిటోరియాన్ని సోమవారం సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డా.ఎన్.కలైసెల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.కలైసెల్వి మాట్లాడుతూ హైదరబాద్ మహానగరాన్ని రానున్న రోజుల్లో సైన్స్ కారిడార్‌గా పరిగణించాలని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరం గొప్ప శాస్త్రీయ వారసత్వం కలిగిన నగరం అని, దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని అన్నారు. శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు నిలయమైన ఈ పరిశోధనా సంస్థలు సమాజ ఆస్తిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐబీసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డా. ప్రకాష్‌కుమార్, సీసీఎంబీ డైరెక్టర్ డా.వినయ్ నందికూరి, పలువురు సైంటిస్టులు పాల్గొన్నారు.

జనవరి 21, 22 తేదీల్లో అంతర్జాతీయ సమావేశం

'మనూ' పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ డాక్టర్ సయ్యద్ నజియుల్లా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల అంతర్జాతీయ సమావేశాలను జనవరి 21, 22 తేదీల్లో నిర్వహిస్తామని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజియుల్లా సోమవారం తెలిపారు. ఈ సమావేశాల్లో పాల్గొనేవారు తమ వ్యక్తిగత పేపర్ వివరాలను డిసెంబర్ 1వ తేదీన సమర్పించడానికి చివరి తేదీ అని పేర్కొన్నారు. కానీ, పూర్తి పేపర్‌ను డిసెంబర 20లోపు సమర్పించాలని, దీనికి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం సదస్సు కో కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్ రజా ఫోన్‌నెంబర్ 98737 70067లో సంప్రదించాలని ఆయన కోరారు.

3టీ ప్రోగ్రామ్ పోస్టర్ ఆవిష్కరణ



3టీ ప్రోగ్రామ్ పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు, సంస్థ ప్రతినిధులు

రాయదుర్గం: 3 టీ ప్రోగ్రామ్ ద్వారా స్కిల్ ఇన్సియేటివ్‌తో 2025లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 10 వేల యువమేధావులను శక్తివంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న పోస్టర్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సింహ, టీవర్క్స్, మ్యాథ్ ఏఐ అండ్ ఎంఎల్ హబ్ సీఈవో జోగిందర్ తనికెళ్ల చేతుల మీదుగా వేర్వేరుగా సంస్థ ప్రతినిధులు సోమవారం నగరంలో ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో 3 టీ ప్రోగ్రామ్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోల్ స్కిల్స్ సీఈవో సామ్యూరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రాడ్యుయేట్లు, అండర్ గ్రాడ్యుయేట్ల కోసం రూపొందించారన్నారు. హ్యాండ్ ఆన్‌లెర్నింగ్, లైవ్ ప్రాజెక్టులు, గేమిఫైడ్ ఎడ్యుకేషన్ ద్వారా డొమైన్ స్పెసిఫిక్ స్కిల్స్‌ను అభివృద్ధి చేయడమే కాకుండా సృజనాత్మకతను ప్రేరేపించడం జరుగుతుందన్నారు. ప్రోగ్రామ్ పూర్తి చేసిన తర్వాత పాల్గొన్న వారికి కెరీర్ మార్గదర్శకత్వం, అవకాశాలను పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులను కేవలం ఉద్యోగాలకే కాకుండా సమాజానికి విలువైన సంస్కరణలు రూపొందించేలా సిద్ధం చేస్తుందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు కుటుంబ సభ్యుల అదృశ్యం



పోచారం: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ముగ్గురు కుటుంబసభ్యులు అదృశ్యమైన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన ప్రకారం... మిర్యాలగూడలోని శాంతి నగర్‌కు చెందిన ఆశల మోహన్(30)కు చందన (21)తో 2023లో వివాహమైంది. చందన తండ్రి వెంకటరామారావు(47) అన్నోజిగూడలో ఉంటూ ఇన్ఫోసిస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. తల్లి సుధారాణి(45) గృహిణి. చందన ఆరోగ్యం బాగా లేకపోవడంతో గత నెల 14న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ నుంచి చందనతోపాటు ఆమె తల్లిదండ్రుల ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉన్నాయి. దీంతో ఈ నెల 15న వీరి ఇంటి వద్దకు మోహన్ వచ్చి చూడగా తాళం వేసి ఉంది. వీరి కోసం ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పోచారం పోలీస్‌స్టేషన్‌లో మోహన్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆవిష్కరణ శక్తికి 'ఈ-సమ్మిట్' దోహదం



ఈ సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న డీఎస్ చౌహాన్

దుండిగల్: వినియోగదారుల సంక్షేమం కోసం సాంకేతికతను ఉపయోగించడం అవసరమని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న 'ఈ సమ్మిట్'సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చౌహాన్ మాట్లాడుతూ ఈ సమ్మిట్, రోబొట్ 2.0 వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆవిష్కరణశక్తిని వెలికితీయడానికి దోహదం చేస్తాయని అన్నారు. ఈ-సమ్మిట్‌లో వర్క్‌షాపులు, స్టార్టప్ ఎక్స్‌పో, ఐడియాథాన్, మాక్ ఇంటర్వ్యూలు, ప్యానల్ చర్చలు, కెరీర్ గైడెన్స్, రోబొట్ 2.0లో లైన్ ఫాలోయింగ్ రోబో, రోబో సాకర్, జలవిహార్, రోబో రేస్, రోబో సుమో వంటి ఉత్కంఠభరిత పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీజాన్ కుమార్ మిత్రా, బ్రిమ్-ఎక్స్ వెంచర్స్ వ్యవస్థాపకుడు చైతన్య చిరుమామి, ఏఐఆర్‌ఏ చైర్మన్ కిషాన్ పీఎస్‌వీ, ఎంఎల్ఆర్ఐటీఎం డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మురళీ ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ జి.అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ నేతల డిమాండ్



ఇందిరాపార్కులో ధర్నా చేస్తున్న డీఎస్సీ ఉర్దూ అభ్యర్థులు

కవాడిగూడ: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీఎస్సీ ఉర్దూ అభ్యర్థులు ధర్నాకు దిగారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్, డీఎస్సీ ఉర్దూ అభ్యర్థుల ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఫైజల్ ఖాన్, క్యాంపు కార్యదర్శి తాజ్, సామాజిక కార్యకర్త ఖలీదాపర్వీన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,183 ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో కేవలం 570 పోస్టులను భర్తీ చేసి మిగతా 666 పోస్టులను డీఎస్సీ అభ్యర్థులు ఉన్నప్పటికీ భర్తీ చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఉర్దూ మీడియంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో నాయకులు తమ ప్రాంతాలకు వచ్చి ఉర్దూలో మాట్లాడటం, టోపీ పెట్టుకోవడం వంటివి చేస్తారే తప్పా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎస్సీ అభ్యర్థులు సభా అజీజ్, కైసర్ పాషా, మహ్మద్ ఖలీద్, కతీజా బేగంతోపాటు అధిక సంఖ్యలో డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 26, నవంబర్, 2024



నథింగ్.. ఎక్స్‌పీరియన్స్

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఫోన్ బ్రాండ్‌గా కౌంటర్ పాయింట్ రీసెర్చ్ పేర్కొన్న లండన్‌కు చెందిన టెక్ బ్రాండ్, నథింగ్ సర్వీస్ సెంటర్ నెట్ వర్క్‌ను కూడా వేగంగా విస్తరించనున్నట్లు నథింగ్ ఇండియా మార్కెటింగ్ హెడ్ ప్రణయ్‌రావు తెలిపారు. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన తమ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంతో పాటు చెన్నై తదితర నగరాల్లోనూ తమ సెంటర్స్ ప్రారంభం అవుతున్నాయని, వీటిలో తమ ఉత్పత్తులు–సేవలు, రిఫ్రెష్‌మెంట్స్, రెట్రో గేమింగ్ కన్సోల్స్ జోన్స్ వారీగా ఏర్పాటు చేసి అందిస్తున్నామన్నారు.



క్రేజీ.. డీజే..

ఉర్రూతలూగించే లేడీ మ్యూజికల్ బీట్స్

తెలుగు అమ్మాయిలు సైతం రంగంలోకి | నగరంలో కదం తొక్కిస్తున్న యువతులు

యువకుల ఆధిపత్యానికి బ్రేక్స్..

క్లబ్స్, పబ్స్, కేఫ్స్, ఈవెంట్స్‌లో డీజేలుగా సందడి

అర్ధరాత్రి సమయం..చిమ్మ చీకట్లని. పట్ట పగలుగా మార్చే రంగురంగుల విద్యుత్ కాంతుల్లో.. ఓ వైపు ఛీర్స్‌తో హుషారు.. మరో వైపు చిందుల జోరు.. ఆ సమయంలో తోడు లేకుండా అమ్మాయిలు బయటకు వెళ్లడమే సరికాదని నొక్కి వక్కాణించే సంప్రదాయ వాదుల చెవులకు చిల్లులు పడే సంగీతంతో కదం తొక్కుతున్నారు ఆధునిక యువతులు. డీజేలుగా.. మేల్ డామినేషన్‌కు గండికొడుతూ శరవేగంగా ముందుకు దూసుకొస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



'మనసుకు నచ్చిన సంగీతం.. వయసుకు తగ్గ వినోదం.. మంచి ఫ్రెండ్స్. ఇన్ని అందించే రంగాన్ని వదిలేసి సాదా సీదా ఉద్యోగం ఎందుకు చేయాలి?' అని ప్రశ్నిస్తున్నారు అఖిల. ఉద్యోగం అంటే మంచి ఆదాయం వస్తుంది కదా..అంటే..! 'నేను ఎంచుకున్న కెరీర్‌లో అంతకన్నా ఎక్కువ సంపాదనే ఇప్పుడు వస్తుంది' అంటూ స్పష్టం చేశారు. సాయంత్రం ఆరు దాకా అఖిల.. ఆరు దాటాక డీజే బ్లాక్.

'నేను ఇక్ఫాయ్‌లో బీబీఏ పూర్తి చేశాను. సొంతంగా బిజినెస్ చేయాలనేది నా ఆలోచన. అయితే చిన్నప్పటి నుంచీ డీజేయింగ్ అంటే ఇష్టం. ఫ్రెండ్స్‌తో క్లబ్స్‌కి వెళ్లినప్పుడు కేవలం డీజే మ్యూజిక్ కోసమే వెళ్లేదాన్ని' అంటూ గుర్తు చేసుకున్నారు అఖిల. మహబూబ్ నగర్‌కు చెందిన ఓ పూర్తి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన అఖిల.. 2018లో డీజే స్కూల్‌లో చేరాలని నిర్ణయించున్నారు. అప్పుడు ఇంట్లో వాళ్ల నుంచి చెప్పుకోదగ్గ ప్రతిఘటననే ఎదుర్కొన్నారు. 'ఫ్యామిలీ వద్దు అన్నప్పటికీ మనసు మాటే విన్నాను. ఒక ప్రోగ్రామ్‌కి కేవలం రూ.1000తో ప్రారంభించి.. ఇప్పుడు అంతకు పదింతలు తీసుకునే స్థాయికి చేరాను' అంటూ సగర్వంగా చెప్పారామె. అమ్మాయిల భద్రత విషయం గురించి మాట్లాడినప్పుడు.. 'మా చుట్టూ బౌన్సర్స్ ఉంటారు. ఇప్పటి దాకా చిన్న చేదు అనుభవం కూడా నాకు ఎదురు కాలేదు' అంటూ చెప్పారామె. భవిష్యత్తులోనూ డీజేగా కొనసాగుతానని, మరిన్ని టాప్ క్లబ్స్‌లో తన మ్యూజిక్‌ని వినిపిస్తానని బాలీవుడ్ ట్రాక్స్‌కి పేరొందిన ఈ డీజే బ్లాక్ చెబుతున్నారు.

ట్రెడిషనల్ ఫ్యామిలీలో.. ట్రెండీగా..



ఎవరూ డేర్ చేయని రోజుల్లోనే..

దాదాపు పదేళ్ల క్రితమే ఈ రంగంలోకి వచ్చారు లీనా. నగరంలోని సికింద్రాబాద్‌లో నివసించే ఈ సింధీ యువతి.. డిగ్రీ పూర్తి చేసి ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు కూడా చేశారు. అనంతరం కొన్ని షోస్ చేశారు.. చిన్న చిన్న ఉద్యోగాలు చేసి ఆ తర్వాత ఫుల్‌టైమ్ డీజేయింగ్‌ను ఎంచుకున్నారు. 'ఏవీ మనసుకు నచ్చలేదు. అదే నా కెరీర్‌ను ఇటు మార్చింది' అంటూ చెప్పారు డీజే లీనా. ఫ్రీలాన్స్ డీజేగా సిటీలోని సగం పైగా క్లబ్స్‌లో ఇప్పటికే తన మ్యూజిక్ వినిపించానంటున్న లీనా.. బాలీవుడ్ అంటే తనకు ప్రేమ అనీ, అందుకే ఆ సంగీతాన్ని ప్లే చేయడానికి తాను ఇష్టపడతానని అంటున్నారు. అమ్మాయిలు ఈ రంగంలోకి ఎక్కువగా రాకపోవడానికి కుటుంబ సభ్యుల నుంచి మద్దతు దొరకకపోవడమే కారణమంటున్నారు లీనా.. తాను కూడా అతి కష్టం మీద కుటుంబ సభ్యులను ఒప్పించగలిగానని చెబుతున్నారు.

'ఫ్లో లో.. 'జో'రుగా..

'మా నాన్న వాళ్లది వరంగల్. అయితే నేను నార్త్‌లోనే పెరిగాను. ప్రస్తుతం సిటీలో సెటిలయ్యా' అంటూ చెప్పారు ఫ్లోజో. డిగ్రీ పూర్తి చేశాక.. కొన్ని కార్పొరేట్ ఉద్యోగాలు చేశా. అయితే చిన్నప్పటి నుంచీ సంగీతం పై ఉన్న ఇష్టంతో డీజేస్కూల్‌లో చేరి కోర్సు పూర్తి చేసి డీజేగా మారాను అంటూ చెప్పారు ఫ్లోజో. ప్రస్తుతం నగరంలో టాప్ డీజేల్లో ఒకరుగా ఉన్న ఈ అమ్మాయి తొలుత లిక్విడ్స్‌లో రెసిడెంట్ డీజేగా ప్లే చేశానని, కొంత కాలం తర్వాత ఫ్రీలాన్స్ డీజేగా మారి, పలు అవార్డ్స్ కూడా అందుకున్నానని వివరించారు. థాయ్‌ల్యాండ్ వంటి అంతర్జాతీయ వేదికలపైనా, గోవా వంటి పార్టీ సిటీల్లోనూ ప్లే చేశానంటున్న ఫ్లోజోకి తన పేరు స్టైలిష్‌గా ఉండడంతో మార్చుకోవాల్సిన అవసరం రాలేదన్నారు. ఈ కెరీర్‌లో అటు ఆనందం, ఇటు ఆదాయం రెండూ బాగుంటాయంటున్న ఫ్లోజో.. ఆరేడేళ్లలోనే కారు, ఫ్లాట్ కొనగలిగానని సంతోషంగా చెప్పారు.








కే-పాప్ కాంటెస్ట్‌లో విజేతలు వీరే..

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలి కాలంలో కొరియన్ పాప్ సంగీతం(కే-పాప్)కు నగరంలోనూ క్రేజ్ పెరిగిన నేపథ్యంలో యువత ఆసక్తిని ప్రోత్సహించేందుకు కొరియన్ కల్చరల్ సెంటర్ ఇండియాతో కలిసి ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా నిర్వహించిన కే-పాప్ సంగీత పోటీల్లో కోల్‌కతాకు చెందిన అభిప్రియ చక్రవర్తి విజేతగా నిలిచింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. నగరం నుంచి పలువురు కే-పాప్ యూత్‌ను ఆకట్టుకున్న ఈ పోటీల్లో డ్యాన్సింగ్ విభాగంలో టైటిల్‌ను ది ట్రెండ్ ఫ్రమ్ ఇటానగర్ ఆల్బమ్ సొంతం చేసుకుందని, విజేతలకు కొరియా ట్రిప్‌ను బహుమతిగా అందించనున్నట్లు వివరించారు.



భగవద్గీతతో జీవన నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: గీతా సారాంశాన్ని అర్థం చేసుకోవడం, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనడం, మానవ సంబంధాలను మెరుగుపర్చుకోవడం, సమతుల్యమైన జీవితాన్ని గడపడం వంటి అవసరమైన అంశాలపై ఆధ్యాత్మిక బోధనలను ఆధ్యాత్మిక గురువు సుఖబోధానంద స్వామి వివరించనున్నారు. ఈ నెల 30, వచ్చే నెల 1వ తేదీల్లో భగవద్గీతతో జీవన నిర్వహణ అనే అంశంపై రెండు రోజుల పాటు విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఐఐటీ హైదరాబాద్‌లో.. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్

నగరానికి అత్యాధునిక మైక్రోస్కోపీ సిస్టమ్స్



సాక్షి, సిటీబ్యూరో: శిక్షణార్థుల పరిశోధనలకు ఊతమిచ్చే లక్ష్యంతో నికాన్ ఇండియాతో కలిసి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్ ఆవరణలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ని ఏర్పాటు చేసింది. దీనిని ప్రారంభించిన సందర్భంగా నికాన్ ఇండియా ఎండీ సజ్జన్ కుమార్ మాట్లాడుతూ అత్యాధునిక మైక్రోస్కోపీ సిస్టమ్స్‌ను నగరానికి తీసుకొచ్చినందుకు సంతోషిస్తున్నామని, ఈ కేంద్రం ద్వారా అటు పరిశోధకులకూ విద్యార్థులకూ ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ కెనాన్ ఇండియాతో తమ భాగస్వామ్యం హర్షణీయమని, పరిశోధనల్లో పరిధులను దాటి సాహసోపేత ప్రయత్నాల్లో ఈ 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' విద్యార్థులకు స్ఫూర్తిని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అలరించిన.. సంగీత్ సమారోహ్

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ ట్రెనింగ్)లో పండిత్ జస్‌రాజ్ 52వ పండిత్ మోతీరాం పండిత్ మనీరాం సంగీత్ సమారోహ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిషి, మహిమా ఉపాధ్యాయులు పాకవజ ద్యుయోట్‌ను, నటీ శోభన భరతనాట్య ప్రదర్శన, అభిషేక్ రఘురాం కర్ణాటక సంగీతంతో ఆకట్టుకున్నారు.





టూరు.. హుషారు..

మంచు చూస్తే ఎవరికైనా మనసు పులకరించి పోతుంది. ఏడాదిలో కొన్ని రోజులు మాత్రమే ఉండే ప్రకృతి అద్భుతాలను కనులారా వీక్షించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మంచుపొరలపై విహరించేందుకు ఇష్టపడుతున్నారు. ఆ అరుదైన దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించి తీపి జ్ఞాపకాలను పదిలం చేసుకోవాలని అనుకుంటున్నారు. ఏడాది పొడవునా ఎండ వేడి, ఉక్కపోతల నుంచి ఉపశమనం కోసం నగరవాసులు మంచు కొండల్లో పర్యటనలకు మొగ్గుచూపుతున్నారట. నగర పర్యాటకులు వచ్చే డిసెంబరులో గుజరాత్, రాజస్థాన్‌తో పాటు ఉత్తర భారతాన్ని చుట్టిరావడానికి టూర్ ప్లాన్ చేసుకుంటున్నారని ట్రావెల్ యాజమాన్యాలు అంచనా వేస్తున్నాయి. దీనికి అనుగుణంగా ప్రత్యేక ప్యాకేజీలతో ముందుకొస్తున్నాయి. **- సాక్షి, సిటీబ్యూరో**

మంచు కొండల్లో విహారానికి సై

స్నో అడ్వెంచర్ క్రీడల పట్ల ఆసక్తి

శీతాకాలంలో పర్యాటక ప్రాంతాలకు పయనం

స్నో అడ్వెంచర్లకు కులుమనాలి అనువైన ప్రదేశంగా పేరొందింది. డిసెంబరులో కులుమనాలి చూసేందుకు వేలాది మంది సందర్శకులు వెళుతున్నారట. ఈ ప్రాంతం ప్రపంచంలోనే మంచు క్రీడలకు ప్రత్యేకమైనదిగా ఖ్యాతి గడించింది. అదే సమయంలో ఎన్నో కొత్త జంటలకు మనాలి హనీమూన్ స్పాట్‌గానూ పిలచుకుంటారు. ఉత్తరాఖండ్‌లోని ఔలి ప్రాంతం నుంచి చూస్తే హిమాలయాలు స్పష్టంగా కనిపిస్తాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా పర్యాటకుల మనసు దోచుకుంటుంది. అక్కడి ఇళ్లపై మంచు దుప్పటిలా పరుచుకుంటుంది. లద్దాఖ్‌లో మంచు వర్షం పర్యాటకులను కనువిందు చేస్తుంది. జమ్మూకశ్మీర్‌లో కేబుల్ కార్ ప్రత్యేక ఆకర్షణ. శ్రీనగర్, డార్జిలింగ్, కొడైకెనాల్, ఊటీ తదితర ప్రదేశాలకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఈ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడిని తట్టుకునే బట్టలు వెంట తీసుకోవడంతో పాటు, వైద్యుల సూచనల మేరకు మందులు సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొంటున్నారు. అక్కడి రహదారులపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.



కొత్త అనుభూతినిచ్చింది..

కుటుంబ సభ్యులంతా కలసి మనాలి టూర్ వెళ్లాం. ఎనిమిది రోజుల లాంగ్ టూర్ అది. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకూ విమానంలో వెళ్లాం. అక్కడి నుంచి రాత్రంతా బస్సు ప్రయాణం. మనాలిలో ఒక రోజు బస చేశాం. కొత్త ప్రాంతం మంచు కొండలు, ప్రకృతి అందాలు, గ్రీనరీ మనసుకు హాయిగా అనిపించాయి. నదిలో రాఫ్టింగ్ చేశాం. హోటల్‌లో రాత్రి ఫైర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. అక్కడి వాతావరణం, వస్త్రధారణ కొత్త అనుభూతినిచ్చింది. **- విజయ్ కుమార్ జైన్, హైదరాబాద్**



ప్రయాణం ఇలా..

హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకూ విమానంలో ప్రయాణించి, అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రహదారి మార్గంలో చేరుకోవాలి. యువత కార్, మోటారు సైకిళ్లను అద్దెకు తీసుకుని మంచు కొండల్లో రయ్.. రయ్..మంటూ దూసుకుపోతున్నారు.

ఓ కరపత్రం 'ఏడు'పు కథ!

సెకీతో ఒప్పందాన్ని 7 గంటల్లోనే ఆమోదించారంటూ ఈనాడు వక్రీకరణ • వాస్తవాలను దాచిపెట్టి విషం చిమ్మడమే అసలు లక్ష్యం



7 గంటల్లోనే సెకీ దస్త్రాన్ని ఆమోదించారంటూ 'ఈనాడు' రాసిన అబద్ధపు కథనం



- సేద్యానికి పగలు 9 గంటల విద్యుత్ కోసం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌తో ఒప్పందం
- యూనిట్ రూ.2.49 చొప్పున ఏటా 7 వేల మెగావాట్లు కొనుగోలు
- మంత్రివర్గం నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పేర్ని నాని

వ్యవసాయానికి పగటి పూట తొమ్మిది గంటలు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏటా 7 వేల మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్ రూ.2.49కే కొనుగోలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందానికి ఆమోదం. 25 ఏళ్ల పాటు ఈ సంస్థ విద్యుత్‌ను సరఫరా చేయనుంది.

సెప్టెంబర్ 15న సెకీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే అనేక చర్చలు, అధ్యయనాలు అనంతరం అక్టోబర్ 28న మంత్రి మండలి ఆమోదించింది. అందుకు సాక్ష్యం ఇదిగో..

సాక్షి, అమరావతి: వక్రీకరణలే పరమావధిగా పచ్చి అబద్ధాలను కుమ్మరిస్తున్న ఈనాడు.. గత సర్కారు ఏడు గంటల్లోనే సెకీతో ఒప్పందాన్ని క్యాబినెట్ భేటీలో ఆమోదించుకుందంటూ మరోసారి బుకాయించింది. రాష్ట్ర రైతాంగానికి ఉచిత విద్యుత్తుకు ఢోకా లేకుండా ప్రయోజనం జరుగుతోంటే రూ.లక్ష కోట్లకుపైగా భారం అంటూ అసత్య ఆరోపణలు చేసింది. ఈ ఒప్పందానికి ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని తెలిసినా పదేపదే విషం చిమ్ముతూ అదే ఒరవడి కొనసాగిస్తోంది. నిజానికి రెండున్నర నెలల పాటు సుదీర్ఘ కసరత్తు.. లాభనష్టాల బేరీజు.. నిపుణుల కమిటీ పరిశీలన.. మంత్రివర్గంలో చర్చ.. చివరిగా విద్యుత్తు నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్.. ఇన్ని దశలు దాటి ప్రక్రియలన్నీ పక్కాగా పాటించాకే సెకీతో ఒప్పందం కార్యరూపం దాల్చింది. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఢోకా లేకుండా పాతికేళ్ల పాటు అత్యంత చౌకగా సౌర విద్యుత్‌ను అందిస్తామని, అంతరాష్ట్ర ప్రసార చార్జీల నుంచి సైతం మినహాయింపు కల్పిస్తామని 2021 సెప్టెంబర్ 15న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ స్వయంగా ప్రతిపాదిస్తూ లేఖ రాసింది. దీనిపై సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సెకీ కోరడంతో 2021 సెప్టెంబర్ 16న అప్పటికే ముందుగా నిర్ణయించిన తేదీ ప్రకారం కేబినెట్ సమావేశంలో దీన్ని టేబుల్ ఐటమ్‌గా ప్రవేశపెట్టారు. అంతేగానీ సెకీ లేఖపై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవటం కోసంగానీ.. ఆమోదించడం గానీ జరగలేదు. ముఖ్యమైన విషయాలు అత్యవసరంగా క్యాబినెట్ దృష్టికి వచ్చినప్పుడు టేబుల్ ఐటమ్ కింద ప్రవేశపెట్టడం పరిపాటి, ఆనవాయితీ. అందులో ఏం తప్పు ఉంది? ఈ క్రమంలో దీనిపై లోతైన అధ్యయనానికి కమిటీని నియమించి క్యాబినెట్‌కు నివేదిక ఇవ్వాలని గత ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ దశలన్నీ పూర్తయ్యాకే 2021 అక్టోబర్ 28న క్యాబినెట్ సమావేశంలో ఒప్పందానికి ఆమోదం లభించింది. ఏపీఈఆర్‌సీ నుంచి కూడా అనుమతి తీసుకోవాలని డిస్కమ్‌లను నిర్దేశించారు. అంతేగానీ ఈనాడు చెబుతున్నట్లుగా హడావుడిగా ఒప్పందాన్ని ఆమోదించాలనుకుంటే అంతకుముందు జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే ఆమోదించి ఉండాలి కదా? నెలల తరబడి ఎందుకు ఆగుతారు? ఇలా సుదీర్ఘంగా చర్చలు, పలు ప్రక్రియలు ముగిశాకే 2021 డిసెంబర్ 1న సెకీతో ఒప్పందం జరిగింది.

అర్థ రహిత ఆరోపణలు..

2021 సెప్టెంబర్ 15న సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ) యూనిట్ రూ.2.49కే సౌర విద్యుత్‌ను సరఫరా చేస్తామని చెప్పింది. నిజానికి ఈ ధర అప్పటి వరకు ఇతర మార్గాల్లో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు వస్తున్న విద్యుత్ ధరల కంటే చాలా తక్కువ. పైగా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహం కింద 'అంతర్ రాష్ట్ర ప్రసార ఛార్జీల (ఐఎస్‌టీఎస్) నుంచి మినహాయింపు'కూడా ఈ ఒప్పందానికి వర్తింపజేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సెకీ లేఖ రాసింది. అయితే సెకీ నుంచి విద్యుత్‌ను తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 7 గంటల వ్యవధిలోనే అంగీకరించిందని, రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలేమిటి? అంత విద్యుత్ వినియోగించగలమా? లాంటి అంశాలను పరిగణలోకి తీసుకునేందుకు తగినంత సమయం కేటాయించలేదని ఈనాడు మొదటి ఆరోపణ చేసింది. సెకీ ప్రతిపాదన వల్ల ప్రజలపై రూ.1,10,000 కోట్ల మేర ఆర్థిక భారం పడుతుందని ఆలోచించలేదనేది రెండో ఆరోపణ. కానీ ఈ రెండూ పచ్చి అబద్ధాలే. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు అల్లుకున్న కట్టుకథలు మినహా ఇందులో ఏ ఒక్కటీ వాస్తవం కాదు.

రెండున్నర నెలలు.. విశ్లేషించాకే అనుమతి..

సౌర విద్యుత్తుకు సంబంధించి పలు ప్రయోజనాలను కల్పిస్తూ 2021 సెప్టెంబర్ 15న సెకీ నుంచి ప్రతిపాదన వచ్చింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం (పవర్ సేల్ అగ్రిమెంట్) 2021 డిసెంబర్ 1న జరిగింది. అంటే ప్రతిపాదనకు - ఒప్పందానికి మధ్య రెండున్నర నెలల కంటే ఎక్కువ వ్యవధి ఉంది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎవరితోనూ ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోలేదు. ఈ రెండున్నర నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సెకీ మధ్య పలు పర్యాయాలు సంప్రదింపులు జరిగాయి. సెకీ ప్రతిపాదనలో లోటుపాట్లను, ఒప్పందం వల్ల కలిగే లాభనష్టాలను లోతుగా విశ్లేషించారు. అంతేకాకుండా ఈ ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆమోదాన్ని 2021 నవంబర్ 8న కోరారు. 2021 నవంబర్ 11న ఏపీఈఆర్‌సీ నుంచి దీనికి ఆమోదం లభించింది. సెకీ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన కసరత్తు, అందుకోసం తీసుకున్న సమయం రెండున్నర నెలలకంటే ఎక్కువ ఉన్నట్లు ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా ఈనాడు మాత్రం 7 గంటల్లోనే ఆమోదం తెలిపేశారంటూ పచ్చి అబద్ధాలను ప్రచురించింది.

క్షుణ్నంగా సుదీర్ఘ కసరత్తు..

సెకీ ఒప్పందాన్ని అమలు చేయాలనే నిర్ణయాన్ని మంత్రి మండలి సెప్టెంబర్ 16వ తేదీన తీసుకుందని ఈనాడు మరో ఆరోపణ చేసింది. వాస్తవం ఏమిటంటే మంత్రి మండలి సమావేశాన్ని అప్పటికప్పుడు నిర్ణయించలేదు. అంతకుముందు వారం రోజుల క్రితమే ఆ సమావేశం షెడ్యూల్ ఖరారైంది. అంటే.. కేబినెట్ సమావేశం తేదీపై నిర్ణయం తీసుకునే నాటికి సెకీ నుంచి ఎలాంటి ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వానికి రాలేదు. సమావేశానికి ఒక రోజు ముందు మాత్రమే సెకీ లేఖ అందింది. తమ లేఖపై వీలైనంత త్వరగా స్పందన తెలియజేయాలని ఆ లేఖలో సెకీ కోరింది. అయితే మొత్తం ప్రక్రియకు కనీసం 2 నుంచి 3 నెలల సమయం పడుతుందనే వాస్తవాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం.. సెకీ కోరినట్లుగా ప్రక్రియను ఆలస్యం చేయకూడదని భావించి తగిన మార్గదర్శకాల కోసం 2021 సెప్టెంబర్ 16న మంత్రి మండలి సమావేశంలో ఈ అంశాన్ని టేబుల్ ఐటమ్‌గా ఉంచింది. ఈ ప్రతిపాదనపై మరింత క్షుణ్నంగా అధ్యయనం చేయాలని రాష్ట్ర ఇంధన శాఖను నాటి సమావేశంలో మంత్రి మండలి ఆదేశించింది. సెకీ ప్రతిపాదనను పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ(ఏపీపీసీసీ) చైర్మన్ నేతృత్వంలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కమిటీ సభ్యులు పలుదఫాలు సెకీ అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం 2021 అక్టోబర్ 25న సెకీ ప్రతిపాదనకు అనుకూలంగా కమిటీ తన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించింది. దీంతో అక్టోబర్ 28న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆ సిఫార్సులను మంత్రి మండలి ముందు ఉంచారు. ఏపీఈఆర్‌సీ అనుమతికి లోబడి సెకీతో పీఎస్‌ఏ అమలును ఆమోదించాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. దీంతో 2021 నవంబర్ 8న ఏపీఈఆర్‌సీ ఆమోదం కోసం డిస్కంలు దరఖాస్తు చేశాయి. 2021 నవంబర్ 11న ఏపీఈఆర్‌సీ ఆమోదం పొందిన తర్వాతే 2021 డిసెంబర్ 1న ఒప్పందం జరిగింది. కాబట్టి టీడీపీ, ఈనాడు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకంగా చేస్తున్నవని స్పష్టం అవుతోంది.

ఎన్నిసార్లు చెప్పినా.. పాడిందే పాట!

ఇక ఈనాడు చేసిన రెండో ఆరోపణపై వాస్తవానికి స్పందించడం కూడా అనవసరం. ఎందుకంటే సెకీతో ఒప్పందం వల్ల ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని డిస్కంలు అనేకసార్లు ఆధారాలతో సహా చెప్పినప్పటికీ ఈనాడు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ ఆ భారాన్ని రాష్ట్రం భరించాల్సి వస్తుందంటూ మళ్లీ అదే అబద్ధాన్ని వల్లె వేసింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక ఇన్సెంటివ్ కింద ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపును కేంద్ర ప్రభుత్వం అందించిందని సెకీ తన ప్రతిపాదనలో స్పష్టంగా పేర్కొంది. ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని, దీని నుంచి మినహాయింపు లభిస్తుందని తెలిపే లేఖను స్పష్టత కోసం అనేకసార్లు ప్రజలకు అందుబాటులో ఉంచినా టీడీపీ కరపత్రంలా ఈనాడు అబద్ధాలను ప్రచారం చేస్తూనే ఉంది.

'సెకీ'ఒప్పందంతో లాభాలివీ..

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) యూనిట్ రూ.2.49కే సోలార్ విద్యుత్తు అందచేస్తామంటూ తనకు తానుగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది.
- ఈ ప్రతిపాదనకు ఏపీ అంగీకరించడం వల్ల 25 ఏళ్ల పాటు ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు లభిస్తుందని 2021 సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో సెకీ స్పష్టం చేసింది.
- ఈ చారిత్రక ఒప్పందం వల్ల రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.3,750 కోట్లు చొప్పున 25 ఏళ్ల పాటు దాదాపు రూ.లక్ష కోట్ల మేర విద్యుత్తు భారం నుంచి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.
- ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు అనేది మరే ఇతర ప్రాజెక్ట్‌కి దక్కని చాలా కీలకమైన ప్రయోజనం. ఇతర రాష్ట్రంలో ఉన్న సోలార్ పవర్ ఉత్పాదక కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా కోసం మరే ఇతర సంస్థతో ఒప్పందం చేసుకుంటే మన రాష్ట్రం ఐఎస్‌టీఎస్ ఛార్జీలను చెల్లించాల్సి వచ్చేది. అప్పుడు అది చాలా భారంగా మారుతుంది. ప్రతి నెలా మెగా వాట్‌కు సుమారు రూ.4 లక్షలు దానికే ఖర్చవుతుంది.
- రాష్ట్ర డిస్కంలు మునుపెన్నడూ ఇంత తక్కువ ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.
- ఇది కేంద్ర సంస్థ సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయానికి తావే లేదు. అలాంటప్పుడు ఇక లంచాలకు ఆస్కారం ఎక్కడుంటుంది?
- టీడీపీ హయాంలో కుదుర్చుకున్న అధిక ధరల పీపీఏలతో పోలిస్తే సెకీతో సగం కంటే తక్కువ ధరకే ఒప్పందం కుదిరింది.



అభివాదం చేస్తున్న కోదండరాం, ఆర్. కృష్ణయ్య, శ్రీనివాస్ గౌడ్, వీహెచ్, వకుళాభరణంతదితరులు

జనగణనలో కులగణన చేపట్టాలి

బీసీల సమర భేరి సభలో ఆర్.కృష్ణయ్య

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం నిర్వహించబోయే జనగణనలో కులగణన నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ.ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల సమరభేరి మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని, ఉద్యోగ పదోన్నతులలో బీసీలకు క్రీమీలేయర్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ, సమగ్ర కులగణన సర్వేలో ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీ వి.హన్మంతరావు మాట్లాడుతూ, బీసీలకు రావాల్సిన హక్కులకై కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు కౌసర్ మొహియుద్దీన్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా 'శక్తి'కి టెండర్లు!

సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు వెండర్ల నమోదు

సాక్షి, హైదరాబాద్: ఇందిరా మహిళా శక్తి పథకం కింద రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో సౌర విద్యుత్ కేంద్రాల స్థాపనకు అవసరమైన పరికరాలను సరఫరా చేసే వెండర్లను ఎంపిక (ఎంప్యానెల్‌మెంట్) చేసేందుకు ఈపీసీ విధానంలో టెండర్లను ఆహ్వానించినట్లు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాజెక్టుల డిజైన్, పరికరాల సరఫరా, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, కమిషనింగ్, రిమోట్ మానిటరింగ్ సేవలను వెండర్లు అందించాల్సి ఉండనుంది. ప్రాజెక్టులకు 5 ఏళ్ల గ్యారంటీ అందించడంతో పాటు ఏడాది పాటు వెండర్లు స్వయంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఆసక్తిగల బిడ్డరుడిసెంబర్ 10లోగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్లు వేయాలని రెడ్కో సూచించింది. ఒక్కో మహిళా గ్రూపుతో మెగావాట్ సామర్థ్యం కలిగిన సౌరవిద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



తిరుమల వేంకటేశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, హీరో గల్లా అశోక్, సినీ నిర్మాత బన్నీ వాసు, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత నవీన్ యెర్నేని, భారతీయ క్రీడా షూటర్ గోల్డ్ మెడల్ లిస్ట్ ఎలవెనిల్ వలరివన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

\- తిరుమల

నేడు జీపీలలో ప్రజాపాలన విజయోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలతోపాటు రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తిచేసుకుంటున్న సందర్భంగా అన్ని జీపీలలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద కనీసం ఏదో ఒక పని చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులను మంత్రి సీతక్క మొదలు ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు. ఉపాధి హామీలో అత్యధిక రోజులు (పర్సన్‌డేస్) పనిచేసిన వారిని, శుభ్రత, పారిశుధ్యం పెంపొందించేందుకు కృషి చేసిన వారిని, మొక్కలను నాటడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు పాటుపడిన వారిని గుర్తించి సన్మానించాలని అన్ని జిల్లా కలెక్టర్లు, ఉపాధి హామీ డీపీసీలు, ఐటీడీఏ పీవోలకు పీఆర్ ఆర్‌డీ డైరెక్టర్ డా.జి.సృజన సూచించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26న గ్రామపంచాయతీల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం ఆయా పంచాయతీల్లో రాజ్యాంగ పీఠికను చదవేలా ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్లుకు ఓ సర్క్యులర్ వెళ్లింది.

ఆందోళనలతో అట్టుడికిన ఏపీ

- ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు
- ఎన్నికల హామీల అమలు, సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కిన వివిధ విభాగాల ఉద్యోగులు



రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న 108 సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రం సోమవారం 108 ఉద్యోగులు, వలంటీర్లు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆందోళనలు, ధర్నాలతో సోమవారం అట్టుడికింది. తమ న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 108 ఉద్యోగులు, వలంటీర్లు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు, ఆయాలు, గిరిజన ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, వెలుగు యానిమేటర్లు రోడ్డెక్కారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనంటూ పోరుబాట పట్టారు. ఆయా జిల్లాల కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వానికి హెచ్చరికలు పంపారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

108 ఉద్యోగుల భారీ ధర్నా

తమకు సకాలంలో జీతాలు చెల్లించడంతోపాటు 104, 108 వ్యవస్థలను ప్రభుత్వమే నిర్వహించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ ధర్నా చౌక్‌లో 108 అంబులెన్స్ ఉద్యోగులు సోమవారం మహాధర్నా చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచే తమ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడంలేదని మండిపడ్డారు. సమ్మెకు వెళ్లడం తమ ధ్యేయంకాదని.. అయితే, ప్రభుత్వమే తమను సమ్మెకు వెళ్లేలా చేస్తోందన్నారు. ఏపీ 108 సేవల కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ గౌరవాధ్యక్షులు ఏపీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 25 నుంచి సమ్మె చేపడతామని నోటీసిచ్చినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలోనూ 108 ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమ్మె సైరన్ మోగించి, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ల వద్ద వలంటీర్ల నిరసన

ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వలంటీర్లు సోమవారం గుంటూరు, నెల్లూరు, కర్నూలు, అన్నమయ్య జిల్లా రాయచోటి, పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్లు, రాజంపేట సబ్ కలెక్టరేట్ వద్ద, విజయవాడ ధర్నా చౌక్‌లో భారీ ధర్నాలు, ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఇందులో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంకా గోవింద రాజులు తలకిందులుగా నిలబడి వినూత్నంగా నిరసన తెలియజేశారు. గుంటూరు, నెల్లూరు, కర్నూలు కలెక్టరేట్ల వద్ద వలంటీర్ల సంఘం నేతలు మాట్లాడుతూ తమను ఉద్యోగాల్లోకి తీసుకొని, జీతం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ముందు తమకు రూ.10 వేలు కనీస వేతనం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు కనీసం జీతభత్యాలు కూడా ఇవ్వడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వమిచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోతే 2.60 లక్షల కుటుంబాలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని, శాసనసభ ముట్టడికి కూడా వెనుకాడబోమని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

ఔట్‌సోర్సింగ్ అధ్యాపకుల ధర్నా..

రాష్ట్రంలోని గిరిజన కులాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమను మెగా డీఎస్సీ నుంచి మినహాయించాలని, ఔట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ కలెక్టరేట్ వద్ద ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ధర్నా చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సీఆర్‌టీలుగా మార్పు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మెగా డీఎస్సీలో తమ పోస్టులను చూపొద్దని డిమాండ్ చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ముగిసిన కోటి దీపోత్సవం

- చివరిరోజు లక్ష్మీనర్సింహస్వామి, రామలింగేశ్వరస్వామి కల్యాణం
- హాజరైన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు



కోటి దీపోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నరేంద్ర చౌదరి

కవాడిగూడ (హైదరాబాద్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కోటి దీపోత్సవ వేదికపై యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి, కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణం అత్యంత ఘనంగా కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి దీపోత్సవం ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం, కోటి దీపోత్సవం చివరిరోజు కావడంతో నగరం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడు ధర్మపురి అధీనం పీఠాధిపతి మాసిల్లమణి దేశీగా జ్ఞానసంబంధ మహాస్వామి అనుగ్రహ భాషణం వినిపించగా, శ్రీ దివి నరసింహ దీక్షితులు ప్రవచనామృతం వినిపించారు.

అస్కీ మాజీ పీడీపై క్రిమినల్ కేసు

- మరో ఐదుగురితో కలసి అస్కీలో నిధుల గోల్‌మాల్
- నకిలీ ఇన్వాయిస్‌లతో రూ.88.91 లక్షలు స్వాహా
- సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన అస్కీ పరిపాలన విభాగం
- మొత్తం ఆరుగురిని నిందితులుగా చేర్చిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: నకిలీ ఇన్వాయిస్‌లతో కుట్రపూరితంగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు (అస్కీ) చెందిన రూ.88.91 లక్షలు స్వాహా చేశారన్న ఆరోపణలపై నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు అస్కీ మాజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లక్ష్మితో పాటు హైదరాబాద్, హరియాణాలకు చెందిన మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. శనివారం నమోదైన ఈ కేసు దర్యాప్తును అధికారులు ముమ్మరం చేశారు. అస్కీ అధీనంలో సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ పేరుతో ఓ కేంద్రం పని చేస్తోంది. వివిధ రకాల నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం దీని బాధ్యత. అస్కీలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ బి.లక్ష్మి ఎక్స్‌టెన్షన్‌పై ఈ ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా పని చేశారు. ఈ ఏడాది ఆగస్టు 16 వరకు పని చేసిన ఆమె హయాంలో అనేక శిక్షణ కార్యక్రమాలు, ప్రాజెక్టులు జరిగాయి. ఆయా సందర్భాల్లో అవసరాన్ని బట్టి వివిధ ఏజెన్సీలు, కన్సల్టెంట్లతో పాటు పలువురు విక్రేతల సేవలను లక్ష్మి వినియోగించుకున్నారు. ఆయా ఏజెన్సీలు, విక్రేతలు ఇచ్చిన ఇన్వాయిస్‌ల ఆధారంగా లక్ష్మి.. అస్కీ నిధుల నుంచి చెల్లింపులు చేశారు. ఈ విక్రేతలు, కన్సల్టెంట్ల జాబితాలో హరియాణాలోని గుర్గావ్‌కు చెందిన షేక్ అభిషేక్ ఇమ్లాక్, నగరానికి చెందిన బల్లపు శ్రుతి, నలమస రజని, ఎం.బుర్రయ్య, ధనలక్ష్మి ఉన్నారు. వీరు ఇచ్చిన ఇన్వాయిస్‌ల ఆధారంగా లక్ష్మి 2021 మార్చి నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.88 లక్షల చెల్లింపులు చేశారు. కాగా, ఈ చెల్లింపులతో పాటు ఇతర కార్యకలాపాల నేపథ్యంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లక్ష్మిని ఈ ఏడాది ఆగస్టు 16న అస్కీ విధుల నుంచి తొలగించింది. ఆపై అంతర్గత విచారణ నిర్వహించారు. ఈ నేపథ్యంలో షేక్ అభిషేక్ ఇమ్లాక్‌కు రూ.19.25 లక్షలు, బల్లపు శ్రుతికి రూ.10 లక్షలు, నలమస రజనికి రూ.16.66 లక్షలు, ఎం.బుర్రయ్యకు రూ.24.55 లక్షలు, ధనలక్ష్మికి రూ.18.45 లక్షల చెల్లింపులు జరిగినట్లు విచారణలో గుర్తించారు. ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేసిన డాక్టర్ బి.లక్ష్మి వీరితో కుమ్మక్కై రూ.88.91 లక్షలు గోల్‌మాల్‌కు పాల్పడినట్లు తేల్చారు. ఈ మేరకు అస్కీ పరిపాలన విభాగం అధికారి బి.జగదీశ్‌కుమార్ శనివారం సీసీఎస్ డీసీపీ ఎస్.శ్వేతకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు డాక్టర్ లక్ష్మితో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అస్కీ నుంచి రికార్డులు తీసుకున్న తర్వాత తదుపరి చర్యలు చేపడతామని పోలీసు అధికారులు చెప్పుతున్నారు.

బార్న్ టు విన్



ఆనందం ఎక్కడ ఉంటుందో ఆత్మస్థైర్యం అక్కడ ఉంటుంది. ఆత్మస్థైర్యం కొలువైన చోట అనేక ద్వారాలు తెరుచుకుంటాయి. విజయానికి సింహద్వారాన్ని చూపిస్తాయి. శారీరక మార్పుల వల్ల లింగమార్పిడికి ముందు, లింగ మార్పిడి తరువాత ఎన్నో అవహేళనలు ఎదుర్కొంది **శ్వేతాసుధాకర్.** అవమానాలు, కష్టాలలో ఆమె జపించిన మంత్రం... 'జీవితం ఒక్కటే. బార్న్ 2 విన్. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక కార్యకర్త, రచయిత, మోటివేషనల్ స్పీకర్‌గా ఎంతోమంది ట్రాన్స్‌జెండర్‌ల జీవితాలలో వెలుగులు నింపుతోంది చెన్నైకి చెందిన శ్వేతా సుధాకర్.

గెలిచేసినచోట గెలిచేద్దాం..!

వెయ్యి ఏనుగుల బలంతో రోజు మొదలు కావాలి అంటారు. ఆ మాట విషయం ఎలా ఉన్నా శ్వేతకు రోజు మొదలైందంటే దిగులుగా ఉండేది. 'ఈరోజు ఎన్ని అవమానాలు పడాలో!' అనుకునేది. చెన్నైలో పుట్టిన శ్వేత సుధాకర్‌లోని శారీరక మార్పులు చూసి 'నీ బాడీ లాంగ్వేజ్ ఇలా ఉందేమిటి... అలా మాట్లాడుతున్నావేమిటి'... ఇలా రకరకాలుగా వెక్కిరించేవారు. శారీరకంగా వచ్చిన మార్పులతో కుటుంబాన్ని వదిలి లింగమార్పిడితో ఎన్నో కష్టాలు ఎదుర్కొంది శ్వేత. 'చదువును నమ్ముకున్న వారు ఎప్పుడూ జీవితంలో ఓడిపోరు' తాను విన్న మాట ఆ రోజు పదే పదే గుర్తు వచ్చింది. ఇక అప్పటినుంచి చదువు తన నేస్తం అయింది. ఆత్మీయత పంచే కుటుంబం అయింది. ధైర్యం ఇచ్చే గురువు అయింది.

మద్రాస్ యూనివర్సిటీలో ఎం.ఏ. సోషియాలజీ చేసిన శ్వేతాసుధాకర్ ఏదో ఒక ఉద్యోగం చూసుకోవాలనుకోలేదు. ఒక ఉద్యమంలా తన లాంటి వారి కోసం విస్తరించాలనుకుంది. 'బార్న్ 2 విన్' అనే స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం చుట్టింది. అయితే చెన్నైలో సంస్థ కార్యాలయం కోసం గదిని అద్దెకు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఈ పరిస్థితుల్లో ఒక మానవతావాది సహాయంతో చెన్నైలోని సైదాపేటలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయగలిగింది శ్వేత.

గురుకులం...

ఇప్పుడు ఈ కార్యాలయం వందలాది మంది ట్రాన్స్‌జెండర్‌లకు రణక్షేత్రం.

'ఇదిగో... జీవితంలో ఎదురయ్యే సమస్యలతో ఇలా యుద్ధం చేయాలి' అని నేర్పుతుంది.

'చింతవద్దు. నువ్వు బతికేమార్గాలు ఎన్నో ఉన్నాయి' అంటూ ఉపాధి విద్యలను నేర్పే గురుకులం అవుతోంది.

లింగమార్పిడి చేసుకున్న వారి హక్కుల కోసం తన గళాన్ని వినిపించడంతో పాటు విద్య, ఉపాధి, లైఫ్‌స్కిల్స్... మొదలైన వాటిలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, టైలరింగ్, కాస్మోటాలజీ, ఫ్యాషన్ డిజైన్‌కోర్సులతో ఎవరికి వారు తమ సొంత కాళ్లపై నిలబడే విధంగా తీర్చిదిద్దుతుంది శ్వేతా సుధాకర్.

ట్రాన్స్ అచీవర్స్ అవార్డ్

తమిళనాడుకే పరిమితం కాకుండా దేశంలోని ఎన్నో రాష్ట్రాలకు విస్తరించింది బార్న్ 2 విన్. శ్రీలంక నుంచి మొదలు యూరప్‌లోని ఎన్నో దేశాల వరకు వివిధ రంగాలలో రాణిస్తున్న ట్రాన్స్‌జెండర్‌లను గత పదకొండు సంవత్సరాలుగా 'ట్రాన్స్ అచీవర్స్' అవార్డులతో సత్కరిస్తోంది శ్వేత. తమిళంతో పాటు తెలుగు, కన్నడం, మలయాళం లాంటి భాషలను అనర్గళంగా మాట్లాడుతూ 'శ్వేత టాక్ షో' పేరుతో ట్రాన్స్ మీడియా యూ ట్యూబ్‌ను నిర్వహిస్తోంది. 'మిస్ తమిళనాడు ట్రాన్స్ క్వీన్' ప్రోగ్రామ్‌ను గత ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. 'బార్న్ 2 విన్ అనేది సంస్థ కాదు. మా కుటుంబం. అది నాకు ఇచ్చిన ధైర్యం ఇంతా అంతా కాదు' అంటుంది సుప్రియ. నిజానికి ఇది ఆమె మాటే కాదు 'బార్న్ 2 విన్' ద్వారా గెలుపు పాఠాలు నేర్చుకున్న ఎందరో విజేతల మాట.

– అస్మతీన్ మైదీన్, సాక్షి, చెన్నై



మన కోసం మనం

కుటుంబాన్ని వదిలి నేను ఎన్నో బాధలు పడ్డాను. ఆ ఒంటరి రోజులలో పుస్తకాలు నా కుటుంబసభ్యులు అయ్యాయి. నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. ఇప్పుడు అదే చదువు ద్వారా ఎంతోమందికి ధైర్యం వచ్చేలా చేస్తున్నాను. 'నా కోసం ఏదీ లేదు. నా కోసం ఎవరూ లేరు' అని ఎప్పుడూ అనుకోవద్దు. ఈ విశాల ప్రపంచంలో మన కోసం ఎన్నో ఉన్నాయి. అయితే వాటిని వెదుక్కోగలగాలి. వాటిని వెదకాలంటే బలం కావాలి. ఆ బలం జీవనోత్సాహం నుంచి వస్తుంది. అందుకే నిరాశానిస్పృహలకు దూరంగా ఉంటూ ఎప్పుడూ సంతోషంగా ఉండేలా ప్రయత్నిస్తుంటాను. ఇప్పుడు 'బార్న్ 2 విన్' రూపంలో నాకంటూ ఒక కుటుంబం ఉంది. సామాజిక, రాజకీయ రంగాలలో గుర్తింపు దొరికింది.

– శ్వేతా సుధాకర్,
బార్న్ 2 విన్–ఫౌండర్

అక్షర బలం

శ్వేతా సుధాకర్ మంచి వక్త మాత్రమే కాదు రచయిత్రి కూడా. నిండైన భావుకత, చక్కని శైలి ఆమె అక్షరబలం. 'నన్‌గై స్వేతాసీ' పేరుతో హిజ్రాల జీవితాలపై 'ఇయర్కై ఎలి దియ ఎలుత్తు పిలయ్(ప్రకృతి రాసిన అక్షర దోషం)', కూందలుం... మీసయుం(శిరోజాలు..మీసాలు), వానం పాత్త తారగయే (ఆకాశం చూసిన తార), తర్కొలై దాహంగల్ (ఆత్మహత్యా దాహం), కల్యాణ కనువుగల్ (పెళ్లి కలలు)... మొదలైన పుస్తకాలను తన 'నన్‌గై పబ్లికేషన్స్' ద్వారా ప్రచురించింది.


సోనమ్ కపూర్

ఇలా ఉందేంటీ..? ఈ అమ్మాయి!

ట్రోల్ చేసి మనల్ని వెనక్కు లాగేవాళ్లు ఉన్నట్లే, మోటివేట్ చేసి ముందుకు నడిపించే వాళ్ళూ ఉంటారు. సోనమ్ కపూర్‌ను అలా ముందుకు నడిపించిన వ్యక్తి కాజోల్. అయితే కాజోల్ కు సోనమ్ ఆ సంగతి నేరుగా ఎప్పుడూ చెప్పలేదు. మనసులోనే ఉన్న కాజోల్ నుంచి ప్రేరణను పొందారు సోనమ్.

సినిమాల్లో కాజోల్ పీక్ దశను కూడా దాటేసి ఉన్నప్పుడు సోనమ్ వయసు 16. పదహారు అంటే పుస్తకాల్లో రాసినట్లు స్వీట్ సిక్స్ టీనే కానీ, అందరి విషయంలోనూ స్వీట్ కాకపోవచ్చు. ఆ వయసులో సోనమ్ అందమైన, లేత ముఖం మీద వెంట్రుకలు కనిపించేవి. పెద్ద పెద్ద మొటిమలు ఉండేవి. బరువు కూడా పెరిగింది. తనకు పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) ఉందనీ, ముఖం పై వెంట్రుకలు రావటం, బరువు పెరగటం, మొటిమలు.. ఇవన్నీ పీసీఓఎస్ వల్లనేనని ఫ్యామిలీ డాక్టర్ తొలిసారి చెప్పినప్పుడు సోనమ్ కుంగిపోయింది. తల్లిని చుట్టేసుకుని బావురుమంది.



అయితే సోనమ్‌కు అంతకన్నా పెద్ద కష్టం వచ్చి పడింది! అందరూ ఆమెను చూసి, 'అనిల్ కపూర్ కూతురు కదా..' అనేవాళ్లట.. 'ఇలా ఉందేమిటి!!' అనే అర్థంలో! (యువతుల డ్రీమ్ బాయ్ అని అనిల్ కపూర్‌కు పేరు). 'పాపం నాన్న పేరు పోతోందే నా కారణంగా..' అని సోనమ్ బాధపడుతుండేది. 'నేనే ఇలా ఎందుకు ఉన్నానమ్మా..' అని తల్లిని పట్టుకుని కంటతడి పెట్టుకునేది.

ఓరోజు తల్లి ఆమెకు కాజోల్ ఫొటో చూపించి, 'తను స్టార్ హీరోయిన్ కదా. అయితే ఆ కనుబొమలు చూడు. రెండూ కలిసిపోయి ఉన్నాయి. కొందరికి ఇలానే 'యూనిబ్రో' ఉంటుంది. అయినా సరే ఆమె ఎప్పుడూ తన కనుబొమలు షేప్ చేయించుకోలేదు. అలాగే ఉంచేసుకున్నారు. అందమంటే అది బంగారం, ఆమెలోని ఆ సెల్ఫ్ కాన్ఫిడెన్స్..' అని చెప్పారు.

తల్లి మాటలు సోనమ్‌లో బాగా నాటుకుపోయాయి. ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది. కాజోల్‌కు మనసులోనే థాంక్స్ చెప్పుకుంది. తనను ట్రోల్ చేసే వాళ్లను పట్టించుకోవటం మానేసింది.

సోనమ్‌కు పదహారు దాటి 17 లోకి రాగానే దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ దగ్గర అవకాశం వచ్చింది. ఆయన 'బ్లాక్' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు సోనమ్. తర్వాత 2007 లో నటిగా తన తొలి చిత్రం 'సావరియా' తో బాలీవుడ్ లోకి ప్రవేశించారు. ఆ తర్వాత తన తండ్రితో కలిసి ఒక చిత్రంలో కూడా కనిపించారు. తన పీసీఓఎస్ ఎప్పుడు మాయమైపోయిందో కూడా సోనమ్‌కి గుర్తులేదు. ట్రోల్స్ కూడా అంతే. వస్తాయి. పోతాయి.

'అంత పెద్ద స్టార్ అయిండీ కాజోల్ తన యూనిబ్రోని ఒక సమస్యగా తీసుకోకపోవటం అన్నది నాలో అంతర్లీనంగా పని చేసి, స్ఫూర్తిని నింపింది..' అని తాజాగా బర్ఖాదత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు సోనమ్ కపూర్.

బ్యూటిప్

'24 క్యారెట్ల' ముఖసౌందర్యం



క్యారెట్ ఆరోగ్యానికి ఎంతో మంచిదని తెలుసు. అయితే ఇది అందానికీ ఎంతగా మెరుగులు దిద్దుతుందో తెలుసా? '24 క్యారెట్ల' బంగారం లాంటి ముఖ సౌందర్యానికి ఏం చేయాలంటే...

- రెండు క్యారెట్లను మెత్తని పేస్టులా చేసుకుని, అందులో ఐదారు చెంచాల పాలు కలిపి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తర్వాత ప్యాక్‌ను తీసేసి ముఖానికి ఆవిరి పట్టాలి. కొన్నాళ్లిలా చేస్తే బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ పోతాయి.
- క్యారెట్ గుజ్జులో కాసింత ముల్తానీ మట్టి, తేనె కలిపి ప్యాక్ వేసుకుంటే... ముఖం కాంతిమంతమవుతుంది.
- క్యారెట్, కీరా, బంగాళ దుంపల్ని మెత్తని పేస్ట్‌లా చేయాలి. ఇందులో కాసింత టొమాటో రసం, చిటికెడు గంధం కలిపి ముఖానికి పూసుకోవాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడిగేసుకుంటే ముఖం మిలమిలా మెరుస్తుంది.

సాగుబడి
అనూరాధ కార్తె:
డిసెంబర్ 2 వరకు

పత్తిలో పప్పులు, కూరగాయలు!



- పత్తి, కందిలో స్వల్పకాలిక అంతర పంటలను సాగు చేస్తున్న వికారాబాద్ రైతులు
- వీరికి చేదోడుగా ఉంటున్న వాసన్ స్వచ్ఛంద సంస్థ, సహకార సంఘాలు

వర్షాధారంగా వ్యవసాయం చేసే చిన్న, సన్నకారు రైతులు బహుళ పంటల సాగుకు స్వస్తి చెప్పి పత్తి, కంది వంటి ఏక పంటల సాగు దిశగా మళ్లటం అనేక సమస్యలకు దారితీస్తోంది. వికారాబాద్ జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు ఈ సమస్యలకు పరిష్కారం వెతికే ప్రయత్నం చేస్తున్నాయి. పత్తిలో పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు,ఆకుకూరలను అంతర పంటలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయటం రైతులకు నేర్పిస్తున్నారు. ప్రధాన పంటపై ఆదాయం పొందుతూనే అంతర పంటలతో కుటుంబ పౌష్టికాహార అవసరాలు తీర్చుకునే దిశగా రైతు కుటుంబాలు ముందడుగు వేస్తున్నాయి.

వికారాబాద్ జిల్లాలోని సాగు భూమిలో 69.5% భూమిలో రైతులు వర్షాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. నల్ల రేగడి భూములతో పోల్చుకుంటే ఎర్ర /ఇసుక నేలలు ఈ జిల్లాలో అధికంగా ఉన్నాయి. ఈ నేలల్లో సారం తక్కువ. తేమ నిలుపుకునే శక్తి కూడా తక్కువ. తద్వారా పంట దిగుబడులు తక్కువగా ఉంటున్నాయి. ఇక్కడ ప్రధానమైన పంట కంది. జిఐ గుర్తింపు కలిగిన ప్రఖ్యాతమైన తాండూర్ కంది పప్పు గురించి తెలిసిందే. పదేళ్ల క్రితం వరకు వికారాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో కంది, పెసర, నువ్వు, పచ్చ జొన్న, బొబ్బెర, కొర్ర, అనుములు, మినుములు, పత్తి, మొక్క జొన్న వంటి పంటలు పండించేవారు. అయితే, ప్రస్తుతం వర్షాధార భూముల్లో 60% వరకు పత్తి పంట విస్తరించింది. రబీలో ప్రధానంగా బోర్ల కింద వేరుశనగ, వరి పంటలు సాగులో ఉన్నాయి.

ఒక పొలంలో అనేక పంటలు కలిపి సాగు చేసే పద్ధతి నుంచి ఏక పంట సాగు (మోనోకల్చర్)కు రైతులు మారటం వల్ల చీడపీడలు పెరుగుతున్నాయి. రైతు కుటుంబాలు రోజువారీ వాడుకునే పప్పులు, కూరగాయలను కొనుక్కొని తినాల్సిన పరిస్థితి నెలకొంది. వాసన్ స్వచ్ఛంద సంస్థ ఈ సమస్యలకు పరిష్కారాలు వెదికే దిశగా కృషి చేస్తోంది. దౌలతాబాద్, దోమ, బోమరసపేట మండలాల్లో అరక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ, ఇతర సహకార సంఘాలతో కలసి పనిచేస్తోంది. పత్తిలో అంతర పంటల సాగుపై సలహాలు, సూచనలు అందిస్తూ రైతులకు తోడుగా ఉంటూ వారి నైపుణ్యాలు పెంపొందిస్తోంది.

పత్తి ప్రధాన పంటగా 5 సాళ్లు, పక్కనే 6వ సాలుగా కంది.. వీటి మధ్య బొబ్బర, పెసర, మినుములు, నువ్వులు విత్తుతున్నారు. 3–4 నెలల్లో ఈ పంటల దిగుబడి చేతికి వస్తోంది. ఆ పంటల కోత పూర్తయ్యాక ఎండు కట్టెను పత్తి పొలంలోనే ఆచ్ఛాదనగా ఉపయోగిస్తున్నారు. టైప్ 2 ఘన జీవామృతం వేయటంతో పాటు ప్రతి 15–20 రోజులకు ద్రవ జీవామృతం, కషాయాలు పిచికారీ చేస్తున్నారు. దీంతో తొలి ఏడాదిలోనే రైతులు సత్ఫలితాలు పొందుతున్నారని వాసన్ ప్రతినిధి సత్యం (83175 87696) తెలిపారు.

ఎకరంలో ప్రకృతి సేద్యం ఖర్చులు	
పని	ఖర్చు (రూ.)
దుక్కం	8,000
రొటోవెటర్	2,000
కూలి	1,500
విత్తనాలు వేయటం	2,800
కలుపు తీత	7,000
పంట కోత కూలి	3,000
పచ్చిరొట్ట విత్తనాలు	500
ద్రవ జీవామృతం	400
దశపర్ణి కషాయం	100
వేపనూనె	600
ఘనజీవామృతం	3,000
సూడోమోనాస్	500
మొత్తం	రూ. 29,400

ఎకరంలో ప్రకృతి సేద్యం ఆదాయ వివరాలు

పంట	దిగుబడి (కిలోలు)	ధర (రూ.)	ఆదాయం (రూ.)
పత్తి (అంచనా)	600	80	48,000
కంది (అంచనా)	400	100	40,000
పెసర	20	120	2,400
బొబ్బర	25	100	2,500
మినుములు	10	110	1,100
నువ్వులు	10	250	2,500
మొత్తం	-	-	రూ. 96,500

ప్రకృతి సేద్యంతో ఆదాయం బాగుంది

మా కుటుంబంలో అమ్మ, నా భార్య, ఇద్దరు పిల్లలు ఉంటాం. ఐదు ఎకరాల పొలం ఉంది. 8 బోర్లు వేసినా రెంటిలోనే నీరు పడింది. ఒకటి 2 ఇంచులు, మరొకటి 1 ఇంచు నీరు ఇస్తున్నాయి. సాధారణంగా 2 ఎకరాల్లో వరి, 3 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, కంది, అలాగే కూరగాయలు సాగు చేస్తుంటాను. 2024 ఫిబ్రవరి, మే నెలల్లో వాసన్ సంస్థ నిర్వహించిన రెండు శిబిరాలకు హాజరై శిక్షణ తీసుకున్నాను. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే సాగు పద్ధతులు, తక్కువ వర్షం అవసరం ఉన్న పంటలు సాగుపై అవగాహన కల్పించారు.

ఈ ఖరీఫ్‌లో 1 ఎకరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేశాను. పంటల సాగుకు ముందు అనేక రకాల పచ్చిరొట్ట పంటలు సాగు చేసి రొటోవేటర్‌తో నేలలో కలియదున్నాను. జులై 3వ తేదీన పత్తి, కంది, బొబ్బర, పెసర, మినుములు, నువ్వులు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూర విత్తనాలు వేశాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పట్టుదలతో పాటించాను. నా ప్రయాణంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నాను. విత్తనాలు వేయడం, కషాయాలు, ద్రవ, ఘన జీవామృతాల వాడకం వంటి అన్ని విషయాల్లో వాసన్ సంస్థ వారు నాకు సూచనలు ఇచ్చారు. విత్తనాలు వేసిన నెల నుంచే ఏదో పంట చేతికి రావడం ప్రారంభమైంది. మాకు నిరంతరం ఆదాయం వచ్చేలా చేశారు.

ఇంట్లో మేము తినటానికి సరిపడా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు వచ్చాయి. మిగిలినవి అమ్ముకొని మంచి ఆదాయం పొందాం. కానీ, ఈ ఏడు అధిక వర్షాల కారణంగా పత్తి 6 క్వింటాళ్లే వచ్చింది. అనుకున్న స్థాయిలో పంట రాలేదు.

ఈ పప్పు ధాన్యాలు, నూనె గింజలు సంవత్సరమంతా మా కుటుంబానికి పోషకాహారాన్ని అందిస్తున్నాయి. ఈ ఎకరానికి రూ. 29,400 ఖర్చయ్యింది. పత్తి, కంది పంటలన్నీ పూర్తయ్యే నాటికి ఆదాయం రూ. 96,500లు వస్తుందని అనుకుంటున్నాను. ఈ వ్యవసాయ పద్ధతి మా కుటుంబానికి ఆర్థిక భద్రతను కలిగించింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో మాకు ఆదాయం బాగుంది. అలాగే, నీటి వినియోగాన్ని తగ్గించడంలో ఈ పద్ధతులు మాకు ఎంతో సహాయపడ్డాయి.

– అక్కలి శ్రీనివాసులు (96668 39118),
రైతు,
దోర్నాలపల్లి, దోమ మండలం,
వికారాబాద్ జిల్లా




భార్యతో బందయ్య

ఒక పంట నష్టమైతే మరొక పంటలో ఆదాయం

వికారాబాద్ జిల్లా దోమ మండలం ఊటుపల్లికి చెందిన బందయ్య దంపతులకు ఇద్దరు పిల్లలు. వారసత్వంగా వచ్చిన 3 ఎకరాల పొలంలో 6 సార్లు బోర్లు వేసినా ఒక్క బోరులోనే 2 ఇంచుల నీరు వస్తోంది. కుటుంబం తిండి గింజల కోసం ఎకరంలో వరి నాటుకున్నారు. మిగిలిన 1.5 ఎకరంలో వర్షాధారంగా జొన్న, పత్తి, కందులను రసాయనిక పద్ధతిలో సాగు చేసేవారు. పెద్దగా ఆదాయం కనిపించేది కాదు. వాసన్ సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పత్తి పంట సాగుపై రెండుసార్లు శిక్షణ పొంది సాగు చేపట్టారు. ఒక పంట నష్టమైతే మరొక పంటలో ఆదాయం వస్తుందని తెలుసుకున్నారు.

ఒక ఎకరంలో పత్తితో పాటు పప్పుదినుసులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పూల మొక్కలను అంతర పంటలుగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేశారు. విత్తనం వేయటం నుంచి, కషాయాలు పిచికారీ, ద్రవ – ఘన జీవామృతాల వినియోగం, పంట కోత విధానం.. ఇలా ప్రతి పనిలోనూ వాసన్ ప్రతినిధుల సూచనలు పాటించారు.

మొదటి నెల నుంచి ఆకుకూరలు, 3 నెలల్లో మినుము, పెసర, కూరగాయలు, చిరుధాన్యాలు.. ప్రతినెలా ఏదో ఒక పంట చేతికి రావడంతో సంతోషించారు. ఇంట్లో తినగా మిగిలినవి అమ్మటం వల్ల అదనపు ఆదాయం కూడా వచ్చింది. పత్తి 7 క్వింటాళ్లు, కందులు 4–5 క్వింటాళ్లు వస్తాయని ఆశిస్తున్నారు. ఒకసారి నీటి తడి ఇచ్చారు. నేల మొత్తం పంటలు పరుచుకోవడం వల్ల నీటి అవసరం చాలా తగ్గిందని బందయ్య తెలిపారు.

పత్తిలో అంతరపంటలు వేసిన ఎకరానికి పెట్టుబడి రూ. 28 వేలు. కాగా, ఇంట్లో వాడుకోగా మిగిలిన పప్పుధాన్యాలు, చిరుధాన్యాల అమ్మకంపై వచ్చిన ఆదాయం రూ. 13,750. పత్తి, కందులపై రాబడి (అంచనా) రూ. 1,01,000. ఖర్చులు పోగా రూ. 86,750 నికరాదాయం వస్తుందని భావిస్తున్నారు. అధిక వర్షం వలన పత్తి పంట కొంత దెబ్బ తిన్నప్పటికీ మిగతా పంటల్లో వచ్చిన దిగుబడులు సంతోషాన్నిచ్చాయని, వచ్చే ఏడు కూడా ఈ పద్ధతిలోనే పత్తి, అంతర పంటలు సాగు చేస్తానని బండి బందెయ్య అంటున్నారు.

రూ. 40 వేలతో మినీ ట్రాక్టర్!

- రూ. 40 వేలతో మినీ ట్రాక్టర్ తయారు చేసిన పొదలకూరు యువకుడు
- 2 లీటర్ల డీజిల్‌తో ఎకరా పొలం దున్నేందుకు అవకాశం ఉందంటున్న పెంచల నారాయణ



పెద్దగా చదువుకోకపోయినా సృజనాత్మక ఆలోచన, పట్టుదలతో కూడి కృషితో అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పటానికి ఈ మినీ ట్రాక్టర్ ఓ ఉదాహరణ. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా పొదలకూరుకు చెందిన పెంచల నారాయణ(25) వెల్డింగ్ పనిచేస్తూ జీవిస్తున్నారు. 9వ తరగతి వరకు చదువుకున్న నారాయణ చిన్న రైతుల కోసం కేవలం రూ.40 వేల ఖర్చుతో మినీ ట్రాక్టర్‌ను తయారు చేసి ప్రశంసలు పొందుతున్నారు.


మినీ ట్రాక్టర్‌తో పెంచల నారాయణ

ఆటో ఇంజన్ తదితర విడిభాగాలను జత చేసి మినీ ట్రాక్టర్‌ను రూపొందించారు. 2 లీటర్ల డీజిల్‌తో ఎకరా పొలం దున్నేయ వచ్చునని నిరూపించారు. పొలం దున్నడంతో పాటు నిమ్మ, జామ వంటి పండ్ల తోటల్లో అంతర సేద్య పనులను ఈ మినీ ట్రాక్టర్‌తో అవలీలగా చేసుకోవచ్చని నారాయణ వివరించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే రైతులకు తక్కువ ఖర్చుతో కూడిన మినీ ట్రాక్టర్‌ను అందిస్తానని పెంచల నారాయణ అంటున్నారు.

కాన్సెప్ట్ బాగుంది: గణేశం

పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం మాట్లాడుతూ.. 'కాన్సెప్ట్ బాగుంది. ఏమీ తెలియని ఒక అబ్బాయి నడిచే మోటరు వాహనాన్ని తయారు చేయడం సులభం కాదు అన్నారు. 'రోడ్డు మీద బాగానే నడుస్తోంది. చిన్న ఇంజన్‌తో దుక్కి చేయటం వంటి శక్తితో కూడుకున్న పనులను ఏయే రకాల భూముల్లో ఈ చిన్న ట్రాక్టర్ ఎంతవరకు చేయగలుగుతుందో చూడాలి' అన్నారాయన.

– కే.మధుసూధన్, సాక్షి, పొదలకూరు



తొలి గేమ్‌లో డింగ్ లిరెన్ చేతిలో గుకేశ్ పరాజయం

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌కు శుభారంభం లభించలేదు. సింగపూర్ సిటీలో సోమవారం జరిగిన తొలి గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన గుకేశ్ 42 ఎత్తుల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. 'కింగ్ పాన్ ఓపెనింగ్'తో గుకేశ్ గేమ్‌ను మొదలుపెట్టగా... డింగ్ లిరెన్ 'ఫ్రెంచ్ డిఫెన్స్' ఓపెనింగ్‌తో సమాధానం ఇచ్చాడు. అనంతరం మిడిల్ గేమ్‌లో 18 ఏళ్ల గుకేశ్ చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్న 32 ఏళ్ల డింగ్ లిరెన్ తొలి గేమ్‌లోనే విజయాన్ని అందుకున్నాడు. ఫలితంగా 304 రోజుల తర్వాత క్లాసికల్ ఫార్మాట్‌లో డింగ్ లిరెన్‌కు తొలి గెలుపు దక్కింది. గుకేశ్, డింగ్ లిరెన్ మధ్య మొత్తం 14 గేమ్‌లు జరుగుతాయి. తొలుత 7.5 పాయింట్లు సాధించిన ప్లేయర్ విజేతగా అవతరిస్తాడు. నేడు జరిగే రెండో గేమ్‌లో డింగ్ లిరెన్ తెల్లపావులతో గేమ్‌ను ప్రారంభిస్తాడు.

295 పరుగుల తేడాతో...

ఇటీవల సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న టీమిండియా... ఆస్ట్రేలియాలో అతిపెద్ద విజయం నమోదు చేసుకుంది. ప్రత్యర్థి జట్టుపై సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియాను 295 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ప్రతిష్టాత్మక 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో టీమిండియా శుభారంభం చేసింది. నాయకుడు ముందుండి నడిపిస్తే ఎలా ఉంటుందో బుమ్రా చాటి చెప్పగా... తొలి మ్యాచ్‌లోనే బౌన్సీ పిచ్‌తో టీమిండియాను పరీక్షించాలనుకున్న ఆస్ట్రేలియా బొక్కబోర్లా పడింది.



తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై భారత్ బ్రహ్మాండ విజయం

- రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 238 ఆలౌట్
- 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' బుమ్రా
- డిసెంబర్ 6 నుంచి రెండో టెస్టు

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనను భారత జట్టు బ్రహ్మాండ విజయంతో శుభారంభం చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా పెర్త్‌లోని 'ఆప్టస్' స్టేడియంలో జరిగిన తొలి టెస్టులో భారత్ 295 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై పరుగుల తేడా పరంగా టీమిండియాకిదే అతిపెద్ద విజయం కావడం విశేషం. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలవడంతో పాటు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో తిరిగి అగ్రస్థానానికి చేరింది. 534 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 12/3తో సోమవారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా చివరకు 58.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. ట్రావిస్ హెడ్ (89; 8 ఫోర్లు) పోరాడగా... మార్ష్ (47; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కేరీ (36; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో తాత్కాలిక కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. రెండో టెస్టు డిసెంబర్ 6 నుంచి అడిలైడ్‌లో జరుగుతుంది.

హెడ్ ఒక్కడే...

గత రెండు ఆసీస్ పర్యటనల్లోనూ చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్న టీమిండియా... వరుసగా మూడోసారి దుమ్మురేపింది. పెర్త్ కొత్త స్టేడియంలో పరాజయం ఎరుగని కంగారూ జట్టును ఓ ఆటాడుకుంది. కొండంత లక్ష్యఛేదనకు దిగిన ఆసీస్ ఏ దశలోనూ పోటీలో కనబడలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ ఖ్వాజా (4)ను అవుట్ చేసిన సిరాజ్... కాసేపటికి స్టీవ్ స్మిత్ (60 బంతుల్లో 17)ను కూడా బుట్టలో వేసుకున్నాడు. హెడ్ ఎదురుదాడికి దిగి కాస్త పరువు నిలబెట్టగా... మార్ష్, కేరీ తలో చేయి వేయడంతో కంగారూ జట్టు ఓటమి అంతరాన్ని తగ్గించగలిగింది. బుమ్రా, సిరాజ్ టాపార్డర్ పనిపడితే... లోయర్ ఆర్డర్‌ను సుందర్, హర్షిత్ రాణా, నితీశ్ రెడ్డి పెవిలియన్ బాట పట్టించారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 104; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 487/6 **డిక్లేర్డ్;** **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** మెక్‌స్వీనీ (ఎల్బీ) (బి) బుమ్రా 0; ఖ్వాజా (సి) పంత్ (బి) సిరాజ్ 4; కమిన్స్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 2; లబుషేన్ (ఎల్బీ) (బి) బుమ్రా 3; స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 17; హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 89; మార్ష్ (బి) నితీశ్ రెడ్డి 47; కేరీ (బి) హర్షిత్ రాణా 36; స్టార్క్ (సి) జురేల్ (బి) సుందర్ 12; లయన్ (బి) సుందర్ 0; హాజల్‌వుడ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (58.4 ఓవర్లలో ఆలౌట్) 238.
వికెట్ల పతనం: 1-0, 2-9, 3-12, 4-17, 5-79, 6-161, 7-182, 8-227, 9-227, 10-238.
బౌలింగ్: బుమ్రా 12-1-42-3; సిరాజ్ 14-2-51-3; హర్షిత్ రాణా 13.4-1-69-1; సుందర్ 15-0-48-2; నితీశ్ కుమార్ రెడ్డి 4-0-21-1.



"తొలి ఇన్నింగ్స్ అనంతరం కాస్త ఒత్తిడికి లోనయ్యాం. కానీ అలాంటి స్థితి నుంచి తిరిగి పుంజుకోగలమని విశ్వసించాం. అదే చేసి చూపించాం. జైస్వాల్ అత్యుత్తమ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కోహ్లికి మా మద్దతు అవసరం లేదు. మాకే అతడి మద్దతు కావాలి. భిన్నమైన పరిస్థితుల్లో ఎలా ఆడాలో అతడికంటే మెరుగ్గా ఎవరికి తెలిసి ఉండదు. యువ ఆటగాళ్లు నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా దూకుడైన ఆటతీరు కనబర్చారు. సారథిగా తొలి విజయాన్ని అందుకోవడం చాలా ప్రత్యేకంగా ఉంది. నా కుమారుడికి భవిష్యత్తులో ఆస్ట్రేలియాపై ఎలా గెలిచామన్నది కథలుగా చెబుతా. -బుమ్రా

1 పరుగుల తేడా పరంగా ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టుకు ఇదే అతిపెద్ద విజయం.

3 విదేశాల్లో భారత్‌కు ఇది మూడో అతిపెద్ద విజయం. 2019 అంటిగ్వాలో వెస్టిండీస్‌పై 318 పరుగుల తేడాతో, 2017 గాలేలో శ్రీలంకపై 304 పరుగుల తేడాతో నెగ్గింది..

0 సొంతగడ్డపై 1970 నుంచి తొలి టెస్టు ఓడిన అనంతరం ఆస్ట్రేలియా ఒక్కసారి కూడా సిరీస్‌ను గెలవలేకపోయింది.

1 పెర్త్ ఆప్టస్ స్టేడియంలో ఆస్ట్రేలియా జట్టుకు ఇదే తొలి పరాజయం.

2 తొలి ఇన్నింగ్స్‌లో 150 కంటే తక్కువ పరుగులు చేసి... ఆ తర్వాత తిరిగి కోలుకొని భారీ తేడా (295 పరుగుల)తో టెస్టు మ్యాచ్ గెలిచిన రెండో జట్టుగా భారత్ నిలిచింది. 1991లో ఆస్ట్రేలియాతో బ్రిడ్జ్‌టౌన్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే పరిమితమైన వెస్టిండీస్ ఆ తర్వాత 343 పరుగుల తేడాతో టెస్టు నెగ్గింది.

పేస్ బౌలర్లకు పట్టం

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన బౌలర్లలో ఒకడు... అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో నాలుగో స్థానం... టైటిల్ సహా దశాబ్ద కాలం పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించిన పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ వేలంలో ఫ్రాంచైజీలను ఆకర్షించడంలో సఫలమయ్యాడు. రెండో రోజు వేలంలో భువీ (రూ.10 కోట్ల 75 లక్షలు) అత్యధిక ధరతో అగ్రస్థానంలో నిలిచాడు. భువనేశ్వర్‌లాగే చెన్నై మూడు ట్రోఫీ విజయాల్లో కీలక బౌలర్‌గా నిలిచిన దీపక్ చహర్‌కు (రూ.9 కోట్ల 25 లక్షలు) భారీ మొత్తం దక్కింది. వీరిద్దరిని వరుసగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ జట్లు దక్కించుకున్నాయి. ప్రతీ జట్టుకూ భారత పేసర్ల అవసరం ఉండటంతో సోమవారం వేలంలో ఆకాశ్‌దీప్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండేలకు మంచి విలువ లభించింది. విదేశీ ఆటగాళ్లలో మార్కో జాన్సెన్, విల్ జాక్స్‌లను ఫ్రాంచైజీలు తగిన మొత్తానికి సొంతం చేసుకున్నాయి. ఆరంభంలో ఆసక్తి చూపించకపోయినా... అజింక్య రహానే, దేవదత్ పడిక్కల్, ఉమ్రాన్ మాలిక్ వంటి ఆటగాళ్లను చివర్లో టీమ్‌లు ఎంచుకున్నాయి. రెండో రోజు కూడా ఆస్ట్రేలియా డాషింగ్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు నిరాశ ఎదురవగా... కేన్ విలియమ్సన్, బెయిర్‌స్టో, మిచెల్, శార్దుల్ ఠాకూర్ తదితరులను ఫ్రాంచైజీలు దూరంగా ఉంచాయి.

భువనేశ్వర్ కుమార్‌కు రూ. 10 కోట్ల 75 లక్షలు

- దీపక్ చహర్‌కు రూ.9 కోట్ల 25 లక్షలు
- ఆకాశ్‌దీప్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండేలకూ భారీ మొత్తం
- ఐపీఎల్ బరిలో 13 ఏళ్ల వైభవ్
- అమ్ముడుపోని డేవిడ్ వార్నర్, విలియమ్సన్, బెయిర్‌స్టో, శార్దుల్
- ముగిసిన ఐపీఎల్ వేలం


భువనేశ్వర్ కుమార్


వైభవ్

జిద్దా (సౌదీ అరేబియా): ఐపీఎల్-2025 కోసం రెండు రోజుల పాటు సాగిన వేలం సోమవారం ముగిసింది. మొత్తం 577 మంది క్రికెటర్లు వేలంలోకి రాగా... గరిష్టంగా 204 మంది క్రికెటర్లను ఎంచుకునే అవకాశం ఉండగా... 10 ఫ్రాంచైజీలు కలిపి మొత్తం 182 మంది ఆటగాళ్లనే వేలంలో తీసుకున్నాయి. వీరిలో 62 మంది విదేశీయులు కాగా... అన్ని జట్లూ కలిపి వేలంలో రూ.639.15 కోట్లు వెచ్చించాయి. ఐపీఎల్‌లో అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. వేలంలో రాజస్తాన్ రూ.1 కోటీ 10 లక్షలకు ఎంచుకునే సమయానికి వైభవ్ వయసు 13 ఏళ్ల 243 రోజులు మాత్రమే. వైభవ్ ఇప్పటి వరకు 5 రంజీ మ్యాచ్‌లు, ఒక టి20 మ్యాచ్ ఆడాడు. అయితే ఇటీవల భారత అండర్-19 జట్టు సభ్యుడిగా ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన నాలుగు రోజుల మ్యాచ్‌లో మెరుపు సెంచరీతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. తొలి రోజు వేలం రికార్డులతో హోరెత్తించగా, రెండో రోజు కూడా పేరున్న ఆటగాళ్లకు మంచి మొత్తమే దక్కింది. సోమవారం జాబితాలో పెద్ద సంఖ్యలో యువ ఆటగాళ్లు బరిలో నిలవగా, కొందరిని అదృష్టం తలుపు తట్టింది. జాతీయ జట్టుకు ఆడని అన్‌క్యాప్డ్ ఆటగాళ్లను ఫ్రాంచైజీలు చివర్లో కనీస విలువకే తీసుకొని జట్టులో మిగిలిన ఖాళీలను నింపాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


ప్రభాస్

అంతర్జాతీయ స్థాయిలో 'కల్కి 2'

- స్వప్న, ప్రియాంక

"'కల్కి 2' సినిమా పనులు ఇప్పటికే మొదలయ్యాయి.. ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి'' అని నిర్మాతలు స్వాప్నా దత్, ప్రియాంక దత్ చెప్పారు. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె, దిశా పటానీ ప్రధాన పాత్రల్లో నటించిన మైథలాజికల్ అండ్ సైన్స్ ఫిక్షన్ మూవీ 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్‌పై సి.అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది జూన్‌లో విడుదలై, ఘనవిజయం సాధించింది. 'కల్కి సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా వచ్చిన 'కల్కి 2898 ఏడీ'కి సీక్వెల్‌గా 'కల్కి 2' రానుందని చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా ప్రస్తుతం గోవాలో జరుగుతున్న 55వ ఇఫీ (ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకల్లో మెయిన్‌స్ట్రీమ్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 'కల్కి 2898 ఏడీ' సినిమాని ప్రదర్శించారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు స్వాప్నా దత్, ప్రియాంక దత్ బదులిస్తూ.. "ప్రస్తుతం 'కల్కి 2' సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. తొలి పార్టు చిత్రీకరణ టైమ్‌లోనే 30 నుంచి 35 శాతం 'కల్కి 2' షూటింగ్ పూర్తయింది. అయితే ఈ సినిమాలోని ప్రధాన నటీనటుల షూటింగ్ కాల్షీట్స్ ఫైనలైజ్ కావాల్సి ఉంది. తొలి పార్టులో మదర్ రోల్ చేసిన దీపికా పదుకొనే 'కల్కి 2'లోనూ మదర్ రోల్ చేస్తారు. ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో రిలీజ్ చేస్తాం'' అని పేర్కొన్నారు 'కల్కి 2' చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ప్రియాంక, స్వప్న

కన్నప్ప ఫిక్స్

విష్ణు మంచు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్, బ్రహ్మానందం, అర్పిత్ రంకా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై డా.మోహన్ బాబు నిర్మిస్తున్నారు. కాగా 'కన్నప్ప' సినిమాను వచ్చే వేసవిలో ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఉజ్జయినీ మహాకాళేశ్వర్ దేవాలయంలో ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. "అంతర్జాతీయ స్థాయిలో 'కన్నప్ప' సినిమాను రూపొందిస్తున్నాం. హాలీవుడ్ స్థాయి సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. న్యూజిలాండ్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిగింది. 'కన్నప్ప' సినిమాలో ఆడియన్స్‌కు గ్రాండ్ విజువల్ ట్రీట్ ఉంటుంది'' అని చిత్రబృందం తెలిపింది.


రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేస్తున్న 'కన్నప్ప' టీమ్

ఆ విషయంలో ఐశ్వర్యకి థ్యాంక్స్

- అభిషేక్ బచ్చన్


అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యా రాయ్

"నేను బయటకు వెళ్లి సినిమాలు చేస్తున్నానంటే అది నిజంగానే నా అదృష్టం. మా కుమార్తె ఆరాధ్య యోగక్షేమాలను నా భార్య ఐశ్వర్యా రాయ్ చూసుకుంటూ ఇంట్లోనే ఉంటోంది. ఆ విషయంలో తనకు థ్యాంక్స్ చెబుతున్నాను'' అని హీరో అభిషేక్ బచ్చన్ అన్నారు. ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ- "కుటుంబం విషయంలో ఐశ్వర్య ఎంతగానో సపోర్ట్ చేస్తుంది. ఆమె వల్లే నేను సినిమాలపై పూర్తిగా దృష్టి పెడుతున్నాను. ఈ రోజుల్లో పిల్లలు కూడా తమ తల్లిదండ్రులతో ఎక్కువ సమయం గడపాలనుకుంటున్నారు. నేను పుట్టిన తర్వాత మా అమ్మ జయా బచ్చన్ సినిమాలు మానేశారు. భర్త, పిల్లలు, కుటుంబానికి ఎక్కువ సమయం ఇవ్వాలని ఆమె అనుకుని ఆ నిర్ణయం తీసుకున్నారు. మా నాన్న అమితాబ్ బచ్చన్ సినిమాలతో బిజీగా ఉండి రాత్రి ఏ సమయంలో ఇంటికి వచ్చినా సరే.. నా గదిలోకి వచ్చి నన్ను చూసి వెళ్లేవారు. ఎన్ని పనులు ఉన్నప్పటికీ నా స్కూల్‌లో జరిగే ప్రతి ఫంక్షన్‌కు, నా బాస్కెట్ బాల్ పోటీలకు నాన్న వచ్చేవారు. తల్లిదండ్రులుగా మనం పిల్లలకు స్ఫూర్తిని ఇవ్వాలి. అలాగే వారి నుంచి ప్రేరణ పొందాలి. ప్రపంచంలోని తల్లిదండ్రులపై నాకు అమితమైన గౌరవం ఉంది. తల్లి బాధ్యతలు మరెవరూ చేయలేరు. తండ్రికి కూడా ఎంతో ప్రేమ, బాధ్యతలు ఉంటాయి. కానీ వాటిని పైకి చూపించడు. వయసు పెరిగేకొద్దీ పిల్లలకు తండ్రి ప్రేమ అర్థమవుతుంది'' అని చెప్పారు అభిషేక్. కాగా అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యా రాయ్ 2007లో వివాహం చేసుకున్నారు. వీరు విడాకులు తీసుకోనున్నారనే వార్తలు గత కొన్ని రోజులుగా చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా అభిషేక్ బచ్చన్ మాటలతో ఆ వార్తలకు చెక్ పడిందని బాలీవుడ్ టాక్.


వరుణ్ ధావన్, కీర్తీ సురేశ్

అదుర్స్

అందం, అభినయంతో తెలుగు, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరోయిన్ కీర్తీ సురేశ్. ఆమె బాలీవుడ్ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇస్తున్న సినిమా 'బేబీ జాన్'. ఈ మూవీలో వరుణ్ ధావన్‌కి జోడీగా నటించారు కీర్తీ సురేశ్. కాలీస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వామికా గబ్బి మరో హీరోయిన్. జీ స్టూడియోస్, అట్లీ సమర్పణలో ఎ ఫర్ ఆపిల్, సినీ1 స్టూడియోస్‌పై మురాద్ ఖేతని, ప్రియా అట్లీ, జ్యోతీ దేశ్‌పాండే నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నైన్ మాటక్క..' సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. వరుణ్ ధావన్, కీర్తీ సురేశ్‌ల మధ్య వచ్చే ఈ పాట అదుర్స్ అంటున్నారు వీక్షకులు. ఈ సాంగ్‌లో గ్లామర్‌గా కనిపించారు కీర్తి. ఇప్పటి వరకు గ్లామర్ రోల్స్ చేయకుండా క్లీన్ ఇమేజ్ బిల్డ్ చేసుకున్న కీర్తీ సురేశ్ 'బేబీ జాన్'తో ఆ ఇమేజ్‌ని బ్రేక్ చేసిందని బాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. ఇదిలా ఉంటే.. అట్లీ దర్శకత్వంలో విజయ్, సమంత జంటగా నటించిన హిట్ మూవీ 'తేరి' (2016) సినిమాకి రీమేక్‌గా 'బేబీ జాన్' రూపొందింది.

క్రైమ్ కామెడీ


'వెన్నెల' కిశోర్

'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల, సియా గౌతమ్ ముఖ్య తారలుగా నటించిన క్రైమ్ కామెడీ థ్రిల్లర్ మూవీ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ పతాకంపై వెన్నపూస రమణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లు సోమవారం అధికారికంగా ప్రకటించారు మేకర్స్. "శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'లో ఓ షార్ప్ డిటెక్టివ్ పాత్రలో 'వెన్నెల' కిశోర్ కనిపిస్తారు. '2018, పొలిమేర, కమిటీ కుర్రాళ్ళు, క' వంటి హిట్ చిత్రాలను సక్సెస్ ఫుల్‌గా రిలీజ్ చేసిన నిర్మాత వంశీ నందిపాటి మా సినిమాని కూడా వంశీ నందిపాటి ఎంటర్‌టైన్మెంట్స్ ద్వారా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. స్నేహా గుప్తా, రవితేజ ఎం, 'బాహుబలి' ప్రభాకర్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సునీల్ కశ్యప్ సంగీతం అందిస్తున్నారు.

ఫీల్‌గుడ్ మ్యూజిక్


మెర్విన్-వివేక్

'పటాస్, సుల్తాన్, గులేబకావళి' వంటి తమిళ సినిమాలకు సంగీతం అందించిన వివేక్-మెర్విన్ ద్వయం తెలుగులో స్ట్రయిట్ ఫిల్మ్ చేస్తున్నారు. రామ్, భాగ్యశ్రీ బోర్సే జంటగా పి.మహేశ్ బాబు దర్శకత్వంలో ఓ ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. తాజాగా ఈ సినిమాకు వివేక్-మెర్విన్ ద్వయం సంగీతం అందించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. "తెలుగు సినిమాకు మరో కొత్త సంగీతం వస్తుంది'' అంటూ వివేక్-మెర్విన్‌లను ఉద్దేశిస్తూ 'ఎక్స్'లో పేర్కొన్నారు రామ్.

గ్రామీణ నేపథ్యంలో...


సుమన్

సుమన్, మురళి గౌడ్, అన్నపూర్ణమ్మ, రవి వర్మ, లాస్య, మీనా చౌదరి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మన కుటుంబం'. ఆకుల రాఘవ దర్శకత్వం వహించారు. కలకొండ ఫిలిమ్స్ బ్యానర్‌పై కలకొండ హేమలత నిర్మించారు. జె.భాను ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. సుమన్, అన్నపూర్ణమ్మ, భానుప్రసాద్, ఆకుల రాఘవ, కలకొండ నరసింహ చేతుల మీదుగా ఆడియో విడుదల చేశారు. ఆకుల రాఘవ మాట్లాడుతూ- "గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'మన కుటుంబం'. అనుబంధాలు, అనురాగాలు, తెలంగాణ సంప్రదాయాలు ఈ మూవీలో హైలైట్‌గా నిలుస్తాయి'' అన్నారు. "త్వరలో సెన్సార్ పూర్తి చేసుకుని, మా సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం'' అని కలకొండ హేమలత చెప్పారు.

యాక్షన్... సెంటిమెంట్


కారుణ్య చౌదరి, సుమన్ బాబు

సుమన్ బాబు ముఖ్య పాత్ర పోషించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎర్రచీర-ది బిగినింగ్'. శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి. శర్మ, సురేష్ కొండేటి, రఘుబాబు, బేబి సాయి తేజస్విని ఇతర పాత్రలు పోషించారు. బేబీ ఢమరి సమర్పణలో ఎన్‌వీవీ సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 20న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ప్రమోద్ పులిగార్ల సంగీతం అందించారు. ఈ సినిమా నుంచి 'తొలి తొలి ముద్దు' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఈ వేడుకకి అతిథిగా వచ్చిన దర్శకుడు వీరశంకర్ మాట్లాడుతూ- "యాక్షన్, మదర్ సెంటిమెంట్, హారర్ .. ఇవన్నీ ఒక కథలో కలిపి చేయడం అరుదైన ప్రయత్నం. ఈ అంశాలను మేళవించి రూపొందించిన 'ఎర్రచీర' ప్రేక్షకాదరణ పొందాలి'' అన్నారు. సుమన్ బాబు మాట్లాడుతూ- "'తొలి తొలి ముద్దు' పాట భార్యాభర్తల మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్. జయసూర్య మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ పాట రీల్స్, షార్ట్స్ చేసి మాకు పంపిస్తే తొలి, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు బహుమతి అందిస్తాం'' అన్నారు. ఈ వేడుకలో కారుణ్య చౌదరి, సంగీత దర్శకుడు ప్రమోద్, లిరిక్ రైటర్ జయసూర్య మాట్లాడారు.

ఆఫీసులో వినోదం


వసంతిక, స్వాతి, ఆర్‌జే కాజల్, శుభశ్రీ

ఆర్‌జే కాజల్, అఖిల్ సార్థక్, శుభశ్రీ, మిర్చి కిరణ్, రీతూ చౌదరి, స్వాతి చౌదరి, వసంతిక, మహేశ్ విట్టా ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్‌సిరీస్ 'వేరే లెవల్ ఆఫీస్'. ఇ.సత్తిబాబు దర్శకత్వంలో వరుణ్ చౌదరి గోగినేని నిర్మించిన ఈ సిరీస్ డిసెంబరు 12 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. సోమవారం జరిగిన ఈ సిరీస్ ట్రైలర్‌లాంచ్ ఈవెంట్‌లో ఇ. సత్తిబాబు మాట్లాడుతూ- "తమిళంలో సక్సెస్ అయిన 'ఆఫీస్' వెబ్‌సిరీస్‌ను తెలుగులోకి తీసుకొస్తున్నాం. తెలుగు కోసం కథలో యాభై శాతం మార్పులు చేశాం. వినోదాత్మకంగా సాగే ఈ సిరీస్ కార్పొరేట్ ఫ్యామిలీస్‌కి బాగా కనెక్ట్ అవుతుంది''అన్నారు. "యూనిక్ కాన్సెప్ట్‌తో ఈ సిరీస్‌ను వీక్షకుల ముందుకు తెస్తున్నాం'' అని 'ఆహా' కంటెంట్ హెడ్ వాసు తెలిపారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
26-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
993	315
80,110	24,221

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,007	▲	3
డోజోన్స్	44,557	▲	260
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,292	▲	30
డాక్స్	19,405	▲	83
షాంఘై	3,265	▼	3
నికాయ్	38,780	▲	496

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	76,440
బంగారం (24 క్యారెట్)	72,800
వెండి (కేజీ)	1,01,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	83.95	84.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	105.00	107.82
€	యూరో	ఎస్‌బిఐ	87.27	89.86
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బిఐ	54.25	55.63
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	54.04	54.24
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.31	65.65
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.58	23.13
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.06	23.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.77	12.59

భారత వృద్ధి అంచనాలకు ఎస్‌అండ్‌పీ కోత

- 2025-26లో 6.7 శాతం
- 2026-27లో 6.8 శాతం
- 0.2 శాతం మేర తగ్గింపు
- 2024-25కు 6.8 శాతం కొనసాగింపు



న్యూఢిల్లీ: భారత వృద్ధి అంచనాలను అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తగ్గించింది. అమెరికా ఎన్నికల అనంతరం ఆసియా పసిఫిక్ ప్రాంతాలకు సంబంధించి వృద్ధి అంచనాలపై తాజా నివేదికను విడుదల చేసింది. 2025-26లో భారత జీడీపీ 6.7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని, ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరానికి (2026-27) 6.8 శాతం మేర వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. ఈ రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ గత అంచనాలు వరుసగా 6.9%, 7% చొప్పున ఉండడం గమనార్హం. అంటే 0.2 % మేర తగ్గించినట్టు తెలుస్తోంది. అధిక స్థాయిలో వడ్డీ రేట్లు, పట్టణాల్లో డిమాండ్ తగ్గడాన్ని తన తాజా నిర్ణయం వెనుక ప్రధాన అంశాలుగా ఎస్‌అండ్‌పీ తెలిపింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-15) 6.8% వృద్ధి నమోదవుతుందని పేర్కొంది. 2027-28 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి 7%గా ఉండొచ్చని ఎస్‌అండ్‌పీ అంచనా వేసింది. 'భారత్‌లో జీడీపీ వృద్ధి 2024-25లో 6.8%కి నిదానించొచ్చు. అధిక వడ్డీ రేట్లు, తక్కువ ఆర్థిక ఉద్దీపనలు పట్టణ డిమాండ్‌ను తగ్గించనున్నాయి. అదే సమయంలో పీఎంఐ ఇంకా విస్తరణ దశలోనే ఉంది. ఇతర ముఖ్యమైన ఆర్థిక సూచికలు మాత్రం వృద్ధి నిదానించినట్టు చెబుతున్నాయి' అని తెలిపింది. మరోవైపు 2024లో చైనా 4.8% వృద్ధి రేటును నమోదు చేస్తుందన్న గత అంచనాలను ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ కొనసాగించింది. ట్రంప్ సర్కారు రూపంలోరానున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని 2025, 2026 సంవత్సరాలకు సంబంధించి చైనా వృద్ధి అంచనాలకు కోత విధించింది.

ఫైబర్ టెక్‌లో లక్ష కొలువులు..

- 2029 నాటికి 76 బిలియన్ డాలర్లకు టెలికం మార్కెట్
- వచ్చే అయిదేళ్లపై టీమ్‌లీజ్ అంచనాలు



ముంబై: బ్రాడ్‌బ్యాండ్, 5జీ నెట్‌వర్క్ సహా డిజిటల్ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వచ్చే అయిదేళ్లలో ఫైబర్ టెక్నాలజీ విభాగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి. ఫైబర్ ఇన్‌స్టాలేషన్, మెయింటెనెన్స్, రిపేర్ సెగ్మెంట్లలో కొత్తగా లక్ష ఉద్యోగాలు రానున్నాయి. టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ పి. సుబ్బురత్నం ఈ విషయాలు వెల్లడించారు. 2024లో దేశీయంగా టెలికం మార్కెట్ 48.61 బిలియన్ డాలర్లుగా ఉండగా ఏటా 9.40 శాతం వార్షిక వృద్ధి రేటుతో 2029 నాటికి 76.16 బిలియన్ డాలర్లకు చేరే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. 2023 నాటికి దేశవ్యాప్తంగా 7 లక్షల కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేయడం పూర్తయిందని, డిజిటల్ మౌలిక సదుపాయాలు విస్తరించడానికి ఇది గణనీయంగా ఉపయోగపడిందని వివరించారు. అసాధారణమైన స్పీడ్, తక్కువ లేటెన్సీ, మరింత మెరుగైన కనెక్టివిటీని అందిస్తూ 2030 నాటికి 5జీ టెక్నాలజీ మరింతగా విస్తరించనుందని సుబ్బురత్నం చెప్పారు. 'ప్రభుత్వం, టెలికం సంస్థలు ఫైబర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విస్తరణపై దృష్టి పెడుతుండటంతో ఫైబర్ టెక్నీషియన్లకు డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో కొత్తగా సుమారు లక్ష ఉద్యోగావకాశాలు రానున్నాయి' అని సుబ్బురత్నం చెప్పారు. ప్రస్తుతం దేశీయంగా ఫైబర్ టెక్నీషియన్ల సంఖ్య సుమారు 5 లక్షల పైగా ఉన్నట్లు అంచనా.

ఇంజనీర్లు, టెక్నీషియన్లకు డిమాండ్..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి పెట్టే టెలికం, ఐటీ, నిర్మాణ, తయారీ తదితర రంగాల్లో ఫైబర్ సాంకేతిక నిపుణుల అవసరం ఉంటుంది. ఫైబర్ ఇంజనీర్లు, ఫైబర్ టెర్మినేషన్ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్లు, ఇన్‌స్టాలేషన్.. రిపేరు, ఫాల్ట్ రిజల్యూషన్ టీమ్, ఫైబర్ సెల్‌సైట్ ఇంజనీర్లు, ఫీల్డ్ టెక్నీషియన్లు మొదలైన వర్గాలకు డిమాండ్ నెలకొనవచ్చని సుబ్బురత్నం చెప్పారు. అయితే, అట్రిషన్ రేటు అధిక స్థాయిలో వార్షికంగా 35-40%గా ఉంటోందన్నారు. సుదీర్ఘ పనిగంటలు, వేతనాల పెంపు చాలా తక్కువగా ఉండటం, ఉద్యోగులను ఇతర సంస్థలను ఎగరేసుకుపోతుండటం తదితర అంశాలు కారణమని వివరించారు.

మహిళల ఆరోగ్యానికి లీ హెల్త్ 'వి-ఫెరిన్'




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధాల తయారీలో ఉన్న లీ హెల్త్ డొమెయిన్.. స్త్రీల జననేంద్రియ ఇన్ఫెక్షన్ల చికిత్సకు 'వి-ఫెరిన్' ప్రోబయోటిక్ సప్లిమెంట్‌ను ప్రవేశపెట్టింది. లాక్టోఫెర్రిన్ పెప్టైడ్, క్రాన్‌బెర్రీ పండ్లతో ప్రీ-ప్రోబయోటిక్స్ లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్ మిశ్రమాలతో ఈ క్యాప్సూల్స్ రూపొందించారు. జననేంద్రియ అసమతుల్యతకు గల మూలకారణాలకు సమగ్ర పరిష్కారాన్ని వి-ఫెరిన్ అందిస్తుందని కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. చికిత్స చేయకుండా వదిలేస్తే స్త్రీ పునరుత్పత్తి అవయవాలలో వాపును కలిగించడం, సంతానోత్పత్తి సమస్యలకు దారి తీస్తుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 25-30% మంది మహిళలు జననేంద్రియ ఇన్ఫెక్షన్ల సమస్యను ఎదుర్కొంటున్నారని ఆమె చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఏటా 7.5 లక్షల కార్ల ఎగుమతి: మారుతీ	అదానీలో పెట్టుబడులు గుడ్

రెండోరోజూ మహా ర్యాలీ!

- మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి గెలుపు ప్రభావం
- మళ్లీ 80 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- 24 వేల పాయింట్ల ఎగువకు నిఫ్టీ



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రాతినిధ్యం వహించిన మహాయుతి కూటమి అఖండ విజయంతో బుల్ రెండోరోజూ రంకెలేసింది. సెన్సెక్స్ 993 పాయింట్లు పెరిగి 80 వేల స్థాయిపైన 80,110 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315 పాయింట్లు లాభపడి 24 వేల స్థాయిపైన 24,221 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే భారీ లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 1,076 పాయింట్లు బలపడి 80,193 వద్ద, నిఫ్టీ 346 పాయింట్లు ఎగసి 24,253 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 1,356 పాయింట్లు ఎగసి 80,473 వద్ద, నిఫ్టీ 445 పాయింట్లు దూసుకెళ్లి 24,352 వద్ద ఇంట్రాడే గరిష్టాలు నమోదు చేశాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 12 పైసలు బలపడి 84.29 స్థాయి వద్ద స్థిరపడింది. అమెరికా ఆర్థికమంత్రిగా అంతర్జాతీయ ఇన్వెస్టర్, మార్కెట్‌కు అనుకూల 'స్కాట్ బెసెంట్'ను ట్రంప్ నామినేట్ చేయడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్, సింగపూర్ మినహా అన్ని దేశాల సూచీలు 1.50% ర్యాలీ చేశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు ఒకశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

→ సెన్సెక్స్ సూచీలో 30కి 26 షేర్లూ లాభాలతో ముగిశాయి. అత్యధికంగా ఎల్‌అండ్‌టీ, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 4 - 2.50% లాభపడ్డాయి. బీఎస్‌ఈలో రంగాల వారీగా ఇండస్ట్రియల్, ఆయిల్‌అండ్‌గ్యాస్ 3%, ఇంధన 2.50%, రియల్టీ, బ్యాంకెక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ 2%, ఫార్మా సూచీలు ఒకశాతం లాభపడ్డాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 2% నుంచి ఒకటిన్నర శాతం పెరిగాయి.

→ అదానీ గ్రూప్ కంపెనీ షేర్లు మిశ్రమంగా స్పందించాయి. ఈ గ్రూప్‌లో పదింటికిగానూ అయిదు కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 2.55%, ఏసీసీ 2.54%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.26%, అదానీ విల్మార్ 2%, అంబుజా సిమెంట్స్ 1% లాభపడ్డాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 8%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 4%, అదానీ పవర్ 3%, ఎన్‌డీటీవీ 2%, అదానీ టోటల్ గ్యాస్ 1.50% నష్టపోయాయి.

→ బీఎస్‌ఈ సెన్సెక్స్ సూచీలో చోటు దక్కించుకోవడంతో జొమాటో కంపెనీ షేరు 3.58% పెరిగి రూ.274 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 7.62% ఎగసి రూ.284 వద్ద గరిష్టాన్ని తాకింది. ఇదే సూచీలో స్థానం కోల్పోయిన జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 2.5% నష్టపోయి రూ. 953 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారుల డేటా లీక్



న్యూఢిల్లీ: జీవిత బీమా దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్‌కి సంబంధించిన ఐటీ సిస్టమ్స్‌లో డేటా లీక్ ఉదంతాలు చోటు చేసుకున్నాయి. ఈ ఉల్లంఘనల తీవ్రత, ప్రభావాలపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు సంస్థ వెల్లడించింది. కస్టమర్లకు సంబంధించిన నిర్దిష్ట వివరాలు ఒక గుర్తు తెలియని సోర్స్ నుంచి వచ్చినట్లు, ఎవరో దురుద్దేశంతోనే ఇదంతా చేసి ఉంటారని అనుమానిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. వీటికి మూలకారణాలను తెలుసుకునేందుకు, దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ నిపుణులను సంప్రదించినట్లు వివరించింది. పాలసీదారుల డేటా లీక్ ఉదంతాల నేపథ్యంలో బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ ఇటీవలే ఐటీ సిస్టమ్‌లను ఆడిట్ చేయించాల్సిందిగా రెండు బీమా సంస్థలను ఆదేశించిన నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఉదంతం ప్రాధాన్యం సంతరించుకుంది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐడీబీఐ బ్యాంక్‌లో 600 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ఐడీబీఐ బ్యాంక్ దేశవ్యాప్తంగా ఉన్న వివిధ జోన్లలో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 600
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ 'ఒ' జనరల్-500, అగ్రి అసెట్ ఆఫీసర్(ఏఏవో)-100.
» **జోన్లు:** అహ్మదాబాద్, బెంగళూరు, చండీగఢ్, చెన్నై, కొచ్చి, ముంబై, నాగ్‌పూర్, పుణె, పాన్ ఇండియా.
» **అర్హత:** గ్రేడ్ 'ఒ' జనరల్ పోస్టులకు ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, గ్రేడ్ 'ఒ' స్పెషలిస్ట్ పోస్టులకు బీఎస్సీ/బీటెక్/బీఈ(అగ్రికల్చర్, హార్టికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఫిషరీస్ సైన్స్/ఇంజనీరింగ్, యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, ఫారెస్ట్రీ, డెయిరీ సైన్స్/టెక్నాలజీ, ఫుడ్ సైన్స్/టెక్నాలజీ, పిసికల్చర్, ఆగ్రో ఫారెస్ట్రీ, సెరికల్చర్) ఉత్తీర్ణులవ్వాలి. జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. కంప్యూటర్/ఐటీ సంబంధిత అంశాల్లో ప్రావీణ్యం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 01.10.2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు ఇస్తారు.
» **పే స్కేల్:** ఏడాదికి రూ.6.14 లక్షల నుంచి రూ.6.50 లక్షల మధ్య ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** లాజికల్ ఇంజనీరింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్/కంప్యూటర్/ఐటీ. గ్రేడ్ 'ఒ' స్పెషలిస్ట్ పోస్టులకు అదనంగా ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగం నుంచి ప్రశ్నలు అడుగుతారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2024.
» **ఫీజు చెల్లింపు చివరితేది:** 30.11.2024.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** డిసెంబర్ 2024/జనవరి 2025.
» **వెబ్‌సైట్:** https://www.idbibank.in

సింగిల్ గర్ల్ చైల్డ్ స్కాలర్‌షిప్-2024


సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ).. ఏకైక బాలికా సంతానంగా ఉన్న ప్రతిభ కలిగిన విద్యార్థినుల కోసం స్కాలర్‌షిప్‌ని ప్రతీ సంవత్సరం అందిస్తోంది.

» **అర్హత:** విద్యార్థిని తల్లిదండ్రులకు ఏకైక కూతురై ఉండాలి. విద్యార్థిని సీబీఎస్‌ఈలో పదో తరగతి ఉత్తీర్ణురాలై,సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాలలో పదకొండు తరగతి, పన్నెండో తరగతి చదువుతూ ఉండాలి. పదో తరగతి పరీక్షలో కనీసం 70 శాతం మార్కులు సాధించి ఉండాలి. విద్యార్థిని ట్యూషన్‌ఫీజు నెలకు రూ.2500 కంటే మించకూడదు.
» **స్కాలర్‌షిప్:**ఉపకారవేతనానికి ఎంపికైన విద్యార్థినులు 11వ తరగతి తర్వాత ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. రెన్యువల్ చేయించుకోవాలంటే.. విద్యార్థిని కనీసం 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి. విద్యార్థినులకు రెండేళ్ల పాటు నెలకు రూ.1000 చొప్పున అందిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.12.2024.
» **సీబీఎస్‌ఈ పాఠశాలల దరఖాస్తు ధ్రువీకరణ తేదీలు:** 25.11.2024 నుంచి 24.12.2024.
» **వెబ్‌సైట్:** https://www.cbse.gov.in

ఎస్‌బీఐ బ్యాంక్‌లో 169 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌బీఐ శాఖల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 169.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(ఇంజనీర్-సివిల్)-43, అసిస్టెంట్ మేనేజర్(ఇంజనీర్-ఎలక్ట్రికల్)-25, అసిస్టెంట్ మేనేజర్(ఇంజనీర్-ఫైర్)-101.
» **అర్హత:** బీఈ/బీటెక్(సివిల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఫైర్/సేఫ్టీ-ఫైర్ ఇంజనీరింగ్/ఫైర్ టెక్నాలజీ-సేఫ్టీ ఇంజనీరింగ్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.10.2024 నాటికి అసిస్టెంట్ మేనేజర్(ఇంజనీర్-ఫైర్) పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, ఇతర పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920 వరకు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:**ఆన్‌లైన్ రాతపరీక్ష,ఇంటరాక్షన్ ఆధారంగా, అసిస్టెంట్ మేనేజర్(ఇంజనీర్-ఫైర్) పోస్టులకు అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటరాక్షన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్/ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు తేదీలు:** 22.11.2024 నుంచి 12.12.2024 వరకు.
» **వెబ్‌సైట్:** https://bank.sbi/web/careers/current-openings



కెరీర్ ట్రెండ్స్

స్టెమ్.. కెరీర్ జెమ్!

స్టెమ్ ప్రోగ్రామ్స్ అనే మాట గత దశాబ్ద కాలంగా బాగా ప్రచారంలోకి వచ్చింది. స్టెమ్ ప్రోగ్రామ్స్ అంటే.. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ కోర్సులు!! ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో.. పరిశ్రమల అవసరాలు, ఉద్యోగార్థులకు అవకాశాల పరంగా టాప్-5లో నిలుస్తున్న ప్రోగ్రామ్స్!! ఈ నాలుగు విభాగాల్లో.. వేటిలో పట్టా పొందినా, ఎందులో నైపుణ్యం సొంతం చేసుకున్నా.. దేశ విదేశాల్లో ఉద్యోగాలకు కొదవలేదు. ఆర్ అండ్ డీలోనూ.. స్టెమ్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. స్టెమ్ ప్రోగ్రామ్స్, వాటి ప్రత్యేకత, ప్రయోజనాలు, కెరీర్ అవకాశాలు, అకడమిక్ మార్గాలు తదితర వివరాలు..

» స్టెమ్ ప్రోగ్రామ్స్‌తో విస్తృత అవకాశాలు
» అంతర్జాతీయంగా స్టెమ్ నిపుణులకు డిమాండ్
» భారత నిపుణులకు పలు దేశాల స్వాగతం

ఏఐ టెక్నాలజీ అయినా.. ఓపెన్ ఏఐ అయినా.. వాటిని కార్యరూపంలోకి తేవాలంటే.. తెరవెనుక సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ నిపుణుల పాత్ర ఎంతో కీలకం. అందుకే ఇప్పుడు ఈ విభాగాల్లో నైపుణ్యం సొంతం చేసుకున్న వారికి అంతర్జాతీయంగా అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్.. ఈ నాలుగు విభాగాలను కలిపి సంక్షిప్తంగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌గా పిలుస్తున్నారు. ఇందుకు కారణం.. ఈ విభాగంలో పేర్కొన్న నాలుగు కోర్సులు ఒకదానికొకటి అనుసంధానంగా ఉండటమే. లేటెస్ట్ టెక్నాలజీస్‌ను రూపొందించే క్రమంలో.. సైన్స్, మ్యాథమెటిక్స్ సూత్రాలను అన్వయించాల్సి ఉంటుంది. ఇదే విధంగా ఇంజనీరింగ్‌కు మూలం సైన్స్, మ్యాథ్స్ సిద్ధాంతాలే.

నిపుణుల కొరత

ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్టెమ్ నిపుణుల కొరత కనిపిస్తోంది. అగ్రరాజ్యం అమెరికా మొదలు యూకే, కెనడా, జర్మనీ, చైనా, భారత్.. ఇలా అన్ని దేశాల్లోనూ స్టెమ్ నిపుణుల కోసం ప్రభుత్వ విభాగాలు, ప్రైవేటు సంస్థలు అన్వేషణ సాగిస్తున్నాయి. కొత్త పరిశోధనలు, సాంకేతికతల ద్వారా నూతన ఆవిష్కరణల దిశగా స్టెమ్ నిపుణుల అవసరం పెరుగుతోంది. స్టెమ్ నిపుణుల డిమాండ్, సప్లయ్ మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తోంది. రీసెర్చ్‌కు కేరాఫ్‌గా భావించే జర్మనీలో, అదే విధంగా అమెరికాలో, యూకేలో.. స్టెమ్ నిపుణులకు డిమాండ్ నెలకొంది.

సైన్స్, మ్యాథమెటిక్స్

స్టెమ్ ప్రోగ్రామ్స్‌లోని నాలుగు విభాగాల్లోఎక్కువ మంది టెక్నాలజీ, ఇంజనీరింగ్ వైపే దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల్లో అధిక శాతం ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సుల్లో చేరుతున్నారు. దీంతో ప్యూర్ సైన్సెస్, మ్యాథమెటిక్స్‌లో అడుగు పెట్టే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. వాస్తవానికి సైన్స్, మ్యాథమెటిక్స్‌ల్లోనే ఎక్కువగా నిపుణుల కొరత నెలకొన్నట్లు పలు అంచనాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా ఆధునిక టెక్నాలజీలుగా పేర్కొంటున్న ఏఐ, బిగ్ డేటా, ఐఓటీ వంటి విభాగాల్లో ఈ నిపుణుల కొరత దాదాపు 40 శాతం మేరకు నెలకొంది.

పెరుగుతున్న ఆసక్తి

స్టెమ్ ప్రోగ్రామ్స్‌పై విద్యార్థుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది. మన దేశంలో గత మూడేళ్లుగా.. స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో చేరే వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఇతర దేశాలతో పోల్చుకుంటే.. స్టెమ్ ప్రోగ్రామ్స్ అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య భారత్‌లోనే ఎక్కువగా ఉంది. సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో రీసెర్చ్ అభ్యర్థులకు పలు ప్రోత్సాహకాలు అందించడం ఇందుకు ఒక కారణంగా చెప్పొచ్చు. దీంతో పాటు ఈ కోర్సులను పూర్తి చేసుకుంటే.. అధిక వేతనాలతో కెరీర్ అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఎక్కువ మంది వీటిల్లో చేరుతున్నారు.

ప్రోత్సాహకాలు

దేశంలో సైన్స్, మ్యాథమెటిక్స్‌లో నిపుణులను తీర్చిదిద్దాలని, తద్వారా పరిశోధనలు, ఆవిష్కరణలు పెంచాలనే ఉద్దేశంతో పలు చర్యలు చేపడుతున్నారు. హైస్కూల్ నుంచి యూనివర్సిటీ స్థాయి వరకూ.. సైన్స్, మ్యాథమెటిక్స్ విద్యార్థులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఫీజులు, ఇతర అకడమిక్ ఖర్చుల కోణంలో రాయితీలు అందిస్తున్నారు. ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్పులు లభిస్తున్నాయి. యూనివర్సిటీ స్థాయిలో ఇటీవల పీహెచ్‌డీలో చేరే విద్యార్థులకు ప్రభుత్వం ఫెలోషిప్‌లను పెంచింది. వీటన్నింటి ఫలితంగా ప్రస్తుతం ఈ ప్రోగ్రామ్స్‌లో చేరుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ప్రత్యేక ఇన్‌స్టిట్యూట్స్

స్టెమ్ ప్రోగ్రామ్స్ నిపుణులకు ఉన్నత స్థాయిలో ప్రత్యేక నైపుణ్యాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఐఐఎస్‌ఈఆర్(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) పేరుతో ప్రత్యేక ఇన్‌స్టిట్యూట్స్‌ను నెలకొల్పింది. వీటితోపాటు స్థానిక యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీల్లో సైన్స్, మ్యాథమెటిక్స్ మేజర్స్‌గా ప్రత్యేక కోర్సులను అందిస్తున్నారు.

డేటా సైన్స్, డేటా అనలిటిక్స్

దేశంలోని పలు మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్ ఎంబీఏ, పీజీడీఎం స్థాయిలో స్టెమ్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తున్నాయి. ముఖ్యంగా డేటా సైన్స్, డేటా అనలిటిక్స్‌కు ప్రాధాన్యమిస్తున్నాయి. కార్పొరేట్ ప్రపంచంలో డేటా సైన్స్, డేటా అనలిటిక్స్‌కు ప్రాధాన్యం పెరగడమే ఇందుకు కారణం. అనలిటిక్స్‌లో నైపుణ్యానికి టెక్ స్కిల్స్ పునాదిగా నిలుస్తున్నాయి. ఈ అనలిటిక్స్ ఆధారంగా వ్యాపార వ్యూహాలు రూపొందించడానికి మేనేజ్‌మెంట్ నిపుణుల అవసరం నెలకొంది. దీంతో మేనేజ్‌మెంట్ విద్యార్థులకే డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్ వంటి నైపుణ్యాలను బోధిస్తే.. రెండు రకాల నైపుణ్యాలు సొంతమై కార్పొరేట్ ఆఫర్లు లభిస్తాయని భావిస్తున్నారు. ఈ కోర్సుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు.

విస్తృత నైపుణ్యాలు

స్టెమ్ ప్రోగ్రామ్స్ పూర్తి చేసుకుంటే.. ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, అనలిటికల్ నైపుణ్యాలు, రీసెర్చ్ ఓరియెంటేషన్ స్కిల్స్ సొంతమవుతాయి. వీటి ఫలితంగా విద్యార్థులు ఆయా విభాగాల్లో భవిష్యత్తులో విధుల నిర్వహణపరంగా మెరుగైన పనితీరు కనబరుస్తారని కంపెనీలు విశ్వసిస్తున్నాయి.

ఉపాధి అవకాశాలు

స్టెమ్ గ్రాడ్యుయేట్స్‌కు ప్రస్తుతం అన్ని విభాగాల్లోనూ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ అండ్ డీ, మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు, బయో మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్, హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్స్, ఐటీ సంస్థలు.. ఇలా పదుల సంఖ్యలో ఆయా రంగాల్లోని కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇంజనీరింగ్, టెక్నాలజీకి సంబంధించి సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఐఓటీ తదితర విభాగాల్లో ప్రోగ్రామర్స్‌కు ఆఫర్స్ లభిస్తున్నాయి.

ఆకర్షణీయ వేతనాలు

స్టెమ్ ప్రోగ్రామ్ నిపుణులకు ఆకర్షణీయమైన వేతనాలు లభిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఉన్న వారికి సగటున నెలకు రూ.30 వేల వేతనం అందుతోంది. పీజీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు వారి స్పెషలైజేషన్‌కు అనుగుణంగా..నెలకు రూ.50 వేల వేతనం లభిస్తోంది. పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.లక్ష వరకు వేతనం ఇవ్వడానికి సైతం సంస్థలు సిద్ధంగా ఉంటున్నాయి.

అకడమిక్ మార్గాలు ఇవే

మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌ల్లో చేరే వీలుంది. అదేవిధంగా ఇంజనీరింగ్, టెక్నాలజీలో చేరాలనుకునే వారికి బీఈ/బీటెక్ కోర్సులను ఆయా ఇన్‌స్టిట్యూట్స్ అందిస్తున్నాయి. వీటితో పాటు సీయూఈటీ-యూజీ, పీజీ ఎంట్రన్స్‌లలో ఉత్తీర్ణత ఆధారంగా.. మ్యాథమెటిక్స్, సైన్స్‌కు సంబంధించి ప్రతిష్టాత్మక సెంట్రల్ యూనివర్సిటీల్లో అడుగు పెట్టొచ్చు. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, గేట్, జామ్ తదితర ఎంట్రెన్స్‌లలో ప్రతిభ చూపడం ద్వారా ఐఐటీలు, ఎన్‌ఐటీలు వంటి ప్రతిష్టాత్మక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్ తోపాటు మరెన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశించొచ్చు.

ఆసక్తి ప్రధానం

స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో రాణించాలంటే.. సంబంధిత సబ్జెక్ట్‌లపై ఆసక్తి ప్రధానమని నిపుణులు పేర్కొంటున్నారు. జాబ్ మార్కెట్ ఉద్దేశంతో కాకుండా సబ్జెక్టులపై ఆసక్తి పెంచుకొని స్టెమ్ కోర్సులను అధ్యయనం చేయాలని సూచిస్తున్నారు. అనలిటికల్ స్కిల్స్, అప్లికేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు పెంచుకోవాలని పేర్కొంటున్నారు. సబ్జెక్ట్‌లను విశ్లేషిస్తూ.. ఆయా అంశాలపై వాస్తవ పరిస్థితులను అన్వయం చేస్తూ ప్రాక్టీస్‌తో కూడిన అభ్యసనం చేయాలి. అప్పుడే చక్కటి నైపుణ్యాలు లభిస్తాయి. ఫలితంగా మెరుగైన కెరీర్ అవకాశాలు సొంతమవుతాయి.

క్లుప్తంగా...

స్వతంత్ర కమిషనర్‌ను ఎప్పుడు నియమిస్తారు?

- దివ్యాంగుల పిటిషన్‌లో సర్కార్‌ను ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులకు స్వతంత్ర రాష్ట్ర కమిషనర్‌ను ఎప్పుడు నియమిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సర్కార్ నుంచి సూచనలు పొంది వివరణ ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాదికి స్పష్టం చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 2కు వాయిదా వేసింది. వికలాంగుల హక్కుల (ఆర్‌పీడబ్ల్యూడీ) చట్టం, 2016లోని సెక్షన్ 79(1)లో పేర్కొన్న విధంగా రాష్ట్రంలో దివ్యాంగులకు స్వతంత్ర రాష్ట్ర కమిషనర్‌ను నియమించాలని కోరుతూ హైకోర్టులో ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ వైస్ ప్రెసిడెంట్ పి.చొక్కారావు, రాష్ట్ర అంధ అభివృద్ధి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్య పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున ముక్కెర సాహితీశ్రీ కావ్య వాదనలు వినిపించారు. దివ్యాంగుల కోసం ఇండిపెండెంట్ స్టేట్ కమిషనర్‌ను నియమించే బాధ్యతను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ డైరెక్టరే కమిషనర్‌గా విధులు నిర్వర్తించేలా 2017, జూలైలో జీవో 13ను సర్కార్ తీసుకొచ్చిందన్నారు. రెండు బాధ్యతలతో సంక్షేమ పథకాలను పర్యవేక్షించడం సాధ్యం కాదని చెప్పారు. ఎవరిపై ఫిర్యాదు చేస్తారో అతనే విచారణాధికారిగా ఉంటే న్యాయం అందడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దివ్యాంగుల హక్కుల రక్షణకు స్వతంత్ర రాష్ట్ర కమిషనర్‌ను నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణ వాయిదా వేశారు.

నకిలీ మందుల తయారీ సమాచారం ఇవ్వండి

- డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నకిలీ మందుల తయారీకి సంబంధించి ఏవైనా సమాచారం ఉంటే వెంటనే డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ (డీసీఏ) అధికారులకు సమాచారం ఇవ్వాలని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ప్రజలను కోరారు. అధిక ధరలకు మందుల విక్రయం, అనుమతులు లేకుండా మందుల నిల్వ విక్రయాలు, తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసగిస్తున్న ఆస్పత్రులు, మెడికల్ షాప్‌లపై డీసీఏ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజలు కూడా ఈ అంశాలకు సంబంధించిన సమాచారం ఉంటే డీసీఏ దృష్టికి తేవాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ టోల్‌ఫ్రీ నంబర్ 1800–599–6969కు ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదు చేయొచ్చని కమలాసన్‌రెడ్డి తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లు నడిపేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు కాచిగూడ–కొట్టాయం (07133/07134) స్పెషల్ ట్రైన్ డిసెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో మధ్యాహ్నం 3.40 గంటలకు బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 6.50 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో డిసెంబర్ 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు కొట్టాయం నుంచి బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. నాంపల్లి–కొట్టాయం (07135/07136) డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 4.10 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో డిసెంబర్ 4, 11, 18, 25, జనవరి 1 తేదీల్లో సాయంత్రం 6.10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు నాంపల్లికి చేరుకుంటుంది.

డిసెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్

పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ డిసెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో రవాణాశాఖ జాయింట్ కమిషనర్ రమేశ్‌కు సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బి.వెంకటేశం, ఎస్.అశోక్, ఎం.ఎ.సలీమ్, ఎ.సత్తిరెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని లెక్కలేనన్ని ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు, వినతిపత్రాలు అందచేసినా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటో చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఫ్రీ బస్సు పథకంవల్ల గిరాకీ రాక ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని, గ్రేటర్‌లో 20 వేల కొత్త ఆటోపర్మిట్‌లు ఇవ్వాలని, యాక్సిడెంట్ బీమాను రూ.10 లక్షలకు పెంచాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆటోడ్రైవర్లకు ఏటారూ.12 వేల ఆర్థికసాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మర్రి చెట్ల రక్షణపై కప్పదాటు తీరు



మొయినాబాద్ సమీపంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి వీలుగా తాజాగా నేలను చదును చేసిన దృశ్యం

ఎన్‌హెచ్‌ఏఐ వైఖరితో అప్పా జంక్షన్–మన్నెగూడ రోడ్డు విస్తరణలో జాప్యం

- ఎన్జీటీ తాజా ఆదేశాలతో పనులకు బ్రేక్
- కేంద్ర పర్యావరణ శాఖ సిఫారసులు సమర్పించని ఎన్‌హెచ్‌ఏఐ
- తమకు పనుల ప్లాన్‌తో కూడిన నివేదిక సమర్పించాలన్న ఎన్జీటీ

సాక్షి, హైదరాబాద్: తొమ్మిది వందలకు పైగా ఊడల మర్రి వృక్షాలను కాపాడే విషయంలో ఎన్‌హెచ్‌ఏఐ దాటవేత ధోరణి, అప్పా జంక్షన్– మన్నెగూడ రోడ్డు విస్తరణకు ఆటంకంగా మారింది. మర్రి చెట్లను కాపాడేందుకు పక్కా చర్యలు చేపట్టాలన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలను కూడా అమలు చేయకుండా హడావుడిగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు మరోసారి బ్రేక్ పడింది. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అధీనంలోని నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) ఇచ్చిన నివేదికను ఎన్‌హెచ్‌ఏఐ తొక్కిపెట్టిన విషయాన్ని ఎన్జీటీ తీవ్రంగా పరిగణించింది. సోమవారం విచారణ సందర్భంగా.. ఈఏసీ సిఫారసుల వివరాలను తనకు సమర్పించాలని, వాటిల్లో వేటివేటిని ఎలా అమలు చేస్తారో ప్లాన్‌ను అందివ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. అయితే ఈ కేసు విచారణ ముగిసిపోతుందని భావించిన ఎన్‌హెచ్‌ఏఐ, పక్షం రోజుల క్రితం రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. తాజాగా ఎన్జీటీ ఆదేశంతో ఆ పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎన్జీటీ వద్దకు మర్రి చెట్ల తొలగింపు అంశం

హైదరాబాద్ నగరంలోని అప్పా జంక్షన్ నుంచి వికారాబాద్ రోడ్డులోని మన్నెగూడ వరకు జాతీయ రహదారిని నాలుగు వరసలతో 60 మీటర్లకు ఎన్‌హెచ్‌ఏఐ విస్తరిస్తోంది. ఈ రోడ్డు కర్ణాటకలోని బీజాపూర్ వరకు కొనసాగుతుంది. మన్నెగూడ తర్వాతి నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డును రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని జాతీయ రహదారుల విభాగం ఇప్పటికే విస్తరించింది. అయితే నగరం నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ. నిడివి ఎన్‌హెచ్‌ఏఐ అధీనంలో ఉంది. దాదాపు రూ.950 కోట్లతో ఈ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే 46 కి.మీ. రోడ్డుకిరువైపులా 915 మర్రి చెట్లున్నాయి. అయితే మొయినాబాద్, చేవెళ్ల పట్టణాల వద్ద బైపాస్ రోడ్ల నిర్మాణంతో వాటిల్లోని 232 చెట్లను తొలగించాల్సిన పని లేకుండా పోయింది. మిగతా చెట్లను తొలగించాల్సి ఉండగా.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కొందరు సాధారణ వ్యక్తులు వాటి రక్షణ ఉద్యమం ప్రారంభించారు. దీంతో ఆ చెట్లను తొలగించబోమని, మరో ప్రాంతానికి తరలించి నాటి కాపాడతామని ఎన్‌హెచ్‌ఏఐ హామీ ఇచ్చింది. గతంలో ఇలాంటి హామీలు నెరవేరిన దాఖలాలు లేని నేపథ్యంలో, వారు ఎన్జీటీని ఆశ్రయించారు.

ఈఏసీ నివేదిక ఏది?

పలు దఫాల విచారణ అనంతరం, ఆ వృక్షాల తొలగింపు వల్ల పర్యావరణంపై ఉండే ప్రభావాన్ని అంచనా వేయాలంటూ కేంద్ర అటవీ పర్యావరణ శాఖను ఎన్జీటీ ఆదేశించింది. దీంతో గత జనవరిలో ఆ శాఖ అధీనంలోని ఈఏసీ ఆ ప్రాంతంలో అధ్యయనం చేసి ఎన్‌హెచ్‌ఏఐకి కొన్ని సిఫారసులతో నివేదిక సమర్పించింది. ఆ నివేదికలోని కొన్ని అంశాల మేరకు చర్యలు తీసుకున్నామని పేర్కొంటూ ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐ రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. మొయినాబాద్, చేవెళ్ల ప్రాంతాల్లో దాదాపు 11 కి.మీ. మేర నిర్మించే బైపాస్ రోడ్ల పనులు ప్రారంభించింది. కాగా సోమవారం ఎన్జీటీలో తుది విచారణ జరగాల్సి ఉండగా.. తనకు ఎన్‌హెచ్‌ఏఐ సమర్పించిన నివేదిక సరిగా లేదని భావించిన ట్రిబ్యునల్.. ఈఏసీ ఇచ్చిన నివేదిక ఏదంటూ ప్రశ్నించింది. తమకు ఆ నివేదిక ఎందుకు సమర్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆ నివేదికలోని సిఫారసులు, వాటి అమలుకు ఎన్‌హెచ్‌ఏఐ రూపొందించిన ప్రణాళికలు తాము పరిశీలించాల్సిందేనని పేర్కొంది. వచ్చే నెలలో దీనిపై విచారణ చేపడతామని తెలిపింది.

మొత్తం 915 వృక్షాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణం వల్ల 232 చెట్లను తొలగించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈఏసీ సిఫారసు ప్రకారం.. అలైన్‌మెంటులో స్వల్ప మార్పు వల్ల మరో 50 వృక్షాలను కూడా తొలగించాల్సిన అవసరం ఉండటం లేదు. ఇక ముడిమ్యాల అటవీ ప్రాంతం

522 చెట్లపై ఏం చేస్తుందో?

వద్ద ఉండే కొన్ని చెట్లు సహా మొత్తం 393 వృక్షాలు అలాగే ఉంటాయి. మిగతా 522 వృక్షాలను రక్షించాల్సి ఉంది. కానీ ఇక్కడే ఆ విభాగం ఎన్‌హెచ్‌ఏఐ కప్పదాటు తరహాలో వ్యవహరిస్తోంది. ఖర్చును తప్పించుకునేందుకే ఇలా చేస్తోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



ముగ్గురికి ఒకటే..

ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉన్నా సర్కారు దవాఖానాల తీరు మారడంలేదు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి పిల్లల వార్డు నుంచి పక్క భవనంలో ఉన్న ఎక్స్‌రే సెంటర్‌కు వెళ్లేందుకు డాక్టర్ లేకుండానే ముగ్గురు పిల్లలకు కలిపి ఒకే సిలిండర్‌తో ఆక్సిజన్ పెట్టి, వార్డు సిబ్బంది వారిని తరలించిన తీరు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆస్పత్రిలో సోమవారం ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. –సాక్షి, ఫొటోగ్రాఫర్ వరంగల్

ఐఐటీ డైరెక్టర్‌తో కలసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని పరిశీలిస్తున్న నికాన్ ప్రతినిధులు



వెంట్రుకలో వెయ్యో వంతునూ చూడొచ్చు!

- హైదరాబాద్ ఐఐటీలో అత్యాధునిక పరికరాలతో కూడిన ల్యాబ్ ఏర్పాటు
- దేశంలోనే తొలి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఐఐటీహెచ్‌లో నెలకొల్పిన జపాన్ సంస్థ నికాన్
- కేన్సర్ కణాలు, రోగనిర్ధారణ ప్రక్రియలో పరిశోధనలకు ఎంతో ఉపయోగం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జపాన్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫొటోగ్రాఫిక్ సాధనాల తయారీ సంస్థ 'నికాన్'.. దేశంలోనే తొలిసారిగా అడ్వాన్స్‌డ్ ఇమేజింగ్ టెక్నాలజీస్‌తో కూడిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించింది. కణం మొదలు కణజాలం వరకు జీవ వ్యవస్థలకు సంబంధించిన విభిన్న పరిశోధనల్లో దోహదపడేందుకు వీలుగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఒక వెంట్రుకలో కేవలం వెయ్యో వంతులో ఉండే సూక్ష్మ పదార్థాన్ని కూడా పరిశీలించే సామర్థ్యం ఇందులోని హై రిజల్యూషన్ ఇమేజింగ్ పరికరాలకు ఉందని.. కేన్సర్ కణాలపై పరిశోధనలతోపాటు స్కానింగ్ ప్రక్రియలకు సంబంధించిన పరిశోధనలకు ఈ కేంద్రం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు. ఈ కేంద్రంలో ఏఎక్స్ఆర్ పాయింట్ స్కానింగ్ కాన్ఫోకల్ వ్యవస్థతోపాటు ఎన్–స్పార్క్ సూపర్ రిజల్యూషన్, టీఐఆర్ఎఫ్ వంటి ఇమేజింగ్ సామర్థ్య వ్యవస్థలు ఉన్నాయని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శౌర్యదత్తగుప్తా తెలిపారు. ఫ్లోరొసెన్స్ ఇమేజింగ్ కోసం నికాన్ ఇన్వర్టెడ్ మైక్రోస్కోప్ టీఐ–2ఈ ఉందన్నారు. అలాగే ఇన్వర్టెడ్ టిష్యూ కల్చర్ మైక్రోస్కోప్ నికాన్ టీఎస్2ఎఫ్ఎల్, మాక్రో ఇమేజింగ్ కోసం నికాన్ ఎస్ఎంజెడ్ 800 ఫ్లోరొసెన్స్ అటాచ్‌మెంట్ సదుపాయం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో నికాన్ ఇండియా ఎండీ సజ్జన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సౌమ్యాస్వామినాథన్‌కు ఎఫ్ఏబీఏ 'లైఫ్‌టైమ్ అవార్డు'



సౌమ్యా స్వామినాథన్‌కు అవార్డును అందిస్తున్న హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు

రాయదుర్గం (హైదరాబాద్): గ్లోబల్ హెల్త్ రంగంలో డాక్టర్ సౌమ్యా స్వామినాథన్ చేసిన కృషిని గుర్తించి ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందించింది. ఆమె ప్రస్తుతం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమానికి ప్రధాన సలహాదారుగా పనిచేస్తున్నారు. సోమవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఎఫ్ఏబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పల్లు రెడ్డన్నల చేతుల మీదుగా ఆమెకు అవార్డును అందించి, సత్కరించారు. వైద్య పరిశోధన, ప్రజారోగ్యం, టీబీ, హెచ్ఐవీ రంగాలలో సౌమ్యా స్వామినాథన్ చేసిన విశిష్ట సహకారాన్ని ఈ పురస్కారంతో గుర్తించినట్లయింది. డబ్ల్యూహెచ్ఓలోనూ ప్రధాన శాస్త్రవేత్తగా ఆమె కీలకపాత్ర పోషించారు. హెచ్‌సీయూలో సోమవారం 'జర్నీ ఆఫ్ టీబీ అండ్ కోవిడ్: లెసన్స్ ఫర్ ఫ్యూచర్ చాలెంజెస్'అనే అంశంపై డాక్టర్ సౌమ్యా గోల్డెన్ జూబ్లీ విశిష్ట ఉపన్యాసం చేశారు. ప్రపంచ ఆరోగ్యానికి టీబీ, కోవిడ్ అంటు వ్యాధులు సవాల్ విసిరాయని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. రాబోయే ప్రజారోగ్య సవాళ్లను ఎదుర్కోవడంలో అందరూ సంసిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, ఎఫ్ఏబీఏ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాయునాణ్యత 'సోషల్' ప్రచారంపై ఆందోళన వద్దు: టీజీపీసీబీ

సాక్షి, హైదరాబాద్: దేశ రాజధాని ఢిల్లీతో సమానంగా హైదరాబాద్‌లో వాయునాణ్యత స్థాయి క్షీణించిందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారం సరికాదని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పేర్కొంది. వాయు నాణ్యత స్థాయి సూచిక (ఏక్యూఐ) 300 పాయింట్లతో ఢిల్లీ స్థాయికి సమానంగా హైదరాబాద్‌లో ఉందంటూ గాలి నాణ్యత క్షీణతపై సోషల్ మీడియాలో వైరల్ అయిన సందేశంతో ఆందోళన చెందొద్దని స్పష్టం చేసింది. చాలా యాప్‌లు యూరప్, అమెరికా ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ ఆధారంగా ఏక్యూఐని గణిస్తున్నాయని ఒక ప్రకటనలో తెలిపింది. అది మనకు వర్తించదని, ఆ ప్రమాణాలను బట్టి చూస్తే ఇది అధిక వాయుకాలుష్యాన్ని సూచిస్తోందన్న విషయాన్ని గమనించాలని కోరింది. ఈ నేపథ్యంలో ప్రజలు హైదరాబాద్‌కి సంబంధించిన ఏక్యూఐను తెలుసుకోవడానికి 'సమీర్'యాప్‌ను ఉపయోగించాలని సూచించింది. ధ్రువీకరణ తర్వాత ఇచ్చే ఏక్యూఐ సందేశాలకోసం ఈ యాప్‌ని ఉపయోగించాలని టీజీపీసీబీ తెలిపింది.

కోహీర్ గజగజ.. 8.8 డిగ్రీల ఉష్ణోగ్రత

చలి తీవ్రతలో రాష్ట్రంలోనే రెండో స్థానం • ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో చలి తీవ్రత కొనసాగుతోంది. సోమవారం ఏకంగా 8.8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోకెల్లా అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాల్లో కోహీర్ రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ) మండలంలో ఇటీవల 8.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. అలాగే న్యాల్‌కల్‌లో 9.6 డిగ్రీలు, కంగ్టిలో 9.8 డిగ్రీలు, గుమ్మడిదల మండలం నల్లవెల్లిలో 10 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వాతావరణశాఖ ఈ మూడు చోట్ల ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల నుంచి 4 డిగ్రీల మధ్య నమోదైతే వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తుంది. 4 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైతే రెడ్ అలర్ట్ ప్రకటిస్తుంది. ఒక్క అమీన్‌పూర్‌లో మాత్రం కనిష్ట ఉష్ణోగ్రత 17.2 డిగ్రీలు ఉండగా మిగిలిన చోట్ల 10 డిగ్రీల నుంచి 14.6 డిగ్రీలలోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

మధ్యాహ్నం నుంచే గజగజ..

సంగారెడ్డి జిల్లాలో ఉష్ణోగ్రతలు అతితక్కువగా నమోదవుతుండటంతో చలికి జనం వణికిపోతున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచే చలి పులి పంజా విసురుతోంది. సాయంత్రం వేళల్లో చలి తీవ్రత మరింత పెరుగుతోంది. అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విదేశీ విషసర్పాలు..

బ్యాంకాక్ నుంచి లగేజీలో తీసుకొచ్చిన ఇద్దరు మహిళలు

శంషాబాద్: అవి విదేశీ విషసర్పాలు.. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికులతోపాటే అవి కూడా ఆర్‌జీఐఏ ఎయిర్‌పోర్టులో దిగాయి.. ఇద్దరు మహిళలు దాచుకొని అక్రమంగా తీసుకొచ్చిన ఆ పాములు ఒక్కసారిగా కలకలం రేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికులను ఎప్పటిలాగే కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇద్దరు మహిళలు గుండ్రంగా ఉన్న బ్యాగులతో తనిఖీల వద్దకు వచ్చారు. అనుమానించిన అధికారులు వాటిని విప్పి చూడగా రెండు బ్యాగుల్లో రెండు బుట్టలు కనిపించాయి. వాటిని విప్పిచూడగా అరుదైన అల్బినో స్నేక్ (నారింజ రంగులో ఉండి లేత గులాబీ రంగులో నోటి భాగం ఉన్న రెండు విషపూరితమైన పాములు) కనిపించడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. దీంతో వెంటనే అటవీశాఖ అధికారులను రప్పించి పాములకు సంబంధించిన వివరాలు సేకరించి ప్రత్యేక పర్యవేక్షణలో వాటిని తిప్పిపంపినట్టు సమాచారం. సాధారణ ప్రయాణికుల్లా విమానంలో తీసుకొచ్చిన ఆ మహిళలు.. వాటిని స్మగ్లింగ్ చేస్తున్నారా ? లేదా వేరే ఎవరి కోసమైనా కొరియర్లుగా వాటిని తీసుకొచ్చారా ? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపడుతున్నారు. పక్షులు లేదా ఏ ఇతర జంతువులను విదేశాలకు రవాణా చేసినా లేదా దిగుమతి చేసుకున్నా క్వారంటైన్ నిబంధనలతో వాటిని చట్టబద్ధంగా తరలిస్తుంటారు. ఇక్కడ మాత్రం మహిళలు తమ బ్యాగుల్లోనే వాటిని తీసుకొచ్చారు. ఇటీవల చెన్నైలో కూడా కౌలాలంపూర్ నుంచి పెద్ద ఎత్తున తీసుకొచ్చిన విదేశీ జంతువులు, సర్పాలు బయటపడ్డాయి. రెండు నెలల వ్యవధిలో దేశవ్యాప్తంగా విదేశీ జంతువులు, విషసర్పాల అక్రమ రవాణాలో ఇది మూడోదిగా పేర్కొంటున్నారు. మహిళలు ఎక్కడివారు అన్న విషయాలను అధికారులు గోప్యంగా ఉంచారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

వడివడిగా థర్మల్ పవర్ ప్రాజెక్టు

స్టేజీ-2కు అడుగులు

- రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం
- స్టేజీ-1 కింద ఇప్పటికే పూర్తయిన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్
- స్టేజీ-2 ద్వారా రూ.29,344.85 కోట్లతో 2,400 మెగావాట్ల ప్రాజెక్టు ఏర్పాటు
- దీనికోసం ఈనెల 29న ప్రజాభిప్రాయ సేకరణ

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఆవరణలో తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ-2 నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. స్టేజీ-1లోని ఒకటి, రెండో యూనిట్లలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కావడంతో మొత్తంగా 1,600 మెగావాట్లు (ఒక్కోటి 800 మెగావాట్లు) అందుబాటులోకి వచ్చాయి. తద్వారా స్టేజీ-1 తొలిదశ పూర్తయ్యినట్టయ్యింది. స్టేజీ-1లో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85 శాతం తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేస్తున్నారు. స్టేజీ-2లోని 2,400 మెగావాట్ల (ఒక్కోటి 800 మెగావాట్ల మూడు యూనిట్లు) ప్రాజెక్టు కోసం ఈనెల 29న ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీహెచ్ఎస్ మైదానంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు.

– సాక్షి, పెద్దపల్లి

పునర్విభజన చట్టం ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ క్రమంలో తొలుత తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ-1లో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇందుకోసం సింగరేణి సంస్థ నుంచి ఏటా 68.5 లక్షల టన్నుల బొగ్గును ఎన్టీపీసీకి సరఫరా చేసేలా ఒప్పందం జరిగింది. ప్రస్తుతం స్టేజీ-2లో భాగంగా 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్ల నిర్మాణానికి రూ.29,344.85 కోట్లకు ఎన్టీపీసీ బోర్డు డైరెక్టర్లు ఇటీవల ఆమోదం తెలిపారు. ప్లాంట్‌లో భాగంగా నిర్మించే యాష్ పాండ్ కోసం ఇప్పటికే అధికారులు 606 ఎకరాల్లో సర్వే చేశారు.

పర్యావరణ పరిరక్షణ చర్యలు

పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్టీపీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రాజెక్టు ఆవరణలో అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో అధిక సామర్థ్యం గల ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్, ఎఫ్‌జీడీ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ నిర్వహణలో 275 మీటర్ల చిమ్నీ, గ్యాస్ డిసల్ఫరైజేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగించడంతో బొగ్గు వినియోగం భారీగా తగ్గుతుంది. దీంతో తక్కువ కాలుష్యం వెలువడుతుందని అధికారులు చెబుతున్నారు.



ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధంగా ఉన్న జెడ్పీహెచ్ఎస్ స్కూల్



ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు



అంబేడ్కర్ మాటలను అంతఃకరణశుద్ధితో ఆచరిస్తున్నాం

అటవీ శాఖమంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగంలో పొందుపరిచిన నిబంధనల కన్నా పాలకుల స్వీయ నైతికతే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుందన్న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మాటలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అంతఃకరణశుద్ధితో ఆచరిస్తోందని అటవీ శాఖమంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని అన్ని గ్రామ పంచాయతీల వికాసం కోసం ప్రభుత్వం 'పనుల జాతర'ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూ.2,750 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. భారత రాజ్యాంగానికి ఆమోదం లభించిన నవంబర్ 26 దేశ ప్రజలందరికీ ఎంతో ప్రత్యేకమైందని సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్యానంతరం దశ దిశ లేని దేశానికి నూతన రాజ్యాంగంతో జవసత్వాలు సమకూరి, గొప్పగా పురోగమించిందని తెలిపారు.



18న విద్యార్థి నిరుద్యోగ కృతజ్ఞత సభ

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రులు

సాక్షి, హైదరాబాద్: ఏడాదిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో 55 వేల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసి విద్యార్థి నిరుద్యోగుల స్వర్ణయుగంగా మార్చారని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ తెలిపారు. ఈ మేరకు వచ్చే నెల 18న ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థి, నిరుద్యోగ కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా కృతజ్ఞత సభ కరపత్రాన్ని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలు నాశనం అయ్యాయని, కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన లోపభూయిష్ట విధానాల వల్ల ఒక తరం విద్యార్థి నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని మానవతారాయ్ ఆరోపించారు. కార్యక్రమంలో చామకూరి శ్రీధర్‌గౌడ్, బైరు నాగరాజు, మల్యాల కార్తీక్‌రెడ్డి, రెడ్డి శ్రీను, పట్ల నాగరాజు, బోనాల నగేశ్, మణికంఠ, పొన్న రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా చేతుల మీదుగా న్యాయశ్రీ-2024 పురస్కారం అందుకుంటున్న హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ కార్యదర్శి శాంతి భూషణ్. చిత్రంలో న్యాయవాది డీఎల్ పాండు, దైవజ్ఞ శర్మ తదితరులు



కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కోటి దిపోత్సవానికి భారీగా హాజరైన భక్తులు

సీఎం తన హోదా మరిచి మాట్లాడుతున్నారు

బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి తన హోదాను మరిచి, దిగజారి రోజుకోమాట మాట్లాడుతున్నారని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు సోయి లేకుండా, ఎజెండా లేకుండా కేవలం హెడ్‌లైన్స్ కోసం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లేముందు సీఎం ఇష్టానుసారంగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. సోమవారం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ అదానీ దగ్గర తీసుకున్న రూ.100 కోట్ల చెక్‌ను ఎవరికి భయపడి వెనక్కి ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'అగ్రిమెంట్ చేసుకున్నప్పుడు రాహుల్ గాంధీకి భయపడలేదు. చెక్ వాపస్ ఇవ్వకపోతే రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వనని చెప్పారా?' అని ప్రశ్నించారు. లగచర్లలో ఫార్మా కంపెనీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని మళ్లీ మాట మార్చి బాధ్యతారాహిత్యంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ 16 స్థానాలకే పరిమితమై ఓ తోకపార్టీగా మారిపోయిందని ఎద్దేవాచేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు మహారాష్ట్రలో పట్టిన గతే పట్టిస్తామని హెచ్చరించారు.

ఆందోళన పడొద్దు.. అండగా ఉంటాం

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: జీహెచ్ఎంసీ పరిధిలో హౌజింగ్ సొసైటీలకు భూ కేటాయింపులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై జర్నలిస్టులు ఆందోళన చెందవద్దని, వారికి అండగా ఉంటామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి భరోసా ఇచ్చారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. సోమవారం ఢిల్లీలో మల్లు రవి విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులకు మళ్లీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏమైనా అవకాశాలున్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా చదివి జర్నలిస్టులకు న్యాయం చేసేందుకు సీఎంతో పాటు కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని రవి తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీం తీర్పు దురదృష్టకరం

టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు అల్లం నారాయణ

సాక్షి, హైదరాబాద్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల సొంత ఇంటి స్థలాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అత్యంత దురదృష్టకరమని టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు అల్లం నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల విషయంలో సుప్రీంకోర్టు మానవీయకోణంలో ఆలోచించి ఉండాల్సిందని సోమవారం ఒక ప్రకటనలో ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులకు న్యాయం జరిగేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని కోరారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి గత, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల నిర్ణయం చెల్లదంటూ కోర్టు చెప్పడం బాధాకరమన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు తీర్పు బాధాకరం

ప్రభుత్వం వెంటనే స్పందించాలి: టీడబ్ల్యూజేఎఫ్

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వం ఇచ్చిన భూముల కేటాయింపులను రద్దు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య పేర్కొన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలిచ్చే విషయంలో సుప్రీంకోర్టు మానవీయ కోణంలో ఆలోచించి తీర్పు ఇవ్వాల్సిందని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాల వైఫల్యం, నిర్లక్ష్యం, తప్పుడు విధానాల కారణంగానే ఇలాంటి పరిణామాలు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు సమన్వయంతో కమిటీ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఐక్యతను ప్రదర్శించి జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రభుత్వం కూడా వెంటనే న్యాయ నిపుణులను సంప్రదించి భవిష్యత్తులో న్యాయపరమైన అడ్డంకులు రాకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు.

తెలంగాణ అన్నవరం..

యాదగిరిగుట్ట

కార్తీకమాసంలో సత్యదేవుని వ్రతాలకు ప్రసిద్ధి

- ఇతర రాష్ట్రాలనుంచి భారీగా భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దేవస్థానం



శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

సత్యనారాయణస్వామి వ్రతాలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం.. తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం క్షేత్రం తర్వాత.. ఆ స్థాయిలో యాదగిరిగుట్టలోనే వ్రతాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఏటా లక్షకు పైనే వ్రతాలు నిర్వహిస్తుండటం విశేషం. కార్తీకమాసం, శ్రావణమాసంలో వ్రతాలు ఆచరించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వ్రత పూజల కోసం కొండ దిగువన అధునాతన మండపం నిర్మించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా దేవస్థానం సౌకర్యాలు కల్పిస్తుండడంతో ఏటేటా వ్రతాల సంఖ్య పెరుగుతోంది. తెలంగాణ మంచే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు పలు రాష్ట్రాల భక్తులు వచ్చి వ్రత పూజలు చేస్తున్నారు.

– సాక్షి, యాదాద్రి

రోజూ అయిదు బ్యాచ్‌లుగా వ్రతాలు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించుకునేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కొండ దిగువన వ్రత మండపంలో శ్రీస్వామి ఫొటోతో కూడిన పీటలు ఏర్పాటు చేశారు. టికెట్‌పై భక్తులకు పూజా సామగ్రిని దేవస్థానం అందజేస్తుంది. రోజూ ఐదు బ్యాచ్‌ల్లో వ్రతాలు జరుగుతున్నాయి. కార్తీకపౌర్ణమి వంటి ప్రత్యేక రోజుల్లో 700 జంటలు వ్రతాలు ఆచరించేలా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. వ్రత సమయాలను వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. వ్రతాలు జరుగుతున్న సమయంలో భక్తుల కుటుంబసభ్యులు.. మండపం బయట నీడలో కూర్చునేందుకు ప్రత్యేకంగా జర్మనీ టెంట్ ఏర్పాటు చేశారు. వ్రతాల అనంతరం కొండపై ప్రసాదాల కొనుగోలుకు ఇబ్బంది కలగకుండా.. వ్రత మండపం పక్కనే ప్రత్యేక ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేశారు. కార్తీక దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేశారు. వ్రతాలు పూర్తికాగానే వ్రత మండపం హాళ్లను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. భక్తుల వాహనాలకు హెలిపాడ్ స్థలంలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

ప్రత్యేక ప్రసాదాల కౌంటర్



కార్తీకమాసంలో యాదగిరిగుట్ట క్షేత్రంలో పెద్ద సంఖ్యలో వ్రతాలు జరుగుతాయి. భక్తు లకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. ఈసారి కార్తీకమాసం మొదలైనప్పటి నుంచి ఆదివారం వరకు 16 వేల వ్రతాలు జరిగాయి. కార్తీక మాసం చివరి వరకు భక్తులు వస్తూ వ్రతాలు ఆచరిస్తుంటారు. భక్తులు ఇబ్బంది పడకుండా వ్రత మండపం వద్ద ప్రత్యేకంగా ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేశాం.

– భాస్కర్‌రావు, ఈవో, యాదగిరిగుట్ట దేవస్థానం

సకల శుభాలు కలుగుతాయి



శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం వల్ల సకల శుభాలు కలుగుతాయి. కొన్ని వందల సంవత్సరాల నుంచి శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో భక్తులు వ్రతాలు చేస్తున్నారు. కార్తీకమాసంలో వ్రతాలు చేసేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఇక్కడ శివకేశవులు కొలువై ఉన్నారు. కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరమైనది.

– నర్సింహమూర్తి, దేవస్థానం అర్చకుడు

వ్రతం చేయిస్తే పుణ్యం



నా తల్లిదండ్రులతో కలి సి వ్రత పూజకు వస్తాను. ప్రతి కార్తీక మాసంలో, వీలైనప్పుడు యాద గిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వ్రతం చేయించి మొక్కులు తీర్చుకుంటాం. ఈసారి కూడా కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి వ్రతం చేశాం.

– స్వర్ణలత, బాలానగర్

పదేళ్లుగా వ్రతం చేస్తున్నాం



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వ్రత పూజ చేస్తే మంచి జరుగుతుందని భావించి ప్రతి కార్తీక మాసంలో ఆలయానికి వస్తాం. కార్తీక మాసంలోనే మా వివాహ వార్షికోత్సవం కావడంతో కలిసి వస్తోంది. వ్రత పూజ చేసిన తరువాత శివుడిని, లక్ష్మీనరసింహస్వామి వారిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకుంటాం.

– వందనపు కరుణశ్రీ, సంస్థాన్ నారాయణపురం.



దేదీప్యమానం
విశాఖలోని ఎంవీపీ కాలనీ టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో కోటీ దీపోత్సవంలో మహిళలు భారీగా పాల్గొని కార్తీక దీపాలు వెలిగిస్తున్న దృశ్యం.



సౌర భవనం
విద్యుత్ వినియోగాన్ని ఆదా చేసేందుకు గాను నెల్లూరు మాగంటి లేఅవుట్ ప్రాంతంలో ఓ భవనానికి సోలార్ ప్లేట్లు ఇలా ఏర్పాటు చేశారు.



గిరిజనుల ఆనంద హేల
విశాఖలో జరుగుతున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా ఆర్‌కే బీచ్ వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

నెల్లూరు కలెక్టరేట్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



నెల్లూరు (అర్బన్): ఎన్నిసార్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా సమస్యను పరిష్కరించలేదంటూ ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు అగ్గిపెట్టె లాక్కొని పెట్రోల్ పోసుకున్న వ్యక్తిపై వాటర్ క్యాన్‌తో నీరు పోశారు. బాధితుడు వెంగమశెట్టి బాలయ్య మాట్లాడుతూ తనకు కావలి మునిసిపల్ పరిధిలోని బుడంగుంట ఇందిరమ్మకాలనీలో 2007లో ప్రభుత్వం 4 సెంట్ల స్థలాన్ని పట్టాగా ఇచ్చిందన్నారు. తాను చెన్నై వెళ్లి పనులు చేసుకుని 17 ఏళ్లు కష్టపడి రూ.13 లక్షలు తెచ్చుకుని ఇల్లు కట్టుకున్నానన్నారు. తనకు ఇచ్చిన పట్టాలో సర్వే నంబర్ తప్పుపడిందన్నారు. తనతో పాటు మరో 8మందికి ఇలా సర్వే నంబర్ తప్పువచ్చిందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కృష్ణమూర్తి అనే వ్యక్తి బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి 2023 నుంచి తన ఇంటిని కబ్జాచేయాలని చూస్తూ తనను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. అతనికి వీఆర్వో మహేశ్వరరావు, వీఆర్ఏలు భాస్కర్, వెంకయ్యలు సహకరిస్తున్నారన్నారు. ఈ విషయమై కావలి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంలో పలుసార్లు అర్జీలు ఇచ్చి సర్వే నంబర్‌ను సరిచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో విధిలేక కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డానని బాలయ్య తెలిపారు. విషయం తెలిసిన కలెక్టరేట్ డీఆర్ఓ ఉదయ భాస్కర్‌రావు బాధితుడి వద్దకు వచ్చి న్యాయం చేస్తామని తెలిపారు. సర్వే నంబర్ సరి చేయించి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితుడు వెనుదిరిగాడు.

గ్రానైట్... రాంగ్ రూట్‌లో రైట్ రైట్!

బాపట్ల జిల్లాలో సేల్స్, మైనింగ్ టాక్స్ చెల్లించకుండా అక్రమ రవాణా

- బల్లికురవ, సంతమాగులూరు నుంచి గ్రానైట్ పలకలు ఎగుమతి
- మార్టూరు నుంచి సైతం అక్రమ రవాణా
- జీరో బిల్లులతో రోజుకు 110 లారీల తరలింపు
- లారీకి రూ.32 వేలు వసూలు చేస్తున్న టీడీపీ నేతలు
- చెక్‌పోస్టు నిర్వహణ కంపెనీకి రూ.16 వేలు, దందా నిర్వాహకులకు రూ.16 వేలు
- తెర ముందు మార్టూరుకు చెందిన అనిల్
- తెర వెనుక గ్రానైట్ మంత్రి ముఖ్య అనుచరుడు, పర్చూరు టీడీపీ నేత
- మాచర్ల, పిడుగురాళ్ల, చిలుకలూరిపేట, నరసరావుపేట నేతలకు నెల మామూళ్లు
- నెలకు రూ.10.56 కోట్ల వసూలు
- జీరో దందాతో ప్రభుత్వానికి నెలకు రూ.23.10 కోట్ల పన్ను ఎగవేత
- ప్రభుత్వ పెద్దలకూ వాటాలంటూ జోరుగా ప్రచారం



తరలి వెళుతున్న గ్రానైట్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు మండలాల నుంచి గ్రానైట్ పాలీషింగ్ పలకలు అక్రమంగా తరలిపోతున్నాయి. ప్రభుత్వానికి ఎటువంటి సేల్స్‌టాక్స్, మైనింగ్ టాక్స్ చెల్లించకుండానే జీరోలో రోజుకు పదుల సంఖ్యలో లారీల పలకలు అటు తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా తరలిస్తున్నారు. పై రెండు మండలాల నుంచే రోజుకు 40 నుంచి 50 లారీలు తరలిపోతున్నాయి. మంత్రి ప్రధాన అనుచరుడు ఈ అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నా కాంట్రాక్ట్ దక్కించుకున్న కంపెనీ మాత్రం అనధికారికంగా ఆ బాధ్యతలను మంత్రి అనుచరుల చేతుల్లో పెట్టి వాటాలు పంచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. జీరోలో పలకలు తరలించాలనుకునే వ్యాపారుల వద్ద లారీకి రూ.32 వేలు కప్పం కట్టించుకొని చెక్ పోస్ట్ కంపెనీ పేరున స్లిప్పులు ఇస్తున్నారు. వాటిని చూసి చెక్ పోస్ట్ సిబ్బంది పచ్చ జెండా ఊపుతున్నారు. వాస్తవానికి టన్ను పాలీషింగ్ పలకలకు సేల్స్‌టాక్స్ రూ.1300, మైనింగ్ టాక్స్ రూ.700 చొప్పున రూ.2 వేలు చెల్లించాలి. లారీ సగటున 35 టన్నుల పలకలు తీసుకెళుతుంది. ఈ లెక్కన ప్రభుత్వానికి లారీకి రూ.70 వేలు పన్ను చెల్లించాల్సి వుంది. కానీ మంత్రి అనుచరులకు రూ.32 వేలు చెల్లిస్తే దర్జాగా గ్రానైట్ పలకలను తీసుకెళ్లే అవకాశం ఉండడం, దాని మూలంగా లారీకి రూ.25 వేలు మిగులుతుండడంతో చాలామంది వ్యాపారులు జీరోలో గ్రానైట్ పలకలు తీసుకెళ్లేందుకు మొగ్గు చూపిస్తున్నారు.

దందా అంతా అనిల్ కనుసన్నల్లోనే...

కూటమి అధికారంలోకి వచ్చిన ప్రారంభం నుంచి మార్టూరుకు చెందిన వ్యాపారులు పర్చూరు నియోజకవర్గ టీడీపీ నేతకు కప్పం కట్టి జీరోలో గ్రానైట్ పలకలు ఇతర రాష్ట్రాలకు తరలించేవారు. మార్టూరు నుంచి రోజుకు 70కి పైగా లారీలు ఈ తరహాలో అక్రమ రవాణా సాగించేవి. ప్రారంభంలో లారీకి రూ.28 వేలు కప్పం కట్టించుకునేవారు.

ఆ తర్వాత మంత్రి నియోజకవర్గం నుంచి గ్రానైట్ పలకలు ఎగుమతి అవుతుండటంతో మంత్రి ప్రధాన అనుచరుడికి ఈ జీరో వ్యాపారంపై కన్నుపడింది. పర్చూరు టీడీపీ నేతతో మిలాఖత్ అయ్యారు. అప్పటికే ఈ వ్యవహారంలో ఆరితేరిన మార్టూరుకు చెందిన అనిల్ అనే వ్యక్తికి దందాను అప్పగించారు. అనిల్ మంత్రి ప్రధాన అనుచరుడికి సైతం అత్యంత సన్నిహితుడు కావడంతో జోడీ కుదిరింది. ఇందుకు మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం ఉంది. లేకపోతే బల్లికురవ, సంతమాగులూరు నుంచి ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా గ్రానైట్ తరలుతుంటే చూస్తూ ఎందుకు ఊరుకుంటారు? మొత్తంగా గ్రానైట్ జీరోవ్యాపారం జోరందుకుంది. ప్రస్తుతం అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలనుంచి రోజుకు 110 లారీల గ్రానైట్ పలకలు అక్రమంగా ఇతర రాష్ట్రాలు, అక్కడినుంచి ఇతర దేశాలకు దర్జాగా తరలిపోతున్నాయి.



లారీలలో తరలిస్తున్న గ్రానైట్ పలకలు



తరలించేందుకు లోడు చేస్తున్న గ్రానైట్ పలకలు

ఆ నేతలకు నెలకు కోట్లలో ఆదాయం...

ఒక్కోలారీలో 35 టన్నులకు తగ్గకుండా గ్రానైట్ పలకలను తరలిస్తారు. ఇందుకోసం దందా నిర్వాహకులు గతంలో కంటే రూ.4 వేలు పెంచి లారీకి రూ.32 వేలు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన జోజుకు 110 లారీలకు రూ.35,20,000, నెలకు రూ.10,56,60,000 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తంలో చెక్‌పోస్టుల కాంట్రాక్ట్ నిర్వాహకులకు లారీకి రూ.16 వేలు చొప్పున సగం డబ్బులు చెల్లించి మిగిలిన దాంట్లో కొంత మొత్తంలో చిలుకలూరిపేట, నరసరావుపేట, మాచర్ల, పిడుగురాళ్ల టీడీపీ నేతలకు వాటాలు పంచుతున్నారు. వారితోపాటు అటు మైనింగ్, పోలీసు, విజిలెన్స్ తదితర అధికారులకు నెలకు కొంతమొత్తం చెల్లిస్తున్నారు. మిగిలిన మొత్తాన్ని పర్చూరు నేత, మంత్రి అనుచరుడు వాటాలుగా పంచుకుంటున్నట్లు సమాచారం. నెలకు కోట్లలోనే రాబడి ఉండడంతో దందా పెద్ద ఎత్తున సాగుతోంది. ఈ రాబడిలో కొంత మొత్తాన్ని ప్రభుత్వంలోని కొందరు పెద్దలకు సైతం చేరవేస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ రాబడికి గండి..

టీడీపీ నేతల అక్రమ దందా పుణ్యమా అని పలువురు గ్రానైట్ వ్యాపారులు పన్నులు చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్ తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ప్రతి టన్ను పాలిషింగ్ పలకలకు సేల్స్‌టాక్స్ రూ.1300, మైనింగ్ టాక్స్ రూ.700 చొప్పున మొత్తం రూ. 2 వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ లెక్కన జీరోలో వెళ్లే 35 టన్నుల లారీకి రూ.70 వేలు టాక్స్ చెల్లించాలి. రోజుకు 110 లారీలకు అనుకుంటే రూ.77 లక్షలు, ఆ ప్రకారం నెలకు రూ.23.10 కోట్లు టాక్స్‌లు చెల్లించాల్సి ఉంది. కానీ వ్యాపారులు ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా అక్రమ మార్గంలో గ్రానైట్‌ను తరలిస్తున్నారు. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతున్నారు.

ఏపీఎస్ఐడీసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెన్‌డౌన్



కడప సెవెన్‌రోడ్స్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వేతన బకాయిలు సత్వరమే చెల్లించాలని, లేకుంటే ఈ నెల 25 నుంచి పెన్‌డౌన్ చేస్తామంటూ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు గతంలోనే తెలిపారు. ఉద్యోగ భద్రతపైనా కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖలో విలీనం చేయాలని బాధితులు కోరుతున్నారు. కూటమి సర్కార్ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో గత్యంతరం లేని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం నుంచి పెన్‌డౌన్ చేపట్టారు. కడపలోని ఏపీఎస్‌డీసీ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ ద్వారా నిరసన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ గ్యారేజీలో టీడీపీ పబ్లిక్ మీటింగ్

- సెక్యూరిటీ నిబంధనలు పట్టించుకోని ఆ పార్టీ నేతలు
- హంగామాగా ఆర్టీసీ ప్రాంతీయ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



గ్యారేజీ నడిబొడ్డున టీడీపీ బహిరంగ సమావేశం

విజయనగరం అర్బన్: ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్‌గా సియ్యారి దొన్నుదొర బాధ్యతల స్వీకరణ..సమావేశ నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించిన తీరు చర్చనీయాంశంగా మారింది. విజయనగరం ఆర్టీసీ జిల్లా అధికారి కార్యాలయంలోని జోనల్ చైర్మన్ కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు స్వాగతం పలికేందుకు వచ్చేవారి వాహనాలతో ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణం నిండిపోయింది. దీంతో కాంప్లెక్స్ లోపలకు బస్సులు రాలేదు. ప్రధాన గేటు నుంచే బస్సులు తిప్పేయడంతో ప్రయాణికులు రోడ్డుపైకి వెళ్లి బస్సులు ఎక్కారు. చైర్మన్ బాధ్యతల స్వీకరణ అనంతరం పక్కనే ఉన్న విజయనగరం డిపో గ్యారేజీలో నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ సభను నిర్వహించారు. సెక్యూరిటీ నిబంధనల మేరకు గ్యారేజీలో కార్మికులు, ఆర్టీసీ అధికారులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. కాంప్లెక్స్ ప్రాంగణంలోకి కూడా ఇతరుల వాహనాలకు అనుమతి ఉండదు. ఇవేవీ పట్టించుకోకుండా గ్యారేజీ ప్రాంగణంలోనే భారీ బహిరంగ సభను నిర్వహించి రాజకీయ ఉపన్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. గ్యారేజీ ప్రాంగణమంతా కార్ల పార్కింగ్‌కే సరిపోయింది. గ్యారేజీలో విలువైన వస్తువులకు రక్షణ ప్రశ్నార్థకంగా మారిందంటూ కొందరు బహిరంగంగానే గగ్గోలుపెట్టారు. బాధ్యత స్వీకరణ కార్యక్రమం వరకే తమ షెడ్యూల్ అని మిగిలిన కార్యక్రమాల నిర్వహణతో ఎలాంటి సంబంధం లేదని ఆర్టీసీ అధికారులు వివరణ ఇచ్చారు.

స్థానిక ఎమ్మెల్యేకు అవమానం

ప్రాంతీయ ఆర్టీసీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతికి అవమానం జరిగింది. ఆహ్వాన ప్రధాన ప్రచార ముఖద్వారం పోస్టర్‌ల్లో ఆమె ఫొటో, పేరు ముద్రించలేదు. సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ తదితర నాయకుల పేర్లు మాత్రమే వేశారు. దీనిని గమనించిన ఎమ్మెల్యే స్థానికంగా ఉన్నా కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఆమె అనుచర వర్గం కూడా ఎవరూ హాజరుకాలేదు.

వెంటాడిన పాపం

26 ఏళ్ల క్రితం ఆరు నెలల పసిగుడ్డును హతమార్చిన తండ్రి

- అప్పటి నుంచి అజ్ఞాతంలోనే నిందితుడు
- పేరు మార్చుకుని కర్ణాటకలో తలదాచుకున్న వైనం
- నిందితుడి ఆచూకీ బయటపెట్టిన పెళ్లి కార్డు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

పుట్టపర్తి టౌన్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త చివరకు కన్నకొడుకును హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లాడు. 26 ఏళ్ల తర్వాత ఆయన చేసిన పాపం పండింది. పేరు మార్చుకుని కర్ణాటకలో తలదాచుకున్న నిందితుడిని పోలీసులు పసిగట్టి సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం దిన్నేహట్టికి చెందిన గొల్ల తిప్పేస్వామికి అదే గ్రామంలో నివాసముంటున్న మేనత్త పల్లెమ్మ కుమార్తె కరియమ్మతో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. 1998 ఏప్రిల్‌లో జన్మించిన రెండో కుమారుడికి శివలింగమయ్య అనే పేరు పెట్టారు. కరియమ్మ ప్రవర్తనపై తిప్పేస్వామికి అనుమానం మొదలైంది. రెండో కుమారుడు తనకు పుట్టలేదని, ఎలాగైనా ఆ పసివాడిని మట్టుబెట్టాలని అనుకున్నాడు. 1998 అక్టోబర్ 2న దసరా సందర్భంగా కులాచారం మేరకు 6 నెలల పసికందును కరియమ్మ ఎత్తుకుని మారెమ్మ జమ్మి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో తిప్పేస్వామి బలవంతంగా లాక్కొని పక్కనే ఉన్న మామిడి తోటలోకి తీసుకెళ్లి గొంతు పిసికి చంపేశాడు. అక్కడే గొయ్యి తీసి పాతిపెట్టి పారిపోయాడు. ఘటనపై కరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేరు మార్చుకుని.. పెళ్లి చేసుకుని

పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుపోయిన తిప్పేస్వామి కర్ణాటకలోని హసన్ జిల్లా న్యామనహళ్లిలో స్థిరపడ్డాడు. తన పేరును కృష్ణగౌడ్‌గా మార్చుకుని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా, ఇటీవల తన పెద్ద కుమార్తె పెళ్లి కుదరడంతో ఆహ్వాన పత్రికను దిన్నేహట్టిలోని తన స్నేహితుడు నాగరాజుకు తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ్ పంపాడు. ఎస్పీ రత్న ఆదేశాలతో పాత కేసుల దర్యాప్తు చేపట్టిన పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు..విచారణలో భాగంగా కొన్ని రోజుల క్రితం దిన్నేహట్టికి వెళ్లి తిప్పేస్వామి గురించి ఆరా తీశారు. ఆ సమయంలో నాగరాజు ఇంట్లో తిప్పేస్వామి కుమార్తె వివాహ ఆహ్వాన పత్రిక లభ్యమైంది. దీని ఆధారంగా తిప్పేస్వామి ఆచూకీని పోలీసులు గుర్తించారు.

పట్టుబడ్డాడు ఇలా...

తిప్పేస్వామి ఆచూకీని పసిగట్టిన తర్వాత న్యామనహళ్లికి వెళ్లి అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. తన తమ్ముడు చిత్తప్పతో భూమి భాగ పరిష్కారం కోసం స్వగ్రామానికి వచ్చిన తిప్పేస్వామి సోమవారం పెద్ద మనుషుల కోసం మందలపల్లి బస్టాండ్ వద్ద వేచి ఉండగా సీఐ రాజ్‌కుమార్ గుర్తించి అదుపులోకి తీసుకుని ఎస్పీ ఎదుట హాజరుపరిచారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో చేసిన నేరాన్ని అంగీకరించాడు.

అష్టదళ పద్మారాధన నేడు

ఆధ్యాత్మిక సమాచారం

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయాలి.

మద్ది అంజన్నకు లక్ష తమలపాకుల పూజ



జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి లక్ష తమలపాకులతో లక్షార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రోచ్చారణలతో పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలను వీక్షించారు. నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అప్పన్న సన్నిధిలో రామచంద్ర జీయర్‌స్వామి



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీ భాష్యకార సిద్ధాంత పీఠం రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి దర్శించుకున్నారు. ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏఎన్‌యూ: దక్షిణ, పశ్చిమ మండలాల(జోన్స్) అంతర్ విశ్వవిద్యాలయాల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ మంగళవారం నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతాయని పోటీల నిర్వహక కార్యదర్శి, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. పోటీలకు వివరాలను సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. మహిళల కేటగిరీ పోటీలు మంగళవారం నుంచి 28 వరకు, పురుషులకు ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో 125 విశ్వవిద్యాలయాల నుంచి వెయిట్ లిఫ్టర్లు హాజరుకానున్నారని తెలిపారు. మంగళవారం జరిగే పోటీల ప్రారంభోత్సవ సభకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బదేటి వెంకటరామయ్య, యూనివర్సిటీ అధికారులు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని తెలిపారు. పోటీలకు వీసీ ఆచార్య కె గంగాధరరావు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారని పాల్ కుమార్ తెలిపారు.

విద్యా సమాచారం

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 నెట్‌బాల్ విజేతలు వీరే...

మదనపల్లె సిటీ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 నెట్‌బాల్ బాలికల విభాగం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు మదనపల్లెలో నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత, రాష్ట్ర అబ్జర్వర్ రామాంజనేయులు, ఎంఈఓ రాజగోపాల్, హెచ్‌ఎం ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగరాజ, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- ఎస్‌జీఎఫ్ అండర్-17 నెట్‌బాల్ బాలికల విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖపట్నం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానం వెస్ట్‌గోదావరి, తృతీయ స్థానం కృష్ణా జిల్లాలు సాధించినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. రాష్ట్ర జట్టు డిసెంబర్‌లో పంజాబ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

హిందూజా (వెస్ట్ గోదావరి), వెంకటరేష్మ (వెస్ట్ గోదావరి), జాగారపు ప్రణతి(విశాఖ), సుప్రియ (కృష్ణ), సాత్విక (కడప), హన్సిక్ (అనంతపురం), కళ్యాణిరేవతి(తూర్పు గోదావరి), భీష్మా (చిత్తూరు), భానుప్రియ (గుంటూరు), వర్షి (చిత్తూరు), రిషిత (విశాఖపట్నం)

స్టాండ్‌బైలు: చంద్రకళ (చిత్తూరు), శిరీషా (విశాఖ), పోషిత (వెస్ట్ గోదావరి), పూజిత (కృష్ణ), సింధూరి (వైఎస్సార్ కడప).

సీఐ తల్లి హత్యకేసులో నిందితుడు ఆత్మహత్యయత్నం

ఆలస్యంగా గుర్తించిన పోలీసులు



ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హత్య కేసు నిందితుడు అనిల్‌కుమార్

మదనపల్లె: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి హత్య కేసులో రెండో నిందితుడైన అనిల్‌కుమార్ ఆదివారం ఆత్మహత్యయత్నం చేయగా, పోలీసులు ఆలస్యంగా గుర్తించారు. మదనపల్లె పట్టణంలోని సాయిరాంవీధిలో నివసిస్తున్న అనిల్‌కుమార్ (25) అతని తల్లి రమాదేవి సెప్టెంబర్ 28వ తేదీన కనబడకుండా పోయి హత్యకు గురైన స్వర్ణకుమారి హత్య కేసులో నిందితులు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు వెంకటేష్‌ను అక్టోబర్ 9న అరెస్టు చేయగా 10వతేదీన అతని తల్లి ఏ4గా ఉన్న ఎల్లమ్మను మదనపల్లె తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో హత్యకేసులో రెండో నిందితుడైన అనిల్‌కుమార్, అతని తల్లి రమాదేవిలు పోలీసుల దర్యాప్తులో దొరకకుండా పరారీలో ఉన్నారు. అయితే అనిల్‌కుమార్ ఆదివారం గుట్టుచప్పుడు కాకుండా మదనపల్లెకు వచ్చారు. స్థానికంగా కొందరు అతడిని గుర్తు పట్టడంతో, తాము పోలీసులకు దొరికిపోతామన్న భయంతో తిరిగి పారిపోయాడు. ములకల చెరువు మార్కెట్‌యార్డు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. అక్కడ ఎవరూ గుర్తించకపోవడంతో రాత్రి కొందరు మార్కెట్ యార్డు వద్ద అపస్మారకస్థితిలో పడి ఉన్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈలోపుగా 108 సమాచారం అందించి బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అపస్మారకస్థితిలో స్పష్టంగా మాట్లాడలేక ఆస్పత్రికి చేరిన అనిల్‌కుమార్‌కు స్థానిక వైద్యులు చికిత్స అందించారు. ఈలోపుగా సీఐ తల్లి హత్య కేసులో నిందితుడు ఇతడేనని పోలీసులకు తెలియడంతో హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని అనిల్‌కుమార్‌కు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో సోమవారం మధ్యాహ్నం వరకు చికిత్స అందించారు. అనంతరం పోలీసులు అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.



మామూలుగానే భారతీయుల్లో ఆస్టియోపోరోసిస్ కేసులు ఎక్కువ. ఇక మహిళల్లో ఈ రుగ్మత ముప్పు మరింత ఎక్కువ. యాభై ఏళ్లు దాటాక మహిళల్లో దాదాపు 40% నుంచి 50% మందిలో ఆస్టియోపోరోసిస్ కనిపించడం చాలా సాధారణంగా జరిగేదే. అలాగే మెనోపాజ్ దాటిన మహిళల్లో కనీసం 40% మందిలో ఇది కనిపిస్తుందంటే దీని విస్తృతి అర్థం చేసుకోవచ్చు. ఇక ఆస్టియోపోరోసిస్ వచ్చిన మహిళల్లో మూడింట ఒక వంతు మందికి ఏదో ఒక దశలో తుంటి ఎముక ఫ్రాక్చర్ కేసులు తప్పక కనిపిస్తాయి. వారికి ముప్పుగా పరిణమిస్తూ, వారిలో ఇంత విస్తృతంగా కనిపించే ఆస్టియోపోరోసిస్ గురించి తెలుసుకుందాం.

● ఆస్టియోపోరోసిస్

ఇంటి వెన్నెముకకు ఎముకలు వీక్

మానవులందరిలోనూ 20 ఏళ్లు వచ్చే వరకు ఎముకల పెరుగుదల సంభవిస్తూనే ఉంటుంది. ఆ తర్వాత ఆగిపోతుంది. కానీ దాదాపు 40 ఏళ్లు వచ్చేవరకు ఇవి బలంగానే ఉంటూ, ఆ తర్వాత క్రమంగా తమ బలాన్ని కోల్పోతూ పెళుసుగా మారిపోతుంటాయి. కానీ మహిళల్లో మాత్రం వాళ్ల ఓవరీల నుంచి ఉత్పత్తి అయ్యే హార్మోన్– ఈస్ట్రోజెన్ తగ్గడం మొదలుకాగానే ఎముకలు బలహీనం కావడం ప్రారంభమవుతుంది. ఇక రుతుక్రమం ఆగిపోయాక ఈస్ట్రోజెన్ ఉత్పత్తి కూడా తగ్గిపోవడంతో ఈ అంశమే వాళ్లలో ఎముకలు బలహీనంగా, పెళుసుగా మారిపోయి, తేలిగ్గా విరిగిపోయే కండిషన్ అయిన ఆస్టియోపోరోసిస్‌కు కారణమవుతుంది.

మహిళల్లోనూ ఈ ముప్పు ఎవరెవరిలో...

వయసు పెరుగుతున్న కొద్దీ ఆస్టియోపోరోసిస్ వచ్చే అవకాశాలు అందరికీ ఉన్నప్పటికీ, కొందరిలో మాత్రం ఈ రిస్క్ మరీ ఎక్కువ ▲ పోషకాహార లోపాలున్నవారికి... మన దేశంలో మహిళలు పాలు, విటమిన్ డి ఉన్న పదార్థాలు తీసుకోవడం చాలా తక్కువ. అన్ని పోషకాలూ ఉన్న ఆహారాలు తీసుకోవడమూ వాళ్లలో తక్కువే. కాబట్టి మహిళల్లో ఈ రిస్క్ మరింత ఎక్కువ ▲ రుతుక్రమం ఆగిన మహిళల్లోనూ, గర్భసంచితో పాటు ఒకటి లేదా రెండు ఓవరీస్ తీయించుకున్న వాళ్లల్లో... ▲ చాలాకాలం పాటు స్టెరాయిడ్స్ వాడేవారిలో ▲ వ్యాయామం చేయని వారిలో (మన దేశంలో మహిళల్లో వ్యాయామం చాలా తక్కువ) ▲ పొగతాగే అలవాటు ఈస్ట్రోజెన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. కాబట్టి స్మోకింగ్ కూడా ఒక రిస్క్ ఫ్యాక్టరే ▲ మద్యం తీసుకోవడం వల్ల శరీర కణాల (ప్రధానంగా ఎముక కణాల) అభివృద్ధి, పెరుగుదల ప్రభావితం అవుతాయి. ఫలితంగా మద్యం అలవాటు ఉన్నవాళ్లలో ఆస్టియోపోరోసిస్ రిస్క్ పెరుగుతుంది ▲ కుటుంబ చరిత్ర... కుటుంబంలో ఎవరికైనా ఆస్టియోపోరోసిస్ ఉంటే ఆ కుటుంబ సభ్యులకు దీని రిస్క్ ఎక్కువ.

ఆస్టియోపోరోసిస్ - నిర్ధారణ...

▲ రక్తపరీక్ష, ఎక్స్‌-రే, బీఎమ్‌డీ (బోన్ మాస్, డెన్సిటీ – అంటే ఎముక సాంద్రత నిర్ధారణ చేసే పరీక్షల ద్వారా రోగిలో దీన్ని నిర్ధారణ చేయవచ్చు)

లక్షణాలు...

ఎముకలు దేహం లోపల ఉంటాయి కాబట్టి ఆస్టియోపోరోసిస్ వచ్చే సూచనలు ముందే కనిపించేందుకు అవకాశం లేదు. ఇది చాప కింద నీరులా వచ్చే పరిణామం. ఎముకలు పలచబారడం దీర్ఘకాలం జరుగుతూ పోతే చిన్న గాయలకే ఎముకలు విరిగే ముప్పు పెరుగుతుంది. చిన్నపాటి ప్రమాదానికే ఎముక తేలిగ్గా విరిగిపోతుంటే దాన్ని ఆస్టియోపోరోసిస్‌గా గుర్తించవచ్చు. ఇక సాధారణంగా కనిపించే కొన్ని లక్షణాలు... ▲ ఒళ్లు నొప్పులు (జనరలైజ్‌డ్ బాడీ పెయిన్స్) ▲ ఎముకలు, కీళ్ల నొప్పులు (బోన్ అండ్ జాయింట్ పెయిన్స్) ▲ అలసట (ఫ్యాటిగ్‌నెస్) ▲ చిన్న ప్రమాదానికే ఎముక విరగడం ▲ విపరీతమైన వెన్ను నొప్పి, కాస్తంత వెన్ను ఒంగినట్లయి శరీరం ఎత్తు తగ్గడం

నివారణ ఇలా...

▲ పౌష్టికాహారం తీసుకోవడం (శరీరానికి అవసరమైనన్ని క్యాలరీలు అందించడం కూడా అవసరం)
▲ రోజుకు కనీసం 45 నిమిషాల వ్యాయామం చేయడం (ఇలా వారానికి కనీసం మూడు గంటల పాటైనా వ్యాయామం చేయడం) ▲ రుతుక్రమం ఆగడానికి (మెనోపాజ్‌కు) ముందు వరకు రోజుకు కనీసం 1000 ఎంజీ క్యాల్షియమ్ శరీరానికి అందేలా చేసుకోవడం
▲ రుతుక్రమం ఆగాక (మెనోపాజ్ తర్వాత) రోజుకు కనీసం 1500 ఎంజీ క్యాల్షియమ్ శరీరానికి అందేలా చూడటం ▲ ఆహారంలో ఉప్పు పాళ్లు బాగా తగ్గించడం ▲ పొగతాగడం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.
▲ కాఫీ ఎక్కువగా తాగే అలవాటు ఉంటే దాన్ని తగ్గించుకోవాలి.

సీ, డీ, ఈ, ఎఫ్, జీ, ఎస్...

ఆస్టియోపోరోసిస్ నివారణ కోసం ఉపయోగపడే అంశాలను చాలా తేలిగ్గా గుర్తు పెట్టుకోవచ్చు. ఇంగ్లిష్ అక్షరాలు వరుసగా సీ, డీ, ఈ, ఎఫ్, జీ గుర్తు పెట్టుకుంటే చాలు.
● 'సి' ఫర్ క్యాల్షియమ్- అంటే అది ఎక్కువగా తీసుకోవాలి.
● 'డి' ఫర్ విటమిన్ డి - అంటే శరీరానికి తగినంత అందేలా చూసుకోవాలి. ● 'ఈ' ఫర్ ఎక్సర్‌సైజ్ - అంటే శరీరాన్ని కాస్తంత శ్రమపెట్టి ఎక్సర్‌సైజ్ చేయించాలి. ● 'ఎఫ్' ఫర్ 'ఫాల్స్' - అంటే ఇంగ్లిష్‌లో పడిపోవడం. కాస్తంత వయసు పైబడ్డాక బాత్‌రూమ్‌ల వంటి చోట్ల, ఇతరత్రా కింద పడిపోకుండా జాగ్రత్తగా ఉండాలి. ● 'జి' ఫర్ గెయిన్ వెయిట్ - అంటే శరీరం బరువు కాస్తంత పెరగాలి. అది ఎత్తుకు తగినట్లుగా ఉండాలి.

చికిత్స ఇలా...

ప్రాథమిక నివారణ చర్యలు ఆస్టియోపోరోసిస్ కండిషన్‌ను ఆలస్యం చేస్తాయి. ఫలితంగా వయసు రిస్క్ తగ్గుతుంది.

క్యాల్షియమ్, విటమిన్ 'డి'...

డాక్టర్లు ప్రాథమిక చికిత్సగా క్యాల్షియమ్, విటమిన్ 'డి' ఇస్తారు. అంటే... 60 ఏళ్లు దాటిన వారికి ప్రతిరోజూ 1500 ఎంజీ క్యాల్షియమ్‌నూ, విటమిన్‌-డిని రోజూ 10 నుంచి 15 ఎంజీ ఇస్తారు.

బిస్‌ఫాస్ఫోనేట్స్...

ఇవి ఒక రకం మందులు. వీటినే బిస్‌ఫాస్ఫోనేట్స్ అని కూడా అంటారు. ఎముక తనలోని పదార్థాన్ని కోల్పోయే ప్రక్రియను ఇవి ఆలస్యం చేస్తాయి. ఫలితంగా ఎముక సాంద్రత తగ్గే వేగం మందగిస్తుంది. దానివల్ల ఎముక మరింత కాలం దృఢంగా ఉంటుంది.



హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ

రుతుక్రమం ఆగిన మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్‌ను తిరిగి భర్తీ చేసే ఈ చికిత్స ప్రక్రియను కూడా అవసరాన్ని బట్టి డాక్టర్లు చేస్తుంటారు. అయితే ఈ హెచ్‌ఆర్‌టీ వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా కనిపిస్తాయి. అంటే... రొమ్ముల సలపరం, మళ్లీ రుతుస్రావం మొదలుకావడం, బరువు పెరగడం, మూడ్స్ మాటిమాటికీ మారిపోవడం, మైగ్రేన్ తలనొప్పి రావడం వంటివన్నమాట. కాబట్టి రోగి కండిషన్ ను బట్టి హెచ్‌ఆర్‌టీ అవసరమా కాదా అన్నది డాక్టర్లే నిర్ధారిస్తారు.

క్యాల్సిటోనిన్: ఈ మందులు ముక్కు ద్వారా పీల్చే మందుగా లభిస్తాయి. అయితే ఇవి తప్పనిసరిగా డాక్టర్ల సలహా మేరకే తీసుకోవాల్సి ఉంటుంది.

టెరీపారటైడ్: ఇది ఆస్టియోపోరోసిస్ చికిత్స ప్రక్రియలో ఇది కూడా ఒక మందు. ఇది ఎముకలో పెళుసుబారిన చోట కొత్త కణజాలం ఉత్పత్తి అయ్యేలా దోహదపడుతుంది. ఫలితంగా ఎముక ఫ్రాక్చర్ అయ్యే అవకాశాలు తగ్గుతాయి. ఈ మందును కడుపు ప్రాంతంలోగాని, తొడల ప్రాంతంలో గాని ఇంజెక్షన్ చేయడం ద్వారా శరీరంలోకి పంపుతారు. దాదాపు ఏడాదిన్నర పాటు ఉపయోగించాల్సి ఉంటుంది. మంచి ప్రభావకారి అయినప్పటికీ ప్రస్తుతం దీని ఖరీదు ఎక్కువ. వికారం (నాసియా), తలనొప్పి, కాళ్లూచేతుల నొప్పి వంటి కొన్ని సైడ్‌ఎఫెక్ట్స్ కూడా కనిపించే ఈ మందుల దీర్ఘకాల ప్రభావాలు ఇంకా తెలియదు.

డోనోసుమాబ్స్: ఇది సరికొత్త మందు. చాలా వేగంగా పనిచేస్తుంది. చవకగా కూడా లభిస్తుంది. తీసుకోవడమూ సులభం.

● బైపాస్


రక్తనాళాల్లో పూడికలు.. తీసివేతలు

చాలామంది వాడుకలో బైపాస్ ఆపరేషన్ అనే మాట నలుగుతుంటుంది. కానీ దాని అసలు అర్థం ఏమిటి, అందులో ఏం చేస్తారు, బైపాస్ శస్త్రచికిత్స అయినవాళ్లు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి వంటి విషయాలను తెలుసుకుందాం.

గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే కీలకమైన ధమనుల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు, వాటిని తొలగించి రక్తసరఫరా సాఫీగా జరడానికి వీలుకల్పించేందుకు చేసే శస్త్రచికిత్సను 'సీఏబీజీ సర్జరీ' అంటారు.

ఇందులో... అప్పటికే రక్తపు క్లాట్స్ ఏర్పడ్డ ధమనులను వదిలేసి, ఇతర రక్తనాళాల ద్వారా అంటే... బైపాస్ చేసిన మార్గం ద్వారా గుండెకండరానికి రక్తం అందేలా చేస్తారు. ఇలా రక్తం బైపాస్ మార్గంలో వెళ్లడానికి కృత్రిమంగా రక్తనాళాలను గ్రాఫ్టింగ్ చేస్తారు కాబట్టి వైద్యపరిభాషలో దాన్ని 'కరొనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్' అంటారు. దానికి సంక్షిప్త రూపమే ఈ సీఏబీజీ . దీన్నే సాధారణ వాడుక భాషలో 'బైపాస్ సర్జరీ' అని వ్యవహరిస్తుంటారు.

గ్రాఫ్టింగ్ కోసం ఉపయోగించే ఆ రక్తనాళాలను కాళ్లు లేదా చేతుల్లో ఉన్నవాటిని తీసి, క్లాట్స్ అడ్డంకులుగా ఏర్పడ్డ రక్తనాళాలకు ప్రత్యామ్నాయంగా అమర్చుతారు. అలా అమర్చిన రక్తనాళాల ద్వారా గుండె కండరానికి అందాల్సిన రక్తాన్ని బైపాస్ అయ్యేలా చేస్తారు.



గుండె వద్ద ఉన్న రక్తనాళాన్ని నేరుగా బైపాస్ చేసే ప్రక్రియను రీ-వాస్క్యులరైజేషన్ అంటారు. సాధారణంగా ఒక బ్లాక్ (అడ్డంకి)ని బైపాస్ చేయడానికి ఒక రక్తనాళం అవసరం. ఛాతీకి కుడి, ఎడమ వైపున ఉన్న రక్తనాళాలను ఇంటర్నల్ మ్యామరీ ఆర్టరీస్ అంటారు. గుండెకు ఎడమవైపున ఉన్న నాళాన్ని లెఫ్ట్ యాంటీరియర్ డిసెండింగ్ ఆర్టరీ అని అంటారు. ఈ రక్తనాళాన్ని బ్లాక్ అయిన నాళాల వద్ద బైపాస్ మార్గంలా కలుపుతారు.



డా. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

బైపాస్ సర్జరీ చేయించుకున్న తర్వాత, భవిష్యత్తులో ఇలా మార్చిన రక్తనాళాల్లోనూ కొవ్వు పేరుకోకుండా హృద్రోగులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో రక్తనాళాల్లో పేరుకున్న బ్లాక్స్‌ను అధిగమించి, రక్తాన్ని గుండెకు చేరవేసేందుకు వీలుగానే కొన్ని రక్తనాళాలు ఏర్పరుస్తారు తప్ప ఈ శస్త్రచికిత్స వల్ల అప్పటికే ఉన్న గుండెజబ్బు తొలగిపోయిందని పేషెంట్ అపోహ పడకూడదు.

అందుకే కొత్తగా వేసిన రక్తనాళాలూ మళ్లీ బ్లాక్ అయిపోయి పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం ఉన్నందున బాధితులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేమిటంటే... బాధితులకు హైబీపీ ఉన్నట్లయితే రక్తపోటును ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకునేలా డాక్టర్ సూచించిన మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలి. అలాగే బాధితుల్లో డయాబెటిస్ ఉంటే, రక్తంలోని చక్కెర మోతాదులను అదుపులో ఉంచుకునేందుకు అవసరమైన మందులు వాడుతూ, కొవ్వులు తక్కువగా ఉండే పోషకాహారం తీసుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి. పొగతాగడం, మద్యం అలవాట్లు ఉంటే దాన్ని తక్షణం పూర్తిగా మానేయాలి. డాక్టర్లు సూచించిన మేరకు శరీరానికి మరీ ఎక్కువ శ్రమ కలిగించని విధంగా తగిన వ్యాయామాలు చేస్తూ ఉండాలి.

● తమ్మె తెగితే

ఇయర్ రిపేర్



ఫ్యాషన్‌లో భాగంగానో లేదా తమ దుస్తులకు మ్యాచింగ్‌గా ఉంటాయనో కొందరు చాలా బరువైన ఇయర్ రింగ్స్‌ను వాడుతుంటారు. ఇలాంటి ఫ్యాషనబుల్ ఇయర్ రింగ్స్ ఎక్కువగా వాడుతుండటం లేదా హ్యాంగింగ్స్ తరచూ వేసుకుంటూ ఉండటంలో వాటి బరువు కారణంగా క్రమంగా చెవి రంధ్రం సాగిపోతూ, ఆ రంధ్రం పెద్దదైపోయి ఒకదశలో చెవి తమ్మె పూర్తిగా తెగిపోయే ప్రమాదమూ ఉంటుంది. ఇది పూర్తిగా తెగిపోయాక అప్పుడు రిపేర్ చేయించుకోవడం కంటే రంధ్రం పెద్దది అవుతున్న సమయంలోనే చేయించుకోవడం మంచిది.

చాలా ఎక్కువ బరువుండే ఇయర్ రింగ్స్ లేదా హ్యాంగింగ్స్ కారణంగా చెవి బాగా సాగిపోయిన లేదా తెగిపోయిన చెవి తమ్మెను ప్లాస్టిక్ సర్జరీ ప్రక్రియ ద్వారా రిపేర్ చేయడం సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియలో బాధితులకు ఎలాంటి మత్తుమందు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉండదు. కేవలం ఆ ప్రాంతం వరకు శరీరం మొద్దుబారేలా మత్తు (లోకల్ అనస్థీషియా) ఇస్తే సరిపోతుంది.



డా॥ జి. వెంకటేశ్ బాబు
సీనియర్ కన్సలెంట్
ప్లాస్టిక్ సర్జన్

రెండుగా చీలిపోయినట్లుగా తెగిన చెవి తమ్మెను నేరుగా ప్లాస్టిక్ సర్జరీ చికిత్సలోనైనా లేదా చికిత్స తర్వాత గాయం మానిన తర్వాతనైనా... సదరు గాయం మచ్చను కనపడకుండా చేసేందుకూ చికిత్స అందించడం వచ్చు ఇందులో భాగంగా చెవి తమ్మెను వంకరటింకరగా (జిగ్‌జాగ్)గా అతికిస్తూ నిపుణులు రిపేర్ చేస్తారు. అయితే ఇలా చెవి తమ్మెలను అతికించే ప్రక్రియ అందరిలోనూ ఒకేలా ఉండకపోవచ్చు.

అయితే ఈ అతికింపు ప్రక్రియ అందరిలోనూ ఒకేలా ఉండకపోవచ్చు. చెవి రంధ్రం చీరుకున్న తీరును బట్టి బాధితులకు ఎలాంటి ప్రక్రియ అవసరమో డాక్టర్లు నిర్ణయిస్తారు. ఆ తర్వాత వాళ్లతోనే మాట్లాడుతూ (కౌన్సెలింగ్ నిర్వహిస్తూ) వాళ్లకు అవసరమైన ప్రక్రియ గురించి వివరిస్తారు. వాళ్లు అంగీకరిస్తే అప్పుడు అతికింపు చికిత్స చేస్తారు.

ఈ చికిత్సలో భాగంగా రెండుగా చీరుకున్న రంధ్రానికి కుట్లు వేయడం కోసం అత్యంత నాణ్యమైన, బయటకు కనపడని సున్నితమైన దారాన్ని ఉపయోగిస్తారు. ప్రక్రియ అంతా పూర్తయ్యాక చికిత్స నిర్వహించిన చోట కొన్నాళ్ల పాటు పైపూతగా ఉపయోగించే యాంటీబయాటిక్ క్రీమ్‌ను కొంతకాలం పాటు రాయాల్సి ఉంటుంది. కాకపోతే గాయం అంతా మానాక వెంటనే బయటకు కనపడదుగానీ... బాగా పరిశీలనగా చూస్తే ఓ పెన్సిల్‌తో గీసినంత సన్నగా ఉండే గీత అస్పష్టంగా కనిపిస్తుంది.



ఈ అతికింపు ప్రక్రియ పూర్తయ్యాక మళ్లీ చెవి కుట్టించుకోవాలంటే... చెవి రంధ్రం పూర్తిగా పూడిపోయాక కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు ఆగి, అప్పుడు కుట్టించుకోవచ్చు. అయితే ఈసారి మళ్లీ అలాంటి చాలా బరువైన హ్యాంగింగ్స్ కాకుండా తేలికైనవి వాడుతూ మాటిమాటికీ చెవి తమ్మె తెగిపోకుండా చూసుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక చెవి తమ్మెలు బాగా లేతగా ఉండే చిన్నారి బాలికలూ, చెవి తమ్మెలో తగినంత స్థలం లేనివారు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండటం చాలా మంచిది.

ఛాతీలో నీరు చేరితే...?

ఛాతీలో నీరు చేరడాన్ని 'ప్లూరల్ ఎఫ్యూజన్' అంటారు. దీనికి చాలా కారణాలున్నాయి. ఇది నీరు కావచ్చు లేదా చీము, రక్తం కావచ్చు. ఇది ఒక పక్క లేదా రెండు వైపులా చేరవచ్చు. నీరు ఎక్కువగా చేరితే దాన్ని 'మాసివ్ ప్లూరల్ ఎఫ్యూజన్' అంటారు. ఇలాంటి వారిలో ఆయాసం కూడా ఎక్కువగా ఉండవచ్చు. అలాంటి వారిలో తక్షణం ఆ నీటిని తీయాల్సి ఉంటుంది.

కారణాలు...

ఛాతీలోకి నీరు చేరడం అనేది హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ సమస్య, లివర్ సమస్యలను సూచిస్తుంది. చీము చేరడం అనేది ఊపిరితిత్తులకు గాని, ప్లూరల్ స్పేస్‌కు గానీ ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు జరుగుతుంది. ఉదా: నిమోనియా, టీబీ ఇన్ఫెక్షన్లు. సాధారణంగా మొదటిదశలో అది చీము అవునా, కాదా అన్నది కనుక్కోవడం కుదరదు. పరీక్షలకు పంపాక మాత్రమే అది తెలుస్తుంది. కాబట్టి ఈ సమస్యను ట్రాన్స్‌డేటివ్ లేదా ఎగ్జుడేటివ్ అని విభజిస్తారు.



ట్రాన్స్‌డేటివ్ నీరు చేరడమనే సమస్య సాధారణంగా మందులతోనే తగ్గిపోతుంది. అయితే ఎగ్జుడేటివ్ నీరు చేరడమనే సమస్యలో దాని దశని బట్టి చికిత్స మారుతుంటుంది.



డా॥ రమణ ప్రసాద్
సీనియర్ పల్మునాలజిస్ట్

ఈ సమస్యకు నిమోనియా కారణమై, నీరు కొద్దిగానే ఉంటే, సాధారణంగా అది యాంటీబయాటిక్స్‌తో తగ్గిపోతుంది. కానీ చీము చాలా ఎక్కువగా ఉంటే, వెంటనే ఛాతీలోకి గొట్టం వేసి దాన్ని డ్రైయిన్ చేసేయాలి (ఆ చీమును బయటకు ప్రవహింపజేయాలి... అంటే తొలగించాలి).

ఒకసారి గొట్టం వేశాక చీము రోజుకు ఎంత పరిమాణంలో డ్రైయిన్ అవుతోంది అన్న అంశం మీద దాన్ని తీసేయడం ఆధారపడి ఉంటుంది. చీము తీసేయడం ఆలస్యమైతే, లోపల అనేక ఫైబ్రస్ పార్టిషన్స్ (గదులు) ఏర్పడి, అక్కడ తేనెతుట్టెలాగా మారిపోతుంది. అలాంటి దశలో ఆపరేషన్ అవసరం కావచ్చు. గొట్టం వేసి, ఆ తేనెతుట్టె లాంటి దాన్ని కరిగించడానికి ఫిబ్రోన్లైటిక్స్ అనే మందుల్ని మూడు రోజుల పాటు లోనికి పంపుతారు. అప్పటికీ లోపలి ఫైబ్రస్ పార్టిషన్స్ కరగకపోతే ఆపరేషన్ ఒక్కటే మార్గం.

చీము తీసేయడం ఆలస్యమైతే, లోపల అనేక ఫైబ్రస్ పార్టిషన్స్ (గదులు) ఏర్పడి,అక్కడ తేనెతుట్టెలా మారిపోతుంది. ఈ దశలో ఆపరేషన్ అవసరం కావచ్చు. అప్పుడు గొట్టం వేసి, దాన్ని, కరిగించడానికి ఫిబ్రోన్లైటిక్స్ అనే మందుల్ని పంపుతారు.

ముందుగా అసలు ఈ చీము ఎందుకు చేరుతుందో కనుక్కోవాలి. అందుకోసం తగిన పరీక్షలూ, కల్చర్స్ చేయించాలి. ఇన్ఫెక్షన్ అదుపు చేయడానికి అవసరమైన మందుల్ని డాక్టర్లు సూచించినంత కాలం వాడాలి.

కొంతమందికి ఈ ఇన్ఫెక్షన్ వల్ల చీము చేరడమే కాకుండా ఊపిరితిత్తులకు కన్నం పడుతుంది. దానివల్ల గాలి లీక్ అవుతుంది. దీన్ని 'బ్రాంకోప్లూరల్ ఫిస్టులా' అంటారు. ఇలాంటివారిలో ఛాతీలో గొట్టం ఎక్కువరోజులు... అంటే ఫిస్టులా మూసుకుపోయే వరకూ ఉంచాలి. ఇందుకు ఒక్కోసారి ఆర్నెల్లు కూడా పట్టవచ్చు. కొంత మందిలో ఆపరేషన్ ద్వారా ఫిస్టులాను రిపేర్ చేయవచ్చు.

● సరిచేద్దాం


మూడేళ్లు... విల్లు కాళ్లు

పిల్లల్లో మోకాళ్ల వద్ద దూరం ఎక్కువగా ఉండి, చిన్నారుల అరికాళ్లు దగ్గరగా ఉంచినప్పుడు ఈ రెండు కాళ్లూ బయటివైపునకు విల్లులా ఒంగి ఉండే కండిషన్‌ను ఇంగ్లిష్‌లో బౌడ్ లెగ్స్, వైద్య పరిభాషలో జీనూవేరమ్ అంటారు. తెలుగు వాడుక భాషలో ఈ కండిషన్‌ను 'దొడ్డికాళ్లు' అంటుంటారు.



నిజానికి పుట్టిన పిల్లలందరూ చిన్నతనంలో కొన్నిరోజుల పాటు ఎంతోకొంత దొడ్డికాళ్ల (బౌడ్ లెగ్స్) కండిషన్‌ను కలిగి ఉంటారు. శిశువు తన పిండ దశలో దగ్గరగా ముడుచుకుని (ఫోల్డెడ్ పొజిషన్‌లో) ఉండటమే దీనికి కారణం. అందువల్ల అప్పుడే పుట్టిన పిల్లల్లో కాళ్లు ఇలా ఉండటం చాలా సాధారణం. పిల్లలు నడక మొదలు పెట్టాక, వాళ్లు తమ కాళ్లపై కొంత బరువు మోపుతుండటం మొదలుకావడంతో... అంటే... ఒకటిన్నర–రెండు సంవత్సరాలప్పటి నుంచి వాళ్ల కాళ్లు మామూలుగా కావడం మొదలవుతుంది. దాదాపు మూడేళ్ల వయస్సు వచ్చేసరికి కాళ్లు రెండూ నార్మల్ షేప్‌కు వస్తాయి.

ఒకవేళ చిన్నారుల్లో వారు మూడేళ్లు పైబడ్డాక కూడా బౌడ్ లెగ్స్ (సివియర్ బౌడ్ లెగ్స్) కండిషన్ ఎక్కువగా కనిపిస్తుంటే అందుకు కారణాలు ఏమై ఉంటాయా అని ముందుగా ఆలోచించాలి. అంటే ఆ పరిస్థితికి... రికెట్స్ వంటి వ్యాధులు గానీ; లేదా లెడ్ (సీసం), ఫ్లోరైడ్స్ వంటి విష పదార్థాల ప్రభావం ఎక్కువ కావడం గానీ; లేదా ఎముకల షేప్ మారడం (బోన్ డిస్‌ప్లేసియాస్) వంటివి గానీ కారణం కావచ్చా అని ఆలోచించాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాలతోనే ఒకవేళ బౌడ్ లెగ్స్ వచ్చి ఉంటే, దాన్ని కాస్తంత తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుంది. ఈ జీనూవేరమ్ కండిషన్ ఉన్న పిల్లలకు ఎక్స్‌రే, రక్తపరీక్షల వంటివి చేసి కారణాలను నిర్ధారణ చేయాలి. కారణం తెలిశాక తగిన చికిత్స అందించాలి.




అయితే మొదట్లో ఈ బౌడ్ లెగ్స్ కండిషన్ కనిపిస్తున్నప్పటికీ చిన్నారుల్లో మూడేళ్ల వయసు వచ్చే వరకు ఈ సమస్య గురించి ఆలోచించాల్సిన లేదా ఆందోళన పడాల్సిన అవసరం ఉండదు. మూడేళ్ల తర్వాత కూడా అలాగే ఉంటే మాత్రం అప్పుడు పిల్లల నిపుణులను లేదా ఆర్థోపెడిక్ నిపుణులను తప్పక సంప్రదించాలి.

సాక్షి ప్లస్
మంగళవారం : 26-11-2024

బిజినెస్ రీల్

రిఫైనింగ్ మార్జిన్లు పెరిగినా.. రిటైల్‌పై అనిశ్చితి..

రిలయన్స్‌పై జేపీ మోర్గాన్ నివేదిక



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ పనితీరు ఇటీవల మందగించడానికి కారణమైన రిఫైనింగ్ మార్జిన్లు పుంజుకున్నా, రిటైల్ విభాగం తీరుతెన్నులను అంచనా వేయడం కష్టతరమేనని బ్రోకరేజి సంస్థ జేపీ మోర్గాన్ పేర్కొంది. రిటైల్ ఆదాయంపై అనిశ్చితి నెలకొన్నట్లు ఒక నివేదికలో వివరించింది. మార్కెట్లు బలహీనంగా ఉండటం, ఇష్యూ పరిమాణం భారీగా ఉండనుండటం వంటి అంశాల కారణంగా జియో/రిటైల్ విభాగాల లిస్టింగ్‌కు మరింత సమయం పట్టేసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. నివేదిక ప్రకారం జూన్ నుంచి గణనీయంగా పడిపోయిన రిఫైనింగ్ మార్జిన్లు క్రమంగా మెరుగుపడ్డాయి. అయితే, రిటైల్ రంగంలో మందగమనంతో పాటు కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రభావాలు ఉండటంతో రిలయన్స్ రిటైల్‌కి సంబంధించి సమీప భవిష్యత్తు అంచనాలను వేయలేని పరిస్థితి నెలకొందని నివేదిక వివరించింది. జూలై 8 నాటి గరిష్ట స్థాయి నుంచి రిలయన్స్ షేరు 22 శాతం క్షీణించిన నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. మిగతా వాటితో పోలిస్తే రిలయన్స్ ఆకర్షణీయమైన ధరలో లభిస్తోందనే అభిప్రాయాలు నెలకొన్నాయి. రిలయన్స్‌లో ప్రధానంగా మూడు వ్యాపార విభాగాలు ఉన్నాయి. మొదటిది ఆయిల్ రిఫైనింగ్..పెట్రోకెమికల్, రెండోది టెలికం విభాగం జియో, మూడోది రిటైల్ సెగ్మెంట్. వీటితో పాటు మీడియా, న్యూ ఎనర్జీ వ్యాపారాలూ ఉన్నాయి. ప్రస్తుతం రిలయన్స్ ఆదాయంలో సుమారు 50 శాతం వాటా రిటైల్, టెలికం విభాగాలదే ఉంటోంది.

27 నుంచి పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో నవంబర్ 27 నుంచి ప్రారంభం అవుతోంది. 29 వరకు జరిగే ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కాంప్లెక్స్ వేదిక కానుంది. 26న నాలెడ్జ్ డే నిర్వహిస్తారు. 50కిపైగా దేశాలకు చెందిన 400లకు పైగా కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి. 16వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోలో 40,000 మంది పౌల్ట్రీ రైతులు, ఈ రంగ నిపుణులు, వ్యాపారులు పాల్గొంటారని అంచనా.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-11-2024

విశాఖ	585-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	595-00
విజయవాడ	595-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	585-00
వరంగల్	587-00
రిటైల్ ధర	6.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	259.05	5.48
BEL	293	4.33
LT	3,757.00	4.26
BPCL	297.3	4.01
SHRIRAMFIN	2,957.65	3.78

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	954.7	-2.32
TECHM	1,735.00	-0.71
INFY	1,891.00	-0.59
MARUTI	11,003.20	-0.55
BAJAJ-AUTO	9,445.00	-0.39

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,504
ఎన్‌ఎస్‌ఈ	1,99,664
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	4,39,522
ఎఫ్ఐఐ	+ 9,948
డీఐఐ	- 6,908

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.05	$ 71.24
బ్రెంట్	72.61	$ 74.63

ఐపీవోకు తొలి ఎస్ఎం రీట్

- ప్రాప్‌షేర్ ప్లాటినా రెడీ
- డిసెంబర్ 2-4 మధ్య ఇష్యూ
- రూ. 353 కోట్లపై కన్ను



న్యూఢిల్లీ: దేశీయంగా తొలిసారి రిజిస్టర్డ్ స్మాల్, మీడియం (ఎస్ఎం) రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్) పబ్లిక్ ఇష్యూకి తెరలేవనుంది. డిసెంబర్ 2న ప్రారంభంకానున్న ఇష్యూ 4న ముగియనుంది. తద్వారా రూ. 353 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు ప్రాపర్టీ షేర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ వెల్లడించింది. సంస్థ నుంచి వెలువడుతున్న తొలి ఎస్ఎం రీట్ పథకం ప్రాప్‌షేర్ ప్లాటినాకు రూ. 10-10.5 లక్షల ధరల శ్రేణిని ప్రకటించింది. ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు ఎలాంటి యూనిట్లను ఆఫర్ చేయకపోగా.. పూర్తిగా ప్లాటినా యూనిట్లను జారీ చేయనున్నట్లు ప్రాపర్టీ షేర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(పీఎస్ఐటీ) పేర్కొంది. ఇష్యూ నిధులను ప్లాటినా ఎస్‌పీవీకిగల ప్రెస్టీజ్ టెక్ ప్లాటినా కొనుగోలుకి వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రాప్‌షేర్ ప్లాటినా తరహా ఎస్ఎం రీట్స్‌వల్ల ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ ఆస్తులలో పెట్టుబడులకు వీలు కలగనున్నట్లు ప్రాపర్టీ షేర్ డైరెక్టర్ కునాల్ మోక్టన్ తెలియజేశారు. నిరవధిక అద్దె రిటర్నులు(ఈల్డ్స్), పెట్టుబడుల వృద్ధి ద్వారా హైబ్రిడ్ రాబడులకు వీలున్నట్లు వివరించారు.

కంపెనీ బ్యాక్‌గ్రౌండ్

ప్రాప్‌షేర్ ప్లాటినా 2,46,935 చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని కలిగి ఉంది. బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్‌వద్ద ప్రెస్టీజ్ టెక్ ప్లాటినాకు చెందిన లీడ్ గోల్డ్ ఆఫీస్ బిల్డింగ్‌లో ఈ ఆస్తిని కలిగి ఉంది. యూఎస్ టెక్ కంపెనీకి పూర్తిస్థాయిలో 9 ఏళ్ల కాలానికి లీజుకి ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఇందుకు 4.6 ఏళ్ల సగటు వెయిటేజీ లాకిన్‌తోపాటు ప్రతీ మూడేళ్లకు 15 శాతం అద్దె పెంపు ప్రాతిపదికను ఎంపిక చేసుకుంది. వెరసి తాజా పథకం 2026లో ఇన్వెస్టర్లకు 9 శాతం పంపిణీ ఈల్డ్‌ను అంచనా వేస్తోంది. 2027లో 8.7 శాతం, 2028లో 8.6 శాతం చొప్పున రిటర్నులకు వీలుంది. యూనిట్లను బీఎస్ఈలో లిస్ట్ చేయనుంది.

ఏటా 7.5 లక్షల కార్ల ఎగుమతి

2031 నాటికి మారుతీ సుజుకీ లక్ష్యం ● ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ

న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ఇప్పటి వరకు 30 లక్షల యూనిట్ల కార్లను వివిధ దేశాలకు ఎగుమతి చేసింది. తాజాగా గుజరాత్‌లోని పిపావావ్ పోర్ట్ నుండి సెలెరియో, ఫ్రాంక్స్, జిమ్నీ, బలేనో, సియాజ్, డిజైర్, ఎస్-ప్రెస్సో వంటి మోడళ్లతో కూడిన 1,053 యూనిట్ల రవాణాతో కంపెనీ కొత్త మైలురాయిని సాధించింది. 2030-31 నాటికి విదేశాలకు ఏటా 7.5 లక్షల యూనిట్లను సరఫరా చేయాలని లక్ష్యంగా చేసుకున్నట్లు సంస్థ సోమవారం తెలిపింది. భారత ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియా చొరవతో మరింత స్థానికీకరణ, ఎగుమతులను రెట్టింపు చేయడం కోసం కట్టుబడి ఉన్నామని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు.

నాలుగేళ్లలో మూడు రెట్లు..

భారత్ నుండి ఎగుమతి అవుతున్న మొత్తం ప్రయాణికుల వాహనాల్లో 40 శాతం వాటా తమ సంస్థ కైవసం చేసుకుందని టాకేయూచీ చెప్పారు. దేశం నుంచి కంపెనీ ఎగుమతులు నాలుగేళ్లలో మూడు రెట్లు పెరిగాయని వెల్లడించారు. ఈ గ్లోబల్ డిమాండ్ నుండి ప్రేరణ పొంది 2030-31 నాటికి వాహన ఎగుమతులను 7.5 లక్షల యూనిట్లకు చేర్చాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు వివరించారు. ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు, కొన్ని మార్కెట్లతో వాణిజ్య ఒప్పందాలు కంపెనీ ఎగుమతుల వృద్ధిని పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ కాలంలో మారుతీ సుజుకీ ఇండియా 1,81,444 యూనిట్లను ఎగుమతి చేసింది. అంతకుముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 17 శాతం వృద్ధిని సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 2.83 లక్షల యూనిట్లను వివిధ దేశాలకు సరఫరా చేసింది.





అత్యంత వేగవంత మిలియన్..

ప్రస్తుతం కంపెనీ లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా, మధ్యప్రాచ్యంలోని దాదాపు 100 దేశాల్లో 17 మోడళ్లను విక్రయిస్తోంది. ఫ్రాంక్స్, జిమ్నీ, బలేనో, డిజైర్, ఎస్-ప్రెస్సో అధికంగా ఎగుమతి అవుతున్న టాప్ మోడళ్లుగా నిలిచాయి. 1986 నుంచి మారుతీ సుజుకీ భారత్‌లో తయారైన కార్లను విదేశాలకు సరఫరాను ప్రారంభించింది. కంపెనీ వాహన ఎగుమతుల్లో తొలి 10 లక్షల యూనిట్ల మార్కును 2012-13లో సాధించింది. తొమ్మిదేళ్లలోనే 20 లక్షల యూనిట్ల మైలురాయిని 2020-21లో అందుకుంది. 30 లక్షల యూనిట్ల స్థాయికి మూడు సంవత్సరాల తొమ్మిది నెలల్లోనే సంస్థ సాధించింది. ఇది కంపెనీకి అత్యంత వేగవంతమైన మిలియన్‌గా నిలవడం విశేషం.

2 కంపెనీల ఐపీవోలకు ఓకే

- సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్
- జాబితాలో కల్పతరు రియల్టీ
- యూనిమెక్ ఏరోస్పేస్



న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ కల్పతరు లిమిటెడ్‌తో పాటు, హైప్రెసిషన్ ఇంజినీరింగ్ కంపెనీ యూనిమెక్ ఏరోస్పేస్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్ పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐపీవోలో కల్పతరు పూర్తిగా తాజా ఈక్విటీని జారీ చేయనుంది. యూనిమెక్ ఏరోస్పేస్ తాజాగా ఈక్విటీ జారీసహా ప్రమోటర్లు షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈ ఏడాది ఆగస్ట్‌లో రెండు కంపెనీలు సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. వివరాలు చూద్దాం..

రూ. 1,590 కోట్లపై దృష్టి

ప్రాస్పెక్టస్ ప్రకారం కల్పతరు ఐపీవోలో భాగంగా రూ. 1,590 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. ఐపీవో నిధుల్లో దాదాపు రూ. 1,193 కోట్లు కల్పతరు గ్రూప్ కంపెనీ రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. కల్పతరు గ్రూప్‌లో కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్, ప్రాపర్టీ సొల్యూషన్స్(ఇండియా), శ్రీ శుభం లాజిస్టిక్స్ ఉన్నాయి.

రూ. 500 కోట్ల సమీకరణ

ఐపీవోలో భాగంగా యూనిమెక్ ఏరోస్పేస్ రూ. 250 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు మరో రూ. 250 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులలో కొంతమేర మెషీనరీ, పరికరాల కొనుగోలు ద్వారా విస్తరణకు వినియోగించనుంది. ఈ బాటలో వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, రుణ చెల్లింపులు తదితరాలకు సైతం నిధులను వెచ్చించనుంది.

భారీగా పెరగనున్న ఉపాధి అవకాశాలు

- ద్వితీయార్థంలో అధికంగా నియామకాలు
- 7 శాతం మందిని పెంచుకోనున్న సంస్థలు
- ఈ-కామర్స్, లాజిస్టిక్స్, తయారీలో సానుకూలత




ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల కాలంలో (2024 అక్టోబర్ నుంచి 2025 మార్చి వరకు) ఉపాధి అవకాశాలు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి. ఈ కాలంలో సిబ్బందిని పెంచుకోనున్నట్టు 59 శాతం సంస్థలు తెలిపాయి. దీంతో ద్వితీయ ఆరు నెలల్లో 7.1 శాతం మేర సిబ్బంది పెరగనున్నట్టు టీమ్‌లీజ్ సర్వీసెస్ 'ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్ రిపోర్ట్' వెల్లడించింది. ప్రస్తుత స్థాయిలోనే సిబ్బంది సంఖ్యను కొనసాగించనున్నట్టు టీమ్‌లీజ్ సర్వేలో 22 శాతం కంపెనీలు తెలిపాయి. 23 రంగాల్లోని 1,307 కంపెనీల అభిప్రాయాలను టీమ్‌లీజ్ సర్వేలో భాగంగా తెలుసుకుంది. లాజిస్టిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), ఈవీ సదుపాయాలు, వ్యవసాయం, ఆగ్రోకెమికల్స్, ఈ-కామర్స్ రంగాల నుంచే ప్రధానంగా ఎక్కువ ఉపాధి అవకాశాలు రానున్నాయని, ఇవి మౌలిక వసతులు, ఆధునిక టెక్నాలజీపై ఎక్కువగా వ్యయం చేస్తున్నట్టు టీమ్‌లీజ్ నివేదిక తెలిపింది.

రంగాల వారీ..

లాజిస్టిక్స్ రంగంలో 14 శాతం మేర ఉపాధి అవకాశాలు అధికంగా రానున్నాయి. ఉద్యోగులను పెంచుకోనున్నట్టు 69 శాతం లాజిస్టిక్స్ కంపెనీలు వెల్లడించాయి. ఆ తర్వాత అధికంగా ఈవీ, ఈవీ ఇన్‌ఫ్రా కంపెనీలు 12 శాతం మేర సిబ్బందిని పెంచుకోనున్నాయి. వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్ కంపెనీల్లో 10.5 శాతం మేర, ఈ-కామర్స్ రంగంలో 9 శాతం మేర ఉపాధి అవకాశాలు అధికంగా రానున్నాయి. ఆటోమోటివ్ రంగంలో 8.5 శాతం, రిటైల్ రంగంలో 8.2 శాతం మేర ఉపాధి అవకాశాలు అధికంగా ఏర్పడనున్నాయి. కోయింబత్తూర్, గురుగ్రామ్ ఉపాధి కల్పన కేంద్రాలుగా మారుతున్నట్టు టీమ్‌లీజ్ నివేదిక తెలిపింది. అత్యధికంగా బెంగళూరు 53.1 శాతం, ముంబై 50.2 శాతం, హైదరాబాద్ 48.2 శాతంతో ఉపాధి కల్పన పరంగా ముందున్నాయి. ఉపాధి కోరుకుంటున్న వారికి చిన్న పట్టణాలు ప్రత్యామ్నాయ కేంద్రాలుగా మారుతున్నట్టు టీమ్‌లీజ్ నివేదిక పేర్కొంది. గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీలు) టెక్నాలజీ, ఆర్అండ్‌డీలో అధిక నైపుణ్య ఉద్యోగాలను సృష్టిస్తున్నట్టు తెలిపింది. జాతీయ పారిశ్రామిక నడవాల ద్వారా ప్రత్యక్షంగా 10 లక్షల మందికి పరోక్షంగా 30 లక్షల మందికి ఉపాధి కల్పించనుండడం, సెమీకండక్టర్ పాలసీ ద్వారా 2025 నాటికి 80,000 ఉద్యోగాల కల్పన తదితర కీలక విధానాలను ప్రస్తావించింది.

అదానీలో పెట్టుబడులు గుడ్

జీక్యూజీ పార్ట్‌నర్స్ వెల్లడి



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై అమెరికాలో నమోదైన లంచాల ఆరోపణల నేపథ్యంలో ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్, ఫ్రాన్స్ ఇంధన రంగ దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ తాజాగా స్పందించాయి. గతేడాది యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల తదుపరి అదానీ గ్రూప్‌లో జీక్యూజీ పార్ట్‌నర్స్ భారీగా ఇన్వెస్ట్ చేసింది. టోటల్‌ఎనర్జీస్ అదానీ గ్రూప్‌తో భాగస్వామ్య కంపెనీని కలిగి ఉంది. కాగా.. అదానీ గ్రూప్‌లోని తమ పెట్టుబడులన్నీ అత్యంత లాభదాయకంగా ఉన్నట్లు జీక్యూజీ తెలియజేసింది. యూఎస్‌లో కేవలం వ్యక్తులపైనే లంచాల ఆరోపణలు నమోదైనట్లు ప్రస్తావించింది. అయితే తాము పెట్టుబడులు చేపట్టిన అదానీ గ్రూప్ పటిష్టంగానే ఉన్నట్లు పేర్కొంది. విడిగా గ్రూప్ కంపెనీల బిజినెస్ మూలాలు పటిష్టంగా ఉన్నట్లు అభిప్రాయపడింది. అదానీ గ్రూప్‌లో జీక్యూజీ 8 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులను కలిగి ఉంది. ఇంతక్రితం వాల్‌మార్ట్, ఒరాకిల్, సీమెన్స్, ఫైజర్, హనీవెల్ తదితర పలు గ్లోబల్ కంపెనీలు, ఎగ్జిక్యూటివ్‌లపై సైతం వివిధ ఆరోపణలను ఎదుర్కొన్నట్లు పేర్కొంది. ఇక మరోవైపు అదానీ గ్రూప్ అత్యున్నత అధికారులపై లంచాల ఆరోపణల నేపథ్యంలో ఫ్రెంచ్ దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ ప్రస్తుతానికి తాజా పెట్టుబడులను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. అదానీ టోటల్ గ్యాస్‌తోపాటు అదానీ గ్రీన్ ఎనర్జీలోనూ ఫ్రెంచ్ దిగ్గజానికి పెట్టుబడులున్న సంగతి తెలిసిందే. అదానీ టోటల్ గ్యాస్‌లో 37.4 శాతం వాటాను కలిగి ఉంది. అదానీ గ్రీన్ ఎనర్జీలోనూ టోటల్‌కు 19.75 శాతం వాటా ఉంది.

ఆర్థికంగా పటిష్టం: అదానీ గ్రూప్

తగినంత నగదు నిల్వలు, లాభార్జన నేపథ్యంలో ఆర్థికంగా పటిష్టంగా ఉన్నట్లు అదానీ గ్రూప్ తాజాగా వెల్లడించింది. దీంతో రుణ చెల్లింపులకు సమస్యలు ఎదురుకాబోవని స్పష్టం చేసింది. అంతేకాకుండా వృద్ధి అవకాశాలకు సైతం నిధులు సరిపోతాయని తెలియజేసింది. తద్వారా ఇన్వెస్టర్లకు భరోసానిచ్చింది. కంపెనీ అత్యున్నత ఎగ్జిక్యూటివ్‌లపై యూఎస్‌లో లంచాల ఆరోపణలు వెలువడిన కారణంగా ఇన్వెస్టర్లకు ఒక నోట్‌లో కంపెనీ ఆర్థిక పరిస్థితులను కంపెనీవద్ద రూ. 55,024 కోట్ల నగదు నిల్వలున్నాయని, ఇవి రాగల 28 నెలల్లో చేపట్టవలసిన దీర్ఘకాలిక రుణ చెల్లింపులకంటే అధికమని తెలియజేసింది. గత ఆరు నెలల్లో గ్రూప్ రూ. 75,227 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. అయితే ఇదేసమయంలో మొత్తం రుణ భారం రూ. 16,882 కోట్లు మాత్రమే పెరిగినట్లు వెల్లడించింది.

దేశీయ విమాన ప్రయాణికుల జోరు

- అక్టోబరులో 1.36 కోట్లకు
- 2023తో పోలిస్తే 5.3% వృద్ధి
- డీజీసీఏ గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 2024 అక్టోబరులో 1.36 కోట్లు నమోదైందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మంగళవారం వెల్లడించింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే గత నెలలో ప్యాసింజర్ల సంఖ్య 5.3 శాతం పెరిగిందని వివరించింది. 2023 అక్టోబరులో 1.26 కోట్ల మంది దేశీయంగా వివిధ నగరాలకు విమాన ప్రయాణాలు సాగించారు. 2024 అక్టోబరులో బడ్జెట్ క్యారియర్ ఇండిగో 86.40 లక్షల మందిని వివిధ గమ్య స్థానాలకు చేర్చింది. తద్వారా 63.3 శాతం మార్కెట్ వాటాను సాధించింది. టాటా గ్రూప్ నడుపుతున్న ఎయిర్ ఇండియా 26.48 లక్షలు, విస్తారా 12.43 లక్షల మందికి సేవలు అందించాయి. ఎయిర్ ఇండియా గణాంకాల్లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్యాసింజర్ల సంఖ్య కలిసే ఉంది. ఎయిర్ ఇండియా తన అనుబంధ సంస్థ ఏఐఎక్స్ కనెక్ట్‌ను తన అంతర్జాతీయ బడ్జెట్ విభాగం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో 2024 అక్టోబర్ 1న విలీనం చేసింది. గత నెలలో ఎయిర్ ఇండియా (ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో సహా) మార్కెట్ వాటా 19.4 శాతం కాగా, విస్తారా 9.1 శాతంగా ఉంది. గతంలో టాటా సన్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ మధ్య 51:49 శాతం జాయింట్ వెంచర్ అయిన విస్తారా కూడా నవంబర్ 12న ఎయిర్ ఇండియాలో విలీనం అయింది. రెండు టాటా గ్రూప్ ఎయిర్‌లైన్స్ (ఎయిర్ ఇండియా, విస్తారా) గత నెలలో మొత్తం దేశీయ ప్రయాణికుల రద్దీలో 28.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అకాశ ఎయిర్ 6.16 లక్షల మందితో 5.4 శాతం, స్పైస్‌జెట్ 3.35 లక్షల మందితో 2.4 శాతం వాటా దక్కించుకున్నాయి.

భారత్ వృద్ధిపై మార్సెలస్ ఇన్వెస్ట్‌మెంట్ పుస్తకం..



ముంబై: శక్తివంతమైన ఆర్థిక కేంద్రంగా ఆవిర్భవిస్తున్న భారత్ ప్రస్థానాన్ని తెలియజేసేలా మార్సెలస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ సీఐవో సౌరభ్ ముఖర్జీ, ఎకానమిస్టు నందితా రాజహంస విశ్లేషణాత్మక పుస్తకాన్ని ఆవిష్కరించారు. బిహోల్డ్ ది లెవియథాన్: అనూజువల్ రైజ్ ఆఫ్ మోడర్న్ ఇండియా పేరిట రాసిన ఈ పుస్తకంలో అధిక వృద్ధిని నిలబెట్టుకుంటూ, సామాజిక సవాళ్లను అధిగమిస్తూ భారత్ పురోగమిస్తున్న తీరును విశ్లేషించారు. వృద్ధి చోదకాలు, చారిత్రక ప్రభావాలు, ప్రస్తుత విధానాలు, భవిష్యత్ అవకాశాల గురించి సవివరంగా ఈ పుస్తకంలో ప్రస్తావించినట్లు ముఖర్జీ తెలిపారు.

విభిన్న కరెన్సీల్లో చెల్లింపులు: మేక్‌మైట్రిప్



ముంబై: ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్ దేశీయంగా పర్యాటకాన్ని పెంపొందించడానికి విభిన్న కరెన్సీల్లో చెల్లింపు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. బహ్రెయిన్ దినార్, బ్రిటిష్ పౌండ్ స్టెర్లింగ్, యూరో, యూఎస్ డాలర్‌లతో సహా ప్రధాన ప్రపంచ కరెన్సీలలో వినియోగదార్లు చెల్లింపులను జరుపవచ్చు. ఈ ఫీచర్ అంతర్జాతీయ ప్రయాణికులను కంపెనీ విస్తృత నెట్‌వర్క్‌తో నేరుగా అనుసంధానించడంలో సహాయపడుతుందని, అలాగే భారత్‌లోని 2,100 నగరాల్లో వసతి కల్పిస్తుందని కంపెనీ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు, అలాగే కంపెనీ అంతర్జాతీయ కస్టమర్ల కోసం వారు ఎంచుకున్న కరెన్సీల్లో చెల్లింపులను సులభతరం చేస్తుందని వివరించింది. విదేశీ ప్రయాణికులు మేక్‌మైట్రిప్ ప్లాట్‌ఫామ్‌ను ఎక్కువగా స్వీకరించడానికి పునాది వేస్తుందని సంస్థ కో-ఫౌండర్, గ్రూప్ సీఈవో రాజేశ్ మాగోవ్ తెలిపారు.

వృద్ధి పట్ల ఆశావహమే.. కానీ అప్రమత్తత

- మంచి వర్షాలు, ఎంఎస్‌పీలతో ప్రయోజనం
- ద్రవ్యోల్బణం దిగొస్తుందన్న కేంద్ర ఆర్థిక శాఖ
- భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం కొనసాగొచ్చని అంచనా



న్యూఢిల్లీ: రానున్న నెలల్లో దేశ ఆర్థిక వృద్ధి పట్ల జాగ్రత్తతో కూడిన ఆశావహ ధోరణితో ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. మంచి వర్షాలు, రిజర్వాయర్లలో మెరుగైన నీటి నిల్వలు, కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పీ) పెంచడం, ముడి సరుకుల లభ్యత ఇవన్నీ సానుకూల అంశాలుగా పేర్కొంది. ''ప్రస్తుతం కొన్ని ఆహార ఉత్పత్తుల ధరలు అధిక స్థాయిలో ఉన్నప్పటికీ, మెరుగైన వ్యవసాయ ఉత్పాదకత పరిస్థితులతో ద్రవ్యోల్బణం రానున్న రోజుల్లో దిగొస్తుంది. నవంబర్ నెల ప్రారంభ ధోరణులు కీలక ఆహార ధరలు మోస్తరు స్థాయికి చేరుతున్నట్టు సంకేతమిస్తున్నాయి. అయినప్పటికీ భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావం దేశీయంగా ద్రవ్యోల్బణం, సరఫరా వ్యవస్థలపై కొనసాగుతుంది''అని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం విడుదల చేసిన నెలవారీ ఆర్థిక సమీక్షా నివేదిక వెల్లడించింది. ఖరీఫ్ సీజన్‌లో పెద్ద ఎత్తున పెరిగిన సాగుతో ఆహార ధరలు దిగొస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేసింది. ఆర్థిక కార్యకలాపాలు వర్షాకాలంలో కొంత నిదానించినప్పటికీ, తిరిగి అక్టోబర్‌లో పుంజుకున్నట్టు కొన్ని సంకేతాలు తెలియజేస్తున్నట్టు తెలిపింది. గ్రామీణ, పట్టణ డిమాండ్‌తోపాటు, పీఎంఐ సూచీ, ఈవే బిల్లుల జారీ తదితర సంకేతాలను ప్రస్తావించింది.

ఉపాధి విస్తరణ..

సంఘటిత రంగంలో ఉద్యోగుల సంఖ్య విస్తరిస్తోందని.. తయారీ రంగంలో చెప్పుకోతగ్గ మేర ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నట్టు ఆర్థిక శాఖ నివేదిక వెల్లడించింది. అభివృద్ధి చెందిన మార్కెట్లలో డిమాండ్ తగ్గడం వల్ల దేశ ఎగుమతులు పుంజుకునే విషయంలో సవాళ్లను ఎదుర్కోవచ్చని అంచనా వేసింది. మరోవైపు సేవల రంగం ఊపందుకుంటున్నట్టు తెలిపింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో (ఎఫ్‌డీఐలు) చెప్పుకోతగ్గ వృద్ధి లేదని వెల్లడించింది. విదేశీ మారకం నిల్వలు ఈ ఏడాది ఇప్పటి వరకు 64.8 బిలియన్ డాలర్ల మేర పెరిగినట్టు, చైనా తర్వాత అధిక వృద్ధి నమోదైనట్టు తెలిపింది. అంతర్జాతీయంగా వడ్డీ రేట్లు, కంపెనీల ఆదాయాల వృద్ధి, విలువలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ట్రంప్ సర్కారు విధాన నిర్ణయాలు తదుపరి విదేశీ పెట్టుబడుల రాకను ప్రభావితం చేస్తాయని వివరించింది.

అంతర్జాతీయ పరిణామాలు..

రష్యా-ఉక్రెయిన్ మధ్య తాజా ఉద్రిక్తతలతో ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆందోళనకు దారితీసిందని, దీంతో భద్రత ఎక్కువ ఉండే సాధనాలైన యూఎస్ ట్రెజరీలు, బంగారానికి డిమాండ్ ఏర్పడినట్టు ఆర్థిక శాఖ నివేదిక తెలిపింది. యూరప్, చైనాలో ఆర్థిక మందగమనం ప్రభావం అంతర్జాతీయ వృద్ధిపై కొనసాగుతుందని అంచనా వేసింది. అదే సమయంలో యూఎస్ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి పనితీరు చూపిస్తున్నట్టు పేర్కొంది.

ఆహార ద్రవ్యోల్బణం స్వల్పకాలికమే

టీసీపీఎల్ ఎండీ సునీల్ డిసౌజా

ముంబై: ఆహార ధరల పెరుగుదల ధోరణులు స్వల్పకాలికమైనవేనని, వచ్చే రెండు త్రైమాసికాల్లో తిరిగి సాధారణ పరిస్థితి నెలకొన్నాక వినియోగదారుల డిమాండ్ మళ్లీ పుంజుకుంటుందని ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్ (టీసీపీఎల్) ఎండీ, సీఈవో సునీల్ డిసౌజా తెలిపారు. వృద్ధి ప్రణాళికల కింద అమ్మకాల పరిమాణాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టిన నేపథ్యంలో, మార్జిన్లపరంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ తక్షణం రేట్లను పెంచే యోచనేదీ లేదని ఆయన పేర్కొన్నారు. రెండంకెల స్థాయిలో ఆదాయం, మార్జిన్ల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. ఆహార ద్రవ్యోల్బణం వల్ల అక్టోబర్‌లో పట్టణ ప్రాంతాల్లో వినియోగంపై ప్రభావం పడినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ మళ్లీ పుంజుకుంటోందని ఆయన పేర్కొన్నారు. టీసీపీఎల్ అగ్రగామిగా ఉన్న టీ తదితర సెగ్మెంట్లలో ముడి సరుకుల ధరలు 25-30 శాతం పెరిగాయని చెప్పారు. తదనుగుణంగా కొన్ని కేటగిరీల్లో ఇప్పటికే రేట్లు కొంత మేర పెంచామని, ఇకపై పెంచినా.. అది నామమాత్రంగానే ఉండొచ్చని వివరించారు.

ఆంధ్ర నుంచి ముగ్గురు...

ఐపీఎల్ వేలంలో హైదరాబాద్, ఆంధ్ర క్రికెట్ సంఘాల నుంచి మొత్తం నలుగురు ఆటగాళ్లను ఫ్రాంచైజీలు ఎంచుకున్నాయి. భారత జట్టులో కీలక సభ్యుడైన పేసర్ మొహమ్మద్ సిరాజ్‌ను తొలి రోజు భారీ మొత్తానికి (రూ.12 కోట్ల 25 లక్షలు) గుజరాత్ ఎంచుకుంది. సోమవారం ముగ్గురు ఆంధ్ర క్రికెటర్లు షేక్ రషీద్ (చెన్నై), పైలా అవినాశ్ (పంజాబ్), పెన్మత్స వెంకట సత్యనారాయణ (ముంబై)లను కనీస మొత్తం రూ.30 లక్షలకు జట్లు ఎంచుకున్నాయి. ఐపీఎల్‌లో మూడు టీమ్‌ల తరఫున ఆడిన వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు మాత్రం వేలంలో నిరాశే ఎదురైంది. వేలానికి ముందే తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డిలను ముంబై ఇండియన్స్, హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్లు అట్టి పెట్టుకున్నాయి.

రాణించిన విజయ్, స్టీఫెన్

నాగాలాండ్‌పై ఆంధ్ర విజయం


విజయ్


స్టీఫెన్

సాక్షి, హైదరాబాద్: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు శుభారంభం చేసింది. ఉప్పల్ స్టేడియంలో సోమవారం జరిగిన గ్రూప్ 'ఇ' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన నాగాలాండ్ జట్టు 17.1 ఓవర్లలో 77 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు త్రిపురాణ విజయ్ 8 పరుగులిచ్చి 4 వికెట్లు... స్టీఫెన్ 6 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి నాగాలాండ్‌ను దెబ్బ తీశారు. శశికాంత్, సత్యనారాయణ రాజు, వినయ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. అనంతరం ఆంధ్ర జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్లు కోన శ్రీకర్ భరత్ (26 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్), అశ్విన్ హెబ్బర్ (24 బంతుల్లో 43; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 63 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక షేక్ రషీద్ (4 నాటౌట్), వంశీకృష్ణ (5 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు. రేపు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో గోవాతో ఆంధ్ర తలపడుతుంది.

తిలక్ వర్మ మెరిసినా...

బెంగాల్ చేతిలో హైదరాబాద్ ఓటమి



రాజ్‌కోట్: కెప్టెన్ ఠాకూర్ తిలక్ వర్మ (44 బంతుల్లో 57; 5 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకంతో ఆకట్టుకున్నా... సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. గత మ్యాచ్‌లో మేఘాలయ జట్టుపై ఘనవిజయం సాధించిన హైదరాబాద్... గ్రూప్ 'ఎ'లో భాగంగా సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో బెంగాల్ చేతిలో 8 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 18.3 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటైంది. టి20ల్లో వరుసగా మూడు శతకాలు బాది రికార్డుల్లోకెక్కిన తిలక్ వర్మ అదే ఫామ్ కొనసాగిస్తూ హాఫ్‌సెంచరీతో విజృంభించగా... రాహుల్ బుద్ధి (30; 4 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించాడు. తన్మయ్ అగర్వాల్ (6) రాహుల్ సింగ్ (10), మికిల్ జైస్వాల్ (12), రవితేజ (0), ప్రతీక్ రెడ్డి (3), సీవీ మిలింద్ (0) విఫలమయ్యారు. బెంగాల్ బౌలర్లలో మొహమ్మద్ షమీ 3... షహబాజ్, కరణ్ లాల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బెంగాల్ జట్టు 17.5 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసి గెలిచింది. అభిషేక్ పొరెల్ (41; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కరణ్‌లాల్ (46; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ, అనికేత్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. తదుపరి మ్యాచ్‌లో బుధవారం రాజస్తాన్‌తో హైదరాబాద్ తలపడనుంది.

7 ఆలౌట్

- నైజీరియాతో మ్యాచ్‌లో కుప్పకూలిన ఐవరీకోస్ట్
- టి20ల్లో కొత్త చెత్త రికార్డు



లాగోస్ (నైజీరియా): ఆఫ్రికా జట్టు ఐవరీకోస్ట్ చెత్త రికార్డుతో క్రికెట్ పుటలకెక్కింది. నైజీరియాతో జరిగిన టి20 మ్యాచ్‌లో ఐవరీకోస్ట్ ఏడంటే 7 పరుగులకే ఆలౌటైంది. దీంతో పురుషుల క్రికెట్‌లో సింగిల్ డిజిట్‌కే కుప్పకూలిన జట్టుగా నిలిచింది. ఐసీసీ టి20 ప్రపంచకప్ సబ్-రీజినల్ ఆఫ్రికా క్వాలిఫయర్స్‌లో భాగంగా గ్రూప్ 'సి'లో జరిగిన పోరులో మొదట నైజీరియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 271 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు సెలిమ్ సలవు (53 బంతుల్లో 112 రిటైర్డ్ అవుట్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు), సులైమోన్ రున్సెవె (29 బంతుల్లో 50; 8 ఫోర్లు) చెలరేగారు. ఇద్దరు తొలి వికెట్‌కు 10 ఓవర్లలో 128 పరుగులు జోడించారు. మిడిలార్డర్‌లో ఇసాక్ ఒప్కే (23 బంతుల్లో 65 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఐవరీకోస్ట్ 7.3 ఓవర్లలో 7 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ మొహమ్మద్ (4) టాప్ స్కోరర్! మిగతా 10 మందిలో మిమి అలెక్స్, ఇబ్రహీమ్, క్లావుడే తలా ఒక పరుగు చేశారు. ఏడుగురైతే అసలు ఖాతానే తెరువలేకపోయారు. ప్రాస్పెర్ ఉసెని పరుగు ఇవ్వకుండా 3, పీటర్ అహో 2 వికెట్లు తీయగా, ఇసాక్ డన్లాడి 2 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. దీంతో నైజీరియా 264 పరుగుల భారీ తేడాతో మ్యాచ్ గెలిచింది. గత అత్యల్ప స్కోరు 10 ఆలౌట్. మంగోలియా-సింగపూర్... ఐల్ ఆఫ్ మ్యాన్-స్పెయిన్‌ల మధ్య జరిగిన రెండు మ్యాచ్‌ల్లో 10 ఆలౌట్ రికార్డును ఐవరీకోస్ట్ జట్టు 'ఏడు'తో తుడిచేసింది.

అర్జున్ అదరహో


అర్జున్

- 16 పాయింట్లు సాధించిన పింక్‌పాంథర్స్ రెయిడర్
- పుణేరి పల్టన్‌పై జైపూర్ ఘనవిజయం

నోయిడా: స్టార్ రెయిడర్ అర్జున్ దేశ్వాల్ 16 పాయింట్లతో విజృంభించడంతో... ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ ఏడో విజయం నమోదు చేసుకుంది. లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన పోరులో పింక్ పాంథర్స్ 37-23 పాయింట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్‌పై విజయం సాధించింది. జైపూర్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడితే... పుణేరి కేవలం రెయిడింగ్‌లోనే సత్తా చాటింది. ఈ మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 20 రెయిడ్ పాయింట్లు సాధించగా... పల్టన్ 19 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. డిఫెన్స్‌లో జైపూర్ 10 పాయింట్లు కొల్లగొట్టగా... పుణేరి 3 పాయింట్లకే పరిమితమైంది. జైపూర్ తరఫున అర్జున్ విజృంభించగా.. అతడికి నీరజ్ నర్వాల్ నుంచి సహకారం లభించింది. పుణేరి పల్టన్ తరఫున పంకజ్, మోహిత్ గోయట్ చెరో 7 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో 13 మ్యాచ్‌లాడి 7 విజయాలు, 5 పరాజయాలు, ఒక 'టై'తో 40 పాయింట్లు ఖాతాలో వేసుకున్న జైపూర్ ఐదో స్థానానికి చేరింది. 42 పాయింట్లతో పుణేరి పల్టన్ నాలుగో స్థానంలో ఉంది. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో యు ముంబా 34-32 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. యు ముంబా తరఫున మన్‌జీత్ (8 పాయింట్లు), అజిత్ చవాన్ (7 పాయింట్లు) రాణించగా... బెంగళూరు తరఫున సుశీల్ (8 పాయింట్లు), ప్రదీప్ నర్వాల్ (6 పాయింట్లు) సత్తాచాటారు. 13 మ్యాచ్‌ల్లో 8 విజయాలు, 4 పరాజయాలు, ఒక 'టై'తో 45 పాయింట్లతో నిలిచిన యు ముంబా పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. 14 మ్యాచ్‌ల్లో 12వ పరాజయం మూటగట్టుకున్న బెంగళూరు బుల్స్ 16 పాయింట్లతో పట్టికలో అట్టడుగున ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తమిళ్ తలైవాస్ (రాత్రి 8 గంటలకు), దబంగ్ ఢిల్లీతో పట్నా పైరేట్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

వేలం ముగిసింది
సమరం మిగిలింది

వచ్చే ఏడాది మార్చిలో ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం



జిద్దా (సౌదీ అరేబియా): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌కు సంబంధించి మెగా వేలం కార్యక్రమం సోమవారం ముగిసింది. 10 ఫ్రాంచైజీలు తాము కోరుకున్న ఆటగాళ్లను ఎంచుకున్నాయి. ఇక వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఐపీఎల్ టోర్నమెంట్‌కు ఎలా సమాయత్తం కావాలో ఫ్రాంచైజీలు ప్రణాళికలు రచించుకుంటాయి. ఇంతవరకూ ఐపీఎల్ టైటిల్ నెగ్గలేకపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు వచ్చే సీజన్‌లోనైనా విన్నర్స్ ట్రోఫీని సొంతం చేసుకుంటాయో లేదో వేచి చూడాలి.

రెండో రోజు వేలంలో కొన్ని విశేషాలు...

- భువనేశ్వర్ కుమార్ కోసం ముంబై, లక్నో మధ్య తీవ్ర పోటీ సాగింది. ఈ రెండు కలిసి అతని విలువను రూ.10 కోట్ల 50 లక్షల వరకు తీసుకెళ్లాయి. ఈ స్థితిలో అనూహ్యంగా ముందుకు వచ్చిన బెంగళూరు రూ.10 కోట్ల 75 లక్షలకు అతడిని సొంతం చేసుకుంది.
- దీపక్ చహర్‌ను తీసుకునేందుకు చెన్నై చివరి వరకు ప్రయత్నించింది. ముంబై, పంజాబ్‌లతో పోటీ పడి రూ. 8 కోట్ల వరకు బరిలో నిలిచింది. అయితే వెనక్కి తగ్గని ముంబై రూ.9 కోట్ల 75 లక్షలకు అతడిని దక్కించుకుంది.
- సోమవారం వేలంలో అందరికంటే ముందుగా న్యూజిలాండ్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ పేరు రాగా అతడిని తీసుకునేందుకు ఆసక్తి చూపించలేదు.
- గత ఏడాది వరకు బెంగళూరు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన డుప్లెసిస్‌ను ఈసారి అతని కనీస విలువ రూ.2 కోట్లకే ఢిల్లీ క్యాపిటల్స్ ఎంచుకుంది.
- భారత పేస్ బౌలర్లలో ఆకాశ్‌దీప్ (రూ.8 కోట్లు; లక్నో), ముకేశ్ కుమార్ (రూ. 8 కోట్లు; ఢిల్లీ), తుషార్ దేశ్‌పాండే (రూ. 6 కోట్ల 50 లక్షలు; రాజస్తాన్ రాయల్స్) మంచి విలువ పలికారు.
- అఫ్గానిస్తాన్ మిస్టరీ ఆఫ్‌స్పిన్నర్ అల్లా గజన్‌ఫర్ కోసం కోల్‌కతా, బెంగళూరులతో పోటీ పడి ముంబై సొంతం చేసుకుంది. భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని పోలిన బౌలింగ్ శైలిగల గజన్‌ఫర్ గత ఏడాది కోల్‌కతా టీమ్‌లో ఉన్నా మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు.
- ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఒకే ఓవర్లో ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాది అందరి దృష్టిలో పడిన ప్రియాన్ష్ ఆర్య కోసం నాలుగు జట్లు బరిలో నిలవగా, చివరగా పంజాబ్ దక్కించుకుంది.
- పదేళ్ల క్రితం చివరి టి20 మ్యాచ్ ఆడి టెస్టుల రిటైర్మెంట్ తర్వాత ఇప్పుడు ఐపీఎల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్‌ను ఎవరూ పట్టించుకోలేదు.
- రిటెయిన్ చేసుకున్న వారితో కలిపి మొత్తం 25 ఆటగాళ్ల గరిష్ఠ కోటాను చెన్నై సూపర్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ పూర్తి చేసుకోగా... లక్నో సూపర్ జెయింట్స్ (24), ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ (23), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (22), డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (21), రాజస్తాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ (20) అంతకంటే తక్కువ మందితో సరిపెట్టాయి.

అమ్ముడుపోని ఆటగాళ్లలో కొందరు...



రెండో రోజు వేలంలోనూ పలువురు ప్రముఖ క్రికెటర్లను ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కెప్టెన్లు డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్... బెయిర్‌స్టో, మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా, శార్దుల్ ఠాకూర్, కోన శ్రీకర్ భరత్, ముస్తఫిజుర్, నవీన్ ఉల్ హక్, స్టీవ్ స్మిత్, సర్ఫరాజ్ ఖాన్, క్రిస్ జోర్డాన్‌లను ఫ్రాంచైజీలు తీసుకోలేదు.

చెన్నై సూపర్ కింగ్స్

రుతురాజ్ (రూ. 18 కోట్లు)
జడేజా (రూ. 18 కోట్లు)
పతిరణ (రూ. 13 కోట్లు)
శివమ్ దూబే (రూ. 12 కోట్లు)
ధోని (రూ. 4 కోట్లు)
నూర్ అహ్మద్ (రూ.10 కోట్లు)
ఆర్. అశ్విన్ (రూ. 9.75 కోట్లు)
కాన్వే (రూ. 6.25 కోట్లు)
ఖలీల్ అహ్మద్ (రూ. 4.80 కోట్లు)
రచిన్ రవీంద్ర (రూ. 4 కోట్లు)
రాహుల్ త్రిపాఠి (రూ. 3.40 కోట్లు)
అన్షుల్ కంబోజ్ (రూ.3.40 కోట్లు)
స్యామ్ కరన్ (రూ. 2.40 కోట్లు)
గుర్జప్‌నీత్ సింగ్ (రూ. 2.20 కోట్లు)
నాథన్ ఎలిస్ (రూ. 2 కోట్లు)
దీపక్ హుడా (రూ.1.70 కోట్లు)
జేమీ ఓవర్టన్ (రూ.1.50 కోట్లు)
విజయ్ శంకర్ (రూ. 1.20 కోట్లు)
వంశ్ బేడీ (రూ. 55 లక్షలు)
ముకేశ్ చౌదరీ (రూ. 30 లక్షలు)
షేక్ రషీద్ (రూ. 30 లక్షలు)
ఆండ్రీ సిద్ధార్థ్ (రూ. 30 లక్షలు)
కమలేశ్ నాగర్‌కోటి (రూ. 30 లక్షలు)
రామకృష్ణ ఘోష్ (రూ. 30 లక్షలు)
శ్రేయస్ గోపాల్ (రూ.30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ. 65 కోట్లు; వేలానికి రూ. 54.95 కోట్లు; మిగిలింది: 5 లక్షలు

ఢిల్లీ క్యాపిటల్స్

అక్షర్ పటేల్ (రూ. 16.50 కోట్లు)
కుల్దీప్ యాదవ్ (రూ. 13.25 కోట్లు)
స్టబ్స్ (రూ. 10 కోట్లు)
అభిషేక్ పొరెల్ (రూ. 4 కోట్లు)
కేఎల్ రాహుల్ (రూ. 14 కోట్లు)
స్టార్క్ (రూ. 11.75 కోట్లు)
నటరాజన్ (రూ. 10.75 కోట్లు)
జేక్ ఫ్రేజర్ (రూ 9 కోట్లు)
ముకేశ్ కుమార్ (రూ. 8 కోట్లు)
హ్యారీ బ్రూక్ (రూ. 6.25 కోట్లు)
అశుతోష్ శర్మ (రూ. 3.80 కోట్లు)
మోహిత్ శర్మ (రూ.2.20 కోట్లు)
డుప్లెసిస్ (రూ. 2 కోట్లు)
సమీర్ రిజ్వీ (రూ. 95 లక్షలు)
దుష్మంత చమీర (రూ. 75 లక్షలు)
డోనొవన్ ఫెరీరా (రూ. 75 లక్షలు)
విప్రాజ్ నిగమ్ (రూ.50 లక్షలు)
కరుణ్ నాయర్ (రూ. 50 లక్షలు)
మాధవ్ తివారి (రూ. 40 లక్షలు)
అజయ్ జాదవ్ (రూ.30 లక్షలు)
దర్శన్ నల్కండే (రూ. 30 లక్షలు)
త్రిపురాణ విజయ్ (రూ. 30 లక్షలు)
మన్వంత్ కుమార్ (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ. 47 కోట్లు; వేలానికి రూ 72.80 కోట్లు; మిగిలింది: రూ. 20 లక్షలు

గుజరాత్ టైటాన్స్

రషీద్ ఖాన్ (రూ. 18 కోట్లు)
శుబ్‌మన్ గిల్ (రూ. 16.50 కోట్లు)
సాయి సుదర్శన్ (రూ. 8.5 కోట్లు)
రాహుల్ తెవాటియా (రూ. 4 కోట్లు)
షారుక్ ఖాన్ (రూ. 4 కోట్లు)
బట్లర్ (రూ.15.75 కోట్లు)
సిరాజ్ (రూ.12.25 కోట్లు)
రబాడ (రూ.10.75 కోట్లు)
ప్రసిధ్ కృష్ణ (రూ.9.50 కోట్లు)
సుందర్ (రూ. 3.20 కోట్లు)
రూథర్‌ఫర్డ్ (రూ. 2.60 కోట్లు)
కొయెట్జీ (రూ. 2.40 కోట్లు)
ఫిలిప్స్ (రూ. 2 కోట్లు)
సాయి కిషోర్ (రూ. 2 కోట్లు)
మహిపాల్ లోమ్రోర్ (రూ.1.70 కోట్లు)
గుర్నూర్ సింగ్ (రూ. 1.30 కోట్లు)
అర్షద్ ఖాన్ (రూ.1.30 కోట్లు),
జయంత్ (రూ. 75 లక్షలు)
ఇషాంత్ (రూ. 75 లక్షలు)
కరీమ్ జనత్ (రూ. 75 లక్షలు)
కుమార్ కుశాగ్ర (రూ.65 లక్షలు)
మానవ్ సుతార్ (రూ. 30 లక్షలు)
అనూజ్ రావత్ (రూ.30 లక్షలు)
నిశాంత్ సింధు (రూ. 30 లక్షలు)
కుల్వంత్ (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ. 51 కోట్లు; వేలానికి రూ. 68.85 కోట్లు; మిగిలింది: 15 లక్షలు

పంజాబ్ కింగ్స్

శశాంక్ సింగ్ (రూ.5.5 కోట్లు)
ప్రభ్‌సిమ్రన్ సింగ్ (రూ.4 కోట్లు)
శ్రేయస్ అయ్యర్ (రూ.26.75 కోట్లు)
అర్ష్‌దీప్ సింగ్ (రూ.18 కోట్లు)
యుజువేంద్ర చహల్ (రూ.18 కోట్లు)
స్టొయినిస్ (రూ.11 కోట్లు)
మార్కో జాన్సెన్ (రూ. 7 కోట్లు)
నేహల్ వధేరా (రూ.4.20 కోట్లు)
మ్యాక్స్‌వెల్ (రూ.4.20 కోట్లు)
ప్రియాన్ష్ ఆర్య (రూ. 3.80 కోట్లు)
జోష్ ఇంగ్లిస్ (రూ. 2.60 కోట్లు)
అజ్మతుల్లా (రూ. 2.40 కోట్లు)
ఫెర్గూసన్ (రూ. 2 కోట్లు)
వైశాక్ విజయ్‌కుమార్ (రూ.1.80 కోట్లు)
యశ్ ఠాకూర్ (రూ.1.60 కోట్లు)
హర్‌ప్రీత్ బ్రార్ (రూ.1.50 కోట్లు)
ఆరోన్ హార్డి (రూ. 1.25 కోట్లు)
విష్ణు వినోద్ (రూ.95 లక్షలు)
జేవియర్ బార్ట్‌లెట్ (రూ. 80 లక్షలు)
కుల్దీప్ సేన్ (రూ. 80 లక్షలు)
అవినాశ్ (రూ. 30 లక్షలు)
సూర్యాంశ్ షెడ్గే (రూ. 30 లక్షలు)
ముషీర్‌ఖాన్ (రూ.30 లక్షలు)
హర్నూర్ (రూ.30 లక్షలు)
ప్రవీణ్ దూబే (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ.9.50 కోట్లు; వేలానికి రూ. 110.15 కోట్లు; మిగిలింది: రూ. 35 లక్షలు

రాజస్తాన్ రాయల్స్

యశస్వి జైస్వాల్ (రూ. 18 కోట్లు)
సంజూ సామ్సన్ (రూ. 18 కోట్లు)
ధ్రువ్ జురేల్ (రూ. 14 కోట్లు)
రియాన్ పరాగ్ (రూ. 14 కోట్లు)
హెట్‌మైర్ (రూ. 11 కోట్లు)
సందీప్‌శర్మ (రూ. 4 కోట్లు)
జోఫ్రా ఆర్చర్ (రూ.12.50 కోట్లు)
తుషార్ దేశ్‌పాండే (రూ.6.50 కోట్లు)
హసరంగ (రూ.5.25 కోట్లు)
మహీశ్ తీక్షణ (రూ.4.40 కోట్లు)
నితీశ్ రాణా (రూ. 4.20 కోట్లు)
ఫజల్‌హక్ (రూ. 2 కోట్లు)
క్వెన మఫాక (రూ. 1.50 కోట్లు)
ఆకాశ్ మధ్వాల్ (రూ.1.20 కోట్లు)
వైభవ్ సూర్యవంశి (రూ. 1.10 కోట్లు)
శుభమ్ దూబే (రూ. 80 లక్షలు)
యుధ్‌వీర్ చరక్ (రూ. 35 లక్షలు)
కుమార్ కార్తికేయ (రూ.30 లక్షలు)
అశోక్ శర్మ (రూ. 30 లక్షలు)
కునాల్‌సింగ్ (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ. 79 కోట్లు; వేలానికి రూ. 40.70 కోట్లు; మిగిలింది: రూ. 30 లక్షలు

సన్‌రైజర్స్ హైదరాబాద్

క్లాసెన్ (రూ. 23 కోట్లు)
కమిన్స్ (రూ. 18 కోట్లు)
హెడ్ (రూ. 14 కోట్లు)
అభిషేక్ శర్మ (రూ. 14 కోట్లు)
నితీశ్ రెడ్డి (రూ. 6 కోట్లు)
ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు)
షమీ (రూ.10 కోట్లు)
హర్షల్ పటేల్ (రూ.8 కోట్లు)
రాహుల్ చహర్ (రూ.3.20 కోట్లు)
అభినవ్ మనోహర్ (రూ.3.20 కోట్లు)
రాహుల్ చహర్ (రూ. 3.20 కోట్లు)
ఆడమ్ జంపా (రూ.2.40 కోట్లు)
సిమర్‌జీత్ సింగ్ (రూ. 1.50 కోట్లు)
ఇషాన్ మలింగ (రూ. 1.20 కోట్లు)
బ్రైడన్ కార్స్ (రూ. 1 కోటి)
ఉనాద్కట్ (రూ. 1 కోటి)
కమిందు మెండిస్ (రూ. 75 లక్షలు)
జీషాన్ అన్సారి (రూ. 40 లక్షలు)
అనికేత్ వర్మ (రూ. 30 లక్షలు)
అథర్వ తైడే (రూ.30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ. 75 కోట్లు; వేలానికి రూ.44.80 కోట్లు; మిగిలింది: రూ.20 లక్షలు

కోల్‌కతా నైట్‌రైడర్స్

రింకూ సింగ్ (రూ. 13 కోట్లు)
నరైన్ (రూ. 12 కోట్లు)
రసెల్ (రూ. 12 కోట్లు)
వరుణ్ చక్రవర్తి (రూ. 12 కోట్లు)
హర్షిత్ రాణా (రూ. 4 కోట్లు)
రమణ్‌దీప్ (రూ.4 కోట్లు)
వెంకటేశ్ అయ్యర్ (రూ.23.75 కోట్లు)
ఆన్రిచ్ నోర్జే (రూ.6.50 కోట్లు)
డికాక్ (రూ.3.60 కోట్లు)
అంగ్‌క్రిష్ (రూ.3 కోట్లు)
జాన్సన్ (రూ. 2.80 కోట్లు)
గుర్బాజ్ (రూ.2 కోట్లు)
మొయిన్ అలీ (రూ. 2 కోట్లు)
వైభవ్ అరోరా (రూ.1.80 కోట్లు)
రోవ్‌మన్ పావెల్ (రూ.1.50 కోట్లు)
రహానే (రూ. 1.50 కోట్లు)
మనీశ్ పాండే (రూ. 75 లక్షలు)
ఉమ్రన్ మలిక్ (రూ. 75 లక్షలు)
అనుకూల్ రాయ్ (రూ. 40 లక్షలు)
మయాంక్ మర్కండే (రూ. 30 లక్షలు)
లవ్‌నిత్ సిసోడియా (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ.69 కోట్లు; వేలానికి రూ. 50.95 కోట్లు; మిగిలింది: రూ.5 లక్షలు

లక్నో సూపర్ జెయింట్స్

పూరన్ (రూ.21 కోట్లు)
రవి బిష్ణోయ్ (రూ.21 కోట్లు)
మయాంక్ యాదవ్ (రూ. 11 కోట్లు)
మొసిన్ ఖాన్ (రూ.4 కోట్లు)
ఆయుశ్ బదోని (రూ.4 కోట్లు)
రిషభ్ పంత్ (రూ.27 కోట్లు)
అవేశ్ ఖాన్ (రూ.9.75 కోట్లు)
ఆకాశ్‌దీప్ (రూ.8 కోట్లు)
మిల్లర్ (రూ.7.50 కోట్లు)
అబ్దుల్ సమద్ (రూ.4.20 కోట్లు)
మిచెల్ మార్ష్ (రూ.3.40 కోట్లు)
షహబాజ్ అహ్మద్ (రూ. 2.40 కోట్లు)
మార్‌క్రమ్ (రూ.2 కోట్లు)
బ్రీట్‌జ్కే (రూ. 75 లక్షలు)
షమర్ జోసెఫ్ (రూ. 75 లక్షలు)
సిద్ధార్థ్ (రూ. 75 లక్షలు)
యువరాజ్ (రూ. 30 లక్షలు)
ప్రిన్స్ యాదవ (రూ. 30 లక్షలు)
ఆకాశ్ సింగ్ (రూ. 30 లక్షలు)
దిగ్వేశ్ సింగ్ (రూ. 30 లక్షలు)
హిమ్మత్ సింగ్ (రూ.30 లక్షలు)
ఆర్యన్ జుయల్ (రూ.30 లక్షలు)
అర్షిన్ కులకర్ణి (రూ. 30 లక్షలు)
హంగార్‌గేకర్ (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ.51 కోట్లు; వేలానికి రూ. 68.90 కోట్లు; మిగిలింది: రూ. 10 లక్షలు

ముంబై ఇండియన్స్

బుమ్రా (రూ. 18 కోట్లు)
హార్దిక్ పాండ్యా (రూ.16.35 కోట్లు)
సూర్యకుమార్ (రూ. 16.35 కోట్లు)
రోహిత్ శర్మ (రూ. 16.30 కోట్లు)
తిలక్ వర్మ (రూ. 8 కోట్లు)
ట్రెంట్ బౌల్ట్ (రూ.12.50 కోట్లు)
దీపక్ చహర్ (రూ. 9.25 కోట్లు)
నమన్ ధీర్ (రూ.5.25 కోట్లు)
విల్ జాక్స్ (రూ.5.25 కోట్లు)
ఘజన్‌ఫర్ (రూ. 4.80 కోట్లు)
సాంట్నర్ (రూ. 2 కోట్లు)
రికెల్టన్ (రూ. 1 కోటి)
రీస్ టోప్లే (రూ. 75 లక్షలు)
లిజాద్ విలియమ్స్ (రూ. 75 లక్షలు)
రాబిన్ మిన్జ్ (రూ.65 లక్షలు)
కరణ్ శర్మ (రూ.50 లక్షలు)
అర్జున్ టెండూల్కర్ (రూ.30 లక్షలు)
విఘ్నేశ్ (రూ.30 లక్షలు)
సత్యనారాయణ (రూ. 30 లక్షలు)
రాజ్ అంగద్ (రూ. 30 లక్షలు)
శ్రీజిత్ కృష్ణన్ (రూ. 30 లక్షలు)
అశ్వని కుమార్ (రూ. 30 లక్షలు)
బెవాన్ జాకబ్స్ (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ. 75 కోట్లు; వేలానికి రూ. 44.80 లక్షలు; మిగిలింది: రూ. 20 లక్షలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

కోహ్లి (రూ. 21 కోట్లు)
రాజత్ పటిదార్ (రూ.11 కోట్లు)
యశ్ దయాళ్ (రూ. 5 కోట్లు)
హాజల్‌వుడ్ (రూ.12.50 కోట్లు)
ఫిల్ సాల్ట్ (రూ.11.50 కోట్లు)
జితేశ్ శర్మ (రూ.11 కోట్లు)
భువనేశ్వర్ (రూ.10.75 కోట్లు)
లివింగ్‌స్టోన్ (రూ.8.75 కోట్లు)
రసిక్ ధార్ (రూ.6 కోట్లు)
కృనాల్ పాండ్యా (రూ. 5.75 కోట్లు)
టిమ్ డేవిడ్ (రూ. 3 కోట్లు)
జాకబ్ బెథెల్ (రూ. 2.60 కోట్లు)
సుయాశ్ శర్మ (రూ.2.60 కోట్లు)
పడిక్కల్ (రూ. 2 కోట్లు)
తుషార (రూ. 1.60 కోట్లు)
రొమరియో (రూ. 1.50 కోట్లు
ఇన్‌గిడి (రూ. 1 కోటి)
స్వప్నిల్ సింగ్ (రూ.50 లక్షలు)
మనోజ్ (రూ. 30 లక్షలు)
మోహిత్ రాఠి (రూ. 30 లక్షలు)
అభినందన్ (రూ. 30 లక్షలు)
స్వస్తిక్ చికార (రూ. 30 లక్షలు)
ఖర్చు: రిటెయినర్లకు రూ. 37 కోట్లు; వేలానికి రూ. 82.25 కోట్లు; మిగిలింది: రూ. 75 లక్షలు

బాధలో పలికే భావాలు..
ప్రపంచమంతటా ఒక్కటే

విచిత్రమైన పరిశోధనలో వెల్లడైన వింత విషయాలు

బాధలో ఉన్నప్పుడు అచ్చులతో కూడిన శబ్దాలొస్తాయని తేల్చిన పరిశోధకులు

హాంకాంగ్: పల్లెటూరు మైదానం ఆటలాడేటప్పుడు కాలికి ముల్లు గుచ్చుకుంటే పిల్లలైనా, పెద్దలైనా ఒకేలా 'అబ్బా'అనో, 'అ'అనో అరుస్తారు. ఇది తెలుగుభాషలో వచ్చే అక్షరాలేకదా అని అనకండి. ప్రపంచవ్యాప్తంగా చాలా భాషల్లోని అక్షరాలను గమనిస్తే మనిషి బాధపడినప్పుడు అసంకల్పితంగా వెలువడే చిట్టిచిట్టి పదాలు, శబ్దాల్లో తొలి అక్షరంగా ఎక్కువగా అచ్చులు ఉంటున్నట్లు ఒక అంతర్జాతీయ పరిశోధనలో తేలింది. ఉష్ణమండల ప్రాంతాల్లో ఇంగ్లిష్‌ను చక్కగా నోరంతా తెరిచి పలికితే చలిదేశాల్లో అదే ఇంగ్లిష్‌ను సగం నోరు తెరిచి లోపల గొణుకుతున్నట్లు పలుకుతారు. ఒక్క భాషనే భిన్నంగా పలికే ప్రపంచంలో వేర్వేరు భాషలు మాట్లాడే ప్రజలు.. హఠాత్తుగా బాధపడినప్పుడు మాత్రం ఆయా భాషల అచ్చులను మాత్రమే అధికంగా పలకడం చూసి పరిశోధకులు సైతం ఆశ్చర్యపోయారు. ఏదైనా భాషలో ఒక పదం ఏమిటో తెలియాలంటే దాని అర్థం తెలిసి ఉండాలి. కానీ ఆశ్చర్యార్థకాలు, కొన్ని పదాలకు అర్థాలతో పనిలేదు. వాటిని వినగానే అవి బాధలో ఉన్నప్పుడు పలికారో సంతోషంతో పలికారో తెలుస్తుంది. బాధలో పలికే పదాల్లో ఎక్కువ అచ్చులు ఉండగా హఠాత్తుగా ఆదుర్దా, సంతోషం కలిగినప్పుడు పలికే పదాల్లో హల్లులు ఎక్కువగా ఉంటున్నాయి. సంబంధిత పరిశోధనా తాలూకు వివరాలు 'అకౌస్టికల్ సొసైటీ ఆఫ్ అమెరికా'జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

131 భాషలను ఒడబోసి

బాధ, సంతోషం, అసహనం, ఆదుర్దా ఇలా హఠాత్తుగా ఏదైనా భిన్న పరిస్థితిని మనిషి ఎదుర్కొన్నపుడు భాషతో సంబంధం లేకుండా రెప్పపాటులో మనిషి గొంతు నుంచి వచ్చే శబ్దాల్లో ఎక్కువగా హల్లులు ఉంటున్నాయా లేదంటే అచ్చులు ఉంటున్నాయా అనేది కనిపెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా అధ్యయనకారుల బృందం బయల్దేరింది. ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా, యూరప్‌లలో అత్యధికంగా మాట్లాడే 131 భాషల్లో జనం బాధపడినప్పుడు, అసహనంగా ఫీల్ అయినప్పుడు, సంతోషపడినప్పుడు అత్యధికంగా వాడే 500కుపైగా ఆశ్చర్యార్థకాలు, పదాలను పరిశోధకులు అధ్యయనం కోసం ఎంపిక చేశారు. వీటిల్లో సంతోషం, బాధ, ఆదుర్దా ఇలా మూడు భాగాలుగా విడగొట్టి వాటిల్లో ఏ భావానికి ఏ పదం వాడారో, ఆ పదం అచ్చుతో మొదలైందో, హల్లుతో మొదలైందో లెక్కగట్టారు. ఇంగ్లిష్ మాట్లాడే దేశాల ప్రజల్లో సంభ్రమాశ్చర్యాలకు లోనైతే ప్రస్తుత ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఎక్కువగా ఔచ్, వావ్ అనే పదాలనే ఎక్కువగా పలుకుతున్నారు. ఇలా అన్ని ఆశ్చర్యార్థకాలను పట్టికగా వేశారు.

ఏం తేలింది?

భాషతో సంబంధం లేకుండా జనమంతా బాధలో ఉన్నప్పుడు ఎక్కువగా పలికిన శబ్దాల్లో ఎక్కువగా అచ్చులే ఉన్నాయి. భాషలు వేరుగా ఉన్నాసరే జనం ఏదైనా ఎమోషన్‌కు లోనైనప్పుడు పలికే తొలిపలుకుల ధ్వనులు దాదాపు ఒకేలా ఉంటాయని తేలింది. మానవుడుకాకుండా ఇతర జీవులు.. అంటే పక్షులు, జంతువులు భయపడినప్పుడు, వేదనకు గురైనప్పుడు ఒకేలా శబ్దాలు చేస్తాయనే భావనకు మూలం దాదాపు తెలిసినట్లేనని పరిశోధకులు చెప్పారు.

మీకు ఎప్పటికీ బుద్ధి రాదు

గ్రంథాలయ భవనాన్ని కూలగొట్టిన ఎంసీడీపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ గ్రంథాలయ భవనాన్ని కూల్చివేసిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)పై సుప్రీంకోర్టు విరుచుకుపడింది. తగు ఏర్పాట్లు చేసుకునే అవకాశం బాధితులకు ఇవ్వకుండా భవనాన్ని నేలమట్టం చేసిన అధికారులను 'మీకు ఎప్పటికీ బుద్ధి రాదు'అంటూ మండిపడింది. 'మిమ్మల్ని మేల్కొలిపేందుకు మేం ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఏ శక్తీ మీ మత్తు వదిలించలేకపోయింది. అలాంటి మీరు.. కేవలం వారం వ్యవధిలోనే మెరుపు వేగంతో పనిచేసి ఎంతో పేరున్న ఆ భవనాన్ని కూలగొట్టేశారు. దీనిపై మేం విచారణకు ఆదేశించడమే కాదు, ఏదైనా తప్పు జరిగినట్లు తేలితే ఆ భవనాన్ని పునరుద్ధరించాలని కూడా ఆదేశిస్తాం'అంటూ ఎంసీడీ తరఫు లాయర్‌కు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం తీవ్ర హెచ్చరికలు చేసింది. భవనంలో అద్దెకు ఉండే వారు, ఇతరులు తగు ఏర్పాట్లు చేసుకునేందుకు గడువివ్వాలంటూ 2018 సెప్టెంబర్ 10న ఢిల్లీ హైకోర్టు ఆదేశించడం, యథాతథ స్థితిని కొనసాగించాలంటూ అదే నెల తాము ఆదేశించినా పట్టించుకోకుండా అదే నెల 18న కూల్చివేయడమేంటని ధర్మాసనం నిలదీసింది. ఎంసీడీతో పాటు కూల్చివేత పనులు చేపట్టిన డింపుల్ ఎంటర్ ప్రైజెస్‌కు నోటీసులు జారీ చేసింది. దేశ ప్రప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలోనే మొట్టమొదటి ప్రభుత్వ లైబ్రరీని పాత ఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలో 1951లో ప్రారంభించారు.



స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యం సంచులతో భారత తీరగస్తీ దళ సభ్యులు

అండమాన్‌లో 6 వేల కిలోల
డ్రగ్స్ పట్టివేత


పోర్ట్ బ్లెయర్: అండమాన్ నికోబార్ దీవుల సమీపంలో భారత తీర రక్షక దళం(ఐసీజీ) ఈ నెల 23న భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. ఓ పడవలో అక్రమంగా రవాణా అవుతున్న 6 వేల కిలోల నిషేధిత మెథాంఫెటమైన్ అనే మాదక ద్రవ్యంతోపాటు ఆరుగురు మయన్మార్ దేశస్తులను పట్టుకుంది. రెండు కిలోల చొప్పున బరువున్న 3 వేల ప్యాకెట్లలో ఉన్న ఈ డ్రగ్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో కోట్లలోనే ఉంటుందని సోమవారం అధికారులు వెల్లడించారు. పోర్ట్ బ్లెయర్‌కు 150 కిలోమీటర్ల దూరంలోని బారెన్ ఐలాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న మత్స్యకారుల పడవను గస్తీ విమానంలో గమనించి, తీరానికి తీసుకువచ్చామన్నారు. మన దేశంతోపాటు పొరుగుదేశాలకు చేరవేసేందుకు దీనిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

భారత్‌కు బ్రిటన్ రాజ దంపతులు

లండన్: బ్రిటన్ రాజు చార్లెస్–3, కెమిల్లా దంపతులు మరోసారి భారత్ రానున్నారు. 2025 ప్రారంభంలో వారు భారత్‌లో పర్యటించనున్నారు. బ్రిటన్ విదేశాంగ కార్యాలయానికి వారు ఈ మేరకు సమాచారమిచ్చారు. సింహాసనాన్ని అధిష్ఠించాక చార్లెస్–3కు భారత్‌లో ఇదే తొలి అధికారిక పర్యటన కానుంది. 2019లో యువరాజు హోదాలో ఆయన భారత్‌లో చివరిసారి అధికారికంగా పర్యటించారు. గత అక్టోబర్‌లో రాజ దంపతులు బెంగళూరులో పర్యటించినా అది పూర్తిగా వ్యక్తిగతంగా సాగింది. గత ఫిబ్రవరిలో చార్లెస్‌కు కేన్సర్ నిర్ధారణ అయినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ వెల్లడించింది. అందుకు చికిత్సలో భాగంగా వారు భారత్ వచ్చినట్లు వార్తలొచ్చాయి. బెంగళూరులో వెల్‌నెస్ రీట్రీట్‌లో రాజ దంపతులు నాలుగు రోజులు గడిపారు. వారిద్దరూ 2022లోనే భారత్‌లో పర్యటించాల్సింది. క్వీన్ ఎలిజబెత్–2 మరణంతో ఆ పర్యటన రద్దయ్యిన సంగతి తెలిసిందే.

ఢిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికలు..
ఏడేళ్ల తర్వాత ఎన్‌ఎస్‌యూఐ గెలుపు

న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం(డీయూఎస్‌యూ) ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎస్‌యూఐ) ఘన విజయం సాధించింది. ఏడేళ్ల తర్వాత ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ పోస్టులను ఈ సంఘం గెలుచుకుంది. అదే సమయంలో, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ)కి వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ పోస్టులను సాధించుకోవడం విశేషం. ప్రెసిడెంట్ పదవికి జరిగిన పోటీలో ఏబీవీపీకి చెందిన రిషబ్ చౌదరిపై ఎన్‌ఎస్‌యూఐ అభ్యర్థి రౌనక్ ఖత్రి 1,300కుపైగా ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఎన్‌ఎస్‌యూఐ చివరిగా సారిగా 2017లో డీయూఎస్‌యూ ప్రెసిడెంట్ పదవిని దక్కించుకుంది. ఫలితాలు వెల్లడవ్వగానే ఎన్‌ఎస్‌యూఐ పక్షం విద్యార్థులు తమ నేతలను భుజాలపై మోసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. క్యాంపస్ ఆవరణలో లౌడ్ స్పీకర్ల వాడకం, బాణసంచా కాల్చడం, డోళ్లు వాయించడంపై నిషేధం ఉంది.



రజోనాకు క్షమాభిక్ష సున్నిత అంశం

బియాంత్ సింగ్ హత్య కేసు దోషిపై సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: 1995లో అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్య కేసులో మరణశిక్ష పడిన బల్వంత్ సింగ్ రజోనాకు క్షమాభిక్ష సున్నితమైన అంశమని కేంద్రం సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. క్షమాభిక్ష పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో ఎంతో జాప్యమైనందున మరణ శిక్షను యావజ్జీవంగా మార్చాలంటూ రజోనా పెట్టుకున్న పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఇది సున్నితమైన వ్యవహారం. సంబంధిత విభాగాలను సంప్రదించాల్సి ఉంది'అంటూసొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. క్షమాభిక్ష పిటిషన్ ప్రస్తుతం హోం శాఖ వద్దే ఉందన్నారు. దీంతో ధర్మాసనం కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.1995 ఆగస్ట్ 31న చండీగఢ్‌లోని పంజాబ్ సెక్రటేరియట్ గేట్ వద్ద జరిగిన పేలుడులో సీఎం బియాంత్‌సింగ్, మరో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో అరెస్టయిన రజోనా 28 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తున్నాడు.

స్కూళ్లలో న్యాయ విద్య, ఆత్మ రక్షణ విద్యకు సమగ్ర విధానం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: పాఠశాలల్లో బోధించే న్యాయ విద్య, ఆత్మ రక్షణ శిక్షణపై సమగ్ర విధానాలను విధిగా అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వ స్పందన కోరింది. రాజ్యాంగమిచ్చిన ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించాలంటే ప్రతి పౌరుడు కూడా ప్రాథమిక న్యాయసూత్రాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని పిటిషనర్, ఢిల్లీ వాసి గీతా రాణి పేర్కొన్నారు. పిల్లలకు హక్కుల గురించి తెలియకుంటే, వాటికి అర్థమే లేదన్నారు. అందుకే, విద్యాబోధనలో ప్రాథమిక న్యాయ విద్యను కూడా చేర్చడం ఎంతో ముఖ్యమనీ, అనుకోని పరిస్థితుల్లో తమను తాము కాపాడుకునేందుకు స్కూలు దశలోనే విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్యను నేర్పడం ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. 2022లో మన దేశంలో పిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించి 1.62 లక్షల కేసులు నమోదైనట్లు ప్రభుత్వం వెలువరించిన నివేదిక చెబుతోందని ఆమె ఉటంకించారు. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం నాలుగు వారాల్లోగా సమాధానమివ్వాలంటూ కేంద్రంతోపాటు రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.

కస్టడీలో మహిళకు చిత్రహింసలపై సిట్

- కలకత్తా హైకోర్టుకు వారంవారం దర్యాప్తు నివేదిక
- సుప్రీంకోర్టు ఆదేశాలు
- ఆర్‌జీ కర్ ఉదంతంపై నిరసనల్లో పాల్గొన్న బాధితురాలు

న్యూఢిల్లీ: కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ఆందోళనల్లో పాల్గొన్న ఓ మహిళను లాకప్‌లో ఉంచి చిత్రహింసలు పెట్టిన ఘటనపై సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం)ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవరిస్తూ సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. ప్రతి అంశాన్నీ సీబీఐకి బదిలీ చేయలేమని పేర్కొన్న ధర్మాసనం.. దర్యాప్తు బాధ్యతలను సీనియర్ ఐపీఎస్ అధికారులకు అప్పగించాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన అధికారులతో ఏర్పాటయ్యే సిట్ తమ విచారణ పురోగతిపై వారం వారం కలకత్తా హైకోర్టు నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. కేసు తీర్పు కోసం ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కూడా కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ధర్మాసనం సూచించింది. కస్టడీలో మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై ఏర్పాటయ్యే ఏడుగురితో కూడిన ఐపీఎస్‌ల సిట్‌లో ఐదుగురు మహిళలు కూడా ఉండాలని నవంబర్ 11న జరిగిన విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటనపై దర్యాప్తునకు సమర్థులైన అధికారులుండగా హైకోర్టు మాత్రం పొరపాటున సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందంటూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలిచ్చింది. సీబీఐ దర్యాప్తుతో రాష్ట్ర పోలీసుల్లో నైతిక స్థైర్యం దెబ్బతింటుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. నిరసనల్లో పాల్గొన్నారనే కారణంతో సెప్టెంబర్ 7వ తేదీన తమను కోల్‌కతాలోని ఫల్టా పోలీసులు అరెస్ట్ చేసి, కొట్టారంటూ రెబెకా ఖాతూన్ మొల్లా, రమా దాస్ అనే వారు పిటిషన్ వేశారు. ఈ ఆరోపణలు నిజమేనని తేల్చిన కలకత్తా హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ అక్టోబర్ 8న ఆదేశించింది.

దావూద్ బెదిరింపుల వల్లే భారత్ వీడా

ఎప్పుడనుకుంటే అప్పుడు స్వదేశానికి వస్తా

- ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ వెల్లడి

లండన్: 2010 నుంచి విదేశాల్లో గడుపుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) వ్యవస్థాపకుడు లలిత్ మోదీ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. భారత్‌లో తనపై ఎలాంటి కేసులు లేవన్న లలిత్ మోదీ..చంపుతామంటూ మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం నుంచి వచ్చిన బెదిరింపుల వల్లే విదేశాల్లో ఉంటున్నట్లు చెప్పుకున్నారు. 'ఫిగరింగ్ ఔట్'అనే పాడ్‌కాస్ట్‌లో రాజ్ షమానీకిచ్చిన ఇంటర్వ్యూలో ఇటీవల ఈ విషయాలను ఆయన వెల్లడించారు. 'వాస్తవానికి, దేశం విడిచి పెట్టేటంతటి సీరియస్ కేసులేవీ నాపైన అప్పట్లో లేవు. దావూద్ ఇబ్రహీం నుంచి చంపేస్తామంటూ నాకు బెదిరింపులు వచ్చాయి. మ్యాచ్ ఫిక్సింగ్‌ను అస్సలు సహించను. అయితే, క్రికెట్ మ్యాచ్‌లు ఫిక్స్ చేయాలనుకున్న దావూద్ ఇబ్రహీం నాపై ఒత్తిడి పెంచాడు. అయితే, అవినీతికి వ్యతిరేకంగా ఆట సమగ్రతను కాపాడటంపైనే నా దృష్టంతా ఉంది. దీనికి తోడు వ్యతిరేక ప్రచారం నాపై ఎక్కువగా జరిగింది'అని లలిత్ పేర్కొన్నారు. 'ఈ పరిస్థితుల్లో హిట్ లిస్ట్‌లో ఉన్నందున నాకు 12 గంటలపాటు మాత్రమే భద్రత కల్పించగలమని సీనియర్ పోలీసు అధికారులు చెప్పారు. నా వ్యక్తిగత సిబ్బంది సూచనమేరకు ముందు జాగ్రత్తగా ఎయిర్‌పోర్టు నుంచి వీఐపీ గేట్ ద్వారానే బయటకు వెళ్లా'అని వివరించారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు భారత్ వెళ్లగలనంటూ ఆయన..'చట్ట పరంగా నేను పరారీలో ఉన్న నేరగాణ్ని కాను. అక్కడ ఏ కోర్టులోనూ నాపైన ఎలాంటి కేసులూ లేవు. అందుకే భారత్‌కు రేపు ఉదయం వెళ్లాలన్నా వెళ్లగలను. అందులో నాకెలాంటి సమస్యాలేదు'అని తెలిపారు. దావూద్ ఇబ్రహీం హిట్ లిస్ట్‌లో ఉన్న వాళ్లలో లలిత్ మోదీ ఒకరు. లలిత్‌ను చంపేందుకు తమ షార్ప్ షూటర్ల బృందం థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్‌లో సిద్ధంగా ఉందంటూ కొన్నేళ్ల క్రితం దావూద్ సన్నిహితుడు చోటా షకీల్ వ్యాఖ్యానించడం తెలిసిందే.



జర్మనీలోని డోర్ట్‌మండ్ నగరంలో విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోతున్న క్రిస్మస్ ట్రీ. క్రిస్మస్ పర్వదిన వేడుకలకు ఆరంభంగా సోమవారం 45 మీటర్ల ఎత్తయిన క్రిస్మస్ ట్రీని ఇక్కడ ఏర్పాటు చేశారు.

చేతులు జోడించి వేడుకుంటున్నా

- పార్లమెంట్ సమావేశాల కోసం బెయిలివ్వండి
- ఢిల్లీ కోర్టులో ఎంపీ ఇంజినీర్ రషీద్ పిటిషన్

న్యూఢిల్లీ: పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ జమ్మూకశ్మీర్ లోక్‌సభ ఎంపీ ఇంజినీర్ రషీద్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. ఉగ్రవాదానికి నిధులందజేసిన ఆరోపణల కేసులో ప్రస్తుతం ఆయన తిహార్ జైలులో ఉన్నారు. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి విమల్ కుమార్ సోమవారం వర్చువల్‌గా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రషీద్..'ప్రజలు నన్ను ఎంపీగా ఎన్నుకున్నారు. కానీ, పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతించడం లేదు. మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని చేతులు జోడించి మిమ్మల్ని వేడుకుంటున్నా'అని ఆయన కోరారు. రషీద్ వినతిపై సమాధానమివ్వాలంటూ కేసు దర్యాప్తు చేస్తున్న జాతీయ దర్యాప్తు విభాగం ఎన్‌ఐఏను ఆదేశిస్తూ జడ్జి తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేశారు.

లిథువేనియాలో ఇళ్లపై కూలిన విమానం

విల్నియస్: లిథువేనియా రాజధానికి సమీపంలో కార్గో విమానం నివాసాలపై కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. జర్మనీలోని లీప్జిగ్ నుంచి విల్నియస్ వెళ్తున్న విమానం ల్యాండింగ్ కోసం రన్‌వేను సమీపించే క్రమంలో ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో కుప్పకూలింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. విల్నియస్ విమానాశ్రయానికి సమీపంలోని రెండంతస్తుల ఇంటిపై దూసుకెళ్లిందని లిథువేనియా మీడియా ఎల్ఆర్టీ తెలిపింది. డీహెచ్ఎల్ కొరియర్ సంస్థకు చెందిన ఈ బోయింగ్ 737 విమానం 31 ఏళ్ల నాటిది.

స్కూళ్ల పునః ప్రారంభం విషయం పరిశీలించండి

ఢిల్లీ సీఏక్యూఎంను కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలి కాలుష్యం తీవ్ర రూపం దాల్చడం, విద్యాసంస్థల మూసివేతపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. స్కూలు, కాలేజీల్లో ప్రత్యక్ష బోధనను తిరిగి ప్రారంభించే విషయాన్ని పరిశీలించాలని దేశ రాజధాని ప్రాంతం ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్(సీఏక్యూఎం)ను ఆదేశించింది. వర్చువల్ తరగతులకు హాజరయ్యే స్తోమత చాలా మంది విద్యార్థులకు లేదన్న న్యాయస్థానం.. వీరు మధ్యాహ్న భోజనం అవకాశానికి దూరమవుతున్నారని పేర్కొంది. చాలా మంది విద్యార్థులకు తమ ఇళ్ల వద్ద ఎయిర్ పూరిఫయర్లు అందుబాటులో లేవని ధర్మాసనం.. ఇటువంటి పరిస్థితుల్లో వీరు ఇళ్లలో ఉన్నా, స్కూళ్లలో ఉన్నా తేడా ఏమీ లేదని పేర్కొంది. కాలుష్య కట్టడి నిబంధనలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన ఢిల్లీ ప్రభుత్వంతోపాటు పోలీసులపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని సీఏక్యూఎంను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఆగస్టీన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం ఆదేశించింది. నిబంధనల అమలు కోసం కొన్ని పోలీసు పోస్టుల్లో ఉంచిన సిబ్బందికి ప్రత్యేకంగా ఎలాంటి సూచనలు ఇవ్వకపోవడంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

విద్యాసంస్థల పునః ప్రారంభంపై మంగళవారం ఉదయం కల్లా నిర్ణయం తెలియజేయాలని సీఏక్యూఎం యంత్రాంగాన్ని ధర్మాసనం కోరింది. గాలి నాణ్యత సూచీలు తగ్గుముఖం పట్టేవరకు దేశ రాజధాని ప్రాంతంలో నిబంధనలను తు.చ. తప్పక అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. కొన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా రోజువారీ కూలీలపై కాలుష్య కట్టడి నిబంధనల ప్రభావం ఎక్కువగా ఉన్నందున లేబర్ సెస్ నుంచి వారికి సాయం అందలా చూడాలని సీఏక్యూఎంను కోరింది. ఇందుకోసం సంబంధిత విభాగాలకు అవసరమైన ఆదేశాలివ్వాలని కూడా కోరింది. స్కూళ్ల మూసివేత కారణంగా లక్షలాది మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరమయ్యే పరిస్థితి వచ్చిందంటూ తల్లిదండ్రుల తరఫున సీనియర్ లాయర్ మేనకా గోస్వామి వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది.

దండలో నోటు లాక్కెళ్లాడని...
ట్రక్కును ఛేజ్ చేసిన వరుడు

మీరట్: యూపీలోని మీరట్‌లో మండపంలో పెళ్లి జరుగుతోంది. ఆహూతుల్లో ఎవరో వరుని మెడలో కరెన్సీ నోట్ల దండ వేశారు. అనంతరం వరుడు ఆలయానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో ఓ ప్రబుద్ధుడు దండలోని ఓ కరెన్సీ నోటును లాక్కుని పారిపోయాడు. అంతే! మనవాడు పెళ్లి తంతును పక్కన పెట్టి మరీ దొంగ వెంటపడ్డాడు. అతన్ని పట్టుకునేందుకు సినీ ఫక్కీలో వీర లెవెల్ ఫీట్లు చేశాడు. వరుని తరఫు బంధువులు కూడా అతనికి తోడుగా యథాశక్తి పాలోమంటూ చేజింగ్‌లో పాల్గొన్నారు. తప్పించుకునేందుకు దొంగ కదులుతున్న ట్రక్కులోకి దూకాడు. దాంతో వరుడు వేగంగా వెళ్తున్న ట్రక్కు కిటికీని అమాంతం పట్టుకుని వేలాడాడు. ఎంత మొత్తుకున్నా డ్రైవర్ ఆపకపోవడంతో కిటికీ గుండా డ్రైవర్ సీట్లోకి దూకాడు. ట్రక్‌ను ఆపించి డ్రైవర్‌ను బయటికి లాగాడు. ట్రక్కును ఆపనందుకు బంధువులతో కలిసి అతడిని చితకబాదాడు. ఈ తతంగమంతటినీ ఓ ప్రయాణికుడు మొబైల్లో రికార్డు చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దొంగనొదిలి డ్రైవర్‌ను కొడతారా అంటూ ట్రక్కు ఓనర్ పెళ్లి బృందంపై మండిపడ్డాడు. ''వెనకనుంచి దొంగ ట్రక్కులోకి దూకిన విషయం డ్రైవర్‌కు తెలియదు. అనవసరంగా అతనిపై దాడి చేసినందుకు పోలీసులకు ఫిర్యాదు చేశాం''అని చెప్పుకొచ్చాడు. నోటు దొరక్కపోగా వరుని అత్యుత్సాహంతో కేసులో ఇరుక్కోవాల్సి వచ్చిందని అతని బంధువులు తీరిగ్గా వాపోతున్నారు.

బఫెట్ విరాళం...
మరో 9,270 కోట్లు!

ఒమాహా: ప్రపంచ ప్రఖ్యాత పెట్టుబడిదారు వారెన్ బఫెట్(96)మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. బెర్క్‌షైర్ హాత్‌వే కంపెనీ నుంచి తమ కుటుంబానికి చెందిన నాలుగు దాతృత్వ సంస్థలకు 1.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9,270 కోట్ల)ను విరాళంగా ప్రకటించారు. మిగిలున్న 147.4 బిలియన్ డాలర్ల సంపదనను తన ముగ్గురు సంతానం వచ్చే పదేళ్లలో ఎలా పంచుకోవాలనే కూడా నిర్ణయించారు. 94 ఏళ్ల వయస్సులోనూ బర్క్‌షైర్ హాత్‌వే చైర్మన్, సీఈవోగా కొనసాగుతున్నారు. ఆయన సంతానం హోవార్డ్, పీటర్, సుసీల వయస్సు వరుసగా 71, 69, 66 ఏళ్లు. బఫెట్ మరణానంతరం ఆయనకు సహాయకుల్లో ఒకరైన గ్రెగ్‌అబెల్ బీమాయేతర కంపెనీలకు సీఈవోగా కొనసాగనున్నారు. సంపదంతా ఒకే చోట పోగుపడాలని తానెన్నడూ కోరులేదని చెప్పే బఫెట్ ఒమాహాలో ఏన్నో ఏళ్ల క్రితం కొనుక్కున్న ఇంట్లోనే ఉంటున్నారు.

అమెరికా సైన్యం నుంచి
ట్రాన్స్‌జెండర్ల తొలగింపు!

ట్రంప్ నిర్ణయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ట్రాన్స్‌జెండర్లను సైన్యం నుంచి తొలగించాలని ఆయన యోచిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. ''ట్రాన్స్‌జెండర్లను సైన్యంలో సేవలందించడానికి అనర్హులని ట్రంప్ భావిస్తున్నారు. వైద్యపరమైన కారణాలతో వారిని విధుల నుంచి తొలగిస్తాం''అని అధికారులు తెలిపారు. సైన్యంలో ట్రాన్స్‌జెండర్లకు ట్రంప్ తొలినుంచే వ్యతిరేకి. తొలిసారి అధ్యక్షుడు కాగానే వారిని సైన్యంలో చేర్చుకోకుండా ఆదేశాలిచ్చారు. అప్పటికే ఉద్యోగాల్లో ఉన్నవారిని మాత్రం తొలగించలేదు. ఈసారి వారినీ తొలగించే చర్యలు చేపడుతున్నారు. అమెరికా సైన్యంలో ప్రస్తుతం 15 వేల మంది ట్రాన్స్‌జెండర్లున్నారు.

ఉపాధ్యక్షుడు, రక్షణమంత్రి సైతం..

లైంగికతకు సంబంధించి ట్రంప్‌వి మొదటినుంచీ భిన్నమైన అభిప్రాయాలే. స్కూళ్లలో లైంగికత తదితరాలపై పాఠాలను నిషేధించాలని వాదిస్తారు. ట్రాన్స్‌జెండర్ అథ్లెట్లను బాలికల క్రీడలకు దూరంగా ఉంచాలంటారు. రక్షణ మంత్రిగా ట్రంప్ ఎంపిక చేసుకున్న పీట్ హెగ్సెత్‌దీ ఇదే అభిప్రాయం. మహిళలు, ట్రాన్స్‌జెండర్లను సైన్యంలోకి తీసుకోవడం అమెరికా భద్రతకు గొడ్డలిపెట్టని ఆయన వాదిస్తారు. కాబోయే ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ట్రాన్స్‌జెండర్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మధ్యతరగతి, ఎగువ–మధ్యతరగతి శ్వేతజాతి విద్యార్థులు కొందరు హార్వర్డ్, యేల్ వంటి విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం లింగమార్పిడి చేయించుకుంటున్నారని ఆరోపించారు.

మహాక్షాత్రప అనే బిరుదు పొందిన రాజు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

మౌర్యుల అనంతర యుగం -2

మౌర్యుల అనంతరం క్రీ.పూ 200 - క్రీ.శ 300 మధ్య కాలంలో భారతదేశంలో అనేక విదేశీ రాజ్యాలు ఏర్పడ్డాయి. మధ్యాసియా, ఇరాన్ నుంచి వచ్చిన విదేశీ తెగలు స్థానిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని స్వతంత్ర రాజ్యాలను ఏర్పాటు చేశాయి. వారిలో ముఖ్యమైన వారు ఇండోగ్రీకులు, శకులు లేదా సైథియన్లు, పార్థియన్లు, యూచీలు.

ఇండో గ్రీకులు

వీరు మౌర్యానంతర యుగంలో భారతదేశంపై దండెత్తిన తొలి విదేశీయులు. వీరినే యవనులని, బాక్ట్రియా గ్రీకులని పిలుస్తారు. భారత్‌లో శకాల కేంద్రంగా యూథిడిమస్, తక్షశిల కేంద్రంగా యూక్రటైడ్స్ అనే రెండు రాజ్యాలు ఏర్పడ్డాయి.

డియోడోటస్: ఇతడు మొదట సెల్యూసిడ్ సామ్రాజ్యంలో బాక్ట్రియాకు గవర్నర్‌గా ఉండేవాడు. సెల్యూసిడ్ రాజు రెండో ఆంటియోకస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి స్వతంత్ర ఇండోగ్రీకు రాజ్యాన్ని స్థాపించాడు.

యూథిడిమస్ వంశం

యూథిడిమస్: ఇతడు డియోడోటస్‌ను వధించి యూథిడిమస్ వంశ పాలనను ప్రారంభించాడు. ఇండోగ్రీకు సామ్రాజ్యానికి తొలి స్వతంత్ర రాజుగా ఇతణ్ని పరిగణిస్తారు.

డెమిట్రియస్-1: భారతదేశ భూభాగాలను జయించి ఇండోగ్రీకు సామ్రాజ్యంలో భాగంగా చేసినవాడు డెమిట్రియస్. తన సేనాపతి మినాండర్‌తో కలిసి తక్షశిలను జయించాడు. శకాలను నూతన రాజధానిగా చేసుకోవడమే కాక దాని పేరును యూథిడేమియాగా మార్చాడు.

మినాండర్: ఇతడు రెండో డెమిట్రియస్ తర్వాత శకాల రాజ్యాన్ని పరిపాలించాడు. భారతదేశాన్ని పాలించిన ఇండోగ్రీకు రాజులందరికంటే ఇతడు గొప్పవాడు. బౌద్ధ మతస్థుడు. 'మిళింద పన్హ' అనే గ్రంథంలో ఇతనికి, బౌద్ధ తత్త్వవేత్త నాగసేనునికి మధ్య జరిగిన సంభాషణల గురించి వివరంగా ఉంది.

యూక్రటైడ్స్ వంశం

యూక్రటైడ్స్: డెమిట్రియస్ భారతదేశ దండయాత్రలో ఉండగా, యూక్రటైడ్స్ బాక్ట్రియాను ఆక్రమించి తక్షశిల కేంద్రంగా తన పేరుతో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. తన కుమారుడు హీలియోకిల్స్ చేతిలో హత్యకు గురయ్యాడు.

ఆంటియాల్ సిదాస్: ఇతడు హెలియోడోరస్ అనే తన రాయబారిని మగధరాజు భాగభద్రుని వద్దకు పంపాడు. ఈ హీలియోడోరస్ వేయించినదే బేస్‌నగర్ స్తంభ శాసనం.

హర్మయూస్: యూక్రటైడ్స్ వంశంలో చివరి రాజు. ఇతని తర్వాత వీరి సామ్రాజ్యాన్ని పహ్లవులు(పార్థియన్లు), శకులు ఆక్రమించారు.

శకులు

మధ్యాసియా నుంచి వచ్చి భారతదేశంపై దండెత్తిన మరో విదేశీ తెగ. వీరినే సైథియన్లు, క్షాత్రపులు అంటారు. భారతదేశంలో నాలుగు శకరాజ్యాలు ఏర్పడగా, ఆఫ్ఘానిస్తాన్‌లో ఒక రాజ్యం ఏర్పడింది. భారతదేశంలోని నాలుగు శకరాజ్యాల్లో అతి ముఖ్యమైనవి క్షహరాట, కార్ధమక.

తక్షశిల శకులు

మోగా (మౌయెస్): భారతదేశంలో శకుల అధికారాన్ని స్థాపించిన తొలిరాజు ఇతడు. తక్షశిల కేంద్రంగా క్రీ.పూ. 80 నుంచి 20 వరకు పాలించాడు. ఇతడు రాగి, వెండి నాణేలను జారీ చేశాడు. వాటిపై గ్రీకు దేవతలతోపాటు శివుడు, బుద్ధుడి బొమ్మలను ముద్రించాడు. మోగా తర్వాత ఏజెస్, ఎజిలిసెస్, ఏజెస్-2 అనే రాజులు పాలించారు.

క్షహరాట శకులు

వీరు మహారాష్ట్ర, గుజరాత్ మొదలైన ప్రాంతాలను పాలించిన పశ్చిమ క్షాత్రపులు. మొదట కుషాణులకు సామంతులుగా పాలించేవారు.

భూమకుడు: ఇతడు క్షహరాట వంశ స్థాపకుడు. మిన్నాగర (మాందసార్) వీరి రాజధాని. ఖరోష్టి, బ్రాహ్మీ లిపులను నాణేలపై ఉపయోగించాడు.

నహపాణుడు: ఈ వంశంలో అందరి కంటే గొప్పవాడు. అనేక రాగి, వెండి నాణేలు జారీ చేశాడు. ఇతడి అల్లుడు, సేనాధిపతి ఉషవదత్తుడు జారీ చేసిన శాసనాలు నహపాణుని విజయాలను, సామ్రాజ్య విస్తీర్ణం గురించి తెలుపుతున్నాయి. ఇతడు క్రీ.శ. 124లో శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి చేతిలో మరణించాడు. గౌతమీపుత్ర శాతకర్ణి పేరుతో పునర్ముద్రించిన నహపాణుని నాణేలు జోగల్‌తంబి అనే ప్రాంతంలో భారీ సంఖ్యలో లభించాయి.

కార్ధమక శకులు

వీరు ఉజ్జయినీ కేంద్రంగా పశ్చిమ భారతదేశాన్ని పాలించారు.

చష్టానుడు: ఇతడు కార్ధమక శకుల వంశంలో మొదటి రాజు. టాలమీ రాసిన 'జాగ్రఫీ' అనే గ్రంథంలో ఇతన్ని టియస్తనీస్ అని పేర్కొన్నారు.

రుద్రదమనుడు: భారతదేశంలోని శకులందరిలోకి అత్యంత గొప్పవాడు. ఇతడు జునాఘడ్ (గిర్నార్ శాసనం) వద్ద సంస్కృత శాసనాన్ని వేయించాడు. శాతకర్ణి అనే రాజును రెండుసార్లు ఓడించినట్లు ఇందులో ప్రస్తావించాడు. చంద్రగుప్త మౌర్యుడి కాలంలో నిర్మించిన సుదర్శన తటాకాన్ని మరమ్మతు చేయించాడు. తన కుమార్తె రుద్రదమనికకు వాశిష్టీపుత్ర శివశ్రీ శాతకర్ణితో వివాహం చేశాడు.

3వ రుద్ర సింహుడు: రుద్రదమనుడి అనంతరం అనేకమంది బలహీన రాజులు పాలించారు. మూడో రుద్ర సింహుడు ఈ వంశంలో చివరివాడు. ఇతడు గుప్తరాజు రెండో చంద్రగుప్తుడి చేతిలో మరణించడంతో భారతదేశంలో ఈ వంశ పాలన ముగిసింది.

పార్థియన్లు

వీరినే పహ్లవులు అని కూడా అంటారు. వీరు ఇరాన్ ప్రాంతానికి చెందినవారు.

గోండోఫెర్నెస్: భారతదేశాన్ని పాలించిన ఇతర పార్థియన్ రాజుల ఆధారాలు అంతగా లభించలేదు. 'తఖ్త్-ఇ-బాహి' అనే శాసనం గోండోఫెర్నెస్ విజయాలను తెలుపుతోంది. ఇతడు ఆఫ్ఘానిస్తాన్‌ను పాలించిన చివరి శకరాజు హెర్మాయూస్‌ను ఓడించి, రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు. సెయింట్ థామస్ అనే క్రైస్తవ మత బోధకుడు... గోండోఫెర్నెస్‌ను క్రైస్తవంలోకి మార్చాడని 'యాక్ట్స్ ఆఫ్ జూడాస్ థామస్, ది అపోజిల్' అనే సిరియన్ గ్రంథం పేర్కొంటోంది.

కుషాణులు

మధ్యాసియాలోని యూచీ అనే తెగలోని 5 శాఖల్లో ఒక దానికి చెందిన వారు కుషాణులు. వీరినే తొచేరియన్లు అని కూడా పిలుస్తారు. చైనాపై దాడి ద్వారా జీవనాన్ని గడిపే ఈ తెగలు చైనా మహాకుడ్య నిర్మాణం వల్ల ఆ అవకాశం కోల్పోయారు. దీంతో భారతదేశంపై దాడి చేశారు. ఇక్కడ పాలకులుగా ఉన్న పార్థియన్లు, శకుల స్థానాలను కుషాణులు ఆక్రమించారు. ఫలితంగా భారతదేశంలో ఖొరసాన్ నుంచి వారణాసి వరకు వారి సామ్రాజ్యం విస్తరించింది. వీరి మొదటి రాజధాని పురుషపురం. రెండో రాజధాని మధుర.

కాడ్ ఫైసెస్-1: ఇతడినే కుజుల కాడ్ఫైసెస్ అంటారు. భారతదేశంలో కుషాణ సామ్రాజ్యాన్ని స్థాపించిన వాడు ఇతడే. చివరి గ్రీకురాజు హెర్మాయూస్‌కు సామంతుడిగా ఉండి తర్వాత పార్థియన్లను అంతం చేసి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు కేవలం రాగి నాణేలను మాత్రమే ముద్రించాడు. అవి అగస్టస్ చక్రవర్తి నాణేలను పోలి ఉండేవి. ఇతడికి 'మహా రాజాధిరాజా' అనే బిరుదు ఉంది. ఇతడు బౌద్ధ, శైవ మతాలను ఆదరించినట్లు తెలుస్తోంది.



కాడ్ఫైసెస్-2 (వీమా కాడ్ఫైసెస్): కుషాణ సామ్రాజ్యం భారతదేశం లోపలి ప్రాంతాల వరకు విస్తరించడానికి ఇతడు ప్రధాన కారకుడు. శైవమతాన్ని ఆదరించాడు. బంగారు నాణేలను ముద్రించాడు. శైవాభిమానాన్ని నాణేల ద్వారా ప్రకటించాడు.

కనిష్కుడు: భారతదేశాన్ని పాలించిన కుషాణ రాజుల్లో అందరికంటే గొప్పవాడు కనిష్కుడు. ఇతడు క్రీ.శ. 78లో 'శక' అనే పేరుతో భారతదేశంలో ఒక నూతన శకాన్ని ప్రారంభించాడు. ఇతడిని అశోకుడి తర్వాత అతిపెద్ద సామ్రాజ్య నిర్మాతగా భావిస్తారు. పాటలీపుత్రం మీద దాడి సందర్భంగా ఇతడు అశ్వఘోషుడనే ప్రముఖ బౌద్ధ పండితుడిని తనతో పాటు పురుషపురానికి తీసుకొని వెళ్లాడు. కాశ్మీర్‌లో తన పేరుతో కనిష్కపుర అనే నగరాన్ని నిర్మించాడు. కుందలవనంలో నాలుగో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. ఇతడి ఆస్థానంలో అనేకమంది పండితులకు ఆశ్రయం లభించింది. వారిలో ముఖ్యమైన వారు పార్శ్వ, వసుమిత్ర, అశ్వఘోష, నాగార్జున, చరకుడు, మాతర మొదలైనవారు. రాగి నాణేలు, బంగారు నాణేలు జారీ చేశాడు. బంగారు నాణేలపై ఒక వైపు రాజు, మరో వైపు దేవత గుర్తులుండేవి. కనిష్కుడు దేవపుత్ర, సీజర్ అనే బిరుదులు పొందాడు. గాంధార శైలిలో బోధిసత్త్వుల విగ్రహాలను చెక్కడం ఇతడి కాలంలోనే ప్రారంభమైంది. మధుర శిల్పకళా శైలిని ప్రోత్సహించాడు.

కనిష్కుని తర్వాతి రాజులు

కనిష్కుడి అనంతరం వశిష్కుడు, హువిష్కుడు, రెండో కనిష్కుడు మొదలైన రాజులు పాలించారు. ఇతని తర్వాత కుషాణ సామ్రాజ్యాన్ని ససానియన్లు, నాగులు, భారశివులు ఆక్రమించారు.

మాదిరి ప్రశ్నలు

1. అలెగ్జాండర్ తర్వాత భారతదేశ లోపలి ప్రాంతాలపై దండయాత్ర చేసిన గ్రీకు రాజు?
ఎ) యూథిడిమస్ బి) యూక్రటైడ్స్
సి) డెమిట్రియస్ డి) మినాండర్
2. మహేశ్వర అనే బిరుదు పొందిన విదేశీ రాజు?
ఎ) కుజుల కాడ్ఫైసెస్
బి) ఆంటియాల్ సిదాస్
సి) వీమా కాడ్ఫైసెస్
డి) హెలియో డోరస్
3. వీమా కాడ్ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖ?
ఎ) పాశుపతం బి) కాపాలికం
సి) కాలాముఖం డి) అఘోర శైవం
4. పాంచావొ అనే చైనా సేనాని చేతిలో ఓడిన కుషాణ చక్రవర్తి?
ఎ) కుజుల కాడ్ఫైసెస్ బి) కనిష్కుడు
సి) వీమా కాడ్ఫైసెస్ డి) హువిష్కుడు
5. కనిష్కుడు ఎవరి సలహా వల్ల కుండల వనంలో నాలుగో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు?
ఎ) వసుమిత్రుడు బి) అశ్వఘోషుడు
సి) శీలభద్రుడు డి) పార్శ్వ
6. శివుడు, నంది గుర్తు కలిగిన నాణేలను జారీ చేసిన కుషాణ చక్రవర్తి?
ఎ) హువిష్కుడు బి) వాసుదేవుడు
సి) రెండో కనిష్కుడు డి) వశిష్కుడు
7. కశ్యపమాతంగ ఎవరి పాలనా కాలంలో చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు?
ఎ) మౌర్యుల కాలంలో
బి) శుంగుల కాలంలో
సి) శకుల కాలంలో
డి) కుషాణుల కాలంలో
8. మహారాజ మహాత్మా అనే బిరుదున్న శకరాజు?
ఎ) రుద్ర దమనుడు బి) భూమకుడు
సి) మోగా డి) నహపాణుడు
9. అభిషేక లక్ష్మీ అనే భారతీయ దేవతను తన నాణేలపై ముద్రించిన శకరాజు?
ఎ) చష్టానుడు బి) ఏజెస్
సి) నహపాణుడు డి) అజిలిసెస్
10. 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' గ్రంథంలో మంబారాస్ అనే పేరుతో ఎవరిని పేర్కొన్నారు?
ఎ) మిళిందుడు బి) నహపాణుడు
సి) రుద్ర దమనుడు డి) భూమకుడు
11. తన నాణేల మీద గ్రీకు, ఖరోష్టి, బ్రాహ్మీ లిపులను ఉపయోగించిన శకరాజు?
ఎ) చష్టానుడు బి) భూమకుడు
సి) మోగా డి) రుద్రదమనుడు
12. మహాక్షాత్రప అనే బిరుదు పొందిన రాజు?
ఎ) నహపాణుడు బి) రుద్రదమనుడు
సి) ఉషవదత్తుడు
డి) భూమకుడు
13. భారతదేశంలో తొలి సంస్కృత శాసనాన్ని ఎవరి కాలంలో జారీ చేశారు?
ఎ) సముద్రగుప్తుడు బి) కనిష్కుడు
సి) రుద్రదమనుడు
డి) గౌతమీపుత్ర శాతకర్ణి
14. ధర్మతిడ, సచధర్మతిడ అనే బిరుదులు ఉన్న కుషాణ చక్రవర్తి?
ఎ) కనిష్కుడు
బి) హువిష్కుడు
సి) కుజుల కాడ్ఫైసెస్
డి) వీమా కాడ్ఫైసెస్
15. సెల్యూసిడ్ రాజు 2వ ఆంటియోకస్ చేతిలో ఓడిన భారతీయ రాజు?
ఎ) సుభాగ సేనుడు
బి) బిందుసారుడు
సి) భాగభద్రుడు డి) పుష్య మిత్రుడు

సమాధానాలు

1) సి; 2) సి; 3) ఎ; 4) బి; 5) డి; 6) బి; 7) డి; 8) సి; 9) డి; 10) బి; 11) ఎ; 12) బి; 13) సి; 14) సి; 15) ఎ.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐ బ్యాంక్‌లో జీఎం, డీజీఎం పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో జీఎం, డీజీఎం పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» పోస్టింగ్ ప్రదేశం: నవీ ముంబై/ముంబై.
» పోస్టుల వివరాలు: జీఎం-డిప్యూటీ సీఐఎస్‌వో(ఇన్‌ఫ్రా సెక్యూరిటీ అండ్ స్పెషల్ ప్రాజెక్ట్)-01, డీజీఎం(ఇన్సిడెంట్ రెస్పాన్స్)-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: విద్యార్హత, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.12.2024.
» వెబ్‌సైట్: https://bank.sbi/web/careers/current-openings

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04.
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్-01, అసోసియేట్ ప్రొఫెసర్-03.
» విభాగాలు: ఎకనామిక్స్, సైకాలజీ, ఇంగ్లిష్, మేనేజ్‌మెంట్.
» అర్హత: పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు టీచింగ్ అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 08.12.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.12.2024
» వెబ్‌సైట్: http://cuap.ac.in

మొక్కల్లో స్త్రీ సంయోగ బీజం



మొక్కల్లో ప్రత్యుత్పత్తి

మాదిరి ప్రశ్నలు

1. కవచ రహిత అండాలకు ఏ రెండు సరైన ఉదాహరణలు?
ఎ) లొరాంథస్ బి) ఆస్టరేసి
సి) ఒపన్షియా డి) బెలనోఫోరా
1) ఎ, బి 2) బి, సి
3) బి, డి 4) ఎ, డి
2. మొక్కల కాండాల పై ఉబ్బెత్తు భాగాల నుంచి ఏర్పడినవి?
1) ఆకులు 2) వేర్లు
3) శాఖలు 4) పుష్పాలు
3. 'కోరకీభవనం' అనే శాఖీయ ప్రత్యుత్పత్తి విధానం వీటిలో దేనిలో కనిపిస్తుంది?
1) మందార 2) వైరస్
3) గులాబీ 4) ఈస్ట్
4. కిందివాటిలో ఏ విత్తనాలు నీటిని శోషించి ఉబ్బుతాయి?
1) వరి 2) బఠాణీ
3) గోధుమ 4) జొన్న
5. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి?
1) మల్లె, జాజి - వికసించే సమయం రాత్రి
2) చామంతి, గన్నేరు - రంగుల పుష్పాలు
3) తామర, సూర్యకాంతం - వికసించే సమయం రాత్రి
4) మల్లె, విరజాజి- తెలుపు, సువాసన
6. 'ఇకేబానా' అనే మాట కిందివాటిలో దేనికి సంబంధించింది?
1) పత్రాల అందమైన అమరిక
2) వేరుదుంపల అమరిక
3) ఫలాల అందమైన అమరిక
4) పువ్వుల అందమైన అమరిక
7. జిలేబీలను తయారుచేసేటప్పుడు రుచి కోసం జిలేబీ పిండిలో దేన్ని కలుపుతారు?
1) రైజోపస్ 2) రైజోబియం
3) ఈస్ట్ 4) లాక్టోబాసిల్లస్
8. కిందివాటిలో ఏ ఫల పరిశీలనలో అది నిజ ఫలం కాదని తెలుస్తుంది?
1) ఆపిల్ 2) జీడిమామిడి
3) టమోట 4) 1, 2
9. పత్రాల ద్వారా శాఖీయోత్పత్తి జరిపే మొక్కకు ఉదాహరణ?
1) కరివేపాకు 2) బంగాళాదుంప
3) రణపాల 4) మామిడి
10. ద్వికక్షియుత పరాగకోశంలో ఉండే పుప్పొడి గదుల సంఖ్య
1) రెండు 2) ఆరు
3) నాలుగు 4) ఒకటి మాత్రమే
11. పరాగకోశంలో ద్వికేంద్రిక స్థితి కలిగిన కణాలు?
1) టపేటం 2) బాహ్య చర్మం
3) ఎండోథీషియం 4) పైవన్నీ
12. ఒక ద్విదళ బీజ మొక్కల్లోని క్రోమోజోముల సంఖ్య 32 ఉంటే ఆ మొక్కలోని సూక్ష్మ సిద్ధ బీజ మాతృ కణాలు, పరాగ కోశం, సిద్ధ బీజాల్లో క్రోమోజోముల సంఖ్యలు వరుసగా
1) 16, 16, 32 2) 32, 32, 32
3) 32, 16, 16 4) 32, 32, 16
13. టెరిస్‌లో సంయోగ బీజ రకం?
1) సమ సంయోగ బీజం
2) విషమ సంయోగం
3) అసమ సంయోగ బీజం
4) ఇవేవీ కావు
14. కిందివారిలో ఏ శాస్త్రవేత్త పునరుత్పత్తిపై పరిశోధన చేశారు?
1) ప్లేటో 2) థియోఫ్రాస్టస్
3) జగదీష్ చంద్రబోస్
4) సోక్రటీస్
15. సూక్ష్మ సిద్ధ బీజ చతుష్కంలోని కణాల స్థితి
1) ఏకస్థితిక 2) ద్వయస్థితిక
3) త్రయస్థితిక 4) బహుస్థితిక
16. ఒక విద్యార్థి తన పరిసరాల్లోని ఒక ద్విలింగ పుష్పాన్ని పరిశీలించినప్పుడు ఆ పుష్ప పరాగ రేణువులు అదే పుష్ప ఒక నిర్మాణాన్ని చేరడాన్ని గమనించాడు. అయితే అవి చేరిన నిర్మాణం, ఆ రకానికి పేరు?
1) కీలం, పరాగ విసర్గం
2) కీలాగ్రం, పరపరాగ సంపర్కం
3) అండాశయం, పరాగ సంపర్కం
4) కీలాగ్రం, ఆత్మపరాగ సంపర్కం
17. కేశ గుచ్ఛం కలిగిన విత్తనాలు ఉన్న కుటుంబం
1) ఫాబేసి 2) సిసాల్పినేసి
3) ఆస్టరేసి 4) లిల్లియేసి
18. సూక్ష్మ సిద్ధ బీజాల్లో ఎక్సైన్ అనేది
1) వ్యాధి జనకం 2) వ్యాధి కారకం
3) వ్యాధి నిరోధకం 4) ఇవేవీ కావు
19. విద్యార్థి ఒక పుష్ప పరిశీలనలో రక్షక, ఆకర్షక పత్రావళి మాత్రమే ఉండటాన్ని గమనించాడు. అటువంటి పుష్పం
1) ద్విలింగ పుష్పం 2) అసంపూర్ణ పుష్పం
3) సంపూర్ణ పుష్పం 4) ఏకలింగ పుష్పం
20. పురుష సంయోగ బీజ ద్వితీయ అభివృద్ధి కిందివాటిలో దేనిపై జరుగుతుంది?
1) అండం 2) కీలం
3) కీలాగ్రం 4) పరాగనాళం
21. స్పోరోపొలెనిన్‌కు సంబంధించిన పదార్థం?
1. Mg 2. N
3. P_2 4. NH_3
22. పుష్పాల వివిధ రంగుల విధికి సరిపోయే అంశం?
ఎ) పుష్పాలను ఎండిపోకుండా చూడటం
బి) పుష్పాల తాజాదనాన్ని పెంచడం
సి) ఫలాల రంగుకు తోడ్పడటం
డి) పరాగ సంపర్కం కోసం కీటకాలను ఆకర్షించడం
1) ఎ, బి 2) బి, సి
3) డి మాత్రమే 4) బి మాత్రమే
23. టపెటమ్ అనేది కిందివాటిలో దేనిలో భాగం?
1) అండకోశం 2) అండం
3) పరాగకోశం 4) ఫలం
24. ఫలదీకరణం పూర్తి అయిన తర్వాత ఫలం, విత్తనాలు ఏర్పరచే పుష్ప నిర్మాణాలు వరుసగా
1) రక్షక పత్రాలు, ఆకర్షక పత్రాలు
2) కేసరాలు, అండ కోశం
3) అండం, అండాశయం
4) అండాశయం, అండాలు
25. చింతకాయ విత్తనం పగుల కొడితే రెండు భాగాలుగా ఏర్పడేవి?
1) అండాలు 2) స్త్రీ బీజ కణాలు
3) బీజ దళాలు 4) సహ కణాలు
26. శాఖీయ ప్రత్యుత్పత్తికి సంబంధించి సరైన జత
1) వేర్ల ద్వారా - గులాబీ
2) శాఖల ద్వారా - మందార
3) ఆకుల ద్వారా - కరివేపాకు
4) కాండం ద్వారా - వేప
27. తగినంత నీరు, గాలితోపాటు కింద ఇచ్చిన ఏ కారకం సహకరిస్తే విత్తనం మొలకెత్తుతుంది?
1) కాంతి 2) ఖనిజ లవణాలు
3) ఉష్ణోగ్రత 4) పైవన్నీ
28. విద్యార్థి శాఖీయోత్పత్తి అనే పాఠాన్ని చదువుతూ ఉదాహరణలు తెలుసుకుంటున్నాడు. వేర్ల ద్వారా శాఖీయోత్పత్తికి కచ్చితమైన ఉదాహరణ నేర్చుకొని ఉంటే వీటిలో ఏది చదివి ఉంటాడు?
1) రణపాల మొక్క వేర్ల ద్వారా శాఖీయోత్పత్తికి ఉదాహరణ
2) గులాబీ వేరు ద్వారా శాఖీయోత్పత్తి జరుపుతుంది.
3) ఉల్లి వేర్లు శాఖీయోత్పత్తి జరుపుతాయి
4) కరివేపాకు వేర్ల ద్వారా శాఖీయోత్పత్తి జరుపుతుంది
29. కిందివాటిలో ఏ రెండు కుటుంబాల్లో పరాగ రేణువు నుంచి ఒకటి కంటే ఎక్కువ పరాగ నాళాలు వృద్ధి చెందుతాయి?
ఎ) లెగుమినేసి బి) కుకుర్బిటేసి
సి) మాల్వేసి డి) యుఫర్బియేసి
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) ఎ, డి
30. కిందివాటిలో అండకోశానికి సంబంధించనది?
1) ప్రతిపాదక కణం
2) ద్వితీయ కేంద్రకం
3) పరాగ కోశం 4) సహాయ కణం

సమాధానాలు

1) 4; 2) 2; 3) 4; 4) 2; 5) 3; 6) 4; 7) 3; 8) 4; 9) 3; 10) 3; 11) 1; 12) 4; 13) 3; 14) 2; 15) 1; 16) 4; 17) 3; 18) 1; 19) 2; 20) 3; 21) 2; 22) 3; 23) 3; 24) 4; 25) 3; 26) 2; 27) 3; 28) 4; 29) 2; 30) 3.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అలైంగిక ప్రత్యుత్పత్తి ద్వారా మందారం నుంచి పొందే పిలక మొక్కల సంఖ్య (డీఎస్సీ-2012)
1) ప్రతి శాఖ నుంచి ఒక్కో పిలక మొక్క
2) పిలక మొక్కలు ఏర్పడవు
3) అనేకం 4) నాలుగు
2. పుష్పించే మొక్కల్లో ద్వయస్థితిక క్రోమో జోముల సంఖ్య 16 అయితే దాని అంకురచ్ఛదంలోని క్రోమోజోముల సంఖ్య (డీఎస్సీ-2012)
1) 10 2) 24 3) 18 4) 16
3. పుష్పంలోని స్త్రీ సంయోగ బీజంలో కణాలు, కేంద్రకాలు, ఫలదీకరణాల సంఖ్య వరుసగా (డీఎస్సీ-2012)
1) 3, 4, 2 2) 2, 3, 2
3) 1, 2, 2 4) 7, 8, 2
4. అతి సరళ పద్ధతిలో మొక్కలను ప్రవర్ధనం చేయాలనుకున్న రైతుకి అవసరం లేనివి (డీఎస్సీ-2012)
1) ఆకులు 2) వేర్లు
3) పండ్లు 4) కాండాలు
5. మొక్క సంయుక్త బీజంలో 30 జతల క్రోమోజోములు ఉంటే ఆ మొక్క శరీర కణాలు ఒక్కోదానిలో క్రోమోజోముల మొత్తం? (డీఎస్సీ-2008)
1) 15 2) 45 3) 60 4) 30
6. పరాగనాళం స్త్రీ బీజ కణం దగ్గరకు కదిలేందుకు సహాయపడే కణాలు (డీఎస్సీ-2008)
1) అంకురచ్ఛద కణాలు
2) సినర్జిడ్లు 3) ప్రతిపాద కణాలు
4) పురుష బీజ కణాలు
7. పుష్ప ఫలదీకరణ సమయంలో పూర్తిగా ఏర్పడిన పిండ కోశంలోని ఏడు కణాల అమరిక (డీఎస్సీ-2008)
1) స్త్రీ బీజకణం, రెండు సినర్జిడ్లు, మూడు ప్రతిపాదక కణాలు, కేంద్రకం
2) రెండు స్త్రీ బీజకణాలు, రెండు సినర్జిడ్లు, రెండు ప్రతిపాదక కణాలు, కేంద్రకం
3) ఒక ప్రతిపాదక కణం, రెండు స్త్రీ బీజ కణాలు, మూడు సినర్జిడ్లు, కేంద్రకం
4) సినర్జిడ్, ప్రతిపాద కణాలు, మూడు స్త్రీ బీజ కణాలు, కేంద్రకం
8. అంకురచ్ఛదం గల విత్తనాలకు ఉదాహరణ (డీఎస్సీ-2006)
1) బఠాణీ, చిక్కుడు 2) వరి, చిక్కుడు
3) చిక్కుడు, ఆముదం 4) వరి, ఆముదం
9. ఫలదీకరణం తర్వాత విత్తనంగా మారే పుష్ప భాగం (డీఎస్సీ-2002)
1) అండాశయం 2) అండం
3) ప్రథమమూలం 4) బీజ దళం
10. మొక్కల్లో స్త్రీ సంయోగ బీజం (డీఎస్సీ-2004)
1) స్థూల సిద్ధబీజ మాతృకణం
2) అండం 3) పిండ కోశం
4) సిద్ధ బీజ మాతృకణం

సమాధానాలు

1) 2; 2) 2; 3) 4; 4) 3; 5) 4; 6) 2; 7) 1; 8) 4; 9) 2; 10) 3.

భవిత
స్పర్థయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం। 26-11-2024

ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన చేప ఏది?

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. కార్డేటాలలో ఏ నిర్మాణం ఉండటాన్ని ముఖ్య లక్షణంగా పేర్కొంటారు?
   1) హృదయం 2) చర్మం
   3) మెదడు 4) పృష్ఠవంశం
2. జీవశాస్త్రంలో విచిత్ర జీవులుగా వేటిని పేర్కొంటారు?
   1) హెమీ కార్డేట్‌లు 2) సెఫలో కార్డేట్‌లు
   3) యూరో కార్డేట్‌లు 4) కార్డేట్‌లు
3. సకశేరుకాల ఉద్భవానికి సంబంధించిన డింభకం ఏది?
   1) బైపిన్నేరియా లార్వా
   2) బఫియోప్లూటియస్
   3) ఆరిక్యులేరియా 4) ఎఖైనోప్లూయస్
4. 'శీతల రక్త జీవులు (బాహ్యోష్ణ సకశేరుకాలు)'గా వేటిని పేర్కొంటారు?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పైవన్నీ
5. కింది వాటిలో 'ఉష్ణరక్త జీవులు (అంతరోష్ణ సకశేరుకాలు)' ఏవి?
   1) సరీసృపాలు 2) పక్షులు
   3) క్షీరదాలు 4) 2, 3
6. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలేవి?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పక్షులు
7. చేపల్లో ఏవిధమైన హృదయం ఉంటుంది?
   1) సిరా హృదయం
   2) ధమని హృదయం
   3) మిశ్రమ హృదయం 4) ఏదీకాదు
8. చేపల హృదయం విశిష్ట లక్షణం ఏది?
   1) మంచి రక్తం ప్రవహించడం
   2) చెడు రక్తం ప్రవహించడం
   3) మిశ్రమ రక్తం ప్రవహించడం
   4) ఎలాంటి రక్తం ప్రవహించకపోవడం
9. విచ్ఛిన్న విస్తరణను ప్రదర్శించే చేపలు ఏవి?
   1) నియోసెరటోడస్
   2) ప్రోటాప్టిరస్ 3) లెపిడో సైరస్
   4) పైవన్నీ
10. కాలేయ నూనెకు ప్రసిద్ధమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) బ్లూవేల్
    3) కాడ్ ఫిష్ 4) సిల్వర్ ఫిష్
11. దోమ డింబకాలను ఆహారంగా తీసుకుంటూ మలేరియా వ్యాధి నివారణకు దోహదపడే చేపలు ఏవి?
    1) ఎక్సోసీటస్ 2) హిప్పోకాంపస్
    3) గాంబూసియా యసినిస్
    4) పైవేవీ కావు
12. కింది వాటిలో నిజమైన చేపలు ఏవి?
    1) జెల్లీ ఫిష్ 2) సిల్వర్ ఫిష్
    3) కటిల్ ఫిష్ 4) షార్క్ ఫిష్
13. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) గోల్డెన్ ఫిష్
    3) సిల్వర్ ఫిష్ 4) స్టార్ ఫిష్
14. బెంగాలీలకు ప్రీతిపాత్రమైన హిల్సా చేప 1 కిలోల బరువు పెరుగడానికి ఎన్నేళ్లు పడుతుంది?
    1) 4 2) 3 3) 2 4) 5
15. ఇక్థియాలజీ అనేది వేటి గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    (Tech.Asst. in Archaeology-2012)
    1) చేపలు 2) సరీసృపాలు
    3) పక్షులు 4) క్షీరదాలు
16. బొటనవేలు లేకపోవడం అనేది కింది వాటిలో ఏ జీవి లక్షణం?
    1) కోతి 2) మానవుడు
    3) కుందేలు 4) కప్ప
17. భూమి మీద మొదట నివసించిన జీవులు ఏవి?
    1) తొండలు 2) డిప్నాయ్ చేపలు
    3) కప్పలు 4) సర్పాలు
18. రెడ్ ఇండియన్లు బాణాల చివరన విషంగా ఏ కప్ప చర్మగ్రంథుల స్రావాలను పూస్తారు?
    1) హైలా 2) రాకోఫోరస్
    3) పిల్లోబేటస్ 4) ఎలైటస్
19. కింది వాటిలో ప్రపంచంలో అత్యంత విష పూరిత ఉభయచరాల్లో ఒకటి ఏది?
    (Gr-II, 2005)
    1) బ్లూ డార్ట్ మండూకం
    2) రాటిల్ స్నేక్ 3) స్పెర్మ్ వేల్
    4) గ్రీన్ టర్టిల్
20. బాహ్య ఫలదీకరణం జరిపే జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) బల్లులు-పాములు 4) 1, 2
21. టాడ్‌పోల్ లార్వా రూప విక్రియను నియంత్రించే హార్మోన్ ఏది?
    1) అడ్రినలిన్ 2) థైరాక్సిన్
    3) ఈస్ట్రోజన్ 4) ఆక్సిటోసిన్
22. 'వేసవి కాల నిద్ర' అంటే ఏమిటి?
    1) శీతాకాల సుప్తావస్థ
    2) ప్రతికూల పరిస్థితులు
    3) గ్రీష్మకాల సుప్తావస్థ 4) కోమా
23. స్పాన్ అంటే..?
    1) కప్ప అండాల సమూహం
    2) పుట్టగొడుగుల విత్తనాలు
    3) కప్ప శుక్రకణాల సమూహం
    4) 1, 2
24. రెండు కర్ణికలు, ఒక జఠరికతో కూడిన హృదయం ఏ జీవుల్లో ఉంటుంది?
    1) చేపలు 2) కప్పలు
    3) పాములు 4) పక్షులు-క్షీరదాలు
25. కప్పల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?



    1) ఇక్థియాలజీ 2) బాట్రకాలజీ
    3) టార్పిడాలజీ 4) ఓఫియాలజీ
26. రూప విక్రియ ప్రదర్శించే జీవి ఏది?
    1) పాము 2) కప్ప
    3) హైడ్రా 4) చేప
27. మెడ, తోక, పొలుసులు లోపించిన జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) సరీసృపాలు 4) పక్షులు
28. సర్పాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) కదిలే కనురెప్పలు ఉంటాయి
    2) కదలని కనురెప్పలు ఉంటాయి
    3) కనురెప్పలు ఉండవు
    4) నిమేశక పటలం ఉంటుంది
29. విషసర్పాల్లో విషగ్రంథులు వేటి రూపాంతరం?
    1) ఆస్య గ్రంథులు
    2) లాలాజల గ్రంథులు
    3) తైల గ్రంథులు 4) అశ్రు గ్రంథులు
30. కింది వాటిలో పాము కరిచినప్పుడు విరుగుడుగా పనిచేసే మంచి ఇంజెక్షన్ ఏది?
    1) పెన్సిలిన్ 2) యాంటీవీనమ్
    3) యాంటీబయాటికిన్
    4) స్ట్రెప్టోమైసిన్
31. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
    1) నలుపురంగు 2) పడగ
    3) రాళ్లలో నివసించడం వల్ల
    4) పడగ, మూడో ఆదివోష్ఠ పొలుసు
32. సర్పాల్లో మధ్య చెవి ఉండదు. అవి శబ్దాలను వేటి ద్వారా గ్రహిస్తాయి?
    1) నాలుక 2) చర్మం
    3) ముట్టె 4) గాలి
33. పాము విషానికి విరుగుడు ఇంజెక్షన్లను ఎక్కడ తయారు చేస్తున్నారు?
    1) A.C.D., ఢిల్లీ
    2) IICT, హైదరాబాద్
    3) హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్, ముంబై
    4) పింప్రి, పుణే
34. సరీసృపాలన్నింటిలో మొసళ్లలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏది?
    1) దృఢమైన దవడ కండరాలు
    2) నేలమీదకు రాగలిగే శక్తి
    3) నాలుగు గదుల గుండె
    4) అండం చుట్టూ గట్టి పెంకు ఉండటం
35. పక్షుల్లో ఉండే ప్రధాన లక్షణం?
    1) ముక్కు 2) రెక్కలు
    3) పొలుసులు 4) ఈకలు
36. పాముల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    1) ఇక్థియాలజీ 2) ఓఫియాలజీ
    3) లెపిడాప్టరాలజీ 4) ఎంటమాలజీ
37. కింది వాటిలో శిశుత్పాదక సర్పం ఏది?
    1) కోబ్రా 2) కట్లపాము
    3) రక్తపింజర 4) రాట్ సర్పం
38. రక్తపింజర విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) జీర్ణ వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) శ్వాస వ్యవస్థ 4) విసర్జన వ్యవస్థ
39. నాగుపాము విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) శ్వాస వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) నాడీ వ్యవస్థ 4) జీర్ణ వ్యవస్థ
40. చలనంలో సర్పాలకు సహాయపడేవి ఏవి?
    1) తల 2) పొలుసులు
    3) పర్శుకలు 4) తోక
41. అతి తక్కువ కాలం చూలు మోసే జీవి?
    1) మేక 2) గుర్రం
    3) అపోజం 4) చుంచెలుక
42. కింది వాటిలో విష సర్పం కానిది?
    1) సముద్ర సర్పం 2) కట్లపాము
    3) రక్తపింజర 4) పైథాన్
43. కింది వాటిలో విష సర్పం ఏది?
    1) పైథాన్ 2) కట్లపాము
    3) ట్రీ స్నేక్ 4) రాట్ స్నేక్
44. ఒక వ్యక్తి కాలికి ఏదో జీవి కరవడం వల్ల రెండు గాట్లు పడ్డాయి. ఆ గాట్ల ఆధారంగా కింది వాటిలో అది ఏ జీవి అయి ఉండవచ్చు?
    1) తేలు 2) ఎలుక
    3) విషరహిత సర్పం
    4) విషపూరిత సర్పం
45. పరిసరాలను బట్టి రంగులు మార్చేది?
    1) పిల్లి 2) ఎలుక
    3) ఊసరవెల్లి (కెమీలియాన్)
    4) తొండ
46. కింది వాటిలో దీర్ఘకాలం జీవించే జంతువు?
    1) ఏనుగు 2) ఒంటె
    3) నక్క 4) తాబేలు
47. డైనోసార్ ఒక...? (UPSC-1989)
    1) సరీసృపం 2) ఉభయచరం
    3) క్షీరదం 4) పక్షి
48. 'డైనోసార్' అనే పదానికి అర్థం?
    1) ఘోర పాకుడు జంతువు
    2) భయంకరమైన పాకుడు జంతువు
    3) ఘోర బల్లి
    4) అధమ పాకుడు జంతువు
49. కింది వాటిలో ఎగిరే డైనోసార్‌గా ప్రసిద్ధి చెందింది ఏది?
    (Polytechnic College, Lecturers)
    1) స్పైనోసారస్ 2) టెరోసారస్
    3) అర్జంటినో సారస్ 4) ఏదీకాదు
50. విషం గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    (Asst.social welfare officer in A.P. 2012)
    1) మార్ఫాలజీ 2) ఆస్టియాలజీ
    3) టాక్సికాలజీ 4) కాంకాలజీ
51. భూమిపై అతి పెద్ద పక్షి ఏది?
    (Asst.social welfare officer in A.P. 2012)
    1) ఈము 2) ఆస్ట్రిచ్
    3) ఆల్ బట్రాస్ 4) సైబీరియన్ క్రేన్
52. కింది వాటిలో దేనిలో వాతులాస్థులు ఉంటాయి?
    1) గబ్బిలం 2) తిమింగలం
    3) పక్షులు 4) ఎక్సోసీటస్
53. పక్షుల్లో కనిపించే దృష్టి లక్షణం ఏది?
    1) మోనాక్యులార్-టెలిస్కోపిక్ దృష్టి
    2) బైనాక్యులర్-మయోపిక్ దృష్టి
    3) బైనాక్యులర్-టెలిస్కోపిక్ దృష్టి
    4) మోనాక్యులర్- మయోపిక్ దృష్టి
54. పక్షుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    (Gr-II, 2012)
    1) హెర్పిటాలజీ 2) ఆర్నిథాలజీ
    3) ఇథాలజీ 4) ఫినాలజీ
55. కింది వాటిలో పక్షుల్లో ఏవి ఉండవు?
    (Gr-II, 2001)
    1) నరాలు 2) చెమట గ్రంథులు
    3) కనురెప్పలు 4) వాతులాస్థులు
56. నేలపై అతి వేగంగా పరుగెత్తే జంతువు?
    (Gr-I, 1998)
    1) లేడి 2) చిరుతపులి
    3) గుర్రం 4) పెద్దపులి
57. స్వేద గ్రంథులు లేని క్షీరదం?
    1) కోతి 2) ఆవు
    3) తిమింగలం 4) పంది
58. గబ్బిలం, తిమింగలం ఏ వర్గానికి చెందినవి?
    1) పక్షులు 2) సరీసృపాలు
    3) క్షీరదాలు 4) ఉభయచరాలు
59. కింది వాటిలో క్షీరదాల అత్యంత ప్రధాన లక్షణం ఏది?
    1) హెమియోథర్మిక్
    2) విభాజక పటలం
    3) శిశు ఉత్పాదకాలు
    4) డైకాండైలిక్
60. ఏ జీవికి వేళ్లు ఉండవు కానీ, గోళ్లు ఉంటాయి?
    1) కంగారు 2) అపోజం
    3) బ్లూవేల్ 4) ఒంటె
61. గుడ్లు పెట్టే క్షీరదం?
    1) డక్‌బిల్ ప్లాటిపస్ 2) ఎకిడ్నా
    3) గబ్బిలం 4) 1, 2
62. ప్రపంచంలో అతి పెద్ద ప్రాణి ఏది?
    (Gr-I, 1998)
    1) ఇండియా ఏనుగు 2) బ్లూవేల్
    3) రైనోడాన్ 4) ఆఫ్రికా ఏనుగు
63. మానవుడి తర్వాత అతి తెలివైన క్షీరదం?
    (S.I.-2008)
    1) బ్లూవేల్-తిమింగలం
    2) డాల్ఫిన్ 3) ఆఫ్రికా ఏనుగు
    4) కంగారు
64. జంతువుల ప్రవర్తనను అధ్యయనం చేసే శాస్త్రం ఏది? (Gr-I, 2010)
    1) ఎంటమాలజీ 2) ఇథాలజీ
    3) ఎకాలజీ 4) యూజెనిక్స్

సమాధానాలు

1) 4;	2) 3;	3) 3;	4) 4;
5) 4;	6) 1;	7) 1;	8) 3;
9) 4;	10) 3;	11) 3;	12) 4;
13) 1;	14) 2;	15) 1;	16) 4;
17) 3;	18) 3;	19) 1;	20) 4;
21) 2;	22) 3;	23) 4;	24) 2;
25) 2;	26) 2;	27) 2;	28) 3;
29) 2;	30) 2;	31) 4;	32) 2;
33) 3;	34) 3;	35) 4;	36) 2;
37) 3;	38) 2;	39) 3;	40) 3;
41) 3;	42) 4;	43) 2;	44) 4;
45) 3;	46) 4;	47) 1;	48) 2;
49) 2;	50) 3;	51) 2;	52) 3;
53) 1;	54) 2;	55) 2;	56) 2;
57) 3;	58) 3;	59) 2;	60) 3;
61) 4;	62) 2;	63) 2;	64) 2.

Another term for hyperlink is..

BANK EXAMS
COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.



The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
   1) Folder 2) Pod 3) Version
   4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
   1) System menu
   2) Address bar 3) Menu bar
   4) Tool bar
   5) None of the above
3. A _____ is a set of computer instructions that carry out a task on the computer.
   1) Program 2) Database
   3) Memory file 4) Folder
   5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
   1) Home Edition
   2) Media Center Edition
   3) Tablet PC Edition
   4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
   1) user-happy 2) user-simple
   3) user-friendly 4) Interface
   5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
   1) Right-clicking
   2) Left-clicking
   3) Either 1 or 2
   4) All of the above
   5) Neither 1 nor 2
7. Another term for hyperlink is______
   1) Link 2) Source
   3) Bar 4) All of the above
   5) None of the above
8. A graphical user interface displays__________
   1) Graphics 2) Text
   3) Both 1 and 2
   4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
   1) Win Zip 2) Win Shrink
   3) Win Style 4) Win small
   5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is__________.
    1) Queue 2) Linked list
    3) Doubly linked list
    4) Binary tree
    5) None of the above
11. Caps lock, Num-lock are known as________
    1) Modifier key 2) Toggle key
    3) Function key 4) Numeric key
    5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
    1) Static RAM
    2) Dynamic RAM 3) EPROM
    4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in ______.
    1) China 2) USA 3) India
    4) England 5) None of these
14. A result of a computer virus can not lead to________.
    1) Disk Crash
    2) Mother Board Crash
    3) Corruption of program
    4) Deletion of files
    5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
    1) Begin the line with a # sign
    2) Begin the line with double slashes (/ /)
    3) Begin and end the line with double hyphens (-_-)
    4) Indent the line
    5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as______
    1) 4GLs 2) Macro languages
    3) Procedure-oriented languages
    4) Visual programming languages
    5) None of these
17. Firewalls are used to protect against______
    1) Unauthorized Attacks
    2) Virus Attacks
    3) Data Driven Attacks
    4) Fire Attacks
    5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
    1) Management 2) Processing
    3) Utility 4) Application
    5) None of these
19. RAM can be thought of as the ________ for the computer's processor.
    1) Factory 2) Operating room
    3) Waiting room
    4) Planning room
    5) None of these
20. The CPU and memory are located on the __________.
    1) Expansion board
    2) Motherboard
    3) Storage device
    4) Output device
    5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of __________.
    1) Application software
    2) System software
    3) Operating system software
    4) Platform software
    5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
    1) <ahref> 2) <a> 3) <link>
    4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
    1) Insert 2) Format 3) Edit
    4) Tools 5) None of these
24. A half byte is known as______.
    1) Data 2) Bit 3) Half byte
    4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called_______.
    1) Modern 2) Interface
    3) Clue 4) Data bus
    5) All of these
26. _____ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
    1) POS 2) RFID 3) PPS
    4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called________.
    1) HTML 2) MP3 3) MPEG
    4) MIDI 5) None of these

KEY

1) 1	2) 2	3) 1	4) 1	5) 3
6) 1	7) 1	8) 3	9) 1	10) 3
11) 2	12) 2	13) 3	14) 2	15) 2
16) 4	17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 1	23) 1	24) 4	25) 2
26) 2	27) 4			